

www.andhrajyothy.com

వరంగల్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 255

శుక్రవారం | 13-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 |

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి త్రయోదశి రా. 7.40 తదుపరి చతుర్దశి, నక్షత్రం: భరణి ఉ.7.50 తదుపరి కృత్తిక తె.5.48, వర్జ్యం: రా.6.49-8.16, దుర్ముహూర్తం: ఉ.8.51-9.35, మ.12.31-1.15, అమృతఘడియలు: తె.3.36-5.04, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.40, సూర్యాస్తమయం: 5.38

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



యూనివర్సిటీల్లో ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి

ప్రత్యేక కమిషన్!

ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు 14

ప్రార్థన స్థలాలపై విచారణ ఆపండి!

- మేం తదుపరి ఉత్తర్వులిచ్చేదాకా కొత్త వ్యాజ్యాలు స్వీకరించొద్దు
- పెండింగ్ కేసుల్లో తీర్పులు ఇవ్వొద్దు
- సర్వే నిర్వహణ సహా ఎలాంటి మధ్యంతర ఆదేశాలూ వద్దు
- కింది కోర్టులకు సుప్రీంకోర్టు ఆదేశం
- కౌంటర్‌కు కేంద్రానికి నెల గడువు



న్యూఢిల్లీ, డిసెంబరు 12: తాము తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకూ దేశంలోని ఏ కోర్టూ.. ప్రార్థనా స్థలాలకు సంబంధించి కొత్త వ్యాజ్యాలను తీసుకోరాదని, ఇప్పటికే ఉన్న కేసుల్లో సర్వే నిర్వహణ సహా ఎలాంటి మధ్యంతర ఆదేశాలు, తుది ఉత్తర్వులు జారీ చేయరాదని సుప్రీంకోర్టు ఆదేశించింది. "ఈ అంశం మా (సర్వోన్నత న్యాయస్థానం) పరిధిలో ఉన్నందున, మేం తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంతవరకూ దీనిపై కొత్త కేసులు స్వీకరించడం, పాత కేసుల్లో చర్యలు తీసుకోవడం సముచితం కాదని భావిస్తున్నాం" అని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో

మిగతా 2వ పేజీలో...



విశ్వవిజేత గుకేష్

11

- ప్రపంచ చెస్ చాంపియన్‌గా భారత గ్రాండ్‌మాస్టర్
- 18 ఏళ్ల పిన్న వయస్సులోనే చరిత్ర
- డిఫెండింగ్ చాంప్ లిరెన్‌పై 14వ గేమ్‌లో విజయం

'ప్రపంచ చెస్‌లో భారత్‌కు స్వర్ణయుగం' అని దిగ్గజ ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్ అన్న మాట నిజమేనని టీనేజ్ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేష్ నిరూపించాడు. 64 గళ్ల సామ్రాజ్యంలో విశ్వవిజేతగా ఆవిర్భవించడం ద్వారా అంతర్జాతీయ చదరంగ యవనికపై మన స్థానాన్ని సమున్నతం చేశాడు. గురువారం సింగపూర్‌లో జరిగిన 14 గేమ్‌ల వరల్డ్ చాంపియన్‌షిప్ ఫైనల్లో తెలుగు మూలాలున్న చెన్నై చిన్నోడు గుకేష్ చైనాకు చెందిన డిఫెండింగ్ చాంపియన్, 32 ఏళ్ల డింగ్ లిరెన్‌ను ఓడించాడు. ఆఖరి రౌండ్‌లో నల్లపావులతో చెక్ పెట్టాడు. మొత్తం 7.5 పాయింట్లతో టైటిల్ సొంతం చేసుకున్నాడు. పిన్నవయస్సులో ప్రపంచ చెస్ చాంపియన్‌గా నిలిచిన ఆటగాడిగా గుకేష్ చరిత్ర సృష్టించాడు.

జమిలికి సై



లోక్‌సభ, అన్ని అసెంబ్లీలకు ఒకేసారి పోలింగ్

రెండు సవరణ బిల్లులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

- వచ్చేవారమే పార్లమెంటులో ప్రవేశపెట్టే చాన్స్.. వెంటనే జేపీసీకి వెళ్తుందంటున్న బీజేపీ వర్గాలు
- 2 బిల్లులను పార్లమెంటు ఆమోదిస్తే చాలు.. తొలిబిల్లుకు ఉభయసభల్లో 2/3 మెజారిటీ అవసరం
- స్థానిక సంస్థలను చేర్చే ఆలోచనకు విరామం
- సగం రాష్ట్రాల ఆమోదం అవసరమవడం వల్లే..
- బిల్లులను చూసి స్పందిస్తామన్న కాంగ్రెస్
- జమిలి కన్నా పెద్ద సమస్యలున్నాయని వ్యాఖ్య
- తీవ్రంగా వ్యతిరేకించిన డీఎంకే, తృణమూల్



జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం. ప్రాంతీయ ఆకాంక్షలకు గొంతు లేకుండా పోతుంది. సమాఖ్య వ్యవస్థ దెబ్బతింటుంది.

- తమిళనాడు సీఎం స్టాలిన్



మద్దతు ఇచ్చిన పార్టీలు: బీజేపీ, అన్నాడీఎంకే, అప్నాదళ్, బిజూజనతాదళ్, అసోం గణపరిషత్, శివసేన, జేడీయూ, అకాలీదళ్

వ్యతిరేకించిన పార్టీలు: కాంగ్రెస్, సీపీఎం, తృణమూల్ కాంగ్రెస్, ఎస్పీ, ఎంఐఎం, సీపీఐ, డీఎంకే, బీఎస్పీ, ఆప్

స్పందించనివి: టీడీపీ, వైసీపీ, బీఆర్ఎస్, ఎన్సీపీ, ఆర్జేడీ, ఆర్ఎల్డీ, జేడీఎస్, ఝార్ఖండ్ ముక్తి మోర్చా, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్, నేషనల్ కాన్ఫరెన్స్, కేరళ కాంగ్రెస్

న్యూఢిల్లీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికల దిశగా కేంద్ర ప్రభుత్వం కీలకమైన ముందడుగు వేసింది. లోక్‌సభకు, దేశంలోని అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన రెండు బిల్లులకు గురువారం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వచ్చే వారం మొదటి రెండు రోజుల్లో పార్లమెంటు ఉభయ సభల్లో బిల్లులను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. రెండు బిల్లుల్లో మొదటిది లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లు కాగా, రెండోది శాసనసభలున్న కేంద్ర పాలిత ప్రాంతాలైన ఢిల్లీ, పుదుచ్చేరి, జమ్మూ కశ్మీర్‌లకు ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు ఉద్దేశించిన సాధారణ బిల్లు. పార్లమెంటు ఉభయ సభల్లో కేవలం సాధారణ మెజారిటీ ఉన్న ఎన్డీయే ప్రభుత్వం రాజ్యాంగ సవరణ బిల్లును నెగ్గించుకోవాలంటే తప్పనిసరిగా అద్భుతం చేయాలి. లేదా విపక్షాల సహకారాన్ని తీసుకోవాలి. ఈ విషయంలో చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం గురువారం నాటి క్యాబినెట్ సమావేశానికి సంబంధించి ఎలాంటి బ్రీఫింగ్ ఇవ్వలేదు. నోట్ కూడా విడుదల చేయలేదు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కేవలం ఉభయ సభల్లో బిల్లులను ప్రవేశపెట్టి, వెంటనే సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) పరిశీలనకు పంపుతారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. జమిలి ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే విషయంపైనా స్పష్టతనివ్వలేదు. తదుపరి సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా జమిలి ఎన్నికల రూపంలోనే జరుగుతాయని పార్టీ వర్గాలు తెలిపాయి. ఒకే దేశం ఒకే ఎన్నికల దిశగా ఎంతోకొంత ముందుకు వెళ్లాలని కృత నిశ్చయంతో ఉన్న ప్రభుత్వం ఇందుకు జేపీసీ మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈసారి పంచాయతీ, మునిసిపల్ ఎన్నికల విషయంలో మాత్రం కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోలేదు. స్థానిక ఎన్నికలను తర్వాత దశలో పరిశీలిస్తారని బీజేపీ వర్గాలు తెలిపాయి. జమిలి కోసం మొత్తం ఆరు బిల్లులు పెట్టాల్సి ఉండగా ప్రస్తుతం రెండింటికే పరిమితం అవుతున్నారు. తర్వాత దశల్లో అవి కూడా వీటికి జత చేరతాయని అంటున్నారు. తొలి బిల్లులో రాజ్యాంగంలోని ఆర్టికల్ 83(పార్లమెంటు కాలపరిమితి), ఆర్టికల్ 172(అసెంబ్లీ కాలపరిమితి)లను సవరిస్తారు. ఇందుకు ఉభయ సభల్లో హాజరైన సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది

మిగతా 2వ పేజీలో...



ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు

అనుమతులు నిధులు ఇవ్వండి

హైదరాబాద్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మించండి

- ఆర్ఆర్ఆర్‌కు సాంకేతిక, ఆర్థిక అనుమతులివ్వండి
- హైదరాబాద్-విజయవాడ రోడ్డును విస్తరించండి
- రూ. 1.63 లక్షల కోట్ల ప్రాజెక్టులకు సహకరించండి
- సింగరేణికి బొగ్గు గనులు
- రాష్ట్రానికి కేవీలు ఇవ్వండి
- కేంద్ర మంత్రులు గడ్కరీ, కిషన్‌రెడ్డి, ధర్మేంద్రకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- నేడు అధిష్ఠానంతో భేటీ
- మంత్రివర్గ విస్తరణపై చర్చ!

న్యూఢిల్లీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధానిలో సీఎం రేవంత్‌రెడ్డి గురువారం బిజీబిజీగా గడిపారు. మధ్యాహ్నం జైపూర్ నుంచి ఢిల్లీ చేరుకున్న ఆయన.. సాయంత్రం తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలతో కలిసి కేంద్ర మంత్రులు గడ్కరీ, కిషన్‌రెడ్డి, ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిశారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టుల గురించి వివరించి, నిధులు, అనుమతులు ఇవ్వాలని కోరారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి (159 కి.మీ.) అవసరమైన సాంకేతిక, ఆర్థిక అనుమతులు వెంటనే ఇవ్వాలని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. 2017లోనే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని 161ఏఏ జాతీయ రహదారిగా ప్రకటించారని గుర్తుచేశారు. ఈ రహదారి నిర్మాణానికి అవసరమయ్యే భూమిలో 94 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం సేకరించిందన్నారు. ఇక దక్షిణ కాశీగా పేరొందిన శ్రీశైలాన్ని హైదరాబాద్‌తో అనుసంధానించే ఎన్‌హెచ్-765లో 125 కిలోమీటర్ల దూరం జాతీయ రహదారుల ప్రమాణాలతో ఉందని, మిగిలిన 62 కిలోమీటర్లు అమ్రాబాద్ అటవీ ప్రాంతంలో ఉందని వివరించారు. అటవీ, పర్యావరణ శాఖ నిబంధనల ఫలితంగా

మిగతా 13వ పేజీలో...

13

విస్తరణపై అధిష్ఠానానిదే తుది నిర్ణయం

- ప్రజాపాలనపై 50% పైగా ప్రజలు సంతృప్తిగా ఉన్నారు
- హైడ్రాకు ధనిక, పేద తేడాల్లేవు.. ఢిల్లీలో మీడియాతో భట్టి

'బీసీ' నివేదికపై ప్రత్యేక కమిషన్

కసరత్తు!

- జిల్లాల పర్యటనలు, భేటీలు ఇప్పటికే పూర్తి
- వివరాలతో ప్రాథమిక నివేదిక సిద్ధం
- కులగణన వివరాలు సేకరించాక ఎంతమేర రిజర్వేషన్ ఇవ్వాలో సూచించే అవకాశం
- ప్రభుత్వానికి రెండు దఫాలుగా నివేదిక!

హైదరాబాద్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు ఎంత శాతం రిజర్వేషన్లను ఖరారు చేయాలన్న అంశంపై నియామకమైన ప్రత్యేక(డెడికేటెడ్) కమిషన్ నివేదికను సిద్ధం చేస్తోంది. ఇప్పటివరకు కమిషన్ దృష్టికి వచ్చిన అంశాలు, జిల్లాల పర్యటనలో సేకరించిన వివరాలన్నింటినీ క్రోడీకరించి.. ప్రాథమికంగా ఒక నివేదిక సిద్ధం చేస్తోంది. అనంతరం కులగణన వివరాలను కూడా కమిషన్ సేకరించనుంది. అన్ని వివరాలను క్రోడీకరించి.. ఈ నెలాఖరులోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించేందుకు కసరత్తు చేస్తోంది. తెలంగాణలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేటాయించాల్సిన రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో ప్రత్యేక కమిషన్‌ను నియమించిన విషయం తెలిసిందే. కమిషన్ ఏర్పాటైన వెంటనే.. రంగంలోకి దిగడంతోపాటు జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించింది. మేధావులు, ప్రజాసంఘాలు, కుల సంఘాల నుంచి విజ్ఞప్తులను సేకరించింది. దాదాపు నెల రోజుల్లోనే

మిగతా 14వ పేజీలో...



సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి బేడీలతో రైతు హీర్యా నాయక్

ఛాతీనొప్పి అంటే.. సంకెళ్లు వేసి ఆస్పత్రికి

- లగచర్ల రిమాండు ఖైదీ, రైతు హీర్యా నాయక్‌పై దాష్టీకం
- సంగారెడ్డి జైలు నుంచి బేడీలతో ఆస్పత్రికి తరలింపు 12
- మా కొడుక్కి ఏదైనా జరిగితే సీఎందే బాధ్యత: హీర్యా తండ్రి
- పోలీసుల తీరుపై రేవంత్ సీరియస్.. విచారణకు ఆదేశం
- సంగారెడ్డి సెంట్రల్ జైలర్ సంజీవరెడ్డి సస్పెన్షన్
- స్ట్రెచర్‌పై కాకుండా బేడీలు వేసి తీసుకెళ్తారా?: కేటీఆర్

అధికారమా! నీకింతటి

కాఠిన్యమా?

- ప్రేమపాశాన్ని కాదని మరొకరికి దత్తత
- చైల్డ్ వెల్ఫేర్ కమిటీ నిర్ణయం
- తల్లడిల్లుతున్న పెంపుడు తల్లిదండ్రులు
- పిల్లల మానసిక స్థితిని పరిగణనలోకి తీసుకోలేదంటూ ఆరోపణ
- హైకోర్టులో సవాల్ చేస్తామని వెల్లడి



హైదరాబాద్ సిటీ, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): కడుపున పుట్టకున్నా, ఆ పిల్లల మీదే ప్రాణాలు పెట్టుకొని కంటికిరెప్పలా సాకుతున్న తొమ్మిది మంది తల్లిదండ్రుల ఆశలు అడియాశలయ్యాయి. పొత్తిళ్లనాటి నుంచి ఊహతెలిసే వరకు పెంచిన వారి కడుపుతీపిని కాదని, మరొకరికి చిన్నారులను దత్తత ఇచ్చేందుకు అధికారులు రంగంసిద్ధం చేస్తున్నారు. ఇంతకాలం ఆలనాపాలనా చూస్తూ, వాత్సల్యాన్ని కురిపిస్తున్న వాళ్లను తమ అమ్మానాన్నగా భావిస్తున్న ఆ పసిబిడ్డల మానసిక స్థితిని ఈ సందర్భంలో కనీసం పరిగణనలోకి తీసుకోకపోవడం గర్హనీయం. చట్టబద్ధంగా దత్తత తీసుకోలేదన్న కారణంగా, ఆరునెలల కిందట 13మంది పిల్లలను పెంపుడు తల్లిదండ్రుల నుంచి

మిగతా 12వ పేజీలో...



మట్టికట్ట వద్దు.. రబ్బర్ డ్యామ్ మేలు

- మేడిగడ్డపై ఇంజనీరింగ్ నిపుణుల సూచన
- భారీగా వరద వచ్చినా ప్రమాదం ఉండదని వెల్లడి

హైదరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి ఎగువ భాగంలో మట్టికట్ట కట్టి.. దానికి రక్షణగా జియో ట్యూబ్‌లు పెట్టాలనే ప్రతిపాదనను నిపుణులు తోసిపుచ్చారు. మట్టికట్ట ఏ మాత్రం సురక్షితం కాదని, దాని స్థానంలో రబ్బర్ డ్యామ్ కట్టుకోవాలని సూచించారు. గత ఏడాది అక్టోబరులో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయింది. దీంతో పాటు అన్నారం, సుందిళ్లపై అధ్యయనం చేసి, శాశ్వతంగా చేపట్టాల్సిన చర్యలను సిఫారసు చేసే బాధ్యతను జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ)కు తెలంగాణ అప్పగించింది. అయితే కోరిన అన్ని పరీక్షల నివేదికలు ఇవ్వకుండా, తమను సంప్రదించకుండా చేపట్టిన చర్యలతో బ్యారేజీల వైఫల్యానికి గల సాంకేతిక ఆధారాలు ధ్వంసమయ్యాయని

మిగతా 13వ పేజీలో...



ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు

మావోయిస్టుల మృతి

- ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మఢ్‌లో ఘటన
- మృతులంతా ఇంద్రావతి దళ సభ్యులు..
- వారిలో ఇద్దరు మహిళలు 3
- విప్లవ సాహిత్యం, తుపాకుల సీజ్
- అమిత్‌షా పర్యటన వేళ అలజడి!



ఏజెన్సీలు గజగజ

- ఆదిలాబాద్ జిల్లా బేలలో 7 డిగ్రీలు నమోదు
- వచ్చే మూడు రోజుల్లో రాష్ట్రంలో మరింత చలి
- 2-4 డిగ్రీల మధ్యకు పడిపోయే చాన్స్ 13

సినిమాల్లోనే నటన..

జీవితంలో రాదు

- మీడియా ప్రతినిధిపై దాడి చేయాలనుకోలే
- రాత్రి ఇంట్లోకి వచ్చి ఇబ్బంది పెట్టారు
- మైక్ నా కంటికి తగిలింది.. అందువల్లే
- లాక్కుని కొట్టా: మోహన్‌బాబు 14
- ఆయనపై హత్యాయత్నం కేసు నమోదు



హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు

శుభవార్త

2

- ఆటోమేటిక్ రెన్యువల్ గడువు 180 నుంచి 540 రోజులకు పొడిగింపు

ధరణి పోర్టల్ తాత్కాలిక బంద్

12

- 16వ తేదీ ఉదయం వరకు..
- డేటాబేస్ వెర్షన్ అప్‌గ్రేడ్ వల్లే..



హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు శుభవార్త

» ఆటోమేటిక్ రెన్యూవల్ గడువు 540 రోజులకు పొడిగింపు

వాషింగ్టన్, డిసెంబరు 12: హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు అమెరికా ఓ శుభవార్తను ప్రకటించింది. యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోం ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) గురువారం హెచ్-1బీ, ఎల్1 వీసాదారుల జీవిత భాగస్వాములకు ఆటోమేటిక్ వర్క్ పర్మిట్ రెన్యూవల్ కాల పరిమితిని పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటివరకూ ఈ పరిమితి 180 రోజుల వరకే ఉంది. తాజా ప్రకటనతో ఈ కాలపరిమితి 540 రోజులకు పెరిగింది. వచ్చే జనవరి 13 నుంచి ఇది అమల్లోకి వస్తుంది. 2022 మే 4న లేదా ఆ తర్వాత దరఖాస్తు చేసుకున్న వారికే ఇది వర్తిస్తుంది. సహజంగా, వీసా జారీ ప్రక్రియలో జాప్యం కారణంగా పనిచేసే అవకాశం కోల్పోతారు. దీంతో అనేక కుటుంబాలు ఇబ్బందుల్లో పడతాయి. ఈ సమస్యకు పరిష్కారంగా గడువును పొడిగిస్తున్నట్లు ఆ ప్రకటన వివరించింది.

సంపద సృష్టికర్తలను వివాదాల్లోకి లాగొద్దు

» పార్లమెంటు స్తంభనపై సద్గురు జగ్గీవాసుదేవ్ స్పందన

న్యూఢిల్లీ, డిసెంబరు 12: దేశంలో సంపద సృష్టించేవారిని, ఉద్యోగాలు కల్పించేవారిని రాజకీయ వివాదాల్లోకి లాగొద్దని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సద్గురు జగ్గీవాసుదేవ్ పేర్కొన్నారు. ఏవైనా అవకతవకలు ఉంటే చట్ట ప్రకారం చర్యలు ఉండాలని, అంతేకానీ రాజకీయంగా ఫుట్‌బాల్ ఆడటం సరికాదన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటులో ప్రతిపక్షాలు నిరసనలు కొనసాగిస్తున్న నేపథ్యంలో 'ఎక్స్' వేదికగా సద్గురు ఓ పోస్టు చేశారు. 'ప్రపంచంలో ప్రజాస్వామ్యానికి భారత్ దీపస్తంభం కావాలని ఆకాంక్షిస్తున్న తరుణంలో పార్లమెంటులో కార్యకలాపాలను అడ్డుకోవడం నిరుత్సాహం కలిగిస్తోంది. మన దేశం భవ్య భారత్‌గా ఎదగాలంటే వ్యాపారాలు అభివృద్ధి చెందడం ఒక్కటే మార్గం' అని సద్గురు పేర్కొన్నారు.

బిడ్డను కలవనీయకపోవడం క్రూరత్వమే

» తల్లిని మానసికంగా వేధించడమే: బాంబే హైకోర్టు

ముంబై, డిసెంబరు 12: బిడ్డను కలుసుకోకుండా తల్లిని అడ్డుకోవడం క్రూరత్వం కిందకే వస్తుందని బాంబే హైకోర్టు ఔరంగాబాద్ బెంచ్ వ్యాఖ్యానించింది. ఇలాంటి చర్యలు ఆమెను మానసికంగా వేధించడం కిందకే వస్తుందని జస్టిస్ విభా కనకన్‌వాడి, జస్టిస్ రోహిత్ జోషిల ధర్మాసనం స్పష్టం చేసింది. అత్తింటివారిపై ఆ తల్లి పెట్టిన కేసును కొట్టివేయడానికి నిరాకరించింది. మహారాష్ట్ర జాల్నాకు చెందిన ఆ మహిళకు 2019లో వివాహం జరిగింది. 2020లో ఓ పాపకు జన్మనిచ్చింది. అయితే అదనపు కట్నం తేవాలంటూ ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించిన అత్తింటివారు 2022 మే నెలలో ఇంటిని బయటకు పంపించివేశారు. పాపను తమ వద్దే ఉంచుకున్నారు. దాంతో ఆమె భర్త, అత్తింటివారిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పాపను తనకు అప్పగించాలని కోరుతూ ఆమె 2023లో మేజిస్ట్రేటు కోర్టులో పిటిషన్ వేసింది. ఆమెకు అనుకూలంగా న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది. కానీ ఆ కోర్టు ఆదేశాలను భర్త అమలు చేయకపోవడంతో ఆమె హైకోర్టులో పిటిషన్ వేశారు. మరోవైపు తమపై కేసును కొట్టివేయాలని కోరుతూ అత్త, మామ, ఆడపడుచు కూడా హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం.. నాలుగేళ్ల పాపను తల్లికి దూరంగా ఉంచడం క్రూరత్వం కిందికే వస్తుందని తెలిపింది.

ట్రంప్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జిన్‌పింగ్!

వాషింగ్టన్, డిసెంబరు 12: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ జనవరి 20న బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆ కార్యక్రమానికి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు ఆహ్వానం పంపినట్లు అంతర్జాతీయ మీడియాల్లో కథనాలు వెలువడ్డాయి. ఈ ఆహ్వానంపై వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం స్పందించలేదు. ఇక అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే దాదాపు 25 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లను జారీ చేసేందుకు ట్రంప్ సిద్ధమవుతున్నారు.

1,539 మందికి బైడెన్ క్షమాభిక్ష

వాషింగ్టన్, డిసెంబరు 12: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ గురువారం 1,500 మందికి గృహనిర్బంధం నుంచి విముక్తి కలిగించగా.. మరో 39 మందికి క్షమాభిక్ష ప్రసాదించారు. ఒకేరోజు ఇంతమందికి క్షమాభిక్ష ఇవ్వటం ఆధునిక చరిత్రలో ఇదే తొలిసారి అని పలువురు భావిస్తున్నారు. కాగా, గృహనిర్బంధం నుంచి విముక్తి లభించినవారిలో చాలామంది కరోనా సమయంలో ఆంక్షలను ఉల్లంఘించిన వారు కాగా.. క్షమాభిక్ష పొందినవారు అహింసాయుత నేరాలకు పాల్పడినవారు. వీరిలో మాజీ సైనికాధికారులు, మతాధికారులు, విద్యార్థులు, మహిళలు ఉన్నారు.

ఆ పేలుళ్లకు పాల్పడింది మేమే..

» లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటన

గురుగ్రామ్, డిసెంబరు12: చండీగఢ్, గురుగ్రామ్‌లలో ఇటీవల బాంబు పేలుళ్లకు పాల్పడింది తామేనంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. 'అందరికీ జై శ్రీరామ్.. చండీగఢ్, గురుగ్రామ్‌లో రెండు రోజుల కింద జరిగిన బాంబు పేలుళ్లు ట్రైలర్ మాత్రమే.. కొందరు బార్‌లు, క్లబ్‌ల నిర్వాహకులు పేదల రక్తం పీలుస్తూ జూదం, హవాలా వంటి అక్రమ మార్గాల్లో కోట్లు సంపాదిస్తున్నారు.. పన్నులు ఎగ్గొట్టి దేశానికి నష్టం చేకూరుస్తున్నారు. ఇప్పట్నుంచి అలాంటి వారు సక్రమంగా పన్నులు చెల్లించాల్సిందే.. మేం పేల్చింది చిన్న బాంబులే అని తేలిగ్గా తీసుకోవద్దు.. అనుకుంటే భారీ పేలుళ్లకు పాల్పడి విధ్వంసం సృష్టించగలం' అని హెచ్చరించింది.

ప్రధానితో మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ భేటీ

న్యూఢిల్లీ, డిసెంబరు 12: మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం సమీపిస్తున్న వేళ ఆ రాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ గురువారం ప్రధాని మోదీతో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నెల 5న మహారాష్ట్ర సీఎంగా ప్రమాణం చేసిన తర్వాత ప్రధానిని ఫడణవీస్ కలవడం ఇదే మొదటిసారి. ఇదిలాఉండగా.. తన క్యాబినెట్‌లో బీజేపీ నుంచి మంత్రులయ్యే అవకాశం ఉన్న వారి జాబితా సిద్ధమైందని, దీనిపై పార్టీ కేంద్ర నాయకత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని ఫడణవీస్ తెలిపారు. రెండు రోజుల పర్యటనకు ఢిల్లీ వచ్చిన ఆయన క్యాబినెట్ విస్తరణపై అమిత్ షా, జేపీనడ్డా, పార్టీ సీనియర్ నేత బీఎల్ సంతోష్‌లతో బుధవారం రాత్రి చర్చించారు.

షిర్డీ ఆలయ భద్రతపై మాక్ డ్రిల్

» పాల్గొన్న ఎన్ఎస్‌జీ, ఫోర్స్ వన్ సిబ్బంది

ముంబయి, డిసెంబరు 12: షిర్డీ సాయిబాబా ఆలయ భద్రతపై అధికారులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఒకవేళ ఉగ్రవాదులు ప్రవేశిస్తే వారిని ఎదుర్కొనేందుకు సిబ్బంది సన్నద్ధత ఎలా ఉండాలనే విషయమై ఈ మాక్ డ్రిల్ జరిగింది. బుధవారం రాత్రి 11 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం గురువారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ) కమెండోలు, ఉగ్రవాద నిరోధక చర్యల కోసం ప్రత్యేకంగా ఏర్పాటయిన మహారాష్ట్ర పోలీసు విభాగంలోని 'ఫోర్స్ వన్' సిబ్బంది, స్థానిక పోలీసులు ఇందులో పాల్గొన్నారు. ఒకవేళ ఉగ్రవాదులు దాడులు చేస్తే వారిని అదుపు చేసేందుకు ఎలా వ్యవహరించాలనేదానిపై కసరత్తు చేశారు. వారికి సహాయంగా విపత్తు నిర్వహణ, అగ్నిమాపక దళం, వైద్య, రెవెన్యూ సిబ్బంది కూడా వచ్చారు. అలాంటి పరిస్థితి వస్తే వివిధ విభాగాల మధ్య ఎలాంటి సమన్వయం ఉండాలన్నదానిపైనా అవగాహన కలిగించారు. అంతకుముందు ఎన్ఎస్‌జీకి చెందిన 150 మంది కమెండోలు అహిల్యానగర్ కాలేజీ ఆవరణలో కవాతు నిర్వహించారు.

13,500 కోట్లతో 12 సుఖోయ్ యుద్ధ విమానాలు

» హెచ్ఏఎల్‌తో ఒప్పందం

న్యూఢిల్లీ, డిసెంబరు 12: భారతీయ వాయు సేన కోసం 12 యుద్ధ విమానాలు కొనుగోలు చేయాలని రక్షణశాఖ నిర్ణయించింది. ఇందుకు రూ.13,500 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వ రంగ సంస్థ అయిన హిందూస్థాన్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)తో గురువారం ఒప్పందం కుదుర్చుకొంది. రష్యాకు చెందిన ఈ యుద్ధ విమానాల పరికరాల్లో 62.6 శాతం మేర భారత్‌లోనే తయారుకానున్నాయి. ఇరు దేశాల ప్రభుత్వాల మధ్య కుదిరిన అవగాహన మేరకు హెచ్ఏఎల్ వీటిని నిర్మించనుంది. నాసిక్‌లోని కర్మాగారంలో వీటిని తయారు చేయనున్నారు.

తమిళనాడు ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం



» ఏడుగురు సజీవ దహనం

» షార్ట్ సర్క్యూటే ఘటనకు కారణం?

చెన్నై, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో దిండుగల్‌లోని సిటీ ఆస్పత్రిలో గురువారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో ఏడుగురు సజీవ దహనం అయ్యారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఒక బాలుడు ఉన్నారు. తిరుచ్చి, దిండుగల్ జాతీయ రహదారిపై ఉన్న సిటీ ఆస్పత్రిలో రాత్రి 10 గంటల ప్రాంతంలో మంటలు సంభవించాయి. నాలుగు అంతస్తుల భవనమున్న ఈ ఆస్పత్రి దిగువ ఫ్లోర్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఏం జరిగిందో గ్రహించేలోపే మంటలు వార్డులకు వ్యాపించాయి. దీంతో రోగులు భయంతో బయటకు పరుగులు తీశారు. ఆ సమయంలో లిఫ్టులో ఉన్న ముగ్గురు మహిళలు, ఒక బాలుడు మంటలకు బలయ్యారు. మరో ముగ్గురి మృతదేహాలు కూడా లభ్యమయ్యాయి. 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో రోగులే ఎక్కువ ఉన్నట్టు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక దళాలు హుటాహుటిన ఘటనాస్థలికి వచ్చాయి. సుమారు 50 అంబులెన్సుల్లో రోగులను, క్షతగాత్రులను ఇతర ఆస్పత్రులకు తరలించినట్లు దిండుగల్ జిల్లా పోలీసులు తెలిపారు. కాగా, ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఐ.పెరియస్వామి, దిండుగల్ కలెక్టర్ ఎం.ఎన్.పూంగుడి, ఎస్పీ ప్రదీప్ తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. అర్ధరాత్రి దాటాక కూడా మంటలు అదుపులోకి రాలేదు. షార్ట్ సర్క్యూట్ ఈ ప్రమాదానికి కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

జమిలికి సై



(మొదటి పేజీ తరువాయి)

సభ్యుల మద్దతు అవసరం. లోక్‌సభలో మూడింట రెండు వంతులు అంటే 361 మంది సభ్యుల మద్దతు కావాలి. ఎన్డీయే కూటమి బలం 293 మాత్రమే. వైసీ పీ, బీజేడీ, అన్నాడీఎంకే మద్దతు ఇచ్చినా 2/3 చేరుకోవడం అసాధ్యం. రాజ్యసభలోనూ 154 మంది ఎంపీల మద్దతు కావాలి. ఎన్డీయే బలం నామినేటెడ్ సభ్యులు కలుపుకొని 119 మాత్రమే. అంటే, ఉభయ సభల్లో బిల్లు నెగ్గడం అంత తేలికేమీ కాదని చెబుతున్నారు.

లోక్‌సభ, అసెంబ్లీ జమిలిపైనే దృష్టి

లోక్‌సభ, అసెంబ్లీలకు మాత్రమే జమిలి ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించాల్సిన అవసరం ఉండదని కేంద్రం భావిస్తోంది. స్థానిక ఎన్నికలను వాటితోపాటు కలిపితే కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీల్లోనైనా ఆమోదం పొందాల్సి ఉంటుందని బీజేపీ వర్గాలు అంటున్నాయి. ప్రస్తుతం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలపైనే పూర్తి దృష్టి కేంద్రీకరించాలని మోదీ ప్రభుత్వం భావిస్తున్నట్టు ఈ వర్గాలు తెలిపాయి. మూడు నెలల క్రితం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సమర్పించిన నివేదికలో లోక్‌సభ, అసెంబ్లీలతో పాటు స్థానిక సంస్థలకూ ఒకేసారి ఎన్నికలు జరపాలని, దేశవ్యాప్తంగా ఒకే ఓటర్ల జాబి తా రూపొందించాలని సిఫారసు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలను కూడా చేర్చాలంటే 324(ఎ) పేరుతో ఆర్టికల్‌ను చేర్చాలని చెప్పింది. దీనికి సగం రాష్ట్రాల శాసనసభల ఆమోదం అవసరం. దీన్ని ప్రస్తుతానికి పక్కన బెట్టారు. కోవింద్ కమిటీ మూడు రాజ్యాంగ అధికరణలకు, మూడు చట్టాలకు కలిపి మొత్తం 18 సవరణలు సూచించింది. ప్రభుత్వ పాల న సాఫీగా జరగడానికి జమిలి ఎన్నికలు అవసరమని తాము భావిస్తున్నట్టు బీజేపీ చీఫ్ విప్ సంజ య్ జైశ్వాల్ తెలిపారు. ప్రతి కొద్ది నెలలకు ఎన్నికలు జరగడం వల్ల ప్రభుత్వ సమర్థత తగ్గిపోతుందని, అధికారులు, రాజకీయ నాయకులు నిరంతరం ఎన్నిక ల ప్రక్రియలో తలమునకలై ఉంటారని, సంక్షేమ పథకాలు అమలు చేయడం సాధ్యం కాదని జైశ్వాల్ చెప్పారు. జమిలిని ప్రవేశపెడితే ఐదేళ్ల పాటు పాలన సాఫీగా సాగుతుందని ఆయన ఒక జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. 1971 వరకు జమిలి ఎన్నికలు నిరాటంకంగా జరిగాయని, తర్వాతే వాటికి అంతరాయం కలిగింద న్నారు. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడాన్ని 30కి పైగా పార్టీలు సమర్థిస్తున్నాయి. కాంగ్రెస్ సహా మరో 15 పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ ప్రతిపాదన ఆచరణాత్మకమైనది కాదని కాంగ్రెస్ అంటోంది. జమిలి ప్రజాస్వామ్య వ్యతిరేకమ ని, ప్రాంతీయ ఆకాంక్షలకు గొంతు లేకుండా పోతుందని, సమాఖ్య వ్యవస్థ దెబ్బతింటుందని తమిళనాడు సీఎం, డీఎంకే అధినేత స్టాలిన్ వ్యాఖ్యానించారు. జమిలిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత మమతా బెనర్జీ కూడా జమిలిని వ్యతిరేకించారు. రాజ్యాంగ ఉల్లంఘన, సమాఖ్య వ్యతిరేకం అని వ్యాఖ్యానించారు. జమిలి ఎన్నికలపై తమకు అనేక సందేహాలు ఉన్నాయని, బిల్లులు సభలోకి వచ్చాక స్పందిస్తామని లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనేత గౌరవ్ గొగో య్ అన్నారు. ఎన్నికల ప్రక్రియలో జమిలికి విఘాతం కలిగించే తీవ్రమైన సమస్యలు ఉన్నాయన్నారు. నాలుగు రాష్ట్రా ల్లో ఒకేసారి ఎన్నికలు పెట్టలేని పరిస్థితి దేశంలో ఉందని, దేశమంతా పెడతానని చెబుతున్న మోదీకి ఎంతటి సాధనా సంపత్తి అవసరమో అంచనా ఉందా? అని వి.హనుమంతరావు ప్రశ్నించారు.

ఏడు దేశాల్లో పరిశీలన

కోవింద్ కమిటీ జమిలి ఎన్నికలకు అనుకూలంగా నివేదిక ఇవ్వడానికి ముందు జమిలి ఎన్నికలను నిర్వహించే ఏడు దేశాలను సందర్శించింది. దక్షిణాఫ్రికా, జర్మనీ, స్వీడన్, జపాన్, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, బెల్జియం దేశాల ఎన్నికల విధానాలను పరిశీలించింది. కోవింద్ కమిటీ నివేదిక ప్రకారం లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలి. తర్వాత వంద రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలి. గత సెప్టెంబరులో మోదీ ప్రభుత్వం కోవింద్ కమిటీ నివేదికను ఆమోదించింది. దక్షిణాఫ్రికాలో లోక్‌సభ, శాసనసభల ఎన్నికలు ఒకేసారి ఐదేళ్లకోసారి జరుగుతాయి. తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయి. స్వీడన్‌లో ఓట్ల శాతాన్ని బట్టి దామాషా పద్ధతిలో సీట్లు కేటాయిస్తారు. అక్కడ పార్లమెంటు నుంచి స్థానిక సంస్థల వరకు ఒకేసారి నాలుగేళ్లకోసారి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అవిశ్వాస తీర్మానం విషయంలో జర్మనీ పద్ధతిని అనుసరించాలని కోవింద్ కమిటీ సభ్యుడు సుభాష్ సీ కష్యప్ సూచించారు. నిర్మాణాత్మక అవిశ్వాసం పద్ధతిలో ప్రస్తుత ప్రధానిని తొలగించేందుకు పెట్టే తీర్మానంలోనే మరో ప్రధానిని సాధారణ మెజారిటీతో ఎన్నుకోవాలి. సభ రద్దయితే మిగిలిన కాలానికి మాత్రమే ఎన్నికలు జరగాలి. లోక్‌సభ కాలపరిమితితో శాసనసభల కాలపరిమితి ముగిసిపోవాలి. అన్ని ఎన్నికలకూ ఒకే ఓటర్ల జాబితా ఉండాలి. అలాగే ప్రభుత్వ ఏర్పాటుకు రాష్ట్రపతి ఒకర్ని పిలవడం కాకుండా పార్లమెంటే సభానాయకుడిని ఎన్నుకోవాలని, అతన్నే రాష్ట్రపతి ప్రభుత్వం ఏర్పాటుకు పిలవాలని కష్యప్ ప్రతిపాదించారు. ఇది జపాన్‌లో అనుసరిస్తున్న విధానం. 2019లో ఇండోనేసియా విజయవంతంగా ఒకేరోజు దేశవ్యాప్తంగా అన్ని సభలకు ఎన్నికలు జరిపి జమిలి వ్యవస్థలోకి ప్రవేశించింది. ఓటేసిన వారి చేతులను ఇంక్ బాటిల్‌లో ముంచడం, 4 శాతం ఓట్లు వచ్చిన పార్టీలకు పార్లమెంటులో ప్రవేశం కల్పించడం, 50 శాతం ఓట్లు దాటిన వారికే అధ్యక్షుడిగా అవకాశం కల్పించడం ఇందులో ప్రత్యేకతలు. 20 కోట్ల మంది ఇండోనేసియన్ పౌరులు ఒకేరోజు ఓటేశారు. ఇది ప్రపంచంలోనే ఒకేరోజు జరిగిన అతిపెద్ద పోలింగ్.

లోకం తీరు



విదేశాల్లో రోడ్డు ప్రమాదాల ప్రస్తావన వస్తే సిగ్గుతో ముఖం దాచుకుంటున్నా

» ఏటా ప్రమాదాల్లో 1.78 లక్షల మంది మృతి

» రోడ్డు పక్కన ట్రక్కులు నిలపడం ప్రమాదాలకు ప్రధాన కారణం: గడ్కరీ



న్యూఢిల్లీ, డిసెంబరు 12: దేశంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య నానాటికీ పెరిగిపోతోందని, అంతర్జాతీయ సదస్సుల్లో ఈ అంశం ప్రస్తావనకు వస్తే సమాధానం చెప్పలేక సిగ్గుతో ముఖాన్ని దాచుకోవాల్సి వస్తోందని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. గురువారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో రోడ్డు ప్రమాదాలపై ఆయన మాట్లాడారు. తాను రోడ్డు, రవాణా మంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టినప్పుడు రోడ్డు ప్రమాదాలను 50% మేర తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నానని, కానీ ఇంకా ఇంకా పెరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నప్పుడు దేశంలో రోడ్డు ప్రమాదాలపై చర్చ జరిగితే సిగ్గుతో ముఖం దాచుకోవాల్సి వస్తోందని వాపోయారు. దేశంలో ప్రజలకు చట్టాలంటే భయం లేదని పేర్కొన్నారు. కొంత మంది రెడ్ సిగ్నల్ జంప్ చేస్తున్నారని, కొంత మంది ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్లు ధరించడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలు తగ్గాలంటే ప్రజలు మారాలని, చట్టాలను గౌరవించాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. రోడ్డు పక్కన ట్రక్కులను నిలిపి ఉంచడం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. దేశంలో ప్రతి ఏటా 1.78 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, వారిలో 60% మంది 18 నుంచి 34 ఏళ్ల వయసు వారేనని తెలిపారు. తాను, తన కుటుంబం కూడా ఓసారి రోడ్డు ప్రమాదానికి గురై చాలా రోజులు ఆస్పత్రిలో ఉండాల్సి వచ్చిందని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని లోక్‌సభ సభ్యులను గడ్కరీ కోరారు.

రాజ్యసభ చైర్మన్‌పై ప్రెస్‌మీట్‌లో విమర్శలా?

» ఖర్గే తీరు సరికాదు: జేపీ నడ్డా

న్యూఢిల్లీ, డిసెంబరు 12: రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బహిరంగంగా విమర్శలు చేయడం సరికాదని కేంద్ర మంత్రి జేపీ నడ్డా అన్నారు. "రాజ్యసభ చైర్మన్‌ను ప్రశ్నించడం ఆమోదయోగ్యం కాదు. చైర్మన్ ఆదేశాలను ప్రశ్నించడం లేదా విమర్శించడం తప్పు. ఒక వేళ అలా చేస్తే అది సభను, చైర్మన్‌ను ధిక్కరించినట్లే అవుతుంది" అని నడ్డా పేర్కొన్నారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత, సీనియర్ నాయకుడైన ఖర్గే మీడియా సమావేశంలో చైర్మన్‌పై విమర్శలు చేశారని, ఈ తప్పుడు చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందని చెప్పారు. సభలో తమకు అవకాశం ఇవ్వడం లేదని, చైర్మన్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారంటూ ఖర్గే చేసిన ఆరోపణలపై స్పందిస్తూ.. చైర్మన్ తన చాంబర్‌కు రావాలని ఆదేశిస్తే ఖర్గే రాలేదని నడ్డా తెలిపారు. ఆయన ఎలాంటి చర్చల్లోనూ పాల్గొనలేదన్నారు. బీఏసీ సమావేశంలోనూ పాల్గొనలేదని, ప్రజాస్వా మ్యంపై ఖర్గేకు ఎంత గౌరవం ఉందన్నది ఈ చర్యతోనే అర్థమవుతోందని చెప్పారు. కాగా, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పక్షపాతంతో వ్యవహ రిస్తున్నారని ఖర్గే గురువారం ఆరోపించారు. ప్రతిపక్ష సభ్యుల భావప్రకటనా స్వేచ్ఛను ఆయన అణచివేస్తున్నారన్నారు. సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వక పోవడం, హేళన చేయడం, నిరాధార ఆరోపణలు చేయడం, ప్రజాసమస్యలపై చర్చించాలని కోరితే తిరస్కరించడం చైర్మన్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఆ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే నడ్డా తనపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తామెవరికీ తల వంచమని, హక్కుల పరిరక్షణకు పోరాడతామని ఖర్గే చెప్పారు.

రోడ్డుపై రెండు ముక్కలైన విమానం

» ఎమర్జెన్సీ ల్యాండింగ్‌లో ప్రమాదం.. అంతా సేఫ్

టెక్సాస్, డిసెంబరు 12: అది బిజీగా ఉండే హైవే. మధ్యాహ్నం 3 గంటల సమయం. రోడ్డుపై కార్లు రయ్ రయ్‌మని దూసుకుపోతున్నాయి. ఇంతలో ఓ విమానం నేలజారుకు వచ్చింది. అంతా చూస్తుండగానే నాలుగు రోడ్ల కూడలిలో కూలి రెండు ముక్కలైంది. ఇంత ప్రమాదం జరిగినా పైలట్ సేఫ్‌గా ఉన్నాడు. ఈ ఘటన అమెరికాలోని దక్షిణ టెక్సాస్‌లో జరిగింది. పోలీస్ అధికారి ఇలైన్ మోయా తెలిపిన వివరాల ప్రకారం.. రెండు ఇంజన్ల చిన్న విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్ కోసం కిందకి వచ్చింది. అది టెక్సాస్‌లోని విక్టోరియాలో స్టేట్ హైవే లూప్ 463 వద్ద రోడ్డుపై దిగే క్రమంలో పలు వాహనాలను ఢీకొట్టి ముక్కలైంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ నలుగురిలో ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అత్యవసర సేవల సిబ్బంది వెంటనే వచ్చి రోడ్డుపై పడ్డ విమాన శకలాలను తొలగించారు.

ప్రార్థన స్థలాలపై విచారణ ఆపండి

(మొదటి పేజీ తరువాయి)



కూడిన త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. "ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనల) చట్టం, 1991"లోని పలు నిబంధనలను సవాల్ చేస్తూ ప్రముఖ న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్ సహా ఆరు పిటిషన్ల విచారణ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. కాశీలో జ్ఞానవాపి, మథురలో షాహీ ఈద్గాహ్ మసీదు సహా దేశ వ్యాప్తంగా 10 మసీదులు/ముస్లిం ప్రార్థనా మందిరాల్లో సర్వే నిర్వహించాలని కోరుతూ దాఖలైన 18 వ్యాజ్యాల్లో తదుపరి విచారణలు ఈ ఆదేశాలతో నిలిచిపోనున్నాయి. 1947 ఆగస్టు 15 నాటికి దేశవ్యాప్తంగా ఉన్న ప్రార్థనా స్థలాల మత స్వభావాన్ని మార్చడానికి వీల్లేకుండా 1991లో అప్పటి కాంగ్రెస్ సర్కారు.. "ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనల) చట్టం, 1991"ని రూపొందించింది. రామజన్మభూమి-బాబ్రీ మసీదు మాత్రం ఈ చట్టం పరిధిలోకి రాకుండా.. ఇదే చట్టంలోని సెక్షన్ ఐదు ద్వారా మినహాయింపునిచ్చారు. ఈ చట్టంలోని నిబంధనలను వ్యతిరేకిస్తూ.. ఈ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆరు పిటిషన్లు దాఖలయ్యాయి. అదే సమయంలో.. ఈ చట్టాన్ని రద్దు చేస్తే దేశంలో మతసామరస్యం దెబ్బతింటుందని, కాబట్టి దాన్ని రద్దు చేయకూడదని, హిందూ పక్షాలు కేసులు వేసిన మసీదుల యథాతథస్థితిని కొనసాగించాలని కోరుతూ కూడా పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లన్నింటినీ విచారిస్తున్న ధర్మాసనం.. తాము ఈ చట్టం న్యాయబద్ధతను, పరిధిని పరిశీలిస్తున్నామని, కాబట్టి దేశంలోని ఇతర కోర్టులు ఈ తరహా కేసుల్లో విచారణ చేపట్టవద్దని చెప్పడం అనివార్యంగా భావిస్తున్నామని పేర్కొంది. అయితే, ఒక హిందూ పక్షం తరఫున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది జె.సాయి దీపక్.. సుప్రీం ఆదేశాలను వ్యతిరేకించారు. ఇలాంటి ఆదేశాలు ఇచ్చే ముందు అన్ని పక్షాల వాదనలూ వినాలని కోరారు. దీనికి సీజేఐ.. సుప్రీంకోర్టు విస్తృత పరిశీలనలో ఉన్న అంశాలపై ఎలాంటి ఆదేశాలూ జారీచేయొద్దని కోర్టులను కోరడం సహజమేనని గుర్తుచేశారు. ట్రయల్ కోర్టులు సుప్రీంకోర్టును కాదని విచారణ జరపవచ్చా? అని ప్రశ్నించారు. ఈ అంశంపై కేంద్రం వైఖరి ఏమిటో తెలియకుండా నిర్ణయం తీసుకోలేం కాబట్టి.. నాలుగు వారాల్లోగా సమాధానం దాఖలు చేయాలని, దాన్ని ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకునే విధంగా వెబ్‌సైట్‌లో పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. కేంద్రం స్పందనపై సమాధానాల దాఖలుకు ఈ కేసుల్లో పార్టీలుగా ఉన్నవారికి మరో నాలుగువారాల గడువిచ్చారు. అలాగే.. ఈ కేసులో కేంద్రం తరఫున కాను అగర్వాల్‌ను, చట్టాన్ని సవాల్ చేస్తున్న పిటిషనర్ల తరఫున విష్ణు శంకర్ జైన్‌ను, చట్టాన్ని సమర్థిస్తూ పిటిషన్లు దాఖలు చేసిన పక్షాల తరఫున ఇజాజ్ మక్బూల్‌ను నోడల్ న్యాయవాదులుగా నియమించిన సుప్రీంకోర్టు, తదుపరి విచారణను ఎనిమిది వారాలకు వాయిదా వేసింది.

ఆత్మహత్య చేసుకుని చచ్చిపో..

భార్య మాటలతోనే అతుల్ సుభాష్ సూసైడ్

» రూ. 5 లక్షలు డిమాండ్ చేసిన జడ్జి

» కేసులో కొత్త విషయాలు.. దేశ వ్యాప్తంగా చర్చ

న్యూఢిల్లీ, డిసెంబరు 12: భార్య వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న బెంగళూరు టెకీ అతుల్ సుభాష్ కేసు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పురుషులకు కూడా న్యాయం అందాలనే డిమాండ్ వినిపిస్తోంది. సుదీర్ఘమైన అతని సూసైడ్ నోట్‌లోని విషయాలు చర్చకు దారితీశాయి. ఈ కేసులో ఒక్కొక్కటిగా కొత్త విషయాలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. భార్య, అత్త ఎగతాళి మాటలే అతన్ని ఆత్మహత్యకు పురిగొల్పేలా చేశాయని స్పష్టమైంది. మరోపక్క అతుల్ కుటుంబ సభ్యులు మీడియా వద్ద తమ ఆవేదన వ్యక్తం చేశారు. సుభాష్ అన్న మాట్లాడుతూ.. 'నా సోదరుడు బెంగళూరు నుంచి యూపీలోని జౌన్‌పూర్ కోర్టుకు 40 సార్లు తిరిగాడు. నా సోదరుడికి న్యాయం జరగాలి. జడ్జిపై కఠిన చర్యలు తీసుకోవాలి. న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం తగ్గుతోంది. ఏటీఎం యంత్రాలం అయిపోతామనే భావన పురుషుల్లో ఉంది. పెళ్లిళ్లు అంటేనే మగవాళ్లు భయపడే పరిస్థితి వస్తోంది' అని అన్నారు. అతని బంధువు మాట్లాడుతూ.. భార్య తరఫు వారు నిత్యం సుభాష్‌ను డబ్బులు డిమాండ్ చేసేవారని చెప్పారు. కాగా, సుభాష్ కుటుంబంపై అతడి భార్య నిఖిత కూడా తీవ్ర ఆరోపణలు చేసింది. తన అత్త కట్నం కోసం వేధించినట్లు పేర్కొంది. "నా భర్త తాగి వచ్చి నన్ను కొట్టేవాడు. నన్ను ఒక పశువులా చూసేవాడు. నా జీతం మొత్తం తన ఖాతాలోకి మార్పించేవాడు. అత్తగారి వేధింపుల కారణంగా నా తండ్రి ఆరోగ్యం పాడై 2019లో మరణించారు" అని పేర్కొంది.

అందుకే ఆత్మహత్య నిర్ణయం..

విడాకుల విచారణ సందర్భంగా ఫ్యామిలీ కోర్టులో జరిగిన రెండు సంఘటనలు సూసైడ్ నోట్‌లో సుభాష్ ప్రముఖంగా ప్రస్తావించాడు. ఆత్మహత్య చేసుకుని చావచ్చు కదా.. అని భార్య అనడంతోనే కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాడు. "మార్చి నెలలో కేసు విచారణకు వెళ్లాను. ఈ కేసును నువ్వెందుకు సెటిల్ చేసుకోవడం లేదు అని ఫ్యామిలీ కోర్టు జడ్జి అడిగారు. నా భార్య మొదట రూ. కోటి డిమాండ్ చేసింది. కోర్టు ఇచ్చిన మధ్యంతర మెయింటెనెన్స్ ఆర్డర్ తర్వాత దానిని రూ. 3 కోట్లకు పెంచింది అని జడ్జికి చెబితే.. నీ దగ్గర డబ్బుంది కాబట్టే వాళ్లు అడుగుతున్నట్లు ఉన్నారు అని జడ్జి అన్నారు. జడ్జికి నా ఆర్థిక పరిస్థితి అంతా వివరించాను. నాలాగే భరణం కేసుల్లో ఎంతమంది మగవాళ్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారో చెప్పాను. ఎన్‌సీఆర్‌బీ రిపోర్టును కూడా చూపాను. ఆ సమయంలో అక్కడే ఉన్న నా భార్య 'ఇంకేం.. నువ్వు కూడా ఆత్మహత్య చేసుకుని చనిపో' అని అన్నది. ఆ మాటలకు జడ్జి కూడా నవ్వారు. ఆ తర్వాత తన భార్యను బయటకు పంపేసి.. రూ. 5 లక్షలు ఇస్తే కేసు సెటిల్ చేస్తానని జడ్జి చెప్పారు. అంత ఇవ్వలేను అని జడ్జికి బదులిచ్చాను" అని సుభాష్ లేఖలో పేర్కొన్నాడు. ఇక ఏప్రిల్ నెలలో కోర్టు విచారణకు వెళ్లినపుడు తన అత్తగారు ఎదురుపడి.. "నువ్వింకా ఆత్మహత్య చేసుకోలేదా.. నువ్వు పోతే ఆస్తి మొత్తం నా కూతురికి చెందుతుంది. అప్పుడు నీ తల్లిదండ్రులు కూడా కోర్టు చుట్టూ తిరుగుతారు" అని రెచ్చగొట్టేలా మాట్లాడిందని సుభాష్ తెలిపాడు. ఈ సమస్యల్నీ పోవడానికి ఆత్మహత్యే శరణ్యం అని భావించానని లేఖలో పేర్కొన్నాడు.

మనోవర్తి నిర్ధారణకు 8 సూత్రాలు

మార్గదర్శకాలు జారీ చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, డిసెంబరు 12: విడాకులు మంజూరు చేసే సమయంలో భార్యకు చెల్లించాల్సిన శాశ్వత మనోవర్తిని నిర్ణయించే సమయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. భర్త చెల్లించాల్సిన మనోవర్తి అతడిని శిక్షించే విధంగా ఉండకూడదని, అదే సమయంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడిపే విధంగా భార్యకు చెల్లింపులు జరపాల్సి ఉంటుందని తెలిపింది. ఇందుకు ఎనిమిది సూత్రాల విధానాన్ని సూచిస్తూ జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బి వరాలే ధర్మాసనం తీర్పు చెప్పింది. ఓ జంట ఆరేళ్ల పాటు కలిసి ఉండి, అనంతరం దాదాపు రెండు దశాబ్దాల పాటు విడిగా జీవించింది. చివరకు విడాకుల కోసం కోర్టును ఆశ్రయించింది. వాదనలు విన్న ధర్మాసనం తుది మనోవర్తి నిర్ధారించే సమయంలో గమనించాల్సిన అంశాలపై మార్గదర్శకాలు ఇచ్చింది.

- భార్య, భర్తల ఆర్థిక, సామాజిక హోదా
- భార్య, ఆమెపై ఆధారపడ్డ పిల్లల హేతుబద్ధమైన అవసరాలు
- ఆ జంట విద్యార్హతలు, ఉద్యోగాల హోదా
- భార్యకు ఉన్న సొంత ఆదాయం, ఆస్తులు
- అత్తవారింటిలో భార్య అనుభవించిన జీవన ప్రమాణాలు
- కుటుంబ బాధ్యతల కోసం ఆమె ఉద్యోగాన్ని త్యాగం చేసి ఉంటే ఆ వివరాలు...
- భార్య ఎలాంటి ఉద్యోగం చేయకుంటే కోర్టుల్లో న్యాయం కోసం ఆమె చేసిన వ్యయం...
- భర్త ఆదాయం, రుణాలు, మనోవర్తి భారం... తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. అన్ని కోర్టులు కూడా ఈ మార్గదర్శకాలను పాటించాలని తెలిపింది. అయితే మనోవర్తి నిర్ధారణకు కచ్చితమైన సూత్రం అంటూ ఏమీ ఉండదని, పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

ఏడుగురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్

మృతుల్లో ఇద్దరు మహిళా నక్సల్స్.. మృతులంతా ఇంద్రావతి దళ సభ్యులు!

- ఆపరేషన్‌లో 4 జిల్లాల పోలీసులు
- దక్షిణ అబూజ్‌మడ్‌లో ఘటన
- అమిత్‌షా పర్యటన వేళ అలజడి!

చర్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అబూజ్‌మడ్ అడవులు మరో మారు ఎరుపెక్కాయి. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటన నేపథ్యంలో.. దక్షిణ అబూజ్‌మడ్‌లో ఇంద్రావతి దళం నక్సల్స్ సమావేశమైనట్లు ఉప్పందుకున్న నాలుగు జిల్లాల పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు జరిపిన కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. పోలీసులు ఘటనాస్థలి నుంచి తుపాకులు, విప్లవ సాహిత్యాన్ని సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 13 నుంచి మూడ్రోజుల పాటు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించనున్నారు. 13వ తేదీన మావోయిస్టు పీఎల్‌జీఏ కమాండర్ హిడ్మా స్వగ్రామమైన బీజాపూర్ జిల్లా పూవర్తిని కూడా ఆయన సందర్శించనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో దక్షిణ అబూజ్‌మడ్‌లో ఇంద్రావతి దళానికి చెందిన 50 మందికి పైగా నక్సలైట్లు సమావేశమైనట్లు భద్రతాబలగాలకు సమాచారం అందింది. దీంతో.. మంగళవారం రాత్రి నుంచే దంతెవాడ, నారాయణపూర్, కొండగావ్, బస్తర్ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ పోలీసులు.. సీఆర్‌పీఎఫ్, ఎస్టీఎఫ్ బలగాలు.. మొత్తం వెయ్యిమంది ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. ఈ క్రమంలో.. గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో మావోయిస్టులు భద్రతాబలగాలపై కాల్పులు జరిపారని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. దాంతో పోలీసులు బలగాలు ఎదురుకాల్పులకు దిగాయని, సుమారు ఐదు గంటల పాటు కాల్పులు కొనసాగాయని చెప్పారు. మావోయిస్టుల వైపు కాల్పులు నిలిచిపోయాక బలగాలు ముందుకు సాగగా.. ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయన్నారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నట్లు తెలిపారు. మృతులను ఇంకా గుర్తించాల్సి ఉందని, శుక్రవారం ఉదయానికల్లా మృతదేహాలను నారాయణపూర్ జిల్లా కేంద్రానికి తరలిస్తామని పేర్కొన్నారు. కాగా.. శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌కు రానున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా.. పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. ముఖ్యంగా 2026కల్లా నక్సల్స్‌ను అంతమొందించాలనే అజెండా నేపథ్యంలో రాష్ట్ర పోలీసులు, కేంద్ర బలగాలకు దిశానిర్దేశం చేస్తారని సమాచారం.

దట్టమైన అడవుల్లో బలగాల పట్టు

నక్సలైట్లకు కంచుకోటగా ఉండే అబూజ్‌మడ్‌పై పోలీసు బలగాలు పట్టు సాధిస్తున్నాయి. 20 ఏళ్లుగా ఈ ప్రాంతంలో జనతనసర్కార్ పేరుతో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టులు.. క్రమంగా బలహీనులవుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి గురువారం నాటి తాజా ఘటన వరకు మొత్తం 13 ఎన్‌కౌంటర్లు జరగ్గా.. 126 మంది మావోయిస్టులు మృతిచెందారు. 300 మందికి పైగా నక్సలైట్లు పోలీసుల ఎదుట లొంగిపోయారు.

11 మంది మావోయిస్టుల లొంగుబాటు

సుకుమా జిల్లాలో గురువారం 11 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు పోలీసులు తెలిపారు. వీరిలో చింతల్నార్‌కు చెందిన హేమ్లా, జోగేంద్ర యాదవ్, మడ్కం హుంగా మినహా.. మిగతా వారంతా 20-25 సంవత్సరాల వయసున్న యువకులేనని పేర్కొన్నారు. సుకుమా ఎస్పీ అమిత్ ప్రకాశ్ ఎదుట వీరు ఆయుధాలతో సహా లొంగిపోయినట్లు వివరించారు.

నక్సల్స్‌తో సంబంధాలు.. ఎన్ఐఏ దాడులు

ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా, ఒడిసాలోని మల్కనగిరి జిల్లాల్లో నక్సల్స్‌తో సంబంధాలున్న వ్యక్తులపై జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) గురువారం దాడులు జరిపింది. సుకుమాలో ఇద్దరు-- భేజీ ప్రాంతానికి చెందిన మంటోష్ మండల్, మరో మహిళ ఇళ్లలో సోదాలు నిర్వహించారు. మండల్‌ను ఎన్ఐఏ అధికారులు సెప్టెంబరు 25న కూడా అదుపులోకి తీసుకుని, విచారించారు. వీరిద్దరితో పాటు.. మల్కన్‌గిరికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులకు నక్సలైట్లతో సంబంధాలున్నట్లు ఎన్ఐఏ వర్గాలు తెలిపాయి.

తెలంగాణకు రూ.31 వేల కోట్లు

- లోక్‌సభలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని జాతీయ రహదారుల అభివృద్ధి పనుల కోసం 2014 నుంచి ఇప్పటి వరకు రూ.31 వేల కోట్ల నిధులు కేటాయించినట్లు కేంద్రం తెలిపింది. గురువారం లోక్ సభలో బీజేపీ ఎంపీ రఘు నందన్ రావు అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఈ మేరకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు. కాగా, అమృత్ 2.0 కింద తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన రూ.9,584.25 కోట్ల విలు వైన ప్రాజెక్టులను ఆమో దించినట్లు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల సహాయ మంత్రి టోకన్ సాహు తెలిపారు. గురువారం లోక్‌సభలో బీజేపీ ఎంపీ గోడం నగేశ్ అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈ మేరకు సమాధాన మిచ్చారు. కాగా, దేశ వ్యాప్తంగా వివిధ హైకోర్టు లలో 2018 నుంచి 684 మంది న్యాయమూర్తులుగా నియ మితులయ్యారని, వారిలో ఓబీసీలు 82 ఉన్నారని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వెల్లడించారు. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈ మేరకు సమా ధానం ఇచ్చారు. 684 మంది జడ్జిల్లో ఎస్సీలు 21, ఎస్టీలు 14, మైనారిటీలు 37 మంది ఉన్నారని పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్ల అభివృద్ధికి నిధులివ్వండి

- రైల్వే మంత్రికి ఎంపీ వంశీకృష్ణ వినతి

అమృత్ భారత్ పథకంలో భాగంగా మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి రైల్వే స్టేషన్ల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ కోరారు. ఈ మేరకు గురువారం పార్లమెంట్‌లో కేంద్ర మంత్రిని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం వంశీకృష్ణ మీడియాతో మాట్లాడుతూ.. మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైలును ఆపాలని (హాల్టింగ్) కోరారు.

సీఎం సారూ.. రుణమాఫీ చేసి ఆదుకోండి!

- ముఖ్యమంత్రికి రైతు వేడుకోలు
- ఆ రైతు ట్రాక్టర్‌లోనే రెండేళ్ల క్రితం ట్రిపుల్ ఐటీకి రేవంత్



రైతు సిందే పీరాజీ ట్రాక్టర్ ఎక్కి బాసర ట్రిపుల్ ఐటీకి వెళుతున్న రేవంత్ రెడ్డి (ఫైల్)



రైతు పీరాజీ

బాసర, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): "సీఎం సారూ మా అమ్మ పేరుపై బాసరలోని ఎస్‌బీఐ బ్యాంకులో రూ. 2 లక్షల 25 వేల వ్యవసాయ రుణం ఉంది. ఇటీవల రూ. 25 వేలు చెల్లించినా మిగిలిన రూ. రెండు లక్షల రుణం మాఫీ కాలేదు. ఈ విషయమై అధికారులను సంప్రదిస్తే.. జాబితాలో తన పేరు లేదని చెబుతున్నారు. దయచేసి మీరు స్పందించి రుణ మాఫీ చేయించండి" అంటూ బాసర మండలం లాబ్ది గ్రామానికి చెందిన సిందే పీరాజీ అనే రైతు ముఖ్యమంత్రి రేవంత్‌ను వేడుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. రెండేళ్ల క్రితం రేవంత్ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సిందే పీరాజీ ట్రాక్టర్‌లోనే బాసర ట్రిపుల్ ఐటీకి చేరుకుని అక్కడ ఆందోళన చేస్తున్న విద్యార్థులకు మద్దతు పలికారు. ఆందోళనలకు వ్యతిరేకంగా ట్రిపుల్ ఐటీ ముందు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో రేవంత్ ట్రాక్టర్‌లో పంట పొలాల వైపు నుంచి అక్కడకు చేరుకోవాల్సి వచ్చింది. దీంతో అప్పటి సంఘటనను ప్రస్తావిస్తూ గురువారం సదరు రైతు ఓ వీడియోను పోస్టు చేశాడు. తనకు రుణమాఫీ కాలేదని, వెంటనే తన రుణాన్ని మాఫీ చేసేలా చూడాలని రైతు సిందే పీరాజీ రేవంత్‌రెడ్డిని కోరాడు.

విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

ధారూరు, డిసెంబరుయ 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మంచి చెడు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు మద్యం మత్తులో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా ధారూరు మండల పరిధిలోని స్టేషన్ ధారూరు ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగింది. పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న కిష్టయ్య అనే ఉపాధ్యాయుడు మద్యం తాగి వచ్చి పాఠశాలలో విద్యార్థినులను తాకడం, గిల్లడం చేస్తూ తరగతి గదిలో సెల్‌ఫోన్‌లో పాటలు పెట్టి డాన్సులు చేయించాడు. బాలికలు ఈ విషయాన్ని తల్లితండ్రులకు చెప్పడంతో వారు పాఠశాలకు వచ్చి ఆందోళన చేశారు. ఉపాధ్యాయుడిపై ఎంఈవో శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో ఎంఈవో పాఠశాలలో విచారణ జరిపారు. విద్యార్థినులతో మాట్లాడి వివరాలు సేకరించారు. బాలికలను వేధించిన కిష్టయ్యను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అటాచ్ చేయిస్తామని, విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పిస్తామని, వారే చర్యలు తీసుకుంటారని ఎంఈవో తెలిపారు.

పంబాపూర్ అడవుల్లోకి పెద్దపులి

- నిర్ధారించిన అటవీశాఖ అధికారులు
- అప్రమత్తంగా ఉండాలని సమీప గ్రామాల ప్రజలకు హెచ్చరిక

తాడ్వాయి, తలమడుగు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని ఏజెన్సీ వాసులకు మూడురోజులుగా నిద్ర లేకుండా చేస్తున్న పెద్దపులి తాజాగా తాడ్వాయి మండలంలోకి ప్రవేశించింది. గురువారం పంబాపూర్ అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు నిర్ధారణ అయింది. బుధవారం సాయంత్రం కిన్నెరసాని అభయారణ్యంలోకి వెళ్లిన పులి ఊహించని విధంగా వెనక్కివచ్చి తాడ్వాయి అడవుల్లోకి ప్రవేశించింది. ముష్టిగింజల కోసం సమీప అడవిలోకి వెళ్లిన ఓ గిరిజనుడు పులిని చూసి భయంతో పరుగున గ్రామానికి చేరుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అటవీశాఖ అధికారులు అడవిలోకి వెళ్లి పాదముద్రల ఆధారంగా పెద్దపులి వచ్చినట్లు నిర్ధారించుకున్నారు. ట్రాప్ కెమెరాల ద్వారా పులి కదలికలను అధికారులు గమనిస్తున్నారు. ఇప్పటికే రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తున్నాయి. జనావాసాల వైపునకు వచ్చే అవకాశం ఉండడంతో సమీప గ్రామాలను అటవీ అధికారులు అప్రమత్తం చేశారు. అడవి సమీపంలోని పంట పొలాల వద్దకు వెళ్లవద్దని, పశువులను మేపడానికి, అటవీ ఉత్పత్తుల కోసం అడవిలోకి వెళ్లకూడదంటూ హెచ్చరికలు జారీ చేశారు. పెద్దపులి సంచారంతో సమీప గ్రామాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. రెండేళ్ల క్రితం ఇదే అడవిలో పెద్దపులి సంచరించింది. 2021లో అనూహ్యంగా వేటగాళ్ల ఉచ్చుకు ఓ ఆడపులి బలైంది. అలాగే, ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం జోర్లీ గ్రామ శివారులోనూ గురువారం సాయంత్రం పెద్ద పులి సంచారం కలకలం రేపింది.

తెలంగాణ ప్రభుత్వం
పోలీసు శాఖ: హైదరాబాద్

వేలము ప్రకటన

ఇందుమూలముగా ప్రజానీకమునకు తెలియజేయునది ఏమనగా, గౌరవనీయులైన మెట్రో పాలిటన్ సెషన్స్ జడ్జి, హైదరాబాద్ గారి Crt. M.P.No. 3952/2022 తేది : 12.10.2022 మరియు CC నెం. 08/2018, CCS, DD, హైదరాబాద్ లోని ఆదేశాల మేరకు ఈ విషయాన్ని సామాన్య ప్రజలకు తెలియ చేస్తున్నాము. సిద్ధి లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్, G1, కృష్ణ నివాస్, కృష్ణపురి కాలనీ, వెస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్, హైదరాబాద్‌కు సంబంధించిన ప్రధాన నిందితుడైన పురం కరుణాకర్ (A-1) యొక్క సదరు సంస్థకు చెందిన ఈ క్రింది స్థిరాస్తులను వేలం ద్వారా విక్రయించబడును. ఇవి G.O.Ms. No. 1218 హోమ్ (పాస్‌పోర్టులు) శాఖ, తేది: 20.10.2017లో స్వాధీనం చేసుకున్న మరియు తాత్కాలిక అటాచ్ చేసిన ఆస్తులు.

డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ CCS, DD, 5వ ఫ్లోర్, బషీర్‌బాగ్, హైదరాబాద్ కార్యాలయం ప్రాంగణంలో తేది 27.12.2024న 12.00 గం.ల నుండి వేలం నిర్వహించబడుతుంది.

ఆస్తి వివరాలు: అన్నపూర్ణకాలనీ, ఉప్పల్ మండలం హైదరాబాద్‌లోని సర్వే నం. 61లో గల ప్లాట్ నెం. 11లోని విస్తీర్ణం 466 చ.గ, 492 చ.గ & 694 చ.గ కలిగిన డోర్ నం. 5-1-78/2/303 గల మూడు ఫ్లాట్ నెం. 301, 302&303.

అమ్మకానికి ఉంచిన ఆస్తులను ఉద్దేశించిన కొనుగోలుదారులు 13.12.2024 మరియు 21.12.2024 తేదీలలో ఉ. 10.30 నుండి సా. 04.00 గం.ల వరకు తనిఖీ చేయవచ్చు. మొత్తం ఆస్తి నిర్ణయించిన కనీస ధర కంటే తక్కువగా విక్రయించబడదు, కాబట్టి వేలం నిర్వహించబడుతుంది. వేలంలో పాల్గొనే ముందు హాజరయ్యే బిడ్డర్లు బ్యాంకర్ చెక్కు లేదా డీడీ ద్వారా సమర్థ అధికారం ఉన్న డీసీపీ, డీడీ, సీసీఎస్, హైదరాబాద్ పేరు మీద రూ. 10,000/-లను చెల్లించవలెను. అది విఫలమైనచో బిడ్డర్లకు తిరిగి చెల్లించబడుతుంది.

విజయవంతమైన బిడ్డర్ బిడ్ అంగీకరించిన తర్వాత మొత్తంలో 25% వారంలోపు చెల్లించాలి, ఆ మొత్తాన్ని నగదు రూపంలో లేదా డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో లేదా బ్యాంకర్ చెక్కు రూపంలో కాంపిటెంట్ అథారిటీ, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ CCS, DD, హైదరాబాద్ మరియు మిగిలిన 75% పబ్లిక్ వేలం తేదీ నుండి 45 రోజులలోపు అవసరమైన స్టాంప్ డ్యూటీ మరియు రిజిస్ట్రేషన్ ఛార్జీలతో పాటు తప్పకుండా చెల్లించాలి.

కాంపిటెంట్ అథారిటీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ CCS, DD, హైదరాబాద్. ఏ కారణం చేతనైనా వేలం వాయిదా వేయవచ్చు అనగా అది కాంపిటెంట్ అథారిటీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ CCS, DD, హైదరాబాద్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. వేలం విక్రయానికి సంబంధించిన వివరాలకు సెల్ ఫోన్ నెం. 8712660822/8712571917ను సంప్రదించండి.

సం/- కాంపిటెంట్ అథారిటీ, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, CCS, DD, హైదరాబాద్

DIPR RO.No 7826-PP/CL/ADVT/1/2024-25 తేది.12.12.2024

NLC India Limited
'Navratna' - A Government of India Enterprise
Regd. Office: No.135, E.V.R. Periyar High Road, Kilpauk, Chennai-600 010.
CORPORATE OFFICE: BLOCK-1, NEYVELI, Cuddalore District, TAMIL NADU-607 801
CIN No.: L93090TN1956GOI003507, Website: www.nlcindia.in
CREATING WEALTH FOR WELLBEING

Form 14
[To be published in pursuance of Clause (7) of Regulation 23]

The Petitioner above-named has filed a petition before the Central Electricity Regulatory Commission, New Delhi for determination of Tariff for **THERMAL POWER STATION-I EXPANSION (2x210 MW) for the period from 01.04.2024 to 31.03.2029**

1. The beneficiaries of the generating station are:
   (a) Tamil Nadu Power Distribution Corporation Ltd (TNPDCL)
   (b) Telangana: Northern Power Distribution Company of Telangana Ltd. (TS NPDCL), Southern Power Distribution Company of Telangana Ltd. (TS SPDCL)
   (c) Karnataka: Bangalore Electricity Supply Company Ltd (BESCOM), Mangalore Electricity Supply Company Limited (MESCOM), Chamundeshwari Electricity Supply Corporation Ltd. (CESC), Gulbarga Electricity Supply Company Ltd. (GESCOM), Hubli Electricity Supply Company Ltd. (HESCOM)
   (d) Kerala State Electricity Board Ltd (KSEB)
   (e) Puducherry Electricity Department (PED)
2. Capacity of the generating station: 420 MW
3. Approved Capital Cost of the project (₹ in lakh): Existing Project
4. Authority which has approved the Capital Cost: Govt. of India
5. Scheduled date of commercial operation: Existing Project
6. Actual date of commercial operation: Existing Project
7. Capital cost on the date of commercial operation (₹ in lakh): Existing Project
8. Details of tariff: TPS-I Expansion (2x210 MW)

Thermal Power Generating Station (₹/kWh)	Previous Tariff	Year-wise tariff sought to be determined				
		2024-25	2025-26	2026-27	2027-28	2028-29
Capacity Charges	0.985	1.078	1.148	1.198	1.250	1.290
Energy Charges	2.843	2.860	2.860	2.860	2.860	2.860

NOTE:
a) NLCIL is publishing the application in terms of Clause (7) of Regulation 23 of CERC (Conduct of Business) Regulation 2023.
b) Monthly ECR shall be calculated based on the formula given in Regulation 64(3)(a) of 2024 Tariff Regulation, due to monthly variation in actual GCV and price of Primary fuel, Secondary fuel and Limestone (if applicable).
c) "Tariff for the Previous Year" in the table above is applicable tariff for the month of Mar-2024.

9. A copy of the petition made for determination of tariff is posted on the website www.nlcindia.in
10. The suggestions and objections, if any, on the proposals for determination of tariff contained in the petition may be filed by any person, including the beneficiaries through the e-filing portal of the Commission, with a copy to the Petitioner within 30 days of publication of this notice.

Place: Chennai — GENERAL MANAGER/COMMERCIAL
Date: 03-12-2024 — NLC INDIA LIMITED

PUBLIC SECTOR IS YOURS: HELP IT TO HELP YOU

NLC India Limited
'Navratna' - A Government of India Enterprise
Regd. Office: No.135, E.V.R. Periyar High Road, Kilpauk, Chennai - 600 010.
Corporate Office: Block-1, Neyveli, Cuddalore District, Tamil Nadu-607 801.
CIN No.: L93090TN1956GOI003507 | Website: www.nlcindia.in
CREATING WEALTH FOR WELLBEING

Form 14
[To be published in pursuance of Clause(7) of Regulation 23]

The Petitioner above-named has filed a petition before the Central Electricity Regulatory Commission, New Delhi for determination of Tariff for **THERMAL POWER STATION-II EXPANSION (2 x 250 MW CFBC) for the period from 01.04.2024 to 31.03.2029.**

1. The Beneficiaries of the generating station are :
   a) Tamil Nadu Power Distribution Corporation Ltd (TNPDCL)
   b) Telangana: Northern Power Distribution Company of Telangana Ltd. (TS NPDCL), Southern Power Distribution Company of Telangana Ltd. (TS SPDCL)
   c) Karnataka: Bangalore Electricity Supply Company Limited (BESCOM), Mangalore Electricity Supply Company Limited (MESCOM), Chamundeshwari Electricity Supply Corporation Ltd. (CESC), Gulbarga Electricity Supply Company Ltd. (GESCOM), Hubli Electricity Supply Company Ltd. (HESCOM)
   d) Kerala State Electricity Board Ltd. (KSEB)
   e) Puducherry Electricity Department (PED)
2. Capacity of the generating station : 500 MW
3. Approved Capital cost of the project (₹ in lakh) : Existing Project
4. Authority which has approved the Capital cost : Govt. of India
5. Scheduled date of commercial operation : Existing Project
6. Actual date of commercial operation : Existing Project
7. Capital cost on the date of commercial operation (₹ In lakh) : Existing Project
8. Details of Tariff : TPS-II Expansion (2 x 250 MW)

Thermal Power Generating Station (₹ / kWh)	Previous Tariff	Year-wise tariff sought to be determined				
		2024-25	2025-26	2026-27	2027-28	2028-29
Capacity Charges	2.106	2.591	2.753	2.803	2.794	2.800
Energy Charges	3.034	2.810	2.795	2.794	2.840	2.872

NOTE :
a) NLCIL is publishing the application in terms of clause (7) of Regulation 23 of CERC (Conduct of Business) Regulation 2023.
b) Monthly ECR shall be calculated based on the formula given in Regulation 64(3)(a) of 2024 Tariff Regulation, due to monthly variation in actual GCV and price of Primary fuel, Secondary fuel and Limestone if applicable.
c) "Tariff for the Previous Year" in the table above is applicable tariff for the month of Mar-2024.

9. A copy of the petition made for determination of tariff is posted on the website www.nlcindia.in
10. The suggestions and objections, if any, on the proposals for determination of tariff contained in the petition may be filed by any person, including the beneficiaries through the e-filing portal of the Commission, with a copy to the Petitioner within 30 days of publication of this notice.

Place : Chennai — General Manager / Commercial
Date : 03.12.2024 — NLC India Limited

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ లిమిటెడ్
ఆపరేషన్: వనపర్తి సర్కిల్

సంక్షిప్త టెండరు ప్రకటన: టెండరు స్పెసిఫికేషన్లు: W-01/2024-25&W-02/2024-25
వనపర్తి సర్కిల్‌లో వివిధ ఎలక్ట్రికల్ పనుల కొరకు టెండరు ప్రకటన: 002/2024-25, స్పెసిఫికేషన్ నం. W-01/2024-25&W-02/2024-25 కొరకు అర్హత గల విక్రేతలనుండి బిడ్లు కోరబడుతున్నవి. టెండర్ల విక్రయం ప్రారంభ తేది: 13.12.2024 మరియు టెండర్ల స్వీకరణకు చివరి తేది: 21.12.2024న 15.00 గం.లకు. టెండరు ప్రకటనకు సంబంధించిన తదుపరి వివరాల కొరకు www.tgsouthernpower.com దర్శించగలరు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్, TGSPDCL వనపర్తి సర్కిల్
DIPR RO No.7805-PP/CL/ADVT/1/2024-25, Dt: 12.12.2024

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ లిమిటెడ్
ఆపరేషన్ బంజారాహిల్స్ సర్కిల్
టెండరు ప్రకటన నం.10/2024-25 (పత్రికా ప్రకటన)

దిగువ తెలిపిన పనుల కొరకు అనుభవం కలిగిన వివిధ కాంట్రాక్టర్ల నుండి టెండర్లు మరియు సీల్డ్ బిడ్లు విడుదల చేయాలని TGSPDCL భావిస్తోంది: (1) సిటీ స్టోర్స్ వద్ద మెటీరియల్ లోడింగ్ & అన్‌లోడింగ్ (2) 11 KV బంజారాహిల్స్ & స్టార్ హాస్పిటల్ ఫీడర్ బైఫర్‌కేషన్ (3) TGTRANSCO వద్ద 11KV HT Cat-II ఎక్స్‌టెన్షన్ (4) SK నగర్ వద్ద 1 నం. EV చార్జింగ్ స్టేషన్‌కు సరఫరా (5) మాదాపూర్ వద్దగల TGREDCOకు 1 నం. నాన్ డొమెస్టిక్ లోడ్‌కు సరఫరా. తదుపరి వివరాలకు దర్శించండి: www.tgsouthernpower.org
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ బంజారాహిల్స్ సర్కిల్
DIPR RO No.7790-PP/CL/ADVT/1/2024-25, తేది:12.12.2024

శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానము, వేములవాడ: రాజన్న సిరిసిల్లా జిల్లా
ఇ- ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు మరియు షార్టు నోటీసు

ఆర్.సి.నం. సి1/1023/2024. — తేది: 12-12-2024.
మహా శివరాత్రి జాతర 2025 సందర్భంగా శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానము, వేములవాడ దేవస్థానము ఇంజనీరింగ్ విభాగము పనుల గురించి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాలు https://tender.telangana.gov.inకు లాగాన్ అవ్వండి. కరంట్ టెండర్స్‌పై క్లిక్ చేసి శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానము, వర్క్స్ సెలెక్ట్ చేయండి.
DIPR RO No.7654-PP/CL/ADVT/1/2024-25, Dt: 12.12.2024 — సం/- కె. వినోద్, కార్యనిర్వహణాధికారి.

సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, TGMSIDC ఈస్ట్ సర్కిల్, వరంగల్
ఫోన్ నం: 0870-3577529, ఇమెయిల్ ఐడి: setmsidcknr1@gmail.com
సంక్షిప్త టెండరు ప్రకటన

నం.11/SE/TGMSIDC Circle/East/2024-25 — తేది: 12.12.2024
దిగువ తెలిపిన పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి: "1) సూర్యాపేట జిల్లాలోని ఏరియా ఆసుపత్రి హుజూర్‌నగర్‌కు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ & UG కేబుల్స్ ఏర్పాటు చేయుట మరియు 2) సూర్యాపేట జిల్లాలోని కోదాడ వద్దగల AH కోదాడకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ & UG కేబుల్స్ ఏర్పాటు చేయుట". ఇతర వివరాలను www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, TGMSIDC ఈస్ట్ సర్కిల్: వరంగల్
DIPR RO No.7846-PP/CL/ADVT/1/2024-25, తేది: 12.12.2024

కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయం
ఫోన్ నం: 0878-2243438, ఫ్యాక్స్ నం: 0878-2240624, ఇమెయిల్: knrcmnr@rediffmail.com
సీల్డ్ కొటేషన్ ప్రకటన

నం. E1/DB/MCK/8201//Quotations/CEIG/2022-23 — తేది: 11.12.2024
కరీంనగర్‌లోని కరీంనగర్ డెయిరీ సమీపాన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ బల్ సీమెన్ సెంటర్ వద్దగల ఇంటిగ్రేటెడ్ వెజ్ & నాన్‌వెజ్ మార్కెట్ వద్ద DTR కొరకు EEIG ఆమోదం మరియు HT SFU బ్రేకర్ సరఫరా మరియు స్థాపన కోసం నాన్ SoR రేట్స్ ఐటమ్స్ కొరకు సీల్డ్ కొటేషన్ ప్రకటన. కొటేషన్ స్వీకరణకు చివరి తేది: 17.12.2024 సా.04.00 గం. మరిన్ని వివరాల కొరకు సంప్రదించండి: 7093972078
సం/- కమిషనర్, కరీంనగర్ నగరపాలక సంస్థ
DIRP RO No.7796-PP/CL/ADVT/1/2024-25, Dt: 12.12.2024

aptdc A.P. TOURISM DEVELOPMENT CORPORATION LTD.
5th Floor, Stalin Corporate, Industrial Estate, Autonagar, Vijayawada-07

Tender Notice No.APTDC/GMP/2025-26 — Dt:11.12.2024

SHORT TENDER NOTIFICATION

Sealed Tenders are invited for renewal of Group Medical Insurance Program offered to the employees and their dependents of APTDC from IRDA LICENSED GENERAL INSURANCE COMPANIES OPERATING IN India.
Date & Time of closing of Tenders: 03.00PM on December-18.12.2024.
The "Request for Quotation" (RFQ) document is available on APTDC website (www.tourism.ap.gov.in) under Tender Section.

Sd/- A.A.L Padmavathi,
Executive Director (OP)

DIPR R.O.No: 3383PP/CL/ADVT/1/1/2021-22, Dt:12.12.2024

తెలంగాణ ప్రభుత్వం
ఆర్థిక శాఖ
అనుబంధం-I

22 సంవత్సరాల తెలంగాణ ప్రభుత్వ స్టాక్ (సెక్యూరిటీలు) 2046 వేలం

మొత్తం : రూ.500.00 కోట్లు
జారీ ధర : ప్రతీ రూ.10,000.00 లకు రూ.10,000.00
కాలవ్యవధి : 22 సంవత్సరాలు
రుణ దరఖాస్తు స్వీకరణ వ్యవధి : సదరు మొత్తం అందిన వెంటనే నోటీసు లేకుండా 17.12.2024న వ్యాపార వేళలలో మరియు తరువాత తక్షణమే ముగియవచ్చును.

పైన తెలిపిన రుణానికి గాను తెలంగాణ ప్రభుత్వం సబ్‌స్క్రిప్షన్లను అభ్యర్థిస్తోంది. పూర్తి వివరాలను భారతీయ రిజర్వు బ్యాంక్, హైదరాబాద్ మరియు ముంబై నుండి ప్రభుత్వ వ్యాపార వేళలలో పొందవచ్చును.
సం/- కె. రామకృష్ణా రావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ
DIPR RO No.486-DP/CL/ADVT/1/2024-25, Dt: 12.12.2024

NLC India Limited
'Navratna' - Government of India Enterprise
Regd. Office: 135, EVR Periyar High Road, Kilpauk, Chennai - 600 010
CORPORATE OFFICE: BLOCK-1, NEYVELI - 607 801, Cuddalore District, TAMIL NADU.
CIN: L93090TN1956GOI003507 Website : www.nlcindia.in
CREATING WEALTH FOR WELLBEING

Form 14
[To be published in pursuance of Clause (7) of Regulation 23]

The Petitioner above-named has filed a petition before the Central Electricity Regulatory Commission, New Delhi for determination of Tariff for **NEYVELI NEW THERMAL POWER STATION (2x500 MW) for the period from 01.04.2024 to 31.03.2029.**

1. The beneficiaries of the generating station are:
(a) Tamil Nadu Power Distribution Corporation Ltd (TNPDCL)
(b) Andhra Pradesh: Southern Power Distribution Company of A.P. Ltd. (APSPDCL), Eastern Power Distribution Company of A.P. Ltd. (APEPDCL), Central Power Distribution Company of A.P. Ltd. (APCPDCL)
(c) Telangana: Northern Power Distribution Company of Telangana Ltd. (TS NPDCL), Southern Power Distribution Company of Telangana Ltd. (TS SPDCL)
(d) Karnataka: Bangalore Electricity Supply Company Ltd (BESCOM), Mangalore Electricity Supply Company Limited (MESCOM), Chamundeshwari Electricity Supply Corporation Ltd. (CESC), Gulbarga Electricity Supply Company Ltd. (GESCOM), Hubli Electricity Supply Company Ltd. (HESCOM)
(e) Kerala State Electricity Board Ltd (KSEB)
(f) Puducherry Electricity Department (PED)
2. Capacity of the generating station: 1000 MW
3. Approved Capital Cost of the project (₹ in lakh): Existing Project
4. Authority which has approved the Capital Cost: Govt of India
5. Scheduled date of commercial operation: Existing Project
6. Actual date of commercial operation: Existing Project
7. Capital cost on the date of commercial operation (₹ in lakh): Existing Project
8. Details of tariff: NNTPS (2x500 MW)

Thermal Power Generating Station (₹ / kWh)	Previous Tariff	Year-wise tariff sought to be determined				
		2024-25	2025-26	2026-27	2027-28	2028-29
Capacity Charges	1.918	2.056	2.107	2.114	2.100	2.090
Energy Charges	2.555	2.747	2.747	2.747	2.747	2.747

NOTE:
a) NLCIL is publishing the application in terms of Clause (7) of Regulation 23 of CERC (Conduct of Business) Regulation 2023.
b) Monthly ECR shall be calculated based on the formula given in Regulation 64(3)(a) of 2024 Tariff Regulation, due to monthly variation in actual GCV and price of Primary fuel, Secondary fuel and Limestone if applicable.
c) "Tariff for the Previous Year" in the table above is applicable tariff for the month of Mar-2024.

9. A copy of the petition made for determination of tariff is posted on the website www.nlcindia.in
10. The suggestions and objections, if any, on the proposals for determination of tariff contained in the petition may be filed by any person, including the beneficiaries through the e-filing portal of the Commission, with a copy to the Petitioner within 30 days of publication of this notice.

Place: Chennai — GENERAL MANAGER / COMMERCIAL
Date: 03.12.2024 — NLC INDIA LIMITED

PUBLIC SECTOR IS YOURS: HELP IT TO HELP YOU

NLC India Limited
("Navratna" - Government of India Enterprise)
Regd. Office: No.135, EVR Periyar High Road, Kilpauk, Chennai 600 010
Corporate Office: Block-1, Neyveli 607 801, Cuddalore District, Tamil Nadu.
CIN: L93090TN1956GOI003507, Website: www.nlcindia.in
CREATING WEALTH FOR WELLBEING

Form 14
[To be published in pursuance of Clause (7) of Regulation 23]

The Petitioner above-named has filed a petition before the Central Electricity Regulatory Commission, New Delhi for determination of Tariff for **THERMAL POWER STATION-II (7 x 210 MW) for the period from 01.04.2024 to 31.03.2029**

1. The beneficiaries of the generating station are:
(a) Tamil Nadu Power Distribution Corporation Ltd (TNPDCL)
(b) Andhra Pradesh: Southern Power Distribution Company of A.P. Ltd. (APSPDCL), Eastern Power Distribution Company of A.P. Ltd. (APEPDCL), Central Power Distribution Company of A.P. Ltd. (APCPDCL)
(c) Telangana: Northern Power Distribution Company of Telangana Ltd. (TS NPDCL), Southern Power Distribution Company of Telangana Ltd. (TS SPDCL)
(d) Karnataka: Bangalore Electricity Supply Company Ltd. (BESCOM), Mangalore Electricity Supply Company Limited (MESCOM), Chamundeshwari Electricity Supply Corporation Ltd. (CESC), Gulbarga Electricity Supply Company Ltd. (GESCOM), Hubli Electricity Supply Company Ltd. (HESCOM)
(e) Kerala State Electricity Board Ltd. (KSEB)
(f) Puducherry Electricity Department (PED)
2. Capacity of the generating station: 1470 MW
3. Approved Capital Cost of the project (₹ in lakh): Existing Project
4. Authority which has approved the Capital Cost: Govt. of India
5. Scheduled date of commercial operation: Existing Project
6. Actual date of commercial operation: Existing Project
7. Capital cost on the date of commercial operation (₹ in lakh): Existing Project
8. Details of tariff: Stage-I (3x210 MW)

Thermal Power Generating Station (₹/kWh)	Previous Tariff	Year-wise tariff sought to be determined				
		2024-25	2025-26	2026-27	2027-28	2028-29
Capacity Charges	0.842	0.987	1.025	1.063	1.101	1.146
Energy Charges	3.197	3.119	3.119	3.119	3.119	3.119

Stage-II (4x210 MW):

Thermal Power Generating Station (₹/kWh)	Previous Tariff	Year-wise tariff sought to be determined				
		2024-25	2025-26	2026-27	2027-28	2028-29
Capacity Charges	0.866	0.915	0.951	0.985	1.019	1.060
Energy Charges	3.197	3.196	3.196	3.196	3.196	3.196

NOTE:
a) NLCIL is publishing the application in terms of Clause (7) of Regulation 23 of CERC (Conduct of Business) Regulation 2023.
b) Monthly ECR shall be calculated based on the formula given in Regulation 64(3)(a) of 2024 Tariff Regulation, due to monthly variation in actual GCV and price of Primary fuel, Secondary fuel and Limestone if applicable.
c) "Tariff for the Previous Year" in the table above is applicable tariff for the month of Mar-2024.

9. A copy of the petition made for determination of tariff is posted on the website: www.nlcindia.in
10. The suggestions and objections, if any, on the proposals for determination of tariff contained in the petition may be filed by any person, including the beneficiaries through the e-filing portal of the Commission, with a copy to the Petitioner within 30 days of publication of this notice.

Place: Chennai — General Manager / Commercial
Date : 03.12.2024 — NLC India Ltd.

CREATING WEALTH FOR WELLBEING

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బంగ్లాపై ఒత్తిడి!

భారత్, బంగ్లాదేశ్‌లు మాట్లాడుకోవడమే ఓ అద్భుతంగా చెప్పుకోవాల్సిన కాలం వచ్చింది. ఎవరివాదనమీద వాళ్ళు ఉన్నప్పటికీ, పొరుగుదేశంమీద కాస్తంత ఒత్తిడిపెంచడానికి భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పర్యటన ఉపకరించింది. రెండుదేశాలు క్రమంగా ఆరోపణలస్థాయినీ, విమర్శల తీవ్రతనీ పెంచేస్తున్న తరుణంలో మిస్రీ ఒక్కరోజు పర్యటన జరిగింది. ఆగస్టులో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తరువాత, దిగజారిన వాతావరణంలో, భారత్‌నుంచి ఒక ఉన్నతాధికారి ఢాకాలో కాలూనడం ఇదే తొలిసారి. మైనారిటీలను రక్షించాల్సిందే అని మిస్రీ గట్టిగా చెప్పడం వల్లనే 88మతవిద్వేషపూరిత ఘటనలు జరిగాయన్న వాస్తవాన్ని బంగ్లాదేశ్ ఒప్పుకుందని కొందరి నమ్మకం. ఇవి ప్రధానంగా హిందువులమీద జరిగాయనీ, ఈ సంఖ్య మరింతగా హెచ్చుగా ఉంటుందని వేరుగా చెప్పుకోనక్కరలేదు. అంతర్జాతీయ స్థాయిలోనూ ఒత్తిడిపెరుగుతోంది కనుక, రాజ్యభారాన్ని తాత్కాలికంగా మోస్తున్న నోబెల్ విజేత యూనిస్ ఏవో కొన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కనిపించవలసిందే. ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తున్నామనీ, వరుస అరెస్టులతో ఉన్మాదులను భయపెడుతున్నామనీ ఆ దేశం వివరణ కూడా ఇచ్చుకుంటోంది.

బంగ్లాదేశ్‌కు ఎంతో చేశామని, పుట్టుకనుంచి ఎదుగుదలవరకూ మనమే మోశామని, ఆ కృతజ్ఞత ఏమాత్రం లేకుండా ఆ దేశం వ్యవహరిస్తున్నదని చాలామంది బాధ. హసీనా పాలనలో ఆ దేశం ఆర్థికంగా మరింత ఎదిగింది, మనతో స్నేహం దానికి ఉపకరించినట్టుగానే, సరిహద్దును ప్రశాంతంగా ఉంచడంలో ఆ దేశం మనకు సాయపడ్డది. ఈశాన్య రాష్ట్రాల్లో నిప్పురాజేసే మిలిటెంట్ సంస్థలను, పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలను నిర్మూలించడంలో బంగ్లా సహకారం కాదనలేనిది. హసీనా లేని బంగ్లాదేశ్ మనకు సమస్యాత్మకంగా తయారవుతుందనీ, మతోన్మాదులకూ, పాక్ అనుకూల శక్తులకూ స్థావరంగా మారుతుందనీ ఊహించినదే. హసీనా నిరంకుశత్వం, ఆధిపత్యధోరణులు ఆమె పతనానికి దారితీశాయన్నది ఎంత నిజమో, ఆమెను దింపేసిన ఉద్యమంలో ప్రజాస్వామ్యాన్ని కాంక్షిస్తున్న యువతరంతో పాటు, ఖలేదాజియా పార్టీ, అనుబంధ ఇస్లామిక్ సంస్థలు ఉన్నాయన్నది అంతే నిజం.

మొదట్లో హిందువులమీద జరిగిన దాడులు పూర్తిగా రాజకీయమైనవేనని, అందులో మతం లేదని యూనిస్ ప్రభుత్వం కొట్టిపారేసింది. ఇప్పుడవి మతవిద్వేష దాడులని ఒప్పుకుంటున్నది కానీ, భారత్‌ను బూచిగా చూపిస్తున్నది. గతంలో ఇస్కాన్ సంస్థలో పనిచేసి, ఆ తరువాత వేరుకుంపటి పెట్టుకున్న చిన్మయి కృష్ణదాస్ వ్యవహారశైలి ఉభయదేశాల మధ్యా దూరాన్ని మరింత పెంచింది. ఆయన అరెస్టు, రాజద్రోహం కేసు, ఉద్రిక్తతల సందర్భంలో మనదేశం గట్టిగా ప్రతిస్పందించి అతడిని వెంటనే వదిలేయాలని డిమాండ్ చేయడంతో, చిన్మయిని మోదీ ఏజెంటుగా అభివర్ణించేందుకు పొరుగువారికి అవకాశం చిక్కింది. ఆఖరునిముషం వరకూ అధికారాన్ని కాపాడుకొనేందుకు ఉద్యమకారులను కాల్చిపారేసిన హసీనాకు ఆశ్రయం ఇవ్వడం కూడా భారతవ్యతిరేకత పెంచడానికి ఉపకరించింది. నిలువనీడ పొందిన ఆమె నోరువిప్పకపోయినా సరిపోయేది. కానీ, కొద్దిరోజుల్లోనే ఆమె అక్కడి రాజకీయ పరిణామాలమీద ఇక్కడనుంచి వ్యాఖ్యానించడం మొదలుపెట్టారు. ఆ తరువాత మరింత ఘాటుపెంచి, యూనిస్ ప్రభుత్వం మైనారిటీలను కాపాడలేకపోతున్నదని అంటూ, హిందువులను ఊచకోత కోస్తున్నారన్న అర్థంవచ్చే వ్యాఖ్యలు చేశారు. హసీనాను అప్పగించండి అని బంగ్లాదేశ్ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి మనం సరేననక్కరలేదు. కానీ, అక్కడి పరిస్థితులు మరింత దిగజారడానికీ, మనకు వ్యతిరేకంగా తయారవడానికి దోహదం చేసే వ్యాఖ్యలకు ఆమెను అనుమతించకూడదు. అక్కడి హిందువులపై జరుగుతున్న దాడులను ఇక్కడ తమ మతరాజకీయాలకు వాడుకోవడంలో భాగంగా యూపీ ముఖ్యమంత్రి యోగి వంటివారు బాబర్, సంభాల్, బంగ్లాదేశ్‌లను ముడిపెడుతూ చేసినటువంటి వ్యాఖ్యలు పొరుగుదేశంతో సంబంధాలను మరింత దిగజార్చుతాయి. బంగ్లాదేశ్‌లో ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాలని మమతాబెనర్జీ ఓ అర్థంలేని వ్యాఖ్యచేయగానే, ఇండియాలో హిందువులు, బంగ్లాలో రజాకార్ వ్యతిరేకశక్తులు చేయికలిపితే ఐదునిముషాల్లో యూనిస్ చర్మం ఊడిపోతుందని పశ్చిమబెంగాల్ బీజేపీ నాయకుడు సువేందు అధికారి వ్యాఖ్యానించారు. మోదీ తలుచుకుంటే ఐదునిముషాల్లో బంగ్లాదేశ్ పనిపూర్తవుతుందని మరోపెద్దమనిషి అన్నాడు. అక్కడి పరిణామాలు మనల్ని బాధిస్తున్నట్టుగానే, ఇక్కడి మాటలు సరిహద్దు ఆవల కూడా ప్రభావం చూపుతాయని మరిచిపోకూడదు.

తెగలూ పగలూ తెగని మణిపూర్ సమస్య!

ఏదో ఒక తత్వంలేని రాజకీయమే లేదు. అది సంకుచితమైతే చాలా ఇబ్బంది. ఇక అది మతం, తెగ చుట్టూ తిరిగేదైతే మరింత ఇబ్బంది. ఆ ఇబ్బంది తెచ్చే అనర్థం ఇంతనీ చెప్పలేం. మణిపూర్ హింసాకాండను ఈ కోణం నుంచి చూస్తేనే అర్థం చేసుకోగలం. మతం, ప్రాంతం, తెగ పునాదిగా రాజకీయాలను నడపటం నిప్పుతో చెలగాటమనటానికి దశాబ్దాలుగా రగులుతున్న అక్కడి వైషమ్యాలే నిదర్శనం.

మతం, ప్రాంతం, తెగ, భాషలనేవి ప్రజల అస్తిత్వాలే. కాదనలేం. ఇవి కొనసాగాలని కోరుకోటాన్ని తప్పుపట్టలేం! అస్తిత్వాల రక్షణ పోరాటాల్లో సందర్భాన్ని బట్టి ఏదో ఒక పక్షం వైపున న్యాయమూ ఉండొచ్చు. దాన్నీ కాదనలేం. ఆ సహేతుకతనూ విస్మరించలేం. కానీ విశాల ఆధునిక దృక్పథాన్ని విస్మరించి అస్తిత్వాలనే పట్టుకుని వేలాడితే రాజకీయాలూ సంకుచితమవుతాయి. అస్తిత్వ అనుకూల వాదనల్లో ద్వేషంపాళ్లు పెరగటమూ అందుకే జరుగుతోంది. ప్రజాస్వామిక ప్రవర్తన పడిపోవటమూ కనిపిస్తోంది.

మణిపూర్‌లో మూడు ప్రధాన జన సమూహాలైన మెయిటీలు, కుకీలు, నాగాలు సంకుచిత అస్తిత్వ రాజకీయాలపై ఆధారపడి సంఘర్షించినప్పుడల్లా హింస పెట్రేగింది. ఏదో ఒక సమూహానికి అపరిమిత అధికారం తోడైతే పరిస్థితి మరింత విషమిస్తుంది. మెయిటీలు మణిపూర్‌లో అధిక సంఖ్యాకులు. జనాభాలో 53 శాతం వారే. వారు అనుసరించేది వైష్ణవ హిందూమతం. సారవంతమైన మైదాన భూములపై వారిదే ఆధిపత్యం. వ్యాపారాలు, పరిశ్రమలు, సేవలు, ఉద్యోగాలు, భవన నిర్మాణం, ప్రసారసాధనాలు... ఇవీ అవీ అని కాదు... ఆధునిక ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అన్ని రంగాల్లోనూ మెయిటీలదే పైచేయి. రాజకీయాల్లో వారికి తిరుగులేదు. రాజకీయ పదవుల్లో కుకీలు, నాగాలు వారి దరిదాపులకు రాలేరు.

దేశంలో ఏదో ఒక రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఒకే కులం వారు ఉండి.. ఆర్థికరంగంపై ఆధిపత్యాన్ని నెలకొల్పుకుని, మతపరంగా సంఘటిత శక్తిగా వ్యవహరిస్తూ, నిరంతరం సాంస్కృతికంగా తమని తాము ఉన్నతులుగా భావించుకుంటూ, రాజకీయ బలం చేజారకుండా పావులు కదుపుతుంటే ఎటువంటి పరిస్థితి తలెత్తుతుంది! దాన్ని మనం కలలో కూడా ఊహించలేం! కులవ్యవస్థను ఎంతగా తిట్టుకున్నా ఏ రాష్ట్రంలోనూ, ఏ ప్రాంతంలోనూ ఒక కులానికి 50 శాతం సంఖ్యా బలాన్ని అది కల్పించలేదు. 20శాతం ఓట్లున్న కులాలు ఒకటి రెండుంటేనే గొప్ప! ఒకవేళ ఉన్నా వాటి బలం ఒకచోట గాక అక్కడక్కడా చెల్లాచెదురై ఉంటుంది. ఏ కులానికి సంఖ్యాపరమైన ఆధిపత్యాన్ని ఇవ్వని ఈ వ్యవస్థే మన ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మగా కొందరు పాశ్చాత్య మేధావులు భావించారు. ఏ రకంగా చూసినా ఒక కులానికి 20 శాతం ఆధిపత్యం ఎక్కడా ఉన్నట్లు కనిపించదు. కానీ కుకీలు, నాగాలు మాత్రం మణిపూర్‌లో 50 శాతం పైగా ఆధిపత్యాన్ని చూస్తున్నామని భావిస్తున్నారు. అంతటి ఆధిపత్యం ఉన్న వాళ్లు వినయం ప్రదర్శిస్తూ వివేక దృష్టితో అభివృద్ధి ఫలాలు సమాజంలో ఇతర వర్గాలకు కొంతైనా చేరే ఏర్పాట్లను చేస్తే పరిస్థితి వేరేలా ఉంటుంది. మణిపూర్‌లో అది జరుగుతోందని చెప్పలేం.

బలమైన వర్గాలు ఆధిపత్య ప్రదర్శనలు చేసినా చేయకపోయినా... మితిమీరిన అసమానతలు వైషమ్య భావనలను పెంచుతాయి. చట్టబద్ధ పద్ధతుల్లోనే పైకి వచ్చామన్న భావన పైవర్గాలకు ఉండొచ్చు. పోటీ ప్రపంచంలో ప్రతిభతో నెగ్గామనే సిద్ధాంత ఊతమూ ఉండొచ్చు. అసమానతలు ఎంత పురాతనమైనవో వాటిని ప్రశ్నించే చరిత్రా అంతే పురాతనమైంది. తెగల అస్తిత్వంతో మమేకమయ్యే భావన బలంగా ఉన్నచోట తేలికగా సంఘటితమయ్యే అనుకూలతా ఉంటుంది. అట్లా ఉన్నచోట సంపదలో సముచిత వాటాలను ఆయుధబలంతో



మణిపూర్ సంఘర్షణలకు భూములపై ఆధిపత్యం, హక్కులే ప్రధాన కారణాలుగా కనపడతాయి. ఆధునిక ఆర్థిక వ్యవస్థ అందించే ఉపాధి అవకాశాలు అంతగా లభించని కుకీలు, నాగాలకు ఉన్న భూములతో పాటు ఊహల్లో ఉన్న భూములను రక్షించుకోవటం అస్తిత్వ సమస్యగా మారిపోయింది. ఆందోళన చేస్తున్న వాళ్లని బయటి వాళ్లుగా ముద్రవేయటం సులభం. తెగలకు కుదురు తక్కువ. అనువైన భూముల వైపు అడుగులు వేయటమే వారికి వ్యాపకం. మనం ఘనంగా చెప్పుకొనే అహోం రాజ పాలకులూ వెలుపల నుంచే వచ్చారు. మత, తెగ తత్వాలను తెగేదాకా లాగితే ప్రజాస్వామ్యానికే ప్రమాదం!

పొందాలన్న ప్రయత్నాలూ ఎక్కువగా ఉంటాయి. మణిపూర్‌లో నిరంతరం కాకపోయినా చాలా సందర్భాల్లో జరుగుతున్న చరిత్ర అదే!

మణిపూర్ మారణహోమాలను తరచి చూస్తే కనిపించేది ఈ దృశ్యమే. మెయిటీలు అక్కడి జనాభాలో 53 శాతం ఉన్నా వారు ప్రధానంగా ఉండేది ఇంఫాల్ (6 జిల్లాలు) లోయలోనే. దీని విస్తీర్ణం 10 శాతం మాత్రమే. మిగతా 90 శాతం (10 జిల్లాలు) కొండ ప్రాంతాలే. కుకీలు(16శాతం), నాగాల (20 శాతం) నివాసం అక్కడే. ముస్లింలు 8.4 ఉంటారు. కుకీలు, నాగాలు ప్రధాన తెగలైనా వీటిల్లో చేరే అన్ని తెగలను లెక్కిస్తే మొత్తం 33కు పైనే ఉంటాయి. ఇక పోరాట మార్గం పట్టిన మిలిటెంట్ గ్రూపులు 30కు పైగా ఉన్నాయి. అంటే సగటున ఒక లక్షకు ఒక మిలిటెంట్ గ్రూప్ ఉన్నట్లు! మొత్తం జనాభానే 32 లక్షలకు కాస్త అటుఇటుగా ఉంటుంది. ప్రతి మిలిటెంటు గ్రూపూ ఏదో ఒక ప్రధాన తెగ, ఉపతెగ అస్తిత్వాల రక్షణకు పోరాడేవిగా ప్రకటించుకున్నాయి.



■ రాహుల్ కుమార్

మెయిటీ, కుకీ, నాగాలుగా వర్గీకరించి ప్రజలను పిలవటం ఇప్పుడు సాధారణమైనా ఒకప్పుడు పలు తెగలను విడివిడిగానే పిలిచేవారు. బ్రిటిషు పాలకులు తమ పాలనా సౌలభ్యం కోసం సన్నిహితంగా ఉన్న తెగలను కలిపేసి పెద్ద సమూహాలుగా వర్గీకరించారు. నాగాలు, కుకీల జాబితాలో చాలా తెగలను అలాగే కలిపేశారు. వైష్ణవాన్ని అనుసరించే తెగలను మెయిటీలుగా వర్గీకరించారు. ఏకీకరణ బాగా జరిగి మెయిటీల్లో ఐక్యత బాలా బలపడింది.

కులాలను కృత్రిమంగా వర్గీకరించి వందల ఏళ్ల నుంచి అవి స్థిరంగా ఉన్నట్లుగా ఎలా నమ్మేటట్లు చేయగలిగారో ఈశాన్య భారత తెగల విషయంలోనూ అలాగే చేశారు. జనాభా లెక్కలతో కులాలకు కొత్త బలాన్ని బ్రిటిషు పాలకులు కలగచేశారన్న వాదనా ఉంది. ఎన్నికల రాజకీయాలు కులాల అస్తిత్వాలను ఇంకా గట్టిపరచాయి. మిలిటెంట్ గ్రూపుల్లో కుకీ, నాగాలతో పాటు మెయిటీలు కూడా ఉన్నారు. ఒక దశలో కుకీల్లో 22 మిలిటెంట్ గ్రూపులు ఉంటే మెయిటీల్లో 10, నాగాల్లో 2 ఉండేవి. ఈ మిలిటెంట్ గ్రూప్‌ల్లో ఇప్పటికీ కొన్ని కొనసాగుతున్నాయి. కమ్యూనిస్టు భావజాలంతో ప్రేరణ పొందినవి కూడా వీటిల్లో ఉన్నాయి. లెనిన్ ప్రతిపాదించిన జాతుల స్వయంనిర్ణయాధికార సిద్ధాంతం అందుకు కారణం.

మణిపూర్ తెగల సంఘర్షణకు చాలా చరిత్ర ఉంది. దాని వెనుక భూముల కోసం ఆరాటాలూ ఉన్నాయి. ప్రాంతాలపై ఆధిపత్యాల కోసం పెనుగులాటలూ ఉన్నాయి. ఉద్యోగాల్లో విద్యా సీట్లల్లో వాటాలు కాపాడుకోవాలన్న వ్యూహాలూ ఉన్నాయి. కిందటి ఏడాది మే నెల నుంచి మెయిటీలు—కుకీల మధ్య మొదలైన హింసకు రిజర్వేషన్ల వ్యవహారంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశమే ప్రధాన కారణమైంది. మెయిటీలు తమను ఎస్టీల్లో చేర్చాలని 40 ఏళ్ల నుంచి డిమాండు చేస్తున్నారు. ఆ మేరకు కేంద్రానికి సిఫార్సుచేస్తూ నివేదికను పంపాలని రాష్ట్రాన్ని ఆదేశించాలని మెయిటీలు పిటీషను వేశారు. హైకోర్టు ఆ మేరకు ఆదేశాలు ఇవ్వటంతో కుకీలు, నాగాలు భగ్గుమన్నారు. కొండ ప్రాంతాల్లో గిరిజనేతరులు భూములు కొనటంపై నిషేధం ఉంది. 10 శాతం భూభాగంలో 50 శాతానికి పైగా జనాభా సర్దుకోవటం కష్టమనే వాదనను మెయిటీలు ఎప్పటి నుంచో చేస్తున్నారు. ఒకప్పుడు తామూ ఎస్టీలుగానే ఉన్నామనీ దాన్ని పునరుద్ధరణను మాత్రమే కోరుతున్నామని మెయిటీలు చేస్తున్న వాదనను అంగీకరిస్తే మణిపూర్ సామాజిక స్వరూపమే మారిపోతుంది. మెయిటీలకు కొండ ప్రాంతాల్లో భూములను కొనుగోలు చేసే అవకాశం లభిస్తుంది. ఇక మెయిటీలను 1995లోనే ఓబీసీలుగా గుర్తించారు. రెండు ఉపతెగలను కూడా 1956లోనే ఎస్సీల జాబితాలో చేర్చారు.

హైకోర్టు తీర్పు వ్యతిరేక ఆందోళనల్లో హింస తలెత్తటానికి కుకీల్లో, నాగాల్లో ఎప్పటి నుంచో మెయిటీలకు వ్యతిరేకంగా గూడు కట్టుకున్న ఆగ్రహమే ప్రధాన కారణం. తమ ప్రాబల్యం ఉన్న ప్రాంతాలతో ప్రత్యేక రాష్ట్రం చేయాలన్న డిమాండును కుకీలు ఎప్పటి నుంచో చేస్తూనే ఉన్నారు. కనీసం ప్రత్యేక పాలనా ప్రాంతాన్నైనా ఏర్పాటుచేసి స్వయంప్రతిపత్తి ఇవ్వాలనే డిమాండుతోనూ ఆందోళనలు చేశారు. బీరెన్‌సింగ్ ముఖ్యమంత్రి (2017) అయిన నాటి నుంచి నల్లమందు తయారీలో ఉపయోగించే గసగసాల సాగుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున చేపట్టిన చర్యలు కూడా వివాదమయ్యాయి. కుకీలతో సోదర సంబంధం ఉన్న మయన్మార్ తెగలు రాష్ట్రంలో చొరబడుతున్నాయని బీరెన్‌సింగ్ ఆరోపించారు. అడవుల్లో సర్వేలు నిర్వహించి ఆక్రమణదారుల్ని భూముల నుంచి తొలగించారు. అన్ని అక్రమ కార్యకలాపాల్లో కుకీల పాత్రే ఎక్కువనే రీతిలో పలుచోట్ల చేసిన

కులవ్యవస్థను ఎంతగా తిట్టుకున్నా ఏ రాష్ట్రంలోనూ, ఏ ప్రాంతంలోనూ ఒక కులానికి 50 శాతం సంఖ్యా బలాన్ని అది కల్పించలేదు. 20 శాతం ఓట్లున్న కులాలు ఒకటి రెండుంటేనే గొప్ప! ఒకవేళ ఉన్నా వాటి బలం ఒకచోట గాక అక్కడక్కడా చెల్లాచెదురై ఉంటుంది. ఏ కులానికి సంఖ్యాపరమైన ఆధిపత్యాన్ని ఇవ్వని ఈ వ్యవస్థే మన ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మగా కొందరు పాశ్చాత్య మేధావులు భావించారు.

వ్యాఖ్యలు మరింత అగ్గిని పుట్టించాయి. బీరెన్ ప్రతి మాటా చేతా తమకు వ్యతిరేకంగా ఉన్నట్లుగా కుకీలు భావించారు. అడవుల్లో కొత్త ప్రాంతాలకు విస్తరించటం తమ సంప్రదాయ హక్కనీ దీనికి గండికొడుతున్నారన్న కోపం కూడా కుకీల్లో నెలకొంది. తెగల పురాతన గాథలు ఆధారంగా ప్రస్తుతం తాము మెజారిటీగా లేని ప్రాంతాలు సైతం కుకీలు తమకే చెందుతాయని వాదిస్తున్నారు. కుకీలకు నాగాలకు ఒకప్పుడు గొడవ ఇక్కడే మొదలైంది. అందుకే కుకీల ప్రతిపాదనలను నాగాలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇక నాగాలు కుకీ ప్రాంతాలను కూడా కలుపుకొని దక్షిణ నాగాలాండ్ ఏర్పాటు కోసం ఆందోళనలు మొదలుపెట్టారు. రెండు తెగల మధ్య 1990ల్లో మొదలైన హింసకు వందల మందీ చనిపోయారు. వందల గ్రామాలు విధ్వంసమూ అయ్యాయి. వేల ఇళ్లు దగ్ధమూ అయ్యాయి. స్త్రీలపై లెక్కలేనన్ని అత్యాచారాలూ జరిగాయి. నాగాలు కూడా పలు ప్రాంతాలు తమవేనని చెప్పటానికి సంప్రదాయ గాథలపైనే ఆధారపడతారు. కుకీలు, నాగాల ప్రతిపాదన ఏదైనా మెయిటీలు ససేమిరా అంటారు.

మొత్తం మీద మణిపూర్ సంఘర్షణలకు భూములపై ఆధిపత్యం, హక్కులే ప్రధాన కారణాలుగా కనపడతాయి. ఆధునిక ఆర్థిక వ్యవస్థ అందించే ఉపాధి అవకాశాలు అంతగా లభించని కుకీలు, నాగాలకు ఉన్న భూములతో పాటు ఊహల్లో ఉన్న భూములను రక్షించుకోవటం అస్తిత్వ సమస్యగా మారిపోయింది. అందుకే ఈశాన్య భారత సంఘర్షణల్లో 50 శాతం మణిపూర్‌లోనే జరిగాయన్న లెక్కలను పూర్తిగా కొట్టేయలేం. ఆందోళన చేస్తున్న వాళ్లని బయటి వాళ్లుగా ముద్రవేయటం సులభం. తెగలకు కుదురు తక్కువ. అనువైన భూముల వైపు అడుగులు వేయటమే వారికి వ్యాపకం. మనం ఘనంగా చెప్పుకొనే అహోం రాజ పాలకులూ వెలుపల నుంచే వచ్చారు. మత, తెగ తత్వాలను తెగేదాకా లాగితే ప్రజాస్వామ్యానికే ప్రమాదం! అధిక సంఖ్యాక మతతత్వమూ దాన్ని రక్షించలేదు. మణిపూర్ నేర్పే పాఠమదే!

దేశ ప్రయోజనాలు పట్టని కులగణన సమర్థన!

‘కులగణనతో దేశానికి హాని ఏమిటి?’ అనే శీర్షికతో భంగ్యా భూక్యా రాసిన వ్యాసం (డిసెంబర్ 5, 2024) అసంబద్ధంగా ఉంది. మాజీ డీజీపీ కె.అరవింద రావు తన వ్యాసంలో (‘ఈ విభజనలతో దేశం ఏమయ్యేట్టు?’—నవంబర్ 23) చెప్పిన విషయాలను భూక్యా ప్రస్తావించడం విజ్ఞత అనిపించుకోదు.

రాజకీయ పార్టీల నాయకులు దేశ ప్రజలను కులాలవారీగా, మతాలవారీగా విభజించి, దేశ సమగ్రతకు, సమైక్యతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తిస్తున్నారని అరవిందరావు తన వ్యాసంలో చెప్పారు. ఆ విషయాన్ని అర్థం చేసుకోకుండా, “దళిత, బహుజన, మత మైనార్టీ వర్గాల్లో వస్తున్న చైతన్యం మీద” అరవిందరావు అక్కసు వెళ్ళగక్కుతున్నారంటూ భంగ్యా భూక్యా రాశారు. క్రైస్తవ సమాజంలోను, ఇస్లాం సమాజంలోను రుగ్మతలు ఉన్నట్లే హిందూ సమాజంలో కూడా రుగ్మతలు ఉన్నాయనే విషయాన్ని అందరూ అంగీకరించాల్సిందే! కానీ వ్యక్తి పుట్టుకను బట్టి హీనంగా చూడాలని హిందూ మతానికి సంబంధించిన ఏ గ్రంథమూ చెప్పలేదు. క్రైస్తవ దేశాలలో నల్ల క్రైస్తవులను అంటే నీగ్రోలను హీనంగా చూడడం పరిపాటి. అరబ్ ముస్లింలు అరబ్బేతర ముస్లింల పట్ల వివక్షత చూపడం ఉంది. అహమ్మదీయ, మొహాజర్ తెగల ముస్లింలను కడు హీనమైన వృత్తుల్లో పెట్టడం ఇస్లామిక్ సమాజాలలో మనం చూడవచ్చు. అలాగే షియా, సున్నిల ఘర్షణలతో ఇరాన్, ఇరాక్‌లు సంవత్సరాలు తలపడ్డాయి. హిందూ మతాన్ని పనిగట్టుకుని తిట్టేవాళ్ళు ఈ విషయాలను దాచిపెడతారు. నాలుగు వర్ణాలుగా ఉన్న ప్రజలు అనేక కులాలుగా ఏర్పడడానికి కారణాలేమిటో నిష్పాక్షికంగా విశ్లేషించే వ్యక్తులు ఈ దేశంలో కరువయ్యారు. ఈ దేశంలో సామాన్య వ్యక్తులు రాష్ట్రపతులు కాగలరు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి ప్రధాని కాగలడు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇందుకు చక్కటి ఉదాహరణ. పర్షియా నుంచి తరిమి వేయబడిన కొందరు పారశీకులు ఈ దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారన్న విషయం ఈ దేశం నాది అనే భావన ఉన్న వ్యక్తులకు మాత్రమే అర్థమవుతుంది.

ఇక వైదిక మతంగా పిలవబడుతున్న హిందూ మతం “సహజ ప్రకృతి ధర్మంకు వ్యతిరేకం” అనీ, అందుకే ఆ మతం ఇతర దేశాలకు విస్తరించలేదనీ భంగ్యా భూక్యా చెప్పడం సరికాదు. ‘ఏకం సత్ విప్రా బహుదా వదన్తి’ (భగవంతుడు ఒక్కడే, జ్ఞానులు ఆయనను అనేక రూపాల్లో చెబుతారు) అన్న ఋషి వాక్యాన్ని ఈ దేశంలోని సనాతన భారతీయ సంస్కృతికి చెందిన ప్రజలు అర్థం చేసుకున్నారు కాబట్టే బౌద్ధం, జైనం, శాక్తేయం, ద్వైతం, అద్వైతం, విశిష్టాద్వైతం, శైవం వీరశైవం, వైష్ణవం ఇత్యాది ఆధ్యాత్మిక పరంపరలకు భారత భూమి వేదిక అయింది. ఇక కొండకోనల్లో, గ్రామాల్లో గ్రామదేవతల గుళ్ళు నిర్మాణం కావడం, గ్రామదేవతలు కొలువు తీరడం భారతీయ ధార్మిక విషయంలో భాగమే. ఇస్లామిక్ దేశాలలో ఇస్లాం మతాన్ని దూషిస్తే కొట్టి చంపుతారు. క్రైస్తవ దేశాలలో కూడా క్రైస్తవాన్ని దూషిస్తే శిక్షలు ఉంటాయి. క్రైస్తవాన్ని విమర్శించిన గెలీలియో, కోపర్నికస్, బ్రూనోలకు పట్టిన గతి ఏమిటో ఎంతమందికి తెలుసు? హిందూ మతస్థులు మెజారిటీగా ఉండే ఈ దేశంలో మాత్రం హిందూ దేవతలను నగ్నంగా గీసి పైశాచిక ఆనందం పొందినా, హిందువుల మత గ్రంథాలను పనిగట్టుకుని దూషించినా ఎవరూ పట్టించుకోరు. ఈ విషయంలో హిందువులను బలహీనులు అనాలా, శాంతి కాముకులు అనుకోవాలా, లేక కుల పిచ్చిగాళ్లు అనాలా?



రాజకీయ పార్టీల నాయకులు దేశ ప్రజలను కులాలవారీగా, మతాలవారీగా విభజించి, దేశ సమగ్రతకు, సమైక్యతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తిస్తున్నారని అరవిందరావు తన వ్యాసంలో చెప్పారు. ఆ విషయాన్ని అర్థం చేసుకోకుండా, ‘దళిత, బహుజన, మత మైనార్టీ వర్గాల్లో వస్తున్న చైతన్యం మీద’ అరవిందరావు అక్కసు వెళ్ళగక్కుతున్నారంటూ భంగ్యా భూక్యా రాశారు.

దేశప్రజలను ముఖ్యంగా హిందువులను కులాల వారీగా విడదీసి, కులాల మధ్య ద్వేషాన్ని నింపింది బ్రిటిష్ పాలకులే అనేది అక్షర సత్యం. ఇదే పరిస్థితి కొనసాగాలని పాలకులు, కుల నాయకులు కోరుకుంటున్నారనే విషయం కులగణన డిమాండ్ ద్వారా స్పష్టమవుతోంది. ఇక భంగ్యా భూక్యా వ్యాసంలో మరో వివాదాస్పదమైన వ్యాఖ్య ఏమంటే— హిందూ ఫాసిజం వల్లనే బెంగాల్ విభజన జరిగిందని, హిందూ నాయకుల మొండి వైఖరి వల్లనే దేశ విభజన జరిగిందని, ఈ విషయంలో ముస్లింలది ఎలాంటి తప్పూ లేదనీ చెప్పడం. ఈ దేశంలోని వామపక్ష వర్గం స్వతంత్రం వచ్చినప్పటి నుంచీ ఈ వాదన చేస్తూనే ఉంది. దేశ విభజన సమయంలో వామపక్షవాదులు ముస్లిం లీగ్‌కు కొమ్ము కాశారనే విషయం ఈ దేశంలోని సామాన్య హిందువులకు తెలియదు. 1946లో రాజ్యాంగ సభకు జరిగిన ఎన్నికల్లో దేశ విభజన అజెండాతో 80 స్థానాలకు పోటీ చేసిన ముస్లిం లీగ్ 73 స్థానాలను గెలుచుకుంది. సమైక్య భారత్ అజెండాతో 1585 స్థానాలకు పోటీచేసిన జాతీయ కాంగ్రెస్ 925 మాత్రమే గెలిచింది. ముస్లిం లీగ్ కోర్కెను ముస్లింలు అంగీకరించారన్న విషయం స్పష్టమైంది. 1946లో ముస్లిం లీగ్ డైరెక్ట్ యాక్షన్‌కు పిలుపునిచ్చి, నరమేధం సృష్టించడంతో కాంగ్రెస్ నాయకులు వణికిపోయి, ముస్లిం నాయకులు అడిగిన రీతిలో తూర్పు, పశ్చిమ పాకిస్థాన్‌లను ఇచ్చారు. నిజం చెప్పాలంటే వారు తన్ని లాక్కున్నారు. ఇది పచ్చి నిజం. అదే రీతిలో కశ్మీర్ లోయలో— అంటే స్వదేశంలో మూడు లక్షల మంది హిందువులను తరిమి వేసిన విషయం ఇంకెంత కాలమో దాచలేరు. ఇస్లామిక్ పరిపాలనలో ఈ దేశంలో నిమ్న వర్గాలే కాకుండా, ఉన్నత వర్గాలు కూడా మనుగడ కోసం మతం మార్చుకున్నాయి. ప్రముఖ రచయిత తారిక్ ఫతే, ‘సారే జహాసే అచ్ఛా’ గీత రచయిత మహమ్మద్ ఇక్బాల్ మతం మార్చుకున్న బ్రాహ్మణులు అనే విషయం ఇక్కడ గమనార్హం. ప్రభుత్వాలు దేశ ప్రజలందరినీ సమానంగా ఆదరించాలి. ముస్లింలకు మాత్రమే దేశ వనరులపై ప్రథమ హక్కు ఉందని వాదించడం మూర్ఖత్వం.

కుల, మత అస్తిత్వాన్ని ఆధారంగా చేసుకొని మనుగడ సాగించడానికి ప్రయత్నించేవారికి ఈ దేశ విశాల ప్రయోజనాలు పట్టవు. దేశభద్రతకు నష్టంచేసే వారితో చేతులు కలపకుండా వీళ్లు ఉండలేరు!

● ఉల్లి బాలరంగయ్య

ఇదేనా రాజ్యాంగ నిబద్ధత?

భారత రాజ్యాంగం నవంబర్ 26, 1949లో రాజ్యాంగ సభలో ఆమోదించబడి 26 జనవరి 1950 నుండి అమల్లోకి వచ్చింది. రాజ్యాంగ రూపకల్పన పూర్వాపరాలు అప్పటి నేపథ్యం సమీక్ష చేసుకోవడంలో అలసత్వంగా సాగుతున్నది. డాక్టర్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన రాజ్యాంగ సభ ఏర్పాటైనప్పటికీ, డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ చొరవ, పరిశీలనతో వాస్తవ సామాజిక ఆర్థిక స్థితిగతులు దృష్టిలో పెట్టుకొని విశాల భారతదేశానికి తలమానికం లాంటి రాజ్యాంగం రూపొందించబడింది. ప్రధానంగా ప్రవేశ పీఠికలో పేర్కొన్న రాజ్యాంగానికి దిశ నిర్దేశించే అంశాలు ఇప్పటికీ ఎప్పటికీ శాశ్వతంగా ఉండేవే, అలాగే 121—అధికరణపై ఎలాంటి రాజీ ఉండదు. నేటి మోదీ ప్రభుత్వం ప్రజలపైన కపట ప్రేమ చూపిస్తూ హిందుత్వ ఎజెండాను అమలు చేయడానికి ఉవ్విళ్లూరుతున్నారు. అందుకే అసలు సమస్య. విభిన్న కులాలు, మతాలు భాషలు భావాలు ప్రాంతాలు ఉన్న దేశంలో భిన్నత్వంలో ఏకత్వం అనేది శాశ్వత పరిష్కారం. కానీ మోదీ ప్రభుత్వం మొసలి కన్నీరు కారుస్తూ రాజ్యాంగ మార్పునకు తిరగదోడ ప్రయత్నిస్తున్నది. ఉమ్మడి పౌరస్మృతి, జమ్మూ కశ్మీర్ 370 ఆర్టికల్ రద్దు లాంటి అంశాలు సజీవంగా చర్చనీయాంశంగా ఉంటాయి. ఈ మధ్య జరిగిన కశ్మీర్ ఎన్నికలలో గెలిచిన ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలలో 370 ఆర్టికల్ పునరుద్ధరించాలంటు నొక్కి వొక్కాణించింది. పౌర హక్కులకు విఘాతం కలిగిస్తూ రాజ ద్రోహం కేసులు, కుట్ర కేసులు లాంటివి పెడుతూ ప్రశ్నించే గొంతుకులను నొక్కడం లక్ష్యంగా మోదీ ప్రభుత్వం పావులు కదుపుతుంది.



కేంద్ర ప్రభుత్వ పాత్ర, బాధ్యతలను రాజ్యాంగం నిర్ధారించింది. ఫెడరల్ వ్యవస్థగా రూపొందించబడింది. అందుకే సర్కారియా కమిషన్ కేంద్ర రాష్ట్ర సంబంధాలపై చక్కటి రిపోర్టును అందించింది. దానిని అమలు చేయడానికి అంగీకరించడం లేదు. ప్రజాస్వామ్యంలో ప్రజల చేత ప్రజల ద్వారా ప్రజల కొరకు ఏర్పడేది ప్రజా ప్రభుత్వం. దానికి భిన్నంగా ఎన్నికల కమిషన్ పైన కూడా పెత్తనం లేదా జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించడం అంటే ప్రజాస్వామ్య మూల సూత్రాలను పాతరేయడమే. ఎన్నికల కమిషన్ నియామకంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని పక్కన పెట్టడం అంటే ప్రజాస్వామ్యం ఎంత వరకు అమలవుతుందో విదితమవుతుంది. సుప్రీంకోర్టులో ఎన్నికల కమిషన్ నియామకం అంశం ప్రస్తావనకు రావడం ప్రధాన న్యాయమూర్తి ఆ పదవి నుండి వైదొలిగారు. కేంద్ర ప్రభుత్వ దుర్బుద్ధికి నిదర్శనం.

పార్టీ ఫిరాయింపుల చట్టం ఉన్నప్పటికీ ఎందుకు ఫిరాయింపులు కొనసాగుతున్నాయి అంటే నాగుపాముకు కోరలు లేకపోతే ఎవరూ భయపడరు. ఫిరాయింపుల చట్టం కోరలు స్వార్థ బుద్ధితో తీసివేయబడినాయి. అందుకే ఎవరికి భయం లేదు. పాలనాదక్షత గురించి మాట్లాడే మోదీ ఎందుకు ఫిరాయింపుల చట్టంలోని లొసుగులను తొలగించడం లేదు? ఏ పార్టీ గుర్తుతో గెలిస్తే ఆ పార్టీలోనే కొనసాగాలి, లేదా ఆ పదవికి రాజీనామా చేయాలి. అలా జరగకపోవడంతో ప్రజలలో రాజకీయ పార్టీల నాయకుల పట్ల చులకన భావం నెలకొంటున్నది. ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా భారత్ ఎదగాలని కలలు కనడం మంచిదే కానీ ప్రపంచ దేశాలలో అదానీ మూలంగా దేశ పరువు ప్రతిష్ఠ దెబ్బతింటున్నదన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. అదాని, అంబానీ, నీరవ్ మోదీ, లలిత్ మోదీ ఆర్థిక మోసాలు అంతా ఇంతా కాదు. బ్యాంకులలో అప్పులు ఎగవేత, సహజ వనరులను కొల్లగొట్టడం లాంటి అనేక అవినీతి కుంభకోణాలకు కారణమైన వారిపైన చర్యలు ఉండవా?

ప్రధాని ఏ దేశం పర్యటించిన దాదాపు అన్ని దేశాల్లో అదాని పెట్టుబడులు పెడుతున్నారు. ఆస్ట్రేలియాలో బొగ్గు గనుల ఏర్పాటుకు మన ఎస్‌బీఐ నుండి అదానికి రుణాలు ఇప్పించారు. అలాగే శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాల్లో పవర్ ప్రాజెక్టులు, పోర్టులు ఆ సంస్థ దక్కించుకుంది. ఇదంతా కూడా ప్రభుత్వ పెద్దల ఆశీస్సులు లేనిదే సాధ్యం కాదని ఎవరికైనా అర్థమవుతుంది. ఏది ఏమైనా ప్రపంచానికి తలమానికం లాంటి రాజ్యాంగ అమలులో కేంద్ర ప్రభుత్వం వివక్ష కనబరుస్తూ, స్వపక్షం, ప్రతిపక్షం అనే భేదాలకు తావిస్తుంది. నిష్పాక్షిక నిబద్ధతతో కూడిన పాలనను ప్రజలు కోరుకుంటున్నారు. కులమత ప్రాంత లింగ విభేదాలకు తావులేని పారదర్శకతతో కూడిన ప్రజాస్వామ్య పరిరక్షణకై ప్రతి పౌరుడు దీక్షబూనాలి. రాజ్యాంగ విలువలను కాపాడుకోవడానికి మేధావులు, బుద్ధిజీవులు, యువకులు, విద్యార్థులు పూనుకోవాలి. దేశ సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకోవడానికి ప్రతిజ్ఞ తీసుకోవాలి.

○ చాడ వెంకటరెడ్డి

బీమా స్ఫూర్తిని కూలదోసే చట్ట సవరణలు!

ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ – ఎఫ్‌డిఐ) 74శాతం నుంచి 100 శాతానికి పెంచనున్న ప్రతిపాదనలపై డిసెంబర్ 10లోపు ప్రజల నుంచి అభిప్రాయాలు కోరుతూ ఆర్థికశాఖ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (డిఎఫ్ఎస్) ఓ ప్రకటన చేసింది. ఆర్థిక అంశాల మీద ప్రజలు ఆన్‌లైన్ ద్వారా తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచే అవకాశాలు ఈ దేశంలో చాలా తక్కువ. నిజంగా అలాంటి అభిప్రాయాలు స్వీకరించాలనుకుంటే ఇన్సూరెన్స్ రంగానికి సంబంధించిన ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు, ఏజెంట్లు, ఏజెంట్ల సంఘాలు, పాలసీదారులు, ఇతరత్రా మేధావుల నుంచి సేకరిస్తే ప్రయోజనం ఉండేది.

ప్రజాభిప్రాయ సేకరణకు ప్రాధాన్యతనిచ్చే ప్రభుత్వాలే అయితే 1998లోనే దేశవ్యాప్తంగా ఒక కోటీ 65 లక్షల సంతకాలు సేకరించి ఇన్సూరెన్స్ రంగంలో ప్రైవేట్ కంపెనీలకు అవకాశం ఇవ్వొద్దని అప్పటి లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి గారికి సమర్పించడం జరిగింది. ఇంకా అనేక సందర్భాలలోనూ సదరు ఎఫ్‌డీఐలు ఏ విధంగా సేవల రంగంలో ప్రధాన భూమిక పోషిస్తున్న ఇన్సూరెన్స్ రంగానికి నష్టం కలిగిస్తాయో కూడా ప్రభుత్వాలకు విడమర్చి చెప్పడం జరిగింది. ఇన్సూరెన్స్ రంగంలో ఎఫ్‌డీఐ పెంపుదలపై ఏర్పాటు చేసిన స్టాండింగ్ కమిటీ ముందు కూడా ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కామ్రేడ్ అమానుల్లా ఖాన్, కామ్రేడ్ కె.వేణుగోపాల్ తమ వాదనలు వినిపించి ఒప్పించారు కూడా. కానీ ఇలాంటి ఏ సందర్భంలోనూ ప్రజాభిప్రాయానికి గానీ సంఘాల అభిప్రాయాలకు గానీ విలువ ఇవ్వకుండా ఇప్పటి కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఇన్సూరెన్స్ రంగంలోకి ఎఫ్‌డీఐలను క్రమం తప్పకుండా పెంచుతూనే ఉంది.

1990 తర్వాత నూతన ఆర్థిక విధానాలలో భాగంగా ఇన్సూరెన్స్ రంగంలోనికి ప్రైవేట్ వ్యక్తులు ప్రవేశించే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. 1995 వరకు ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో నడిచే ఇన్సూరెన్స్ రంగాన్ని రెగ్యులేట్ చేయడం కోసం ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అథారిటీ (ఐఆర్ఏ) అనే ప్రతిపాదనను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చింది. పార్లమెంట్‌లో ఈ బిల్లును పాస్ చేయించడం కోసం నాటి ఆర్థిక మంత్రులు ఐకే గుజ్రాల్, పి.చిదంబరం వేరు వేరు సందర్భాల్లో ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. 1999లో అధికారంలోకి వచ్చిన వాజ్‌పేయి ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం ఈ ఐఆర్ఏ అనే పదాన్ని ఐఆర్‌డీఏ (ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ)గా నామకరణం చేస్తూ పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ సాయంతో బిల్లును ఆమోదింపజేసుకున్నది. ఈ బిల్లు పాస్ అయినప్పుడు ఇన్సూరెన్స్ రంగంలోకి ప్రైవేట్ కంపెనీలు రావచ్చు అయితే 26 శాతం మాత్రమే ఎఫ్‌డీఐలు ఉండాలన్న నిబంధన ఉంచారు. ఆశించిన మేర ప్రైవేట్ కంపెనీలు నమోదు కాకపోవడంతో ఎఫ్‌డీఐని మరింత పెంచాలని తద్వారా ఫారిన్ కంపెనీస్ వస్తాయని చాలా ప్రయత్నాలు చేశారు. కానీ యూపీఏ—1 ప్రభుత్వానికి ప్రభుత్వ రంగాలకు పెద్దపీట వేసే వామపక్ష పార్టీల మద్దతుతో ఉండడంతో అది సాధ్యపడలేదు. మళ్లీ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత 2015లో ఎఫ్‌డీఐ 26 నుండి 49 శాతానికి పెంచారు. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదనే నెపంతో 2021లో దీనిని 74 శాతానికి కూడా పెంచారు. ఆ తర్వాత కూడా ఈ 25 ఏళ్ల కాలంలో అన్ని ప్రైవేట్ కంపెనీలు కలిపి 25 సంఖ్యను కూడా చేరుకోలేకపోయాయి. అంచేత ఇప్పుడు ఇన్సూరెన్స్ రంగంలో వందశాతం ఎఫ్‌డీఐలను పెంచడం ద్వారా పుట్టగొడుగుల్లా ప్రైవేట్ కంపెనీలు వెలసి ఇన్సూరెన్స్ రంగాన్ని అభివృద్ధిపరచగలవని కేంద్ర ప్రభుత్వం గాలిలో మేడలు కడుతున్నది. అనగా ఇకపై దేశీయ భాగస్వామ్యం కలిగిన కంపెనీలేవీ ఇన్సూరెన్స్ రంగంలో ఉండకుండా విదేశీ కంపెనీలు తమ దుకాణాలను ఇక్కడ తెరవవచ్చు.



ఇప్పుడు ప్రతిపాదిస్తున్న ఇన్సూరెన్స్ చట్టాల సవరణ బిల్లులో అనేక ప్రమాదకర ప్రస్తావనలు ఉన్నాయి. లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రారంభించాలంటే వంద కోట్ల కనీస మూలధనం అవసరం. ఇప్పుడు దాన్ని తగ్గించాలన్న ప్రతిపాదన ఇందులో ఉన్నది. ఎల్ఐసీ ఆఫ్ ఇండియా పూర్తి ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్నది కాబట్టి వంద కోట్ల మూలధనం అవసరం లేదని మొర పెట్టుకున్నా వినకుండా ఎల్ఐసీ ఆఫ్ ఇండియా నుంచి వంద కోట్ల మూలధనాన్ని ఏర్పాటు చేయించారు. ఇప్పుడు ఇదే నిబంధనను విదేశీ కంపెనీలను సంతృప్తిపరచడం కోసం తొలగిస్తున్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలు సింగల్ రిజిస్ట్రేషన్‌తో లైఫ్, జనరల్, హెల్త్ ఇన్సూరెన్స్ వ్యాపారం చేసుకోవచ్చు. ఈ కాంపోజిట్ లైసెన్స్‌తో అడ్వర్స్ (నష్టదాయకమైనది) సెలక్షన్ జరగవచ్చనే ఆలోచనకు చరమగీతం పాడుతున్నారు. ఇన్సూరెన్స్ ఏజెంట్లు కూడా మూడు లైఫ్ ఇన్సూరెన్స్, మూడు జనరల్ ఇన్సూరెన్స్, మూడు హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఒకే లైసెన్స్‌తో పనిచేయవచ్చని మరో ప్రతిపాదన చేశారు. దీంతో ఏజెంట్ల వ్యవస్థ అస్తిత్వం ప్రమాదంలో పడనున్నది. ఇన్సూరెన్స్ సంస్థలు తమ ప్రధాన విధి అయినటువంటి బీమా కల్పనతో పాటు ఇతర ఇండెమినిటీ వ్యాపారాలు, ఆస్తిపాస్తుల అమ్మకాలు కొనుగోళ్లు వంటి ఇతర వ్యాపారాలు కూడా చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. దీనిద్వారా ప్రధాన ధ్యేయం పక్కదారి పడుతోంది. బీమా ‘సుగమ్’ పేరున ‘ఇన్సూరెన్స్ సొల్యూషన్స్ ఫ్రమ్ వన్ ప్లేస్’ అనే ప్రతిపాదన ద్వారా ఇన్సూరెన్స్ మూలసూత్రాలు, విలువలు ప్రమాదంలో పడనున్నాయి. ఇలాంటి సరళీకరించబడిన విధానాలు ప్రైవేట్ కంపెనీలకు లాభాల కోసం ఎంతకైనా ఒడిగట్టే అవకాశాన్ని ఇస్తాయి. దీర్ఘకాలిక కాంట్రాక్టులకు ఆలవాలమైన ఇన్సూరెన్స్ రంగంలో ఇలాంటి సరళీకరణ విధానాలు ప్రమాదకరంగా పరిణమిస్తాయి. ఇలాంటి కీలక అంశంపై ప్రజల నుండి మొక్కుబడి అభిప్రాయాన్ని సేకరణలు కాకుండా ఇన్సూరెన్స్ రంగంలోని సంఘాలతో చర్చిస్తే మంచిది.

■ గూళ్ల తిరుపతయ్య



కాళోజీ కళాక్షేత్రం గేటు వద్ద సెక్యూరిటీ సిబ్బందితో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు రావుల కిషన్, తదితరులు



సర్కిళ్ల పెంపు హుళక్కేనా?!

- నగరం విస్తరించడంతో పౌర సేవలకు ఇబ్బందులు
- 2017లోనే సర్కిళ్ల పెంపునకు జీవో జారీ
- ఆరు చోట్ల కార్యాలయాల ఏర్పాటు విస్మరించిన అధికారులు
- ప్రతీ పనికి మైళ్లదూరం వెలుతున్న నగర ప్రజలు
- పట్టించుకోని బల్దియా పాలకవర్గం
- కొత్త కార్యాలయాలు ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కొత్త సర్కిల్ కార్యాలయాల ఏర్పాటు ప్రక్రియ మూలన పడింది. 2019 జీడబ్ల్యూఎంసీ యాక్ట్ ప్రకారం సర్కిల్ కార్యాలయాలు విస్తరణ చేపట్టవచ్చనే నిబంధనలున్నా ఇప్పటి అధికారులు, పాలక వర్గం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో వరంగల్ నగర పాలక సంస్థలో ఇప్పటికీ పెండింగ్ పనులు కుప్పలుతెప్పలుగా పడి ఉన్నాయి. ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపినా.. కొత్త సర్కిళ్లను ఏర్పాటు చేయడానికి అధికారులు వెనకాడుతున్నారు. సర్కిల్ కార్యాలయాల ఏర్పాటును పాలక వర్గం సైతం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

84 డివిజన్‌లుగా విస్తరింపు

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధి ప్రస్తుతం పెరిగిపోయింది. ప్రస్తుతం నగర జనాభా 12 లక్షలకు పైగా పెరిగింది. ఇతర ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడే స్థిరపడ్డ వారి సంఖ్య రెండింతలు పెరిగిపోవడంతో అధికారులకు సేవలందించడం కష్టంగా మారింది. డెత్, బర్త్ సర్టిఫికెట్ల నుంచి ఇంటి అనుమతుల వరకు ప్రతీ చిన్నపనికి కాజీపేట, కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాలతో పాటు ప్రధాన కార్యాలయానికి ప్రజలకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. ఒక్కో డివిజన్‌కు 5 నుంచి 6 వేల మంది ప్రజలు మాత్రమే నివసించి ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 10 నుంచి 15 వేలకు పైగా ఉన్నట్టు మున్సిపల్ రికార్డులు చెబుతున్నాయి. అయితే డివిజన్‌లు కూడా వచ్చే మున్సిపల్ ఎన్నికల వరకు పెరిగే అవకాశాలు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. బల్దియా అధికారులు ఇప్పటి నుంచే సర్కిల్ కార్యాలయాల ఏర్పాటుతో పాటు డివిజన్‌ల పెంపు, విభజన ప్రక్రియను చేపట్టాలని సూచిస్తున్నారు. ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు వెంటనే సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు చేసి సేవలందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గతంలోనే ప్రతిపాదనలు

వరంగల్ మున్సిపల్ కార్యాలయానికి అనుబంధంగా ప్రస్తుతం నడుస్తున్న కాజీపేట, కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాలతో పాటు మరో నాలుగు సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని బల్దియా అధికారులు అప్పట్లో రంగం సిద్ధం చేశారు. పౌరసేవలు మరింత వేగవంతంగా, జవాబుదారీతనంతో అందించేందుకు 2017 అక్టోబరు 4న జరిగిన కౌన్సిల్ తీర్మానంలో వెల్లడించారు. అప్పటి పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్‌మిట్టల్ సర్కిల్ కార్యాలయాలు పెంచుతూ జీవో నెంబరు 267ను జారీ చేశారు. 66 డివిజన్‌లలో 11 డివిజన్‌లకు ఒక సర్కిల్ కార్యాలయం చొప్పున సేవలందించాలని ప్రతిపాదిస్తూ డివిజన్‌లను కూడా కేటాయిస్తూ క్రమబద్ధీకరించారు. అయితే గత ప్రభుత్వంలో విస్తరించాల్సిన బల్దియా సర్కిల్ కార్యాలయాలు ఇప్పటి వరకు కార్యరూపం దాల్చడం లేదు. రాష్ట్ర ప్రభుత్వ సమీక్షలో ఈ అంశంపై ప్రస్తావించే వారు లేకపోవడంతో ఈ సమస్య మూలన పడుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి.

గత మున్సిపల్ అధికారులు, పాలకవర్గం కొత్త సర్కిల్ కార్యాలయాల ఏర్పాటుకు బాగానే కసరత్తు చేశారు. అయినప్పటికీ ఆచరణలో సాధ్యం కాలేక పోయింది. అప్పటి మేయర్, కమిషనర్, అధికారుల ప్రత్యేక చొరవతో బల్దియా వ్యాప్తంగా 6 సర్కిళ్లను 66 డివిజన్‌లలో ప్రాంతాల వారిగా పని చేసేందుకు ఇనుమడింపచేస్తూ ప్రతిపాదిత ప్రక్రియను చేశారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వం కార్యాలయాల్లో సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందించాలని కార్యాచరణ రూపొందించారు. ఈ క్రమంలో సర్కిల్-1గా కాశిబుగ్గ పరిధిలో గిర్మాజిపేట, మట్టెవాడ, కొత్తవాడ, పోచమ్మమైదాన్, పిన్నవారివీధి, రామన్నపేట ప్రాంతాలను చేర్చారు. సర్కిల్-2 పరిధిలో ఎల్బీనగర్, లేబర్‌కాలనీ, అబ్బనికుంట, కాశిబుగ్గ, చింతల్, శివనగర్, పెరుకవాడతో పాటు మరి కొన్ని విలీన గ్రామాలను ఎంపిక చేశారు. అదే విధంగా సర్కిల్-3లో రంగశాయిపేట లేదా ఉర్సు సీఆర్సీ భవనంలో ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాలకు సేవలందించాలని సూచించారు. సర్కిల్-4లో హనుమకొండలోని నక్కలగుట్టలో కార్యాలయం ఏర్పాటు చేసి హనుమకొండ చౌరస్తా, కిషన్‌పుర, కుమార్‌పల్లి, అడ్వకేట్స్ కాలనీ, కేయూ రోడ్డుతో పాటు మరి కొన్ని ప్రాంతాలను ఈ సర్కిల్ పరిధిలోనికి తీసుకురావాలని యోచించారు. సర్కిల్-5లో కాజీపేటలో ప్రస్తుతం కొనసాగుతున్న కార్యాలయంలోనే కొనసాగించాలని తెలిపారు. ఇంకా సర్కిల్-6లో నయీంనగర్ కూరగాయల మార్కెట్‌లో ఏర్పాటు చేసి పాతిమానగర్, కాజీపేటతో పాటు విలీన గ్రామాలకు అందుబాటులో ఉండే విధంగా ప్రతిపాదనలు చేశారు.



విభజింపు ఇలా..



ప్రతీ పనికి చాలా దూరం వెళ్లాల్సి వస్తోంది..

కొక్కిరాల రవీందర్‌రావు, టీఎన్‌జీవోస్ కాలనీ

హనుమకొండలో ఉంటూ ప్రతీ పనికి వరంగల్, కాజీపేటకు వెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుతం నగరంలో జనాభా పెరిగి పోవడం వల్ల జనాభాకు అనుగుణంగా సర్కిల్ కార్యాలయాలను పెంచితే ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ఇంకా మహిళలకు చిన్నపాటి సర్టిఫికెట్ల కోసం కూడా చాలా దూరం రావాల్సి వస్తోంది. వెంటనే సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుంది.



సర్కిల్ కార్యాలయాలతో పాటు డివిజన్లు పెంచాలి

చాతిరి బిక్షపతి. 54వ డివిజన్, హనుమకొండ

ప్రస్తుతం ప్రతీ డివిజన్‌లో 10 వేల నుంచి 15వేలకు పైగా ప్రజలు ఉంటున్నారు. ప్రజలు డెత్, బర్త్ సర్టిఫికెట్ల నుంచి ఆరు పథకాల సర్టిఫికెట్లు సమర్పించేందుకు వరంగల్‌కు వెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుతం 66 డివిజన్‌లను ఇంకా పెంచి సర్కిల్ కార్యాలయాలు ఆయా డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అధికారులు చొరవ చూపాలి.

‘కళాక్షేత్రం పగుళ్ల’పై విచారణ జరిపించాలి

- కాంట్రాక్టర్లపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలి
- బీజేపీ, కేయూ విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్
- గేటుకు తాళం వేయడం పట్ల ఆగ్రహం
- చర్చనీయాంశమైన ‘ఆంధ్రజ్యోతి’ కథనం
- పగుళ్లను పరిశీలించిన కుడా అధికారులు

హనుమకొండ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రూ.కోట్లు వెచ్చించి.. నగరం నడిబొడ్డున ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరుతో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం గోడలకు పగుళ్లు వచ్చిన అంశంపై ‘ఆంధ్రజ్యోతి’ ప్రధాన సంచికలో గురువారం ప్రచురితమైన కథనం తీవ్ర చర్చనీయాంశమయ్యింది. బీజేపీ నాయకులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు కళాక్షేత్రాన్ని పరిశీలించేందుకు వెళ్లగా అక్కడి సెక్యూరిటీ సిబ్బంది గేటుకు తాళం వేసి ఉంచడం వివాదాస్పదమైంది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావుల కిషన్, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళోజీ కళాక్షేత్రం ప్రారంభించి నెలరోజులు కాకముందే పగుళ్లు ఏర్పడటంపై కలెక్టర్ విచారణ జరిపించాలని, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన కళాక్షేత్రం పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించ లేదని, అందువల్లే గోడలకు పగుళ్లు వచ్చాయని ఆరోపించారు. ఇక ‘ఆంధ్రజ్యోతి’ కథనంతో అప్రమత్తమైన కుడా అధికారులు కళాక్షేత్రం గోడలకు వచ్చిన పగుళ్లను పరిశీలించారు. ఇవి చిన్న చిన్న లోపాలని, ఇలాంటివి సహజంగానే జరుగుతాయని, దీన్ని పెద్దదిగా చేయడం సరికాదన్నారు. వెంటనే పగుళ్లకు మరమ్మతులు చేయిస్తామని అధికారులు వెల్లడించారు. ఇదిలాఉంటే సుమారు రూ.95కోట్లు వెచ్చించి నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం విషయంలో నాణ్యత పాటించకపోవడమేంటన్న చర్చ సర్వత్రా జరిగింది.

అవి పగుళ్లు కాదు : జీడబ్ల్యూఎంసీ కమిషనర్

కాళోజీ కళాక్షేత్రం భవనం గోడలకు వచ్చినవి పగుళ్లు కాదని, ఎలివేషన్‌లోని రెండు జీఎఫ్ఆర్‌సీ పలకల మధ్య గ్యాప్ వచ్చిందని గ్రేటర్ వరంగల్ కమిషనర్, కుడా వైస్‌ఛైర్మన్ అశ్వినితానాజీ వాకడే బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాళోజీ కళాక్షేత్రం గోడలకు పగుళ్లు వచ్చిన అంశంపై ‘ఆంధ్రజ్యోతి’లో గురువారం కథనం ప్రచురితమైన నేపథ్యంలో ఆమె స్పందిస్తూ ఓ ప్రకటన చేశారు.

వేసవిలో డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేయాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

6

రేపు గురుకుల హాస్టళ్లలో ప్రత్యేక కార్యక్రమం

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలోని అన్ని గురుకుల హాస్టళ్లలో 14వతేదీన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో గురుకుల హాస్టల్ విద్యార్థుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై వివిధ శాఖల అధికారులతో గురువారం సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం గురుకుల హాస్టల్ విద్యార్థులకు 40శాతం డైట్ చార్జీలను పెంచిందన్నారు. అదేవిధంగా 16 ఏళ్ల తర్వాత ప్రభుత్వం కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచిందన్నారు. గురుకుల విద్యార్థుల కోసం పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లలో అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. శనివారం నుంచి అమలయ్యే నూతన డైట్, కాస్మోటిక్ చార్జీలపై జిల్లాలోని ప్రతీ గురుకుల హాస్టల్‌లో ఏర్పాటుచేసే ప్రత్యే కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా, జోనల్, మండలస్థాయి అధికారులు పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు. పెంచిన డైట్, కాస్మోటిక్ చార్జీల వివరాలను తెలిపేలా బ్యానర్‌లను ప్రతీ గురుకుల హాస్టల్‌లో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, డీఈఓ వాసంతి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య, చిత్రంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

భూముల సర్వేపై కలెక్టర్ సమీక్ష

ధర్మసాగర్ మండలంలోని ఇనుపరాతి గుట్ట పరిధిలో ఉన్న ఫారెస్ట్, పట్టా భూముల సర్వేపై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఆయా గ్రామాల పరిధిలో ఉన్న ఫారెస్టు, పట్టాదారు భూముల సర్వే ఎంతవరకు వచ్చిందనే వివరాలను సర్వే, ఫారెస్టు, రెవెన్యూ అధికారులను ఈ సందర్భంగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఎఫ్ఓ లావణ్య, ఫారెస్టు, సర్వే సంబంధి శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు ఉన్నారు.

‘ఇందిరమ్మ ఇళ్ల’కు టోల్‌ఫ్రీ నెంబర్

ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి సందేహాలు నివృత్తి చేసేందుకు, ఫిర్యాదుల స్వీకరణకు సంబంధించిన వివరాల కోసం జిల్లా కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నెంబర్ 1800425115 ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోల్‌ఫ్రీ నెంబర్ అన్ని పనిదినాలలో ఉదయం 10:30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పని చేస్తుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

రేపటి నుంచి సెలవులో కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టర్ సత్యశారదకు ఇన్‌చార్జ్ బాధ్యతలు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఈ నెల 14వ తేదీ నుంచి 10 రోజుల పాటు సెలవుల్లో వెళ్లనున్నారు. వ్యక్తిగత కారణాలతో 10 రోజులు సెలవు కావాలని కలెక్టర్ ప్రావీణ్య దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ దరఖాస్తును పరిశీలించిన ప్రభుత్వం సెలవులు ఆమోదించింది. తిరిగి ప్రావీణ్య విధుల్లో చేరే వరకు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారదకు హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా బాధ్యతలు ప్రభుత్వం అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 23వ తేదీన తిరిగి ప్రావీణ్య విధుల్లో చేరనున్నారు.

విద్యార్థుల డ్రాపవుట్స్ లేకుండా చూసుకోవాలి

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల్లో విద్యార్థుల డ్రాపవుట్స్ లేకుండా చూడాలని, ర్యాగింగ్ లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద సూచించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో గురువారం జిల్లా పాఠశాల, ఇంటర్మీడియెట్, కాలేజీయేట్ విద్యాశాఖలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. ఆయా విద్యాశాఖ విద్యాసంస్థల్లో విద్యార్థుల హాజరుశాతాన్ని, మానసిక స్థైర్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ, సమీక్షిస్తూ ఉండాలని సూచించారు. జిల్లాలో అన్ని కళాశాలల్లో యాంటీడ్రగ్స్, టెలీమానస్, అడ్మిషన్లు, డ్రాపవుట్స్, విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లు, శాఖాధికారులు తీసుకుంటున్న చర్యలపై ఎప్పటికప్పుడు నివేదికలను సేకరిస్తూ అందజేయాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలవుతున్నారని, వారితో ఉపాధ్యాయులు నిరంతరం వారి చదువుతో పాటు వారి కుటుంబ పరిస్థితులపై మాట్లాడుతూ వారిని చెడుమార్గాల వైపునకు పయనించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రానున్న వార్షిక పరీక్షల్లో ఉపాధ్యాయులు ప్రణాళిక బద్ధంగా పాఠ్యాంశాలు బోధించి విద్యార్థలను పరీక్షలకు సంసిద్ధులను చేసి 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి వారి ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఇంటర్మీడియెట్ కళాశాలల్లో విద్యార్థులకు డ్రగ్స్, మత్తుపదార్థాలపై అవగాహన కల్పిస్తూ వాటి జోలికి వెళ్లకుండా సూచించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఈవో జ్ఞానేశ్వర్, డీఐఈవో డాక్టర్ సుమన్ శ్రీధర్, మామునూరు ఏసీపీ తిరుపతి, డీఆర్వో విజయలక్ష్మి, ఆర్అండ్‌బీ ఈఈ జితేందర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, జిల్లా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ పాల్గొన్నారు.



వరంగల్ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద, చిత్రంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి

ఈవీఎం గోదాముల తనిఖీ

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని జిల్లా వేర్‌హౌస్ గోదాములలో భద్రపర్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం)లను కలెక్టర్ సత్యశారద గురువారం అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూణ్నెళ్లకోసారి నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోదాములను పరిశీలించినట్లు తెలిపారు.

గురుకులాలు, వసతి గృహాల్లో నాణ్యమైన విద్యాబోధన

ఈ నెల 14న జిల్లాలోని గురుకుల విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాల్లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌లో హాలులో ప్రభుత్వం కల్పిస్తున్న సదుయాపాలు, ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని గురుకుల విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల నెలవారి డైట్, కాస్మోటిక్ పెంపుపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని కులాల పేద విద్యార్థుల వైద్య కల్పనే లక్ష్యంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా, మండలస్థాయి అధికారులు పాల్గొంటారని వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఈవో జ్ఞానేశ్వర్, ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమ అధికారులు పుష్పాలత, పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మీ, సౌజన్యలతోపాటు అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, వసతి గృహాలు, రెసిడెన్షియల్, కేజీబీవీ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

భద్రకాళి అభివృద్ధికి ప్రత్యేక కమిటీ

- 10 శాఖల సమన్వయంతో పారదర్శకంగా పనులు
- మరో 15 రోజుల్లో పూడికతీత పనులు ప్రారంభం

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి చెరువులో పనులు పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం నడుం బిగించింది. ఈ మేరకు రెండు రోజుల కిందట మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి ప్రత్యేక సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డితో కుడా, బల్దియా, ఇరిగేషన్, భూగర్భశాఖ అధికారులతో హైదరాబాద్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. పూడికతీత పనులపై దిశానిర్దేశం చేశారు. భద్రకాళి చెరువు అభివృద్ధి పనులలో ఎలాంటి ఆటంకం, ఆరోపణలు కాకుండా ప్రతీ పని పారదర్శకంగా నిర్వహించాలని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో పనులు నిర్వహించాలని మార్గనిర్దేశం చేశారు. పూడికతీత మట్టి తరలింపులో అధికారులు పూర్తి పర్యవేక్షణ అవసరం అని, మట్టి ట్రిప్పులు రోజుకు ఎన్ని తరలిస్తున్నారు? ఎక్కడికి తరలిసున్నారు? అని ప్రతీ పనికి ఒక లెక్కతో కూడిన రికార్డు చేయాలని చెప్పినట్టు తెలిపారు.

ప్రత్యేక కమిటీకి ఇరిగేషన్ శాఖ నాయకత్వం

హైదరాబాద్ సమీక్షలో సూచనల మేరకు హనుమ కొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇద్దరు కలెక్టర్లు, బల్దియా కమిషనర్‌తో కలిసి గురువారం సమీక్ష నిర్వహించారు. భద్రకాళి చెరువు అభివృద్ధితో పాటు నీటిని నింపి ప్రజలకు సౌకర్యార్థంగా ఉండేందుకు సంబంధిత శాఖలు ఒక కమిటీగా ఏర్పడాలని కలెక్టర్లు సూచించారు. ఈకమిటీని ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో పది ప్రభుత్వ శాఖ సమన్వయంలో ఏర్పాటు చేయాలని సూచించారు. ఇరిగేషన్, కుడా, బల్దియా, భూగర్భశాఖ, రవాణశాఖ, ఆర్అండ్‌బీ, మత్స్యశాఖ, పోలీసు శాఖలతో పాటు చెరువుల పరిరక్షణ కమిటీలు, ప్రకృతి పరిరక్షణ కమిటీలు ఒక కమిటీగా ఏర్పాటు చేసి భద్రకాళి చెరువు అభివృద్ధి పనులు చేయాలని ఆదేశించారు. అయితే ఇప్పటివరకు భద్రకాళి చెరువులో పూడికతీత మట్టిని కూడా అధికారులు తీసే ప్రయత్నం చేయగా బురదమట్టి వస్తుండడంతో వెనక్కి తగ్గినట్టు చెప్పారు. ప్రస్తుతం చెరువును ఎండబెడుతున్నామని చెరువు నీరు పూర్తిగా రెండు మీటర్ల వరకు ఎండిపోయిన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీసీ కెమెరాల పర్యవేక్షణలో 15 రోజుల్లో పూడికతీత పనులు ప్రారంభం అవుతాయని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.



ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ప్రవేశాల గడువును ఈనెల 16 వరకు పొడిగించినట్లు డీఈవో దౌలాగర్ వాసంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాలతో మధ్యలోనే చదు వు మానేసిన వారు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పూర్తి వివరాలకు ఉమ్మడి వరంగల్ జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ ఎ. సదానందం (9346020003/9396337572)ను సంప్రదించాలని ఆమె సూచించారు.

కేయూ ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్ డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 19 నుంచి జరగాల్సిన ఎంసీఏ ప్రొఫెషనల్ థియరీ మూడో సెమిస్టర్ పరీక్షలను గ్రూప్-2, ఆర్ఆర్‌బీ, యూజీసీ నెట్ పరీక్షల నేపథ్యంలో వాయిదా వేస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది తర్వాత ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

కేయూ అభివృద్ధికి రూ.20 కోట్లు కేటాయించాలి

కేంద్ర గిరిజన మంత్రికి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి వినతి



కేంద్ర గిరిజన మంత్రి జువల్ ఓరం భేటీలో జాటోతు హుస్సేన్‌నాయక్

కేయూ క్యాంపస్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాక తీయ యూనివర్సిటీలో విద్యార్థుల హాస్టల్ వసతి కోసం తక్షణమే రూ.20 కోట్లు నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరంను కోరారు. ఈ మేరకు న్యూఢిల్లీలోని కేంద్రం మంత్రి జువల్ ఓరంను కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. ఇటీవల కాకతీయ యూనివర్సిటీలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ తన బృందంతో పర్యటించారు. వర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డితో పాటు పరిపాలన అధికారులతో వర్సిటీ అభివృద్ధితో పాటు విద్యార్థుల సమస్యలపై చర్చించారు. విద్యార్థులకు 500 బెడ్ల వసతి కల్పించిన హాస్టల్‌ను ఇప్పించేందుకు తన వంతుగా కృషి చేస్తానని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ విద్యార్థులకు హామీ ఇచ్చారు. దీనిపై వర్సిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, స్కాలర్లు, వర్సిటీ ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేశారు.

కేయూ విద్యార్థులు ఉద్యోగాలు సాధించుకోవాలి

విద్యార్థులతో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ముఖాముఖి



కంప్యూటర్ సైన్స్ విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్

కేయూ క్యాంపస్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ పీజీ కోర్సుల విద్యార్థులందరూ నిర్దిష్టమైన లక్ష్యంతో కష్టపడి చదువుకుని ఉద్యోగాలు సాధించుకోవాలని కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి సూచించారు. గురువారం వర్సిటీ క్యాంపస్‌లోని కంప్యూటర్ సైన్స్, జంతుశాస్త్రం, బాటనీ విభాగాలను క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతుల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థుల తరగతి గదుల్లోకి స్వయంగా వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఇంటర్, డిగ్రీ విద్యకు క్యాంపస్ పీజీ కోర్సుల విద్యకు తేడా ఉంటుందని, తమ తమ సబ్జెక్టును సంపూర్ణంగా అధ్యయనం చేసేందుకు పీజీ కోర్సు కీలమని చెప్పారు. ఇప్పుడు సబ్జెక్టు నేర్చుకోకపోతే మళ్లీ నేర్చుకునేందుకు అవకాశం దక్కదని విద్యార్థులకు ఉద్బోధించారు. ప్రతీ రోజు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై చక్కగా పాఠాలు నేర్చుకోవాలని వివరించారు.

వర్సిటీ క్యాంపస్‌లోని అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని పీజీ కోర్సు పూర్త య్యేలోగా ఉద్యోగాలు సాధించుకోవాలని చెప్పారు. విద్యార్థులకు సబ్జెక్టు స్కిల్స్ తప్పనిసరి అని చెప్పారు. వర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వీసీతో పాటు క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డి, జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ, కంప్యూటర్ సైన్స్‌విభాగం ప్రొఫెసర్ బి.రమేశ్ పాల్గొన్నారు.

సమన్వయంతో గ్రూప్-2 నిర్వహించాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ సత్యశారద



సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించే గ్రూప్-2 పరీక్షను సమష్టి కృషితో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. వరంగల్ కలెక్టరేట్‌లో గ్రూప్-2 పరీక్ష నిర్వహణపై గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ.. పరీక్షా కేంద్రాల వద్ద తగినంత పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయడంతోపాటు 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షా సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించి, అభ్యర్థుల కోసం తగినన్ని బస్సు సర్వీసులను నడిపించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. గ్రూప్-2 పరీక్షకు 11,309 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా విధులు నిర్వర్తించాలి

హనుమకొండ కలెక్టరేట్: గ్రూపు-2 పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు పకడ్బందీగా విదులు నిర్వర్తించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో గురువారం సాయంత్రం ఈ నెల 15, 16 తేదీలలో జరనున్న గ్రూపు-2 పరీక్షల నిర్వహణపై అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థుల హాల్‌టికెట్, ఫొటో గుర్తింపును క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఈ నియమ నిబంధనలు, మార్గదర్శకాలను అధికారులకు అదనపు కలెక్టర్ వివరించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవి, పరీక్షల రీజినల్ కోఆర్డినేటర్లు ప్రొఫెసర్ సదానందం, ప్రొఫెసర్ ఆనంద్ కిశోర్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ ఇవ్వాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి దృష్ట్యా విద్యుత్ డిమాండ్ తగ్గట్టు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల ఎస్ఈ, ఆపరేషన్, టెక్నికల్, ఎంఆర్టీ డీఈలు, ట్రాన్స్‌కో సీఈ, ఎస్ఈ, డీఈలతో గురువారం సీఎండీ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. సబ్‌స్టేషన్‌లో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుకోవాలని, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల లాంటి పనులు పూర్తి చేయాలన్నారు. ప్రతీ సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యామ్నాయ సరఫరా కోసం ఇంటర్ లింకింగ్ పనులను త్వరతగిన పూర్తిచేసేందుకు సమాయత్తం కావాలన్నారు. తప్పనిసరిగా ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, లైన్ల నిర్వహణ చేపట్టాలన్నారు. ప్రతీ లైన్‌కు సర్క్యూట్ బ్రేకర్ ఉండాలన్నారు. పట్టణాల్లో పీక్‌లోడ్ ఉన్న సమయాల్లో టాంగ్‌టెస్టర్ రీడింగ్ తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలను జీరో స్థాయికి తీసుకురావడానికి లూజ్‌లైన్‌లు సరిచేయాలన్నారు. తక్కువ ఎత్తు ఉన్న స్థానంలో 9.1 మీటర్ల స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. లైన్ క్రాసింగ్, డబుల్ ఫీడింగ్ వచ్చే వాటిని గుర్తించి సరిచేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, మధుసూదన్, ట్రాన్స్‌కో సీఈ శ్రీరామ్‌కుమార్, విజయ్ కుమార్, పాపారావు, డిస్కం సీఈలు తిరుమల్‌రావు, అశోక్, రాజు చౌహాన్, బికంసింగ్ తదితరులు పాల్గొన్నారు.



రాజీయే రాజమార్గం

సీపీ అంబర్‌కిషోర్ ఝా

వరంగల్ క్రైం, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): వివిధ గొడవల్లో కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో రాజీపడి పరిష్కరించుకోవడమే రాజీ మార్గమని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ఈ నెల 14న జాతీయ మెగా లోక్‌అదాలత్ ఏర్పాటు చేస్తున్నారని, ఇందులో చాలా కాలంగా పరిష్కారం కానీ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. కోర్టు ఇస్తున్న ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీసు అధికారులు, కోర్టు డ్యూటీ నిర్వహించే కానిస్టేబుల్స్, ఇతర సిబ్బంది రాజీపడే కేసులను గుర్తించి ఇరువర్గాలను పిలిపించి కౌన్సెలింగ్ చేసి రాజీపడేలా అవగాహన కల్పించాలన్నారు. కేసులల్లో రాజీపడాలనుకునే వ్యక్తులు పోలీసులను సంప్రదించాలన్నారు.

కాలం చెల్లిన బేకరీ ఉత్పత్తులపై టాస్క్‌ఫోర్స్ దాడులు



టాస్క్ ఫోర్స్ పోలీసులు సీజ్ చేసిన బేకరి ఉత్పత్తులు

వరంగల్ క్రైం, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్ కల్లుమండువా చౌరస్తాలోని స్టార్ బేకరీలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం సోదాలు నిర్వహించి సుమారు 17 వేల విలువ చేసే 40 రకాల కాలం చెల్లిన బేకరీ ఉత్పత్తులు సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు కథనం ప్రకారం.. సీపీ ఆదేశాల మేరకు నాణ్యత, పరిశుభ్రత పాటించని స్టార్ బేకరీలో సోదాలు నిర్వహించగా వివిధ రకాల కాలం చెల్లిన ఆహార పదార్థాలు లభ్యమయ్యాయన్నారు. ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్డ్ యాక్ట్ 2006, 2011 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై ఫుడ్‌సేఫ్టీ అధికారుల సహాయంతో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు, ఆర్ఎస్సై భానుప్రకాశ్, ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ బ్రహ్మాజీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాషా నాయక్ పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

వరంగల్ క్రైం, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కమిషనరేట్ రోడ్డు సేఫ్టీబ్యూరో (సీఆర్ఎస్‌బీ) ఇన్‌స్పెక్టర్ బొలగాని శ్రీనివాసరావు సూచించారు. కేడీసీలో రోడ్డు భద్రతపై గురువారం అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మంది వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వలనే మరణిస్తున్నట్లుగా తమ పరిశీలనలో తెలిసిందనారు. అదే విధంగా మైనర్లు డ్రైవింగ్ చేస్తూ రోడ్డుపైకి వస్తూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు.

18 ఏళ్లు నిండిన వారంతా డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకొని లైసెన్స్ పొందాలన్నారు. ప్రమాదాల నివారణలో యువత పాత్ర చాలా కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్ఎస్‌బీ ఆర్ఎస్సై నవీన్‌కుమార్, ఏఎస్సై వేణుగోపాల్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రవీందర్‌కు భారత సేవారత్న జాతీయ అవార్డు



ఆడెపు రవీందర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పోచమ్మమైదాన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా వరంగల్ నగరానికి చెందిన లయన్ డాక్టర్ ఆడెపు రవీందర్‌కు భారత సేవారత్న 2024 అవార్డును ప్రదానం చేశారు. రవీందర్ సేవా కార్యక్రమాలను గుర్తించి అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ బాధ్యులు ఈ అవార్డును హైదరాబాద్‌లో గురువారం ప్రదానం చేశారు. అవార్డును అందుకున్న ఆడెపు రవీందర్ మాట్లాడుతూ.. కళాకారులను ప్రోత్సహిస్తూ వారికి అండగా ఉండి లయన్స్‌క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా అందిస్తున్న సేవలను గుర్తించి అవార్డు అందజేసిన జాతీయ, రాష్ట్ర , జిల్లా నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వడ్నాల నరేందర్, మార్గం ఎల్లయ్య, కాసం నమఃశివాయ, కూరపాటి రమేష్, కటకం నరేందర్, డాక్టర్ మహేశ్వర్, ఈగ వెంకటేశ్వర్లు, ఊరుగొండ రమేష్, కూచన రమేష్, మంత్రి కమలాకర్, తుమ్మ రమేష్, గడ్డం కేశవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన పత్తి, మిర్చి ధరలు

వరంగల్ వ్యవసాయం, డిసెంబరు 12: (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో గురువారం పత్తి అలాగే మిర్చి ధరలు స్వల్పంగా పెరిగాయి. మూడు నెలలుగా పత్తి క్వింటాల్‌కు ఏడు వేలలోపు మాత్రమే పలుకుతోంది గత సోమవారం క్వింటా పత్తి రూ.6950, మంగళవారం రూ.6900లు, బుధవారం రూ.6935లు పలికింది. గురువారం పత్తి క్వింటాల్‌కు రూ.7100లకు పెరిగింది. ఒక్కరోజులో రూ.165లు ధర పెరిగింది. అలాగే మార్కెట్లో తేజరకం కొత్త మిర్చికి బుధవారం క్వింటాకు 15000లు ధర పలుకగా గురువారం రూ.వెయ్యి పెరిగి రూ.16000లకు చేరింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

రేపు, ఎల్లుండి అరబిందో సొసైటీ రాష్ట్రస్థాయి సమావేశాలు

వడ్డెపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట ఫాతిమా నగర్‌లోని బాల వికాస సోషల్ సర్వీస్ సొసైటీలో 14, 15 తేదీల్లో శ్రీఅరబిందో సొసైటీ రాష్ట్రస్థాయి సమావేశాలు జరుగుతాయని శ్రీఅరబిందో సొసైటీ చైర్మన్ డాక్టర్ బండారి జగదీష్ బాబు, కార్యదర్శి వరిగొండ కాంతారావు తెలిపారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారదతో పాటు సంస్థ రాష్ట్ర చైర్మన్ ములుగు శ్రీనివాస్‌లు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి శ్రీఅరవిందో సొసైటీ సభ్యులు హాజరవుతారని జిల్లాలోని సొసైటీ సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికల ఫలితాలు వెల్లడి

● సికింద్రాబాద్, విజయవాడలో మజ్దూర్ యూనియన్ ముందంజ ● మిగతా నాలుగు డివిజన్లలో ఎంప్లాయీస్ సంఘ్ హవా

కాజీపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 4, 5, 6 తేదీల్లో దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో జరిగిన రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికల ఫలితాలు గురువారం ఆయా డివిజన్‌లలో వెల్లడించారు. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ 47.46 శాతం, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ 42. 91 శాతం ఓట్లు సాధించి రెండు యూనియన్‌లు గుర్తింపు దక్కించుకున్నాయి. దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో 6 డివిజన్‌లు గుంటూరు, నాందేడ్, హైదరాబాద్, విజయవాడ, సికింద్రాబాద్, గుంతకల్ డివిజన్‌లలో వెల్లడించిన ఫలితాల్లో సికింద్రాబాద్, విజయవాడ డివిజన్‌లలో మజ్దూర్ యూనియన్ మొదటి ప్రాధాన్యత ఓటు సాధించింది. మిగతా 4 డివిజన్లు గుంటూర్, నాందేడ్, హైదరాబాద్, గుంతకల్ డివిజన్‌లలో మొదటి ప్రాధాన్యత ఓట్లు ఎంప్లాయీస్ సంఘ్ సాధించింది.

వన్ యూనియన్ వన్ ఇండస్ట్రీతో చేపట్టిన ఈ ఎన్నికల్లో ఐదు యూనియన్‌లు పోటీ చేసినా కేవలం దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ మాత్రమే గుర్తింపు హోదా లభించింది. పోలింగ్‌లో 30 శాతం ఓట్లు దక్కించుకుంటే వచ్చే గుర్తింపు డీఎంఆర్‌కే, ఐఆర్ఎంయూ, ఆర్ఎంయూ సంఘాలకు కనీసం 30 శాతం ఓట్లు దక్కించుకోక పోవడంతో గుర్తింపు లభించలేదు.

సికింద్రాబాద్‌లో ఎన్నికల ముగిసిన అనంతరం మజ్దూర్ యూనియన్ నేతలు సికింద్రాబాద్, కాజీపేటలో రైల్వే కార్మికులు బాణసంచా కాల్చి, రంగులు పూసుకుని పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. తమపై నమ్మకంతో మంచి మెజారిటీతో గెలిపించినందుకు మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ పి. రవీందర్ కార్మికులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎంప్లాయీస్ సంఘ్ డిప్యూటీ డివిజనల్ సెక్రటరీ చింత మురళి, జోనల్ యూత్ కమిటీ మెంబర్ పాక రాజ్ కుమార్ మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో ఓట్లేసి గుర్తింపు ఇచ్చినందుకు రైల్వే కార్మికులకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు.

క్రైం కార్నర్

గుండెపోటుతో ఆర్మీ జవాన్ మృతి



రమేష్ (ఫైల్)

ఖానాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపచెట్టుతండా శివారు కోమటిపల్లితండాకు చెందిన ఆర్మీ జవాన్ గుగులోతు రమేష్(38) గుండెపోటుతో గురువారం ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో మృతి చెందాడు. తండా వాసుల కథనం ప్రకారం... రమేష్ 13 సంవత్సరాలుగా ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో విధి నిర్వాహణలో ఉన్న రమేష్ గుండెపోటుతో మృతి చెందడంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనకు భార్య లలిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రమేష్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని తండా వాసులు కోరుతున్నారు.

భార్య మృతి కేసులో భర్తకు ఐదేళ్ల జైలు శిక్ష

ఖానాపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నిత్యం మద్యం తాగివచ్చి భార్యను మానసికంగా వేధింపులకు గురిచేసి ఆమె మృతికి కారకుడైన భర్తకు ఐదేళ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ వరంగల్ మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ప్రేమలతారెడ్డి గురువారం తీర్పు వెలువరించారు. మండలంలోని కొత్తూరు గ్రామానికిచెందిన క్రిష్ణ నిత్యం తాగివచ్చి భార్య రజితను వేధింపులకు గురిచేయడమే కాకుండా, అదనపు కట్నం కావాలని వేధింపులకు గురిచేశాడు. 2018 ఆగష్టు 1న మద్యం మత్తులో ఉన్న క్రిష్ణ భార్యతో గొడవపడి ఇద్దరం కలిసి చస్తామని ఇంట్లో ఉన్న కిరోసిన్ తీసుకొని తన మీద కొద్దిగా పోసుకొని భార్య మీద చాలా పోసి తన ఒంటిపైన ఉన్న చొక్కాను విప్పి నిప్పంటించి భార్య మీద విసిరివేయగా ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి.

చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అదే నెల 5న (5రోజులు) చికిత్స పొందుతూ మృతి చెందిం ది. ఈ కేసులో మెజిస్ట్రేట్ ఆస్పత్రికి వెళ్ళి బాధితు రాలి వాగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ప్రేమలతారెడ్డి తీర్పు చెప్పారు.

హోంగార్డ్స్ ఏసీపీగా నాగయ్య



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏసీపీ నాగయ్య

వరంగల్ క్రైం, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ హోంగార్డ్స్ ఏసీపీగా నాగయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝాను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ముగ్గురు ఎస్సైలు బదిలీ

వరంగల్ క్రైం, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ముగ్గురు ఎస్సైలను బదిలీ చేస్తూ సీపీ అంబర్‌కిషోర్ ఝా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్సై జి. గోవర్ధన్‌ను నల్లబెల్లి ఎస్సైగా, ఆత్మకూరు ఎస్సైగా పనిచేస్తున్న జె.పరమేశ్వర్‌ను శాయంపేట ఎస్సైగా, శాయంపేట ఎస్సైగా పని చేస్తున్న సీహెచ్. ప్రమోద్‌ను సీసీఎస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైబ్రెంట్ విద్యాసంస్థల అధినేత రాజేందర్‌రెడ్డి సేవలకు సన్మానం



రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

హనుమకొండ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 20 ఏళ్లుగా తన బోధనల ద్వారా విద్యాసంస్థలలో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన వైబ్రెంట్ విద్యాసంస్థల అధినేత చిట్టిరెడ్డి రాజేందర్‌రెడ్డి సేవలను గుర్తించి మానవహక్కుల సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. హనుమకొండలోని రాయల్ ఫంక్షన్ గార్డెన్‌లో రాజేందర్‌రెడ్డి దంపతులకు శాలువా కప్పి భారత సేవారత్న బిరుదును బహూకరించి ఘనంగా సన్మానించారు. రాజేందర్‌రెడ్డి 2019లో మహిళా డిగ్రీ కళాశాలను స్థాపించి ఎంతోమంది పేద విద్యార్థులకు సేవ చేసినట్లు తెలిపారు. ఆయన సేవలను గుర్తించి సన్మా నం చేసినట్లు తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు
(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2315	2080
పల్లికాయ (సూక)	4020	4000
పల్లికాయ (పచ్చిది)	4250	5500
కందులు	-	-
పెసళ్లు	6812	6000
పత్తి	7100	5800
పసుపు (కాడి)	11111	11000
పసుపు (గోల)	11209	10500
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి (కొత్తది)	16000	12000
తేజ ఏసీ	15500	14000
వండర్‌హాట్ ఏసీ	13000	11000
యూఎస్341ఏసీ	14500	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం



LAND FOR SALE
హనుమకొండ-ఖమ్మం హైవే 230 ఫీట్ ఫేసింగ్ తో 5200 గజాల భూమి ఆకేరు వాగు (వర్ధన్నపేట) దగ్గరలో లక్ష్మి గార్డెన్స్ ప్రక్కన కాంపౌండ్ వాల్ కట్టి చాలా అనువుగా తో అమ్మకానికి కలదు. వివరాలకు
Cont : 9705469885, 9705469886

WANTED
★ మొబైల్ టెక్నీషన్/ సెల్స్ పర్సన్స్ (With/with out) Experience. Good Salary + Insentives. Teja Mobiles Hnk. Cont : 7673946689
AJW-199490

WANTED
★ మడికొండ (ధర్మసాగర్) దగ్గరలో ఉన్న పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మంచి ఉత్సాహవంతులైన వర్కర్స్ కావలెను .సం॥ప్ర॥ 8247771016, 8247771525
AJW-4024

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ : నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్.రావు. సం॥ప్ర॥ 9849145043, 9866584455
AJW-199469

REAL ESTAE
★ డబ్బులు లేకుండా TDR ఇవ్వబడును బదులుగా మీ వద్ద ఉన్న Flats (or) Open Lands తీసుకోబడును (ఖరీదు చేయబడును) సం॥ప్ర॥ 9885301652
AJW-7628

అడ్మిషన్లు జరుగుచున్నవి
★ DOA, DOM DML DRGA అడ్మిషన్లు జరుగుచున్నవి మరియు కంప్యూటర్ ఆపరేటర్, రిసెప్షనిస్ట్ స్కాలర్‌షిప్ వర్క్ చేయడానికి కావలెను. సం॥ప్ర॥ 9177631014
AJW-199491

పాస్‌పోర్టు పోయినది
★ రుద్రాంగి శ్రీనివాస్, తండ్రి : విశ్వనాథం, H.No: 2-4-605/1, రాంనగర్, హన్మకొండ గారికి సంబంధించిన ఒరిజినల్ పాస్‌పోర్టు నెం : K555109 గలది హన్మకొండ ఓల్డ్ బస్ డిపో నుండి కలెక్టర్ ఆఫీస్‌కు ఆటోలో ప్రయాణిస్తుండగా మార్గమధ్యంలో పోయినది. దొరికిన వారు సం॥ప్ర॥ 9949648175
AJW-226285

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

3+2 స్కీం కలదు

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ 9985400013, 8978510273
వరంగల్ 9985406150, 9985408173
జనగామ 9866431354
మహబూబాబాద్ 9985418040
తొర్రూర్ 9985418040
నర్సంపేట 9985418040
భూపాలపల్లి 9985401232
పరకాల 9985401232

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-
గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

మాదిగ విద్యార్థుల మహాసభను జయప్రదం చేయాలి

కేయూ క్యాంపస్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 20న హనుమకొండ వడ్డెపల్లిలోని పల్లా రవీందర్‌రెడ్డి విద్యుత్ భవన్‌లో జరిగే వరంగల్ ఉమ్మడి మాదిగ విద్యార్థుల మహాసభను విజయవంతం చేయాలని ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, డాక్టర్ పోడేటి శ్రీనివాస్, డాక్టర్ సంకినేని వెంకట్, ఎమ్మార్పీఎస్ పొలిట్ బ్యూరో సభ్యుడు బోడ్డు దయాకర్ కోరారు. గురువారం కేయూ పరిపాలన భవనం ఎదుట మాదిగ స్కాలర్లు, విద్యార్థుల నేతృత్వంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 20న హనుమకొండలో జరిగే మాదిగ విద్యార్థుల మహాసభలకు ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాదిగ యువ విద్యార్థులందరూ హాజరుకావాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్, తోక ల చిరంజీవి, ముక్కెర ముఖేశ్, డాక్టర్ వడ్డెపల్లి మధు, మంద భాస్కర్, బొడ్డు శాంతి సాగర్, రాణాప్రతాప్, రంజిత్ పాల్గొన్నారు.

వీసీని కలిసిన ఎమ్మార్పీఎస్ నేతలు

కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని గురువారం వర్సిటీ పరిపాలన భవనంలో మాదిగ ప్రొఫెసర్లు, ఎమ్మార్పీఎస్ జాతీయ నేతలు, స్కాలర్లు, నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. వర్సిటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు అంశాలపై చర్చించారు. విద్యార్థులకు, ప్రొఫెసర్లకు రావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు తన వంతుగా సహకరిస్తానని వీసీ ప్రతాప్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ పొడేటి శ్రీనివాస్, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, స్కాలర్లు, విద్యార్థులు, ఎమ్మార్పీఎస్ నేతలు పాల్గొన్నారు.



మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ రామచంద్రం, శ్రీనివాస్, వెంకట్

సీకేఎం ఆస్పత్రిలో నిండిన సెప్టిక్ ట్యాంకులు

డ్రెయినేజీ పైపులు లీక్.. రోగుల ఇబ్బందులు

గిర్మాజీపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఆవరణలోని సెప్టిక్ ట్యాంక్‌లు నిండి.. డ్రైనేజీ పైపులు లీకవుతున్నాయి. ఆస్పత్రి ఆవరణలో ఆపరేషన్ థియేటర్ వ్యర్థాలు గురువారం కాలువగా పారడంతో దుర్గంధభరిత వాసనతో రోగులు, సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆస్పత్రి ఆవరణలోని ఓపీ బ్లాక్ సమీ పంలో జనరేటర్ గది వెనుక ఉన్న రెండు సెప్టిక్ ట్యాంకులు ఉన్నాయి. ఆస్పత్రిలోని వార్డు లలోని టాయిలెట్ల వ్యర్థాలు ఇందులోకి వస్తాయి. అయితే ఈ రెండు సెప్టిక్ ట్యాంకులు నిండిపోవడంతో డ్రైనేజీ నీరు ఈ ప్రాంతంలో పారుతూ దుర్వాసన వస్తున్నా ఆస్పత్రి అధికారులు , ఆస్పత్రి నిర్వాహకులు, పారిశుధ్య కాంట్రాక్టర్ పట్టించు కోవడం లేదని పలువురు ఆరోపిసున్నారు. వెంటనే కలెక్టర్ ఆస్పత్రిని సందర్శించి చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.



ఆస్పత్రి ఆవరణలో ఆపరేషన్ థియేటర్ నుంచి వస్తున్న వ్యర్థాలు

మంత్రి పదవి నుంచి సురేఖను భర్తరఫ్ చేయాలి

కాశిబుగ్గ, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పదవి నుంచి కొండా సురేఖను భర్తరఫ్ చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి, గవర్నర్‌కు లేఖలు రాశారు. ఆ లేఖలను గురువారం కాశిబుగ్గలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా హరిశంకర్ మాట్లాడుతూ.. వేములవాడలోని గోశాల నుంచి గోవులు నిబంధన లకు వ్యతిరేకంగా గీసుగొండకు తరలించి.. అక్కడి నుంచి కబేళాకు గోవులను తరలించిన సంఘటనకు మంత్రి సురేఖ నైతిక బాధ్యత వహించాలని పేర్కొన్నారు. వేములవాడ నుంచి గీసుగొండకు గోవులు తరలించడానికి మంత్రి సిఫారసు లేఖ అందించారని ఆయన ఆరోపించారు. మంత్రి సిఫారసు లేఖ మేరకు గోవులను వేములవాడ నుంచి తరలించారని విమర్శించారు. మంత్రి పదవి నుంచి ఆమెను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎరుకల రఘునారెడ్డి, బీజేపీ సీనియర్ నేతలు సముద్రాల పరమేశ్వర్, కుమార్ యాదవ్, ఆనంద్, నాగరాజు, సతీష్, శ్రీనివాస్, రతన్, భిక్షపతి, అజయ్, అనిల్ పాల్గొన్నారు.



పోస్టుకార్డులను చూపిస్తున్న బీజేపీ నేతలు

పోడు భూములకు పట్టాలివ్వాలి

వడ్డెపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న నేతకాని కులస్తులు పోడు చేసుకొని సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని, నేతకాని కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేసి పాలక వర్గాన్ని నియమించాలని తెలంగాణ నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయనతో పాటు రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ దుర్గం నర్సయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామెర ప్రకాష్‌లు మాట్లాడారు. హైదరాబాద్‌లోని నేతకాని ఆత్మగౌరవ భవన నిర్మాణం పనులను వెంటనే పూర్తి చేయాలని, నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని, తమ సామాజిక వర్గానికి రెండు ఎమ్మెల్సీ సీట్లు, ఒక రాజ్యసభ పదవిని ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే నేతకాని సింహ గర్జన సభను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు బండారి సురేష్, అనపర్తి యువరాజు, బండారి చేరాలు, జనగాం సారయ్య, గోదెర రాజేష్, గొల్లె సుమన్, దుర్గం సుమన్, అన్వేష్ పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



ప్రసంగిస్తున్న కార్పొరేటర్ సువర్ణ

ఖిలావరంగల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ-సురేష్ అన్నారు. 37వడివిజన్ తూర్పుకోట కొత్తగడ్డలో గురువారం కాకతీయ మహిళా పరస్పర సహాయ, సహకార సమాఖ్య జనరల్ బాడీ సమావేశాన్ని ఆర్పీ బేర కవిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామీణ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్‌కుమార్, సీవో ప్రవీణ్, ఫీల్డ్ ఆఫీసర్ కిరణ్, అంగన్‌వాడీ టీచర్లు రాజమణి, కాకతీయ మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలి



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదగా మెలగాలని హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి పోలీస్ సిబ్బందికి సూచించారు. గురువారం సుబేదారీ పోలీస్‌స్టేషన్‌ను హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడి సందర్శించి తనిఖీ చేశారు. ఈసందర్భంగా క్రైమ్ రికార్డులు, శానిటేషన్‌ను, పోలీస్ సిబ్బంది కిట్‌లను పరిశీలించగా సిబ్బంది ఏసీపీకి కేసుల వివరాలను తెలిపారు. ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందికి రివార్డులను ఏసీపీ అందజేశారు. సీఐ పి.సత్యనారాయణరెడ్డి, ఎస్సైలు శ్రీకాంత్, ఫణీ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హసన్‌పర్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాకతీయ యూనివర్సిటీ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ అన్నారు. మండలంలోని భీమారం ఎస్‌వీఎస్ కళాశాలలో గురువారం పోలీసు కళాజాత బృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, నార్కొటిక్ డ్రగ్స్, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రవికుమార్ విద్యార్థులను ద్దేశించి మాట్లాడుతూ.. చెడు వ్యసనాలకు అలవాటు పడి తమ జీవితాలను దుర్భరం చేసుకోవద్దని సూచించారు కేయూసీ పోలీసు సిబ్బంది, కళాశాల విద్యార్థులు, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

'కాకతీ' కదన భేరి పోస్టర్ ఆవిష్కరణ

వరంగల్ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 21వ డివిజన్ చార్‌బౌలిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'కాకతీ' కదన భేరి పోస్టర్ ఆవిష్కరించే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. ఇటీవల కేంద్ర మంత్రి వర్గం యూపీఎస్ విధానాన్ని ఆమోదం తెలిపిందన్నారు. ఏప్రిల్ 1, 2025 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేయనున్న ఏకీకృత పెన్షన్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ నెల 22వ తేదీన వరంగల్ జిల్లా కేంద్రంగా 'కాకతీ' కదనభేరి పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఏకీకృత పెన్షన విధానం అనేది కేవలం ఉద్యోగులను మోసగించి కార్పొరేట్ల కడుపు నింపడానికి వచ్చిందే తప్ప ఉద్యోగి కుటుంబానికి సామాజిక భద్రత చేకూర్చే పథకం కాదని పేర్కొన్నారు. దీన్ని తీవ్రంగా ప్రతిఘటించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. ఈ బహిరంగసభకు ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి రవీందర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగమూర్తి, బుచ్చన్న, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లికార్జున్ పాల్గొన్నారు.

రావు పద్మపై బీఆర్ఎస్ ఆరోపణలు హాస్యాస్పదం

బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు

రాంనగర్, డిసెంబర్ 12(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అనుచరులు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఆరోపణలు చేయడం హాస్యాస్పదం అని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు అన్నారు. గురువారం హంటర్‌రోడ్డులో జరిగిన విలేకరుల సమావేశంలో సంద్ర మధు మాట్లాడుతూ.. కాజీపేట రైల్వేవ్యాగన్, కోచ్ ఫ్యాక్టరీపై బీఆర్ఎస్ నేతలు అవగాహన లేక తప్పుదారిపట్టిస్తున్నాడన్నారు రావు పద్మను విమర్శించే స్థాయి పులి రజినీకాంత్, ఇతరులకు లేదన్నారు. దాదాపు 8 ఏళ్ల కిందటే రావు పద్మ స్థానిక బీజేపీ నాయకుల సహకారంతో నరేంద్రమోదీని హనుమకొండకు ఆహ్వానించి శంకుస్థాపన చేయించిందన్నారు. నాటి నుంచి శరవేగంగా పనులు సాగుతూ 2025 నాటికి కోచ్‌లు బయటికి వచ్చే తరుణంలో వినయభాస్కర్ ఢిల్లీలో ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. కోచ్ శంకుస్థాపనకు రాకుండా ముఖం చాటేసి ఇప్పుడు కోచ్ ఫ్యాక్టరీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో ఎస్టీ మోర్చా నాయకుడు తిరుపతి, జిల్లా నాయకులు శ్రీనువాస్‌రావు, కృష్ణమాచారి, సంపత్‌రెడ్డి, అనిల్, రవి, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు .



మాట్లాడుతున్న ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

మామునూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ మామునూరులోని మరియపురంలో డార్ట్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో లయన్స్ క్లబ్, ప్రేమలత క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ గవర్నర్ డాక్టర్ చంద్రశేకర్ 100 మంది అనాథ వృద్ధులకు బీపీ, షుగర్ టెస్టులు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని వృద్ధులు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిక్షలు చేసుకోవాలని తద్వారా రక్తహీనత పరిస్థితులను పసిగట్టవచ్చని అన్నారు. అనంతరం డార్ట్ స్వచ్ఛంద సంస్థ వారు వృద్ధులకు ఒక నెల సరిపడా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. డాక్టర్ రాజేశ్వరీ, సురేష్, మార్గం ప్రభాకర్, విష్ణు పూర్ణచందర్, నిరంజన్ డార్ట్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులు, అనాథల మధ్య పుట్టిన రోజు వేడుక

కాజీపేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : తమ కుమారుడి పుట్టిన రోజు వేడుకను దివ్యాంగులు, అనాథల మధ్య జరుపుకొని వారిని సంతోషపెట్టాలనుకున్నారు ఆ దంపతులు. కాజీపేట మండలం కడిపికొండకు చెందిన కన్నెబోయిన రాజు యాదవ్-స్వప్న దంపతులు తమ కుమారుడు అద్విక్ యాదవ్ 5వ పుట్టిన రోజు వేడుకను కాజీపేటలోని మదర్ ఫౌండేషన్ ఆశ్రమంలోని దివ్యాంగులు, అనాథల మధ్య జరిపి వారికి అన్న వితరణ గావించారు. పండ్లు పంపిణీ చేశారు.

అయ్యప్ప మాలధారులకు మైనారిటీ నాయకుడి అన్నదానం

హనుమకొండ చౌరస్తా, డిసెంబరు 12: (ఆంధ్రజ్యోతి): కులమతాలకతీతంగా ముస్లిం మైనారిటీ నాయకుడు, మాజీ డిప్యూటీ మేయర్ ఖాజా సిరాజోద్దిన్ అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించారు. గురువారం హను మకొండ గుడిబండల్‌లోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో శ్రీ అయ్యప్ప స్వామికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం ఖాజా సిరాజోద్దిన్ ఆధ్వర్యంలో మాలధారులకు మహాన్నదానం నిర్వహించగా.. ఖాజాసిరాజోద్దిన్ స్వయంగా స్వాములకు వడ్డించారు. కార్యక్రమంలో అర్చకులు కిరణ్‌శర్మ, గురుస్వాములు బొల్లపెల్లి పూర్ణచందర్, సిద్దంశెట్టి శ్రీనివాస్, మహేష్‌కన్నా, దేవులపల్లి ప్రదీప్, సురేష్, ప్రదీప్, అన్న సతీష్, కూచన సునీల్, అంకమ్మరావు, గంట శ్రీనివాస్, శిరీష్, బీఆర్ఎస్ నాయకులు చింతాకుల ప్రభాకర్, పమ్మి రమేష్, రుద్రోజు సంపత్, చాగంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ ఖాజా సిరాజోద్దిన్

ముగిసిన సీఎం కప్ క్రీడా పోటీలు



మండల స్థాయిలో విజేతగా నిలిచిన క్రీడాకారులకు సర్టిఫికెట్, షీల్డ్‌ను ప్రదానం చేస్తున్న జీడబ్ల్యూఎంసీ డీసీ రవీందర్

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 12:(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా రెండు రోజులుగా హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న మండలస్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ (డీసీ) గొడిశాల రవీందర్ ముఖ్య అతిథిగా హాజరై వివిధ క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సర్టిఫికెట్లను, షీల్డ్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 17నుంచి 19వరకు జేఎన్ఎస్ వేదికగా నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి గుగులోత్ అశోక్ కుమార్, హనుమకొండ మండల తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి, ఎంఈవో రాజేందర్‌రెడ్డి, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ మల్లం రాజేష్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ పోలేపాక అనీల్‌కుమార్, డీఎస్ఏ కోచ్ శ్రీమన్నారాయణ, సీనియర్ పీడీ సదానందం పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలి



అంబేద్కర్ సర్కిల్‌లో మాట్లాడుతున్న ఎమ్డీ నయిమొద్దీన్

వడ్డెపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని బీఆర్ఎస్ మైనారిటీ సెల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ నయిమొద్దీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం సర్కిల్‌లో ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింలకు మంత్రి పదవి వెంటనే కేటాయించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు.సమావేశంలో ముస్లిం మైనారిటీ నేతలు మహ్మద్ ఇస్మాయిల్ , తస్లీం, మహ్మద్ ఆరీఫ్ హుస్సేన్, ఆబిద్ హుస్సేన్, సర్దార్ అలీ, అమీనాబీ, రషీదా , యాస్మిన్, యాకూబ్, అబ్దుల్లా ఖాన్, హసన్, అఫ్సర్, మజహర్, ఆరీఫ్, రహీం , ఫిరోజ్, యూసుఫ్ పాల్గొన్నారు.

కుడా కార్యాలయంలో కరెంటు కోత

ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులు

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని కుడా (కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) కార్యాలయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారంగా మారింది. కుడా క్యాంపస్ ఆవరణలోని కుడా, ఆర్డీఎంఏ కార్యాల యం, భూగర్భశాఖ కార్యాలయంలో విద్యుత్ నిలిచిపోయింది. గురువా రం ఉదయం 10.30 గంటలకు కుడా కార్యాలయంలో కరెంటు లేకపోవడంతో టౌన్‌ప్లానింగ్, ఎల్ఆర్ఎస్, వివిధ విభాగాల కంప్యూటర్ సెక్షనలలో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సుమారు మూడు గంటల పాటు విద్యుత్ లేకపోవడంతో కొంత సమయం జనరేటర్‌తో పనులు నిర్వర్తించా రు. మధ్యాహ్నం 2 గంటలకు కరెంటు రావడంతో సిబ్బంది పనులు నిర్వహించారు.



కుడా కార్యాలయంలో కరెంటు లేకపోవడంతో ఖాళీగా కూర్చున్న సిబ్బంది

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వరంగల్ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీజీఎన్‌పీడీసీఎల్ వరంగల్ డివిజన్ పరిధిలోని 11కేవీ మెయింటనెన్స్‌లో భాగంగా శివాలయం, రామ్‌కీ ఫీడర్లలోని కాశీబుగ్గ, శాంతినగర్, మదీనా రోడ్డు, రామ్‌కీ, దయానంద కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నారు. ఈ మేరకు వరంగల్ డీఈ శంకేషి మల్లికార్జున్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

● రాంనగర్, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని కేయూసీ పీఎస్ పరిధి, పలివేల్పుల, సీఆర్‌పీఎఫ్ క్యాంపు, టీబీ ఆస్పత్రి, కనకయ్య హోటల్, మహాత్మానగర్, విజయగణపతి కాలనీ, వినాయక టెంపుల్ లైన్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని టెంపుల్ ట్రీ విల్లాస్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడిగా ప్రభాకర్



ప్రభాకర్

వడ్డెపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కంచరకుంట ప్రాంతానికి చెందిన డక్కు ప్రభాకర్ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా నియమితుల య్యారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవికుమార్ ఆదేశం మేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర చంద్రమౌళి గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్‌పీఐ సీనియర్ నాయకులు సహకారంతో హనుమకొండ జిల్లాలో పార్టీని బలోపేతం చేసి పేదల పక్షాన పోరాటం చేస్తానని డక్కు ప్రభాకర్ పేర్కొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 31 మందికి జరిమానా

మట్టెవాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 31 మందికి వరంగల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం రూ.31,300 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన నలుగురు వాహనదారులకు మేజిస్ట్రేట్ రూ. 2వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని వినియోగించుకోవాలి

మట్టెవాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగ పరుచుకో వాలని 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన నవీన్ అన్నారు. వరంగల్ విశ్వకర్మ వీధిలోని స్వర్ణకార సంఘం భవనంలో గురువారం సాయంత్రం పీఎం విశ్వకర్మ యోజన పథకానికి సంబంధించిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ సెంటర్‌ను కార్పొరేటర్ గందె కల్పన నవీన్ ప్రారంభించారు. స్వర్ణకార సంఘం అధ్యక్షుడు సురో జు రమేశ్‌బాబు, ప్రధాన కార్యదర్శి కట్ట రాజేం దర్, కవిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రసేన, బీజేపీ సీనియర్ నాయకులు గందె నవీన్, రామని సుమన్, స్వర్ణకార సంఘం నాయకులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ పరీక్షలు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను వెలికితీస్తామని రిటైర్డ్ డైట్ లెక్చరర్ సోమయ్య అన్నారు. హంటర్‌రోడ్‌లోని సైన్స్ సెంటర్‌లో తెలంగాణ గణిత ఫోరమ్ ఆధ్వర్యంలో గురువారం 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సోమయ్య మాట్లాడారు. పోటీల్లో గెలుపొందిని విద్యార్థులకు ఆహుతుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఏఎంవో శ్రీనివాస్, ఫోరమ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు టి.భాస్క ర్, బి.మహేష్‌కుమార్, కోశాధికారి మల్లికార్జున్, రాష్ట్ర నాయకులు కె.సురేష్, కె.శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో నెహ్రూ, డీఎస్‌వో శ్రీనివాస్‌స్వామి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ సీఆర్‌పీఎఫ్ జవాన్ మృతి

కాజీపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రమాదంలో గాయపడిన సీఆర్‌పీఎఫ్ జవాన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు.. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పంజాబ్‌కు చెందిన హర్పిందర్ సింగ్ (50) భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విధులు నిర్వరిస్తున్నాడు. హర్పిందర్ సింగ్ సెలవుపై పంజాబ్‌కు వెళ్తుండగా బుధవారం కాజీపేటలో రైలు నుంచి జారిపడి రెండు కాళ్లు విరిగాయి. 108 ద్వారా చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య ఒక కూతురు ఉన్నారు.

ఎస్ఆర్‌నగర్‌లో రెవెన్యూ సర్వే

వరంగల్ సిటీ, డిసెంబరు12: (ఆంధ్రజ్యోతి): నగరంలోని 14వ డివిజన్ ఎస్ఆర్‌నగర్‌లో ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించుకున్నారంటూ కొంత కాలంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇదే విషయంపై మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత ఎమ్మెల్యే, తహసీల్దార్, ఏనుమాముల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ అధికారులు, పోలీసులు కాలనీ పెద్దలు, యువకులతో చర్చించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వరంగల్ తహసీల్దార్ ఆధ్వర్యంలో గురువారం ఎస్ఆర్‌నగర్‌లో భూ ఆక్రమణల గుట్టురట్టు చేసేందుకు వీఆర్‌వో మహేందర్ స్థానికుల సమక్షంలో సర్వే నిర్వహించారు. ఆ సర్వే రిపోర్టును తహసీల్దార్ ఎక్బాల్‌కు అందజేశారు. రిపోర్టు ఆధారంగా తహసీల్దార్ చర్యలు తీసుకోనున్నారు.

బాలిక గురుకులంలో కలకలం

సెమీ క్రిస్మస్ వేడుకల నిర్వహణపై వీహెచ్‌పీ అభ్యంతరం

విద్యార్థినులపై దాడి చేశారంటూ ప్రిన్సిపాల్ ఆరోపణలు

పోలీసులకు పరస్పర ఫిర్యాదు?

హసన్‌పర్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డులోని తెలంగాణ బాలికల గురుకుల కళాశాల ఆవరణలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన సెమీక్రిస్మస్ వేడుకలు వివాదానికి దారితీశాయి. ఈ వేడుకలకు క్రిస్టియన్ ప్రబోధకుడు ప్రకాష్ హాజరవగా.. విషయం తెలుసుకున్న వీహెచ్‌పీ నేతలు అక్కడకు చేరుకుని నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో అన్యమత ప్రచారం చేయడమేంటని, విద్యార్థినులపై బలవంతంగా మత ప్రచారాన్ని రుద్దడం సరికాదని ఆరోపించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న హసన్‌పర్తి ఎస్సై దేవేందర్ పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. అయితే తాను ప్రిన్సిపాల్ ఇందుమతి ఆహ్వానం మేరకే వచ్చానని మత ప్రబోధకుడు ప్రకాష్ తెలపగా.. తాము కళాశాలలో అన్ని మతాలకు సంబంధించి పండుగలను నిర్వహిస్తున్నామని, ఈ క్రమంలో సెమీక్రిస్మస్ వేడుకలను నిర్వహించాలనుకున్నామని, కానీ మత ప్రచారం చేస్తున్నారంటూ కొందరు ఇక్కడకు వచ్చి విద్యార్థినులపై దాడి చేశారని ప్రిన్సిపాల్ ఇందుమతి ఆరోపించారు. వీహెచ్‌పీ నేత ఉదయ్ శ్రీరాం మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలో అన్యమత ప్రచారం చేస్తూ విద్యార్థినులపై ఒత్తిడి తీసుకువస్తున్న ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్ ఇందుమతిపై విశ్వహిందూ పరిషత్ నేతలు, వీహెచ్‌పీ నేతలపై ప్రిన్సిపాల్ ఇందుమతి పరస్పర ఫిర్యాదులు చేసుకున్నట్టు సమాచారం. ఈ విషయంపై ఎస్సై దేవేందర్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. దీంతో ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలును ఫోన్‌లో వివరణ కోరగా ఘర్షణ జరిగినట్లు సమాచారం తెలిసిందని, కానీ తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పడం గమనార్హం

అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు

హసన్‌పర్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా ఎంపిక చేస్తామని హౌసింగ్ డీఈ సిద్ధార్థ నాయక్ అన్నారు. మండలంలోని పెంబర్తిలో ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వేను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో కట్ల కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పులి మడుగు

ప్రకృతి సోయగం

గూడూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎత్తైన కొండలు.. అరుదైన వృక్షాలు.. అబ్బురపరిచే జలపాతం.. పచ్చని ప్రకృతి అందాలతో ఎంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి చారిత్రక పులిమడుగు గుట్టలు. ఒకప్పుడు పులులకు ఆవాసంగా ఉండే ఈ ప్రాంతంలో ఇప్పుడు పలు వన్యప్రాణులున్నాయి. ఎలుగుబంట్లు, జింకలు, కనుజు, మూషికజింక, చుక్కల దుప్పులు, కుందేళ్లు, అడవి పందులు, నెమళ్లు, ఇతరత్ర వన్య ప్రాణులతో పాటు పశుపక్ష్యాదులు, ఔషధ గుణాలు కలిగిన చెట్లు ఇక్కడి ప్రత్యేకం. మహబూబాబాద్ జిల్లాలో 1.50లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న పులి మడుగు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వంలో అధికారులు ప్రతిపాదనలు చేశారు. తాజాగా, ప్రకృతి పర్యాటక కేంద్రంగా సర్కార్ గుర్తించడంతో పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందబోతోందని అధికారులు చెకబుతుండగా.. పర్యాటకులను ఆకర్షించేలా సఫారీ, బర్డ్‌వాచ్, ట్రెక్కింగ్, బోటింగ్, ఉండడానికి వసతి సౌకర్యాలను కల్పిస్తే బావుంటుందని ప్రకృతి ప్రేమికులు అభిప్రాయ పడుతున్నారు.

12 ప్రకృతి సర్క్యూట్లలో ఒకటి..

పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిసారించింది. రాష్ట్రంలో అటవీ, అటవీ ఇతర ప్రాంతాలు కలిపి మొత్తం 12 సర్క్యూట్‌లను అధికారులు గుర్తించారు.

వీటిలో భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ పరిధిలోని మహబూబాబాద్ జిల్లా గూ డూరు రేంజ్ పరిధిలోని పులిమడుగు అటవీప్రాంతాన్ని చేర్చారు. పులిమడుగు ప్రాంతం వన్యప్రాణుల ఆవా సానికి అనువుగా ఉంటుంది. ఇక్కడి దట్టమైన అడవిలో నీటి వనరులు పుష్కలంగా ఉండటం, విశాలమైన గడ్డి మైదానాలు, రాళ్ల గుట్టలు, గుహలు వాటి ఆవాసానికి అనుకూలంగా ఉంటాయి.

పులిమడుగులో క్యాంపెయిన్ సైట్..

గూడూరు, గంగారం, కొత్తగూడ, బయ్యారం సరిహద్దుల్లో ఉన్న ఈ పులిమడుగులో అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.18 లక్షల నిధులతో క్యాంపెయిన్ సైట్, సోలార్ బోరు, నీటి కుంటలను ఏర్పాటు చేశారు.

గూడూరు రేంజ్ పరిధిలోని మట్టెవాడ శివారు కొంగరిగిద్ద నుంచి కొడిశలమిట్ట సమీపంలో పులిమడుగు ప్రాంతం ఉంది. అక్కడి వరకు తాత్కాలికంగా రోడ్డును ఏర్పాటు చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి పులిమడుగుకు చేరుకోవాలంటే కేవలం 40 కిలోమీటర్లు ఉంటుంది. హనుమకొండ, గూడూరు మీదుగా పులిమడుగు వరకు సుమారు 100 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఇప్పటికే అరకొరగా ఉన్న సౌకర్యాలతోనే పర్యాటకులు వచ్చి సందడి చేస్తున్నారు. కొంగరిగిద్ద నుంచి పులి మడుగు వరకు రోడ్డు సౌకర్యం, సఫారి, బర్డ్‌వాచ్, ట్రెక్కింగ్ బోటింగ్ లాంటి సౌకర్యాలు కల్పిస్తే పులి మడుగుకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుం చే కాకుండా ఖమ్మం, హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం నుంచి పర్యాటకులు వస్తారని, తద్వారా అటవీశాఖకు, ప్రభు త్వానికి ఆదాయం సమకూరుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పులిమడుగు పర్యాటక కేంద్ర అభివృద్ధి కోసం గతంలో కంప అడిషనల్ పీసీసీఎఫ్ సువర్ణ, అడిషనల్ పీసీసీఎస్ ఫర్గీన్, భద్రాద్రి కొత్తగూడెం సీసీఎఫ్ భీమా నాయక్, అప్పటి మహబూబాబాద్ కలెక్టర్ శశాంక, డీఎఫ్‌ఓ రవికిరణ్, ప్రస్తుత డీఎఫ్‌వో బత్తుల విశాల్, గూడూరు ఎఫ్‌డీవో చంద్రశేఖర్‌రావు, వరంగల్ డీఎఫ్‌వో అపర్ణలు సందర్శించారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

> విశాలమైన అడవులకు నెలవు
> వన్యప్రాణుల మనుగడకు అనువైన ప్రాంతం
> పర్యాటకులను ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు
> అభివృద్ధి చేస్తే మరింత ఆదరణ

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి
మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు, గూడూరు



గూడూరు అటవీశాఖ రేంజ్ పరిధిలో ఉన్న పులిమడుగు అటవీ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. కొంగరిగిద్ద నుంచి పులిమడుగు వరకు రహదారిని ఏర్పాటు చేయాలి. పర్యాటకులకు ట్రెక్కింగ్, బర్డ్‌వాచ్, సఫారీ, బోటింగ్, వసతి సౌకర్యం కల్పించాలి. పులిమడుగులో పర్యాటకుల సందడి పెరిగితే అటవీశాఖకు అదాయం సమకూరనుంది.

పులిమడుగు జీవ వైవిధ్యానికి కేంద్రం
ఎఫ్ఆర్వో , మహబూబాబాద్ జిల్లా



పులిమడుగులోని పచ్చని వాతావరణం సకల ప్రాణుల ఆవాసానికి అనుకూలంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో నీటిఊటలు, వాగులు, వంకలు, అరుదైన వృక్షశిలాజాలు ఉన్నాయి. ఇది శాకాహార జంతువులతో పాటు క్రూర జంతువులకు కూడా ఆవాసంగా ఉంది. పులిమడుగును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే అటవీశాఖ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఇప్పటికే పులిమడుగులో క్యాంపెయిన్ సైట్, నీటికుంటలు, సోలార్ బోర్‌ను ఏర్పాటు చేశాం.



పులి మడుగులో బోటింగ్ చేస్తున్న అటవీ శాఖాధికారులు



పులిమడుగులో క్యాంపెయినింగ్ సైట్‌ను ప్రారంభిస్తున్న అటవీశాఖ ఉన్నతాధికారులు (ఫైల్)



పులిమడుగులో పర్యటిస్తున్న అటవీశాఖ అధికారులు

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

వరంగల్ మెడికల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేరళలో నిర్వహించిన రీజినల్ స్థాయి హెచ్ఐవీ, ఎయిడ్స్ క్విజ్ పో టీలలో హనుమకొండ జిల్లా విద్యార్థులు తృతీయ బహుమతి సాధించారు. ఈ కాంపిటీషన్‌లో విద్యార్థులు విధాత్రి, ఖలీముల్లా బహుమతిలో భాగంగా రూ.20వేల నగదు, ప్రశంసా పత్రం అందుకున్నారు. విజేతలను, తోడ్పాటు అందించిన మేనేజర్ స్వప్న మాధురిలను హనుమకొండ డీఎంహెచ్ఓ ఏ.అప్పయ్య, అదనపు డీఎంహెచ్ఓ మదన్‌మోహన్‌రావు అభినందించారు.



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు



ములుగురోడ్‌లోని సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో కొలువుదీరిన దత్తాత్రేయుడు

గురువులకే గురువు.. గురుదత్తుడు

- 15న దత్త జయంతి.. వేడుకలకు దత్తక్షేత్రంలో ఏర్పాట్లు
- పౌర్ణమి హోమం, అన్నప్రసాద వితరణ
- భక్తులతో 54 సార్లు దత్తస్థవ పారాయణం

ఆధ్యాత్మికం

వరంగల్ కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆది గురువు గురువులకే గురువు.. అత్రి అనసూయ మాతల పుత్రుడు దత్తాత్రేయుడు. యోగా మూర్తిగా నిరంతరం భక్తులను అనుగ్రహించే దత్తుడి జయంతి రోజైన ఈ నెల 15న వరంగల్ ఉమ్మడి జిల్లాలో దత్తాల యాల్లో, సాయిబాబా దేవాలయాల్లో గురు పరంపరల ఆశ్రమాలలో అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. మార్గశిర మాసం కృత్తికా నక్షత్రం పౌర్ణమి రోజున దత్తాత్రేయ స్వామి జన్మదినం సందర్భంగా స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు, హోమాలు, అలంకరణలు, భజనలు, హారతులు, అన్నదానాలు నిర్వహించడానికి ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు.

తైలంతో అభిషేకం విశేష ఫలం

దత్తాత్రేయ స్వామికి నువ్వుల నూనెతో అభిషేకం నిర్వహిస్తే విశేష అనుగ్రహం కలుగుతుందని, మంచి జరగడం కోసం, అనారోగ్యాల బారి నుంచి కాపాడుకోవడం కోసం పౌర్ణమి రోజున నువ్వుల నూనెలో ముఖం చూసుకొని ఆ తైలంతో దత్తాత్రేయ స్వామికి అభిషేకం చేయాలని, దాంతో విశేషఫలం కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. దత్తా.. దత్తా.. అని స్మరణ చేస్తే సంతుష్టుడయ్యే మూర్తి గా దత్తాత్రేయుడిని ఆరాధిస్తారు. స్వామికి భజనలు, నామస్మ రణలంటే ప్రీతి. గురు పరంపరలో ఆది గురువుగా ప్రసిద్ధికెక్కిన అవదూతగా దత్తాత్రేయస్వామిని గురువుగా కొలుస్తారు.

దత్తక్షేత్రంలో వేడుకలు

రాష్ట్రంలోనే స్థిరమూర్తిగా కూర్చొని ఉన్న దత్తాత్రేయస్వామి ములుగురోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో కొలువు దీరాడు. ఏటా దత్తజయంతి రోజున ఇక్కడ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆదివారం 15న ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో తైలాభిషేకాలు, హోమంతో పాటు 54 సార్లు శ్రీదత్తస్థవ పారాయణంనిర్వహిస్తారు. మహా అన్నప్రసాద వితరణను కూడా ఏర్పాటు చేశారు. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని సాయిబాబా దేవాలయాలు, గురు ఆశ్రమాల్లో 15న దత్త జయంతి వేడుకలు, హారతులు, అన్నదానం, హోమాలు, అభిషేకాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

నారుమడికి జెండా అండ



పక్షుల నుంచి నారుమడిని కాపాడుకునేందుకు పార్టీ జెండాలను ఏర్పాటు చేసి తన అభిమానాన్ని చాటుకున్నాడు ఓ రైతు. కేసముద్రం మండలంలోని తాళ్లపూసపల్లి శివారులో మహబూబాబాద్ వెళ్లే రహదారి వెంట ఓ నారుమడికి నాలుగువైపులా కాంగ్రెస్ పార్టీ జెండాలను ఏర్పాటు చేశాడో రైతు. స్వతహాగా కాంగ్రెస్ అభిమాని అయిన సదరు రైతు.. తనకే కాదు నారుమడికి కూడా అభయ 'హస్తం' అన్నట్టుగా పార్టీ జెండాలను ఏర్పాటు చేశాడంటూ దారినపోయేవారు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

- కేసముద్రం, ఆంధ్రజ్యోతి

బహుముఖ ప్రజ్ఞాశాలి.. వలస పైడి

- వ్యాఖ్యాతగా, కవిగా రాణిస్తున్న ఉపాధ్యాయుడు
- అర్ధాంగి జ్ఞాపకాలతో 'మాఇంటి బతుకమ్మ' పుస్తక ప్రచురణ
- విద్యాశాఖ, పలు ప్రభుత్వ కార్యక్రమాలకూ సమన్వయకర్త



మన టీవీ, యూ ట్యూబ్‌లో పాఠాలు బోధిస్తున్న పైడి

కీర్తి పతాక

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆయన భావిపౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయుడు. సమాజాన్ని నిర్దేశించే సామాజిక సాహితీవేత్త. టీచర్ వృత్తిలో కొనసాగుతూనే దూరదర్శన్ విద్యా సంబంధ కార్యక్రమాలు, ఆకాశవాణిలో పలు కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా, సాహితీ కార్యక్రమాలకు సమన్వయకర్తగా, నాటకాల్లో పాత్రధారిగా, కవిగా, రచయితగా బహుముఖ రంగాల్లో ప్రతిభను చాటుతున్నారు. ఆయనే హనుమకొండ జిల్లా కేంద్రంలోని మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు వలస పైడి. కరోనా సమయంలో పైడి పేరుతో యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించి 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు 72 పాఠాలను రూపొందించి బోధించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని అంబాల పక్కనున్న శ్రీరాములపల్లిలో వలస ఉప్పలయ్య, కట్టమ్మ దంపతులకు జన్మించిన పైడి అక్కడి ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం, అంబాల జడ్పీహెచ్ఎస్‌లో 6 నుంచి టెన్త్ వరకు పూర్తి చేశారు. ఆరో తరగతిలోనే సాహిత్యంపై మక్కువ పెంచుకున్న పైడి.. శ్రీరాముల పల్లిలోని భజన మండలి ప్రదర్శించే నాటకాలకు సాహిత్యం అందించారు. అంతేకా దు ఆరో తరగతిలోనే లవకుశ నాటకంలో రైతు పాత్ర వేశారు. వరంగల్‌లోని విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాల, కడప జిల్లా లోని ప్రొద్దుటూర్‌లో ఉపాధ్యాయ పండిత శిక్షణ అనంతరం 1996లో వరంగల్ మట్టెవాడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు.

11 పుస్తకాల రచన

వలస పైడి వ్యాఖ్యాతగానే కాకుండా కవి, రచయిత గాను ఖ్యాతిగడిస్తు న్నాడు. సామా జిక స్పృహ కలిగిన కవిగా రాణిస్తూ 11 పుస్తకాలను ఆయన రచించారు. తన అర్ధాంగి సునీత మరణించగా ఆమె గుర్తులను 'మా ఇంటి బతుకమ్మ'గా పదిలపరుచుకున్నారు. 'ఆచార్య దేవోభవ' పేరుతో 5 బాలల నాటికలను పుస్తకంగా రచించారు. 'మా పల్లె పచ్చబడ్డది' అనే సైన్స్ నేపథ్యంతో ఉన్న నాటికి రాష్ట్ర స్థాయిలో ప్రదర్శింపబడింది. 'ఆకురా లిన వసంతం' అనే పరిశోధానత్మక పుస్తకంతో పాటు 'మా నాయిన' అనే గేయ కవిత్వం, 'కొత్త పొద్దు', 'తెలంగాణ జయ కేతనం' పేరుతో తెలంగాణ ఆవిర్భావం సందర్భం పై పుస్తకాలు రాశారు. ఇలా సాహిత్యంలోని అన్ని కోణాలను స్పృశిస్తూ రచనలు చేస్తున్నారు.

విద్యా శాఖ కార్యక్రమాలకు ఆయనే వ్యాఖ్యాత

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏ కార్యక్రమం నిర్వహించాలన్నా వ్యాఖ్యాతగా వలస పైడి ఉండాల్సిందే అంటే అతిశయోక్తి కాదు. 1997లో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో వ్యాఖ్యాతగా అరంగేట్రం చేసిన పైడి వేలాది కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.

టీశాట్ (మన టీవి)లో లైవ్ లెసన్ ప్రజెంటర్‌గా పనిచేశారు. ఇవే కాకుండా ప్రభుత్వం నిర్వహించిన జిల్లా స్థాయి కాకతీయ ఉత్సవాలు, ఓరుగల్లు కళావైభవాలు కార్యక్రమాలకు వ్యాఖ్యానం అందించారు. జిల్లాలో నిర్వహించే వివిధ సాహి తీ సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు, ఉగాది పండుగ వేళ దూదర్శన్‌లో నిర్వహించే కవి సమ్మేళనానికి, వేయి స్తంభాల గుడిలో నిర్వహించే కవి సమ్మేళనాలకు వలస పైడియే వ్యాఖ్యాతగా ఉంటారు.

వరంగల్ ఆకాశవాణిలో డాక్టర్ అంపశయ్య నవీన్ రాసిన బాంధవ్యాలు అనే నాటికను 18 ధారావాహికాల్లో ఆయా పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసి వ్యాఖ్యానం చేశారు. అలాగే 42 ధారావాహికాల్లో 101 బాలల కోసం భారత కథలు వ్యాఖ్యానం చేశారు. అలాగే అనేక నాటకాల్లో వివిధ పాత్రలకు ఆయన ప్రాణం పోశారు.

సీఎంలు, మంత్రుల కార్యక్రమాలకు..

జిల్లాకు వచ్చే ముఖ్యమంత్రులు, మంత్రుల కార్యక్రమాలకు పైడినే అధికారులు వ్యాఖ్యాతగా ఎంచుకుంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ములుగు రాయినిగూడెంలో నిర్వహించిన కార్యక్రమానికి వ్యాఖ్యానం చేశారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన హయాంలో నర్సంపేటలో నిర్వహించిన గ్రామజ్యోతి కార్యక్రమానికి పైడినే వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

అవార్డులెన్నో..

2017లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సత్కారం పొందారు. రెండు సార్లు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా గౌరవాన్ని దక్కించుకున్నారు. ఢిల్లీలో దళిత సాహిత్య అకాడమీ వారి ఉత్తమ కవిగా అవార్డు అందుకున్నారు. లయన్స్, రోటరీ క్లబ్‌ల నేషనల్ బిల్డర్ అవార్డు పొందడంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల నుంచి వలస పైడి అనేక మార్లు సత్కారాలు అందుకున్నారు.



అప్పటి డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు తీసుకుంటున్న పైడి

ఎల్డర్ లైన్ 14567

- ఆదరణకు నోచుకోని వృద్ధుల కోసం ఫోన్‌నెంబర్
- తక్షణమే సాయం అందించేలా ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రెవెన్యూ డివిజన్లు, జిల్లాల స్థాయిలో ప్రత్యేక ట్రిబ్యునళ్లు
- వయోవృద్ధుల సంరక్షణ చట్టం అమలుకు విభాగం ఏర్పాటు

మీ కోసం

బాలసముద్రం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మన సంస్కృతిలో కుటుంబంలోని పెద్దల పట్ల ఎంతో గౌరవం ఉండేది. కానీ సామాజికంగా, ఆర్థికంగా వస్తున్న మార్పుల కారణంగా ఆ గౌరవం సన్నగిల్లుతోంది. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై కుటుంబం అంటే భార్యా, భర్త, పిల్లలు మాత్రమే అనే పరిస్థితి వచ్చింది. చివరకు తమను పెంచిపెద్ద చేసిన.. ప్రయోజకులను చేసిన అత్తామామ, తల్లిదండ్రులకు వారింట్లో స్థానంలేకుండా పోయింది. ఫలితంగా ఆ తల్లిదండ్రులు చరమాంకంలో నిర్లక్ష్యానికి గురవుతున్నారు. నేటి సమాజంలో చాలా మంది వయోవృద్ధులు తమ పిల్లల నుంచి సరైన ఆదరణకు నోచుకోక.. ఆర్థిక ఇబ్బందులు, ఒంటరితనం, దూషణలు, ఎన్నో అవమానాలు భరిస్తూ బతుకుతున్నారు. ఇక జీవిత భాగస్వామిని కోల్పోయిన, సంతానం లేని వృద్ధుల పరిస్థితి అయితే ఇంకా దారుణంగా ఉంటోంది. అలాంటి వృద్ధుల సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. చట్టాలను అమలు చేస్తున్నాయి. రాజ్యాంగంలో వయో వృద్ధులకు కూడా ప్రాథమిక హక్కులున్నాయి. హిందూ దత్తత పోషణ చట్టం ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత సంతానంపైనే ఉంటుంది. అంతేగాక తల్లిదండ్రులు తమను తాము పోషించుకోలేని స్థితిలో పిల్లల నిరాదరణకు గురైనప్పుడు చట్టం ద్వారా ప్రభుత్వం వారి పోషణకు అయ్యే ఖర్చులను పిల్లల నుంచి ఇప్పిస్తోంది.



వయో వృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రభుత్వ శాఖ

చట్టంపై అవగాహన లేకపోవడం, చట్టం నిబంధనల గురించి తెలియకపోవడంతో వయో వృద్ధులు ఎన్నోసమస్యలతో నిస్సహాయంగా బాధపడుతున్నారు. 2007లో రూపొందించిన తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2011లో నియమావళి రూపొంది అములులోకి వచ్చింది. చట్టాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా విభాగాన్ని ఏర్పాటు చేసింది. వయో వృద్ధుల వ్యథను తీర్చేందుకు, గౌరవంగా జీవించేందుకు అవసరమైన ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం ఆ విభాగం ప్రధాన కర్తవ్యం. మారుమూల పల్లెల్లో నివసిస్తున్న వయో వృద్ధులకు చట్టం గురించి తగు అవగాహన కల్పించి అవసరమైన సౌకర్యాలు కల్పించే బాధ్యత అధికారులపై ఉంటుంది.

ఎల్డర్ లైన్, ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు

నిర్లక్ష్యానికి గురైన వయోవృద్ధుల పరిస్థితులను చక్క దిద్దేందుకు వారికి అవసరమైన సామాజిక భద్రత, ఆరోగ్య పరిరక్షణ, సురక్షితమైన ఆశ్రయం, బలవర్ధకమైన ఆహారం దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఆసరా పింఛన్, ఆరోగ్య శ్రీ లాంటి పథకాలను అమలు చేస్తోంది. బాధితులైన వయో వృద్ధులకు త్వరితగతిన న్యాయం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రెవెన్యూ డివిజన్లలో ట్రిబ్యూనళ్లను, జిల్లా స్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యూనళ్లను ఏర్పాటు చేసింది. అంతేగాక బాధిత వృద్ధులకు సత్వరం సులభంగా సహాయం అందించడానికి ప్రత్యేకమైన ఉచిత సహాయక ఫోన్ నంబర్ 14567 (ఎల్డర్‌లైన్)ను ఏర్పాటు చేసింది. సాధారణంగా తల్లిదండ్రులు వృద్ధాప్య దశకు చేరుకున్నాక తమ పేరున ఉన్న స్థిరాస్తులను తమ పిల్లల పేరున మార్పిడి చేస్తారు. ఆస్తి మార్పిడి అయ్యాక కొంత కాలానికి పిల్లలు తమ తల్లిదండ్రుల పోషణ, బాగోగులను పట్టించుకోకుండా నిర్దయగా ప్రవర్తిస్తే విధిలేని పరిస్థితుల్లో వారు ప్రభుత్వ సహాయాన్ని కోరవచ్చు. ఎల్డర్‌లైన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించినా లేదా సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారిని కలిసి సమస్యను విన్నవించుకున్నా పరిష్కరించి తగిన న్యాయం చేస్తారు. పిల్లల పేరున బదిలీ చేసిన ఆస్తిని తిరిగి తల్లిదండ్రుల పేరున మార్పిడి చేస్తారు. ఇది ఆస్తిని అనుభవించే వారసులందరికీ చట్టం వర్తిస్తోంది.

వృద్ధుల సంక్షేమం కోసం సంఘం ..

వయో వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వ పరంగానే కాకుండా స్వచ్ఛందంగా సేవలందించేందుకు సామాజిక స్పృహకలిగిన పలువురు రిటైర్డ్ ఉద్యోగులు ముందుకొచ్చారు. రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య అధ్యక్షుడిగా.. తేరాల యుగంధర్ ప్రధాన కార్యదర్శిగా సుమారు 100 మంది రిటైర్డ్ ఉద్యోగులు కలిసి హనుమకొండ జిల్లా వయో వృద్ధుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేశారు. తమవంతు కర్తవ్యంగా నగరంలోని రోడ్లవెంట చలిలో వణుకుతున్న అనా థ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు. లయన్స్‌క్లబ్ సహకారంతో కంటి చికిత్స శిబిరాలు, డీఎంహెచ్‌వో, అయుష్ డిపార్ట్‌మెంట్ సహకారం తో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. వరంగల్‌లోని ఎంజీఎం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చే వృద్ధులకు ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేయాలం టూ సంక్షేమ సంఘం నాయకులు చేసిన కృషి ఫలితంగానే ప్రత్యేక ఓపీ ని ఏర్పాటు చేశారు. అంతేగాక సమస్యల పరిష్కారం కోసం పోలీసు స్టేషన్‌కు వచ్చే వృద్ధుల సౌకర్యార్థం చట్టపరంగా ప్రతీ పోలీసు స్టేషన్‌లో వృద్ధ మిత్ర కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవిస్తున్నారు.

వృద్ధులు పనికిరాని వారు కాదు..



వృద్ధులను పనికి రాని వారుగా పరిగణించవద్దు. జీవితంలో వారు గడించిన అనుభవాలు ఎన్నో ఉంటాయి. అంతేగాక జ్ఞాన సంపన్నులై ఉంటారు. సమాజం వారి సేవలను ఉపయోగించుకోవాలి. రిటైర్ అయిన ఉద్యోగులంతా తమ ఉన్నతికి అవకాశం కల్పించిన సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం శాయశక్తుల కృషి చేయాలి.

దామెర నర్సయ్య, రిటైర్డ్ డీఎస్పీ, వృద్ధుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 13 డిసెంబరు 2024



తిరువెంబావై... ధనుర్మాసంలో శివ వ్రతం

ధనుర్మాసంలో 'తిరుప్పావై' పాశురాలకు ఉన్న ప్రాధాన్యత సర్వవిదితం. ఆండాళ్ పాడిన ఆ పాశురాలను వైష్ణవ సంప్రదాయానికి పట్టుకొమ్మలుగా భావిస్తారు. కాగా అదే కోవలోకి వచ్చే శైవ పాశురాలు కూడా ఉన్నాయి. అవే మాణిక్య వాచకర్ రచించిన 'తిరువెంబావై' పాశురాలు. మాణిక్య వాచకర్ శివుడికి మహా భక్తుడు. దివ్య భక్తిపూరితమైన 'తిరువాసగం'ను ఆయన చెబుతూ ఉంటే... సాక్షాత్తూ శివుడే వాటిని రాశాడని ప్రతీతి. తిరుప్పావై - మార్గళి (శ్రీ) వ్రతం గురించి వివరిస్తే, తిరువెంబావై 'శివవ్రతా'న్ని ప్రబోధిస్తుంది. ధనుర్మాస ఉషోదయ కాలంలో... శివవ్రతంలో భాగంగా చల్లని నీటిలో స్నానం చేయడానికి కొందరు యువతులు ఇంటింటికీ వెళ్ళి, తోటి చెలులను మేలుకొలుపడానికి పాడిన పాశురాలు దీనిలో చోటు చేసుకున్నాయి. ఈ కావ్యం సారాంశం వైష్ణవులు ఆచరించే మార్గళి వ్రతాన్ని పోలి ఉంటుంది. ఇందులోని పాశురాలు కూడా... ఆండాళ్ తన చెలికత్తెలను మేలుకొలపడానికి వెళ్ళినప్పుడు పాడిన రీతిలోనే ఉంటాయి. తిరుప్పావై... వైష్ణవ గ్రంథరాజమైన నాలాయిర ప్రబంధంలో చోటు చేసుకోగా, తిరువెంబవై... మాణిక్యవాచకార్ 'తిరువాసగం'లో చోటు దక్కించుకుంది. తిరుప్పావైలో ముప్ఫై పాశురాలు ఉండగా, తిరువెంబావైలో ఇరవై పాశురాలు, వాటికి అనుబంధంగా మరో పది గీతాలు ఉంటాయి. అయితే తిరుప్పావై అంతటి ప్రాచుర్యం తిరువెంబావై పొందలేదు.

16 నుంచి ధనుర్మాసం

పోలికలు, తేడాలు...

తిరుప్పావై, తిరువెంబావై పాశురాల్లో చాలా పోలికలు కనిపిస్తాయి. రెండిటిలోనూ ప్రకృతి వర్ణన, భక్తి, జ్ఞాన మార్గాలను సూచించడం, ఉపనిషత్తుల సారాన్ని పొందుపరచడం జరిగింది. శ్రీరంగనాథుణ్ణి ఉద్దేశించి ఆండాళ్ పాడిన పాశురాలు... తిరుప్పావై కాగా, చిదంబరేశ్వరుణ్ణి కీర్తిస్తూ మాణిక్య వాచకర్ ఆలపించిన పాశురాలు... తిరువెంబావై. వీటిలో ఇరవై పాశురాలను తిరువణ్ణామలైలో కొలువుతీరి ఉన్న అరుణాచలేశ్వరుని సన్నిధిలో, మరో పది గీతాలను మదురైకి సమీపంలోని తిరుప్పరుందరైలో ఆయన గానం చేశారని చెబుతారు. తిరుప్పావైలో ఆండాళ్ తన స్నేహితురాళ్ళతో మార్గళి వ్రతం ఆచరించడం కోసం ఉషఃకాలంలో ఇంటింటికీ వెళ్ళి వారిని మేలుకొలుపుతుంది. తిరువెంబావైలో కూడా కొందరు యువతులు తమతోటి వారిని ఇదే విధంగా మేలుకొలపడం కనిపిస్తుంది. అయితే ఈ రెంటికీ తేడా ఉంది. తిరుప్పావైలో యువతులు శ్రీరంగనాథుణ్ణి కీర్తించినట్టు... తిరువెంబైవైలో యువతులు శివుణ్ణి ప్రార్థిస్తారు. అక్కడ వారు శ్రీరంగనాథుణ్ణి భౌతికమైన కోరికలు కోరుకుంటే... ఇక్కడ వీరు శివుడి అనుగ్రహాన్ని ఆకాంక్షిస్తారు. తిరుప్పావైలో శ్రీరంగనాథుణ్ణి చేరుకోవడానికి నీలాదేవి అనుగ్రహం కోసం ఆమెను స్తుతించినట్టే... తిరువెంబావైలో యువతులు పరాశక్తి అయిన ఉమాదేవి అనుగ్రహం కోరుతారు, తమకు శివ సాన్నిధ్యాన్ని అందించాలని ప్రార్థిస్తారు. జీవులను 'మనోన్మని, సర్వభూతదమని, బలప్రమధని, బలవికరణి, కలవికరణి, కాళీ, రౌద్రి, జ్యేష్ఠ, వామ' అనే తొమ్మిది రకాల తామస శక్తులు ఆవహించి ఉంటాయి. వాటిని పారద్రోలి, అజ్ఞానం నుంచి మానవులను మేలుకొలిపి, మాలిన్యం నుంచి బయటపడడానికి 'జ్ఞానం' అనే చన్నీటి స్నానం చేయడమే మార్గం అనే భావాన్ని తిరువెంబావై పాశురాల్లో అంతర్లీనంగా చెప్పడం జరిగింది.



విశేషం

పరమాచార్యుల ద్వారా ప్రాచుర్యం

శాస్త్రానుసారం శివ కేశవులకు ప్రీతికరమైనది ధనుర్మాసం. ఈ మాసంలోని ఆరుద్ర నక్షత్రం రోజున పరమ శివుడు అరుణాచలంలో అగ్నిలింగంగా ఆవిర్భంచాడని శివపురాణంతో సహా పలు గ్రంథాలు పేర్కొంటున్నాయి. శివ పార్వతుల కల్యాణాన్ని ఈ మాసంలోని ఏదో ఒక సోమవారం నిర్వహించే సంప్రదాయం ఉంది. ధనుర్మాసంలో ఉషఃకాల వ్రతంగా 'శివవ్రతం' ఆచరిస్తారు. ఈ వ్రతం ఆచరించే సమయంలో తిరువెంబావైని పఠించడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీమద్రామానుజుల పరంపర ద్వారా దక్షిణాదిలో తిరుప్పావై ప్రాచుర్యం పొందింది. ఈ విధానం తెలుగునాట కుడా ఆనవాయితీగా మారింది. కానీ తమిళ శైవాచార్యులు తగిన ప్రచారాన్ని కల్పించకపోవడంతో మన ప్రాంతాల్లో తిరువెంబావై గురించి ఎక్కువ మందికి తెలియదు. ధనుర్మాసంలో తిరుప్పావై, తిరువెంబావై... ఈ రెండూ అవశ్య పఠనీయాలుగా పేర్కొని, వాటికి ప్రాచుర్యం కల్పించినవారు కంచి పరమాచార్యులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి. మహా మహిమాన్వితమైన 'తిరువాసగం' గురించి, దానిలో పొందుపరిచి ఉన్న తిరువెంబావై, దాని ఆవిర్భావం గురించి భగవాన్ శ్రీ మహర్షి విపులంగా వివరించారు. కంచి పీఠంలో, శ్రీరమణాశ్రమంలో.. ధనుర్మాస కాలంలో తిరుప్పావై, తిరువెంబావై... ఈ రెండిటినీ గానం చేస్తారు.

• ఆయపిళ్ళ రాజపాప

సహజయోగ

యోగసాధనకు మార్గశిరం...

భగవద్గీతలో శ్రీకృష్ణుడు 'మాసానాం మార్గశీర్షోహం' అన్నాడు. అంటే 'మాసాలలో మార్గశిర మాసాన్ని నేను' అని అర్థం. మరి ఈ మాసానికి ఉన్న విశిష్టత ఏమిటి? మార్గశిర మాసాన్నే శ్రీకృష్ణుడు ప్రత్యేకంగా ఎందుకు చెప్పాడు? 'శీర్షము' అంటే శిఖరము లేదా తల. 'మార్గము' అంటే దారి. 'మార్గశీర్షము' అంటే శిఖరానికి తీసుకుపోయే దారి. మన సూక్ష్మ శరీరంలో శీర్షం అంటే తల మాడు భాగంలో ఉండే సహస్రారం. దాని దగ్గరకు తీసుకువెళ్ళే దారి... సుషుమ్న నాడి. మన వెన్నెముక అడుగు భాగాన ఉండే కుండలినీ శక్తి... ఈ నాడి ద్వారానే సహస్రారానికి చేరుతుంది. దానికి అధిష్ఠాన దేవత శ్రీ మహాలక్ష్మి. అందుకే మార్గశిర మాసంలో ప్రతి గురువారం లక్ష్మీ దేవికి పూజలు చేస్తారు. అంతే కాకుండా... సుషుమ్న నాడి ద్వారా మానవులందరిలో ధర్మాన్ని, సంతృప్తిని, సమతుల్యతను, సత్యాన్వేషణను, జీవ పరిణామ శక్తిని శ్రీమహావిష్ణువు పరిరక్షిస్తాడు. అందుకే "మాసాలలో నేను మార్గశీర్షాన్ని" అని శ్రీకృష్ణుడు చెప్పాడు.

మనలోని ధర్మానికి ఆధారం ఆయనే...

మన సూక్ష్మశరీరంలో మూడు నాడులు ఉంటాయి, ఎడమవైపున ఉన్నదాన్ని 'ఇడా నాడి' అని, కుడివైపు నాడిని 'పింగళా నాడి' అనీ, మధ్యలో ఉండే నాడిని 'సుషుమ్న నాడి' అని పిలుస్తారు. ఇడా, పింగళ నాడులు మనలో సహానుభూత నాడీ వ్యవస్థకు, సుషుమ్న నాడి మనలోని ఆధ్యాత్మిక ఉన్నతికి దోహదపడే పర సహానుభూతి నాడీ వ్యవస్థకు బాధ్యత వహిస్తాయి. అమీబా నుంచి మానవ దశ వరకూ మన పరిణామ క్రమానికి ఈ సుషుమ్న మార్గమే కారణం. దాని వల్లనే మనం మానవులం అయ్యాం. నాభీ చక్రం నుంచి మానవులలో సత్యాన్వేషణ మొదలవుతుంది. జంతువులు ఆహారాన్ని, మానవులు దైవాన్ని వెతకడానికి ఈ చక్రమే కారణం. దైవాన్ని అన్వేషించే శక్తి మానవుల్లో అంతర్లీనంగా ఉంటుంది. ఆ అన్వేషణ నెరవేరేవరకూ అతను సంతృప్తి చెందలేడు. 'యోగక్షేమం వహామ్యహం' అని శ్రీకృష్ణుడు చెప్పినట్టు... భగవంతుడితో యోగం పొందిన తరువాతే మానవుడికి అన్ని వైపుల నుంచి పోషణ లభిస్తుంది. అతను సంతృప్తి చెందుతాడు అప్పటివరకూ ఏదో రూపంలో సత్యం కోసం అన్వేషణ చేస్తూనే ఉంటాడు. మన సూక్ష్మ శరీరం అంతటా విష్ణుమూర్తి ఒక్కో చక్రం దగ్గర ఒక్కో రూపంలో ఉంటాడు. నాభి చక్రం దగ్గర శ్రీమన్నారాయణుడిగా, అనాహత చక్రం దగ్గర శ్రీరామునిగా, విశుద్ధి చక్రం దగ్గర శ్రీకృష్ణుడిగా, ఆజ్ఞా చక్రం దగ్గర మహా విష్ణువుగా, సహస్రారం దగ్గర కల్కి రూపంలో ఉంటాడు. వీటిలో కల్కి అవతారం ఇంకా భూమి మీదకు రావలసి ఉంది. మనలో లోపల ఉన్న ధర్మానికి ఆధారం మహా విష్ణువు. మనలో ధర్మం ఉన్నప్పుడే మనకు సమతుల్యత లభిస్తుంది. దాని ద్వారా వివేకం ఏర్పడుతుంది. అలాంటి మానవులు కుండలినీశక్తి ఉత్థానానికి చాలా అనుకూలమైనవారు. ఆత్మసాక్షాత్కారం పొంది ధ్యానం చేస్తే, కుండలినీ శక్తి ఉత్థానమై, పరిపూర్ణమైన నిరానంద అనుభూతి ప్రసాదిస్తుంది.



జీవ పరిణామక్రమం... అవతారాలు

మానవుల్లో ధర్మాన్ని పరిరక్షించి, వారిని పరిణామక్రమంలో ముందుకు తీసుకువెళ్ళినది విష్ణువు. ఆ కార్య నిర్వహణకోసమే ఆయన దశావతారాలు ధరించాడు. వాటిని గమనిస్తే... మొదటిది మత్స్యావతారం. సైన్స్‌ప్రకారం కూడా జీవరాశి మొదట నీటిలోనే ఏర్పడింది. వాటిలో కొన్ని జలచరాలు నేలమీదకు వచ్చి నడవడం మొదలుపెట్టాయి. అదే కూర్మావతారం. అలా నడవడం మొదలుపెట్టిన జీవులు మొదట నాలుగు కాళ్ళతో నడిచాయి అదే వరాహావతారం. వాటిలో కొన్ని రెండు కాళ్ళతో నడవడం ప్రారంభించాయి. కానీ వాటి పశులక్షణాలు పూర్తిగా పోలేదు. అదే నరసింహావతారం. అంటే సగం మనిషి, సగం సింహం. వాటి నుంచి కురచగా ఉండే మానవజాతి మొదలయింది. అది వామనావతారం. ఆ తరువాత పూర్తిస్థాయి మానవుడు రూపు దిద్దుకున్నా... క్రూరత్వం సంపూర్ణంగా పోలేదు. అది పరశురామావతారం. అనంతరం పూర్తిస్థాయి మానవుడు రూపుదిద్దుకున్నాడు. అదే రామావతారం. అయితే మానవులు ధర్మాన్ని కచ్చితంగా ఆచరించాలనే ఆలోచనతో... సంఘంలో అందరితో కలిసి ఆనందించడం లేదు. వారికి అది నేర్పించడానికి వచ్చిన అవతారమే శ్రీకృష్ణావతారం. అంటే పరిణామక్రమంలోని ప్రతి స్థాయిలో... ధర్మానికి భంగం కలుగుతున్నప్పుడల్లా... అధర్మాన్ని ఖండించి, ధర్మమార్గంలో ఉన్న జీవులను ఉద్ధరించడానికి భగవంతుడు స్వయంగా ఒక రూపం ధరించి భూమి మీదకు వస్తున్నాడు.

ఎప్పుడూ వర్తమానంలోనే ఉండాలి...

మానవ పరిణామ క్రమంలో తదుపరి ఉన్నత దశ... ఆత్మ సాక్షాత్కారం పొందిన యోగులుగా మారడం. ఆత్మ సాక్షాత్కారం పొందిన వ్యక్తి 'నేను ఈ శరీరాన్ని కాదు ఆత్మను' అనే విషయాన్ని తన కేంద్ర నాడీవ్యవస్థలో కలిగే అనుభూతి ద్వారా తెలుసుకుంటాడు. అలా తెలుసుకోవాలంటే... మనలోపల సుషుమ్న నాడి పూర్తిగా తెరుచుకొని ఉండాలి. అది ఎంత తెరుచుకుంటే అంత ఎక్కువగా కుండలినీ శక్తి పైకి వచ్చి, సూక్ష్మ శరీరానికి అవసరమైన పోషణను ఇస్తుంది. సుషుమ్న నాడి విశాలంగా తెరుచుకొని ఉండాలంటే... మనం ఎల్లప్పుడూ వర్తమానంలో ఉండాలి. పని మీదనే మన ధ్యాస ఉండాలి. తీసుకొనే ఆహారం సమతుల్యతతో ఉండేలా చూసుకోవాలి. ఏది చేసినా అతి కాకుండా జాగ్రత్త వహించాలి. అరిషడ్వర్గాలలో మూడవదైన లోభం మన నాభీ చక్రాన్ని దెబ్బతీస్తుంది. దానివల్ల మన లోపల ఉన్న సుషుమ్న నాడి కూడా బలహీనపడుతుంది. లోభాన్ని అధిగమించాలంటే... దాతృత్వం కలిగి ఉండాలి. మన జీవనానికి అవసరమైన ధనాన్ని ధర్మమార్గంలోనే సంపాదించాలి. సంపాదించిన దానితో సంతృప్తి పొంది, ధార్మిక జీవనాన్ని గడపాలి.

దైవచింతనతో గడిపితే...

"సహజ యోగానికి సంబంధించిన ఈ జ్ఞానం అంతా ప్రాచీన కాలంలోని ఆధ్యాత్మిక గ్రంథాలలో ఉంది. కబీర్‌దాసు కూడా తన రచనల్లో దాని గురించి స్పష్టంగా చెప్పారు" అని సహజయోగ ప్రదాత శ్రీమాతాజీ నిర్మలాదేవి పేర్కొన్నారు. అటువంటి ప్రాచీనమైన సహజయోగ సాధనకు మార్గశిరమాసం చాలా అనుకూల సమయం. ఈ మాసంలోనే శ్రీగోదాదేవి ధనుర్మాస వ్రతాన్ని ఆచరించి, శ్రీరంగనాథునిలో ఐక్యమయింది. ఈ మాసంలోనే దత్తజయంతి కూడా వస్తుంది. ఈ మాసం మొదటివారంలో సుబ్రహ్మణ్య షష్ఠి ఉంటుంది. ఆధ్యాత్మికంగా ఈ మాసం ఎంతో విశిష్టమైనది. దైవచింతనతో ఈ మాసాన్ని గడపడం వల్ల పరిపూర్ణమైన ప్రయోజనాలు సిద్ధిస్తాయి.

డాక్టర్ పి. రాకేష్ 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

బిజినెస్

రష్యాతో రిలయన్స్ భారీ డీల్ !

» రోజుకు 5 లక్షల బ్యారళ్ల చమురు దిగుమతికి ఒప్పందం

న్యూఢిల్లీ: భారత-రష్యా ఇంధన బంధం మరింత బలపడుతోంది. గుజరాత్ జామ్‌నగర్‌లోని తన రిఫైనరీకి రష్యా నుంచి పదేళ్ల పాటు రోజుకు ఐదు లక్షల బ్యారళ్ల చమురు దిగుమతి చేసుకునేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్).. రష్యా ప్రభుత్వ నిర్వహణలోని రాస్‌నెఫ్ట్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఇది ఏటా 1,300 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.10 లక్షల కోట్లు)కు సమానం. దుబాయ్ క్రూడ్ కంటే మూడు డాలర్ల డిస్కౌంట్‌తో రష్యా ఈ చమురు సరఫరా చేయనుంది. అవసరమైతే ఈ ఒప్పందాన్ని మరో పదేళ్ల పాటు పొడిగించుకునేందుకు అవకాశం ఉంది. అయితే ఈ ఒప్పందంపై రెండు కంపెనీలు ఇంకా అధికారికంగా నోరు మెదపడం లేదు. తన చమురు దిగుమతులపై యూరోపియన్ యూనియన్ (ఈయూ), అమెరికా ఆంక్షల నేపథ్యంలో రాస్‌నెఫ్ట్, రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో ఈ దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకోవడం విశేషం. కాగా రిలయన్స్ గతంలో రాస్‌నెఫ్ట్‌తో ఏడాది కాలపరిమితితో రోజుకు 3 లక్షల బ్యారళ్ల చమురు సరఫరా చేసేలా ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం రిలయన్స్ జామ్‌నగర్‌లో పూర్తిగా ఎగుమతుల కోసమే రోజుకు 5.8 లక్షల బ్యారళ్ల సామర్థ్యం గల రిఫైనరీని నిర్వహిస్తోంది. దేశీయ అవసరాల కోసం రోజుకు 6.6 లక్షల బ్యారళ్ల సామర్థ్యంతో మరో రిఫైనరీని కూడా నిర్వహిస్తోంది.

తగ్గిన ధరల కాక

నవంబరులో రిటైల్ ద్రవ్యోల్బణం 5.48 శాతం



న్యూఢిల్లీ: దేశంలో ధరల మంట కాస్తంత ఉపశమించింది. అక్టోబరులో 6.21 శాతానికి దూసుకుపోయి అటు ప్రభుత్వంలోను, ఇటు ప్రజల్లోను అలజడి రేకెత్తించిన రిటైల్ ద్రవ్యోల్బణం నవంబరు నెలలో 5.48 శాతానికి దిగి వచ్చింది. ఆహార వస్తువుల ధరల్లో తగ్గుదల ఇందుకు దోహదపడినట్టు ప్రభుత్వ గణాంకాలు తెలుపుతున్నాయి. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) గురువారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఆహార వస్తువుల ధరల విభాగంలో ద్రవ్యోల్బణం అక్టోబరుతో పోల్చితే 10.87 శాతం నుంచి 9.04 శాతానికి తగ్గింది. గత ఏడాది నవంబరులో ఇది 8.70 శాతంగా ఉంది. నవంబరు నెలలో కూరగాయలు, పప్పులు, పప్పు ఉత్పత్తులు, చక్కెర, కన్ఫెక్షనరీ, పళ్లు, పాలు, పాల ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు, రవాణా, కమ్యూనికేషన్, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గాయని ఎన్ఎస్ఓ తెలిపింది. జూలై, ఆగస్టు నెలల్లో సగటున 3.6 శాతం ఉన్న వినియోగ వస్తువుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం సెప్టెంబరులో 5.5 శాతానికి, అక్టోబరులో 6.2 శాతానికి దూసుకుపోయిన విషయం విదితమే. తాజా పరిస్థితిని పరిశీలనలోకి తీసుకున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం అంచనాను 4.5 శాతం నుంచి 4.8 శాతానికి పెంచింది. ఆహార ధరల ఒత్తిడి కారణంగా డిసెంబరు త్రైమాసికంలో కూడా ద్రవ్యోల్బణం అధికంగానే ఉండవచ్చని కూడా పేర్కొంది.

మందగించిన పారిశ్రామికం

మైనింగ్, విద్యుత్, తయారీ రంగాలు మందగించడంతో అక్టోబరు నెలలో పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) వృద్ధి రేటు 3.5 శాతానికి పరిమితమైంది. గత ఏడాది అక్టోబరులో వృద్ధి రేటు 11.9 శాతంతో పోల్చితే పారిశ్రామిక వృద్ధి గణనీయంగా తగ్గినా సెప్టెంబరులో నమోదైన 3.1 శాతంతో పోల్చితే మాత్రం మెరుగుపడినట్టు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ గణాంకాలు వెల్లడించాయి. ఏప్రిల్-అక్టోబరు నెలల మధ్య కాలంలో కూడా ఐఐపీ వృద్ధి రేటు వార్షిక ప్రాతిపదికన 7 శాతం నుంచి 4 శాతానికి క్షీణించింది. అక్టోబరులో గనుల రంగంలో వృద్ధిరేటు 13.1 శాతం నుంచి 0.9 శాతానికి క్షీణించగా తయారీ రంగంలో 10.6 శాతం నుంచి 4.1 శాతానికి, విద్యుత్ రంగంలో 20.4 శాతం నుంచి 2 శాతానికి, యంత్ర పరికరాల విభాగంలో 21.7 శాతం నుంచి 3.1 శాతానికి వృద్ధి రేటు పడిపోయింది. వినియోగ ఆధారిత వర్గీకరణ కింద ఉత్పత్తి కన్స్యూమర్ నాన్ డ్యూరబుల్స్ విభాగంలో కూడా 9.3 శాతం నుంచి 2.7 శాతానికి క్షీణించింది.

మస్క్ @ 447 బిలియన్ డాలర్లు

» ప్రపంచంలో ఈ స్థాయి సంపద కలిగిన తొలి వ్యక్తిగా టెస్లా అధిపతి సరికొత్త రికార్డు
» ఒక్కరోజే 5.33 లక్షల కోట్లు పెరిగిన ఆస్తి
» మొత్తం 37.93 లక్షల కోట్లకు చేరిక



న్యూయార్క్: ప్రపంచ కుబేరుడు, అమెరికన్ విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా అధిపతి ఎలాన్ మస్క్ వ్యక్తిగత సంపద సరికొత్త రికార్డు స్థాయికి పెరిగింది. బ్లూంబర్గ్ బిలియనీర్స్ రియల్‌టైం ఇండెక్స్ ప్రకారం.. బుధవారం మస్క్ ఆస్తి ఏకంగా 62.8 బిలియన్ డాలర్లు (6,280 కోట్ల డాలర్లు = రూ.5.33 లక్షల కోట్లు) పెరిగి మొత్తం 447 బిలియన్ డాలర్లకు(44,700 కోట్ల డాలర్లు= రూ.37.93 లక్షల కోట్లు) చేరుకుంది. ప్రపంచంలో 400 బిలియనీర్ల వ్యక్తిగత సంపద కలిగిన తొలి వ్యక్తి ఈయనే. ఈ ఏడాదిలో మస్క్ నెట్‌వర్త్ 218 బిలియన్ డాలర్ల మేర పుంజుకుంది. ప్రధానంగా గత నెల 5న జరిగిన అమెరికా ఎన్నికల్లో కొత్త అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైనప్పటి నుంచి మస్క్ కంపెనీల షేర్ల ధరలతో పాటు ఆయన ఆస్తి శరవేగంగా పెరుగుతూ వచ్చింది. ఎన్నికల్లో ట్రంప్‌కు మస్క్ గట్టి మద్దతుదారుగా నిలిచారు. ఆయన కోసం భారీగా ఖర్చు కూడా చేశారు. ట్రంప్ ప్రభుత్వంలో మస్క్ కీలక పాత్ర పోషించనుండటం కూడా తన కంపెనీ షేర్లకు గిరాకీ అమాంతం పెంచింది. ట్రంప్ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైనప్పటి నుంచి టెస్లా షేరు ధర 65 శాతం వృద్ధి చెందడమే ఇందుకు నిదర్శనం.

సెన్సెక్స్ 236 పాయింట్లు పతనం

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు గురువారం నష్టాల్లో ముగిసాయి. సెన్సెక్స్ 236.18 పాయింట్లు కోల్పోయి 81,289.96 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 93.10 పాయింట్ల నష్టంతో 24,548.70 వద్ద స్థిరపడింది. ద్రవ్యోల్బణం, పారిశ్రామికోత్పత్తి గణాంకాల విడుదల నేపథ్యంలో మదుపరులు ముందుజాగ్రత్తగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్ అండ్ టీ, హెచ్‌యూఎల్ సహా పలు బ్లూచిప్ కంపెనీల షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, రూపాయి క్షీణత, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ అంశాలూ మార్కెట్ సెంటిమెంట్‌ను కుంగదీశాయి. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 18 నష్టాల్లో ముగిసాయి.

- భారత కరెన్సీ సరికొత్త ఆల్‌టైం కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 5 పైసల నష్టంతో రూ.84.88 వద్ద ముగిసింది. డాలర్ బలోపేతం, ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, ముడి చమురు ధరల పెరుగుదల ఇందుకు కారణమయ్యాయి.
- అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 0.30 శాతం పెరిగి 73.74 డాలర్లకు ఎగబాకింది.

న్యూలాండ్ ల్యాబ్స్‌కు క్యాపిటల్ గ్రూప్ గుడ్‌బై

3.77% వాటా రూ.756 కోట్లకు విక్రయం

న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు చెందిన న్యూలాండ్ లేబొరేటరీస్ నుంచి అమెరికాకు చెందిన క్యాపిటల్ గ్రూప్ పూర్తిగా వైదొలిగింది. న్యూలాండ్‌లో తనకున్న 3.77 శాతం వాటాను రూ.756 కోట్లకు విక్రయించింది. బహిరంగ మార్కెట్లో బల్క్ డీల్స్ ద్వారా ఈ వాటాను ఉపసంహరించుకుంది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. 3.77 శాతం వాటాకు సమానమైన 4.84 లక్షల షేర్లను ఒక్కొక్కటి సగటున రూ.15,618.16కు విక్రయించింది. ఎన్ఎస్ఈలో న్యూలాండ్ షేరు 5.54 శాతం నష్టంతో రూ.16,014.95 వద్ద ముగిసింది.

టాటా మోటార్స్ ట్రక్కులు, బస్సుల ధరల పెంపు

న్యూఢిల్లీ: టాటా మోటార్స్ తన వాణిజ్య వాహనా లైన ట్రక్కులు, బస్సుల ధరలను 2 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. పెంచిన ధరలు జనవరి 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. ఇండివిడ్యువల్ మోడల్, వేరియంట్‌ను బట్టి ఈ పెంపు ఉంటుందని పేర్కొంది. ఉత్పత్తి వ్యయాలు పెరగటంతో ధరలు పెంచక తప్పటం లేదని టాటా మోటార్స్ తెలిపింది. కాగా కంపెనీ ఇప్పటికే తన ప్యాసింజర్ కార్ల ధరలను 3 శాతం వరకు పెంచింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,500 ▲	72,900 ▲	1,04,000 ▲
విజయవాడ	81,000 ▲	73,500 ▲	96,000 ▲
విశాఖపట్నం	78,690 ▲	72,130 ▲	95,200 ▲
రాజమండ్రి	79,470 ▲	72,850 ▲	95,600 ▲
ప్రొద్దుటూరు	79,700 ▲	73,800 ▲	95,000 ▲
ముంబై	78,147 ▲	71,583 ▲	93,300 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ			
హైదరాబాద్	620	విజయవాడ	630
వరంగల్	622	గోదావరి	630
చిత్తూరు	633	విశాఖపట్నం	620
		దజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	86	విజయవాడ	96
వరంగల్	86	గుంటూరు	96
కరీంనగర్	86	ఒంగోలు	96
మహబూబ్‌నగర్	86	చిత్తూరు	83
కర్నూలు	86	నెల్లూరు	83
విశాఖపట్నం	98	అనంతపురం	83
గోదావరి	96		

2030 నాటికి ఇన్‌ఫ్రాలోకి రూ.187 లక్షల కోట్ల పెట్టుబడులు

నైట్ ఫ్రాంక్ ఇండియా

న్యూఢిల్లీ: భారత్ 2030 నాటికి 7 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం భారీగానే ఖర్చు చేయాల్సి ఉంటుందని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా ఒక నివేదికలో తెలిపింది. ఈ మొత్తం ఎంతలేదన్నా 2.2 లక్షల కోట్ల డాలర్లు (ప్రస్తుత మారకం రేటు ప్రకారం సుమారు రూ.186.56 లక్షల కోట్లు) వరకు ఉంటుందని అంచనా. భారీ సంస్కరణల ద్వారా పెద్ద ఎత్తున ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడం ఒక్కటే ఇందుకు మార్గమని స్పష్టం చేసింది. మన ఆర్థిక వ్యవస్థను 2030 నాటికి ఏడు లక్షల కోట్ల డాలర్ల స్థాయికి తీసుకువెళ్లేందుకు 2024-30 మధ్య కాలంలో మన జీడీపీ ఏటా సగటున 10.1 శాతం చొప్పున వృద్ధి చెందడం అవసరమని స్పష్టం చేసింది. మౌలిక రంగంలో ప్రైవేట్ పెట్టుబడులు పెరిగితే ప్రభుత్వాల ద్రవ్యలోటూ తగ్గుతుందని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది.

విమానాశ్రయాల కోసం రూ.60,000 కోట్లు

విమానాశ్రయాల అభివృద్ధి కోసం భారత్ వచ్చే మూడేళ్లలో పెద్ద మొత్తం ఖర్చు చేయక తప్పేలా లేదు. ఇందుకోసం ఎంతలేదన్నా రూ.60,000 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుదని క్రిసిల్ అంచనా. 2027 నాటికి ఏటా 6.5 కోట్ల విమాన ప్రయాణికుల సామర్థ్యం కోసం ఈ పెట్టుబడులు తప్పవని తెలిపింది.



టాప్‌గేర్‌లో ఆటోమొబైల్ విడిభాగాల పరిశ్రమ

దేశంలో ఆటోమొబైల్ విడి భాగాల పరిశ్రమ టాప్‌గేర్‌లో దూసుకుపోతోంది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ఆరు నెలల్లో ఈ పరిశ్రమ రూ.3.32 లక్షల కోట్ల టర్నోవర్ నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువని ఈ పరిశ్రమకు ప్రాతినిధ్యం వహించే ఆటోమొబైల్ కాంపోనెంట్స్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఏసీఎంఏ) తెలిపింది. అంతర్జాతీయ ఆటుపోట్లతో ఎగుమతుల వృద్ధి సన్నగిల్లినా పరిశ్రమ ఈ అభివృద్ధి నమోదు చేసిందని ఏసీఎంఏ జాతీయ అధ్యక్షుడు శ్రద్ధా సూరి మార్వా చెప్పారు.

ఈ సెక్యూరిటీ రూ.10 లక్షల పైమాటే!!

దేశంలో అత్యంత ఖరీదైన సెక్యూరిటీగా ప్రాపర్టీ ప్లాటినా రీట్

ముంబై: తాజాగా స్టాక్ మార్కెట్లో నమోదైన ఓ చిన్న కంపెనీ సరికొత్త రికార్డును సృష్టించింది. ఏకంగా రూ.10.5 లక్షల వద్ద లిస్టయి దేశంలో ట్రేడింగ్‌కు అందుబాటులో ఉన్న అత్యంత ఖరీదైన సెక్యూరిటీగా ప్రాప్‌షేర్ ప్లాటినా రీట్ నిలిచింది. మార్కెట్లో అత్యంత ఖరీదైన ఎల్సిడ్ ఇన్వెస్ట్‌మెంట్ (రూ.2.07 లక్షలు), ఎంఆర్ఎఫ్ (రూ.1.32 లక్షలు) షేర్ల ధర కంటే చాలా రెట్లు అధికమిది. ఈ మధ్యనే ఐపీఓకు వచ్చిన ప్రాపర్టీ షేర్ ప్లాటినా రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్).. ఈ నెల 10న తన యూనిట్లను బీఎస్ఈలో నమోదు చేసింది. రూ.10.5 లక్షల వద్ద లిస్టయిన ఈ సెక్యూరిటీ.. ప్రస్తుతం రూ.10.35 లక్షల వద్ద ట్రేడవుతోంది.


విలువపరంగా టాప్-5 సెక్యూరిటీలు
(ఈ నెల 12న బీఎస్ఈలో ముగింపు ధరల ఆధారంగా)

కంపెనీ	రూ.
ప్రాప్‌షేర్ ప్లాటినా రీట్	10,35,001
ఎల్సిడ్ ఇన్వెస్ట్‌మెంట్స్	1,97,405
ఎంఆర్ఎఫ్	1,31,861
ది యమున సిండికేట్	45,600
హనీవెల్ ఆటోమేషన్	40,864









స్టైలిష్ వెంకీ



వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్ రాజు, శిరీశ్ నిర్మాతలు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. సినిమా సంక్రాంతికి రాబోతోంది. కాగా, నేడు వెంకటేశ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ మూవీ నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. వెంకటేశ్ డైనమిక్ అండ్ స్టైలిష్ అవతార్‌లో కనిపించిన ఈ బ్రాండ్ న్యూ పోస్టర్ అదిరిపోయింది. నేడు ఈ సినిమా నుంచి సింగిల్ ప్రోమోని అభిమానులకు కానుకగా ఇవ్వబోతోంది చిత్ర యూనిట్.

ఓ ఫైటర్‌లా పదేళ్ల కెరీర్ పూర్తి చేశాడు



'సాయిదుర్గ తేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'సంబరాల ఏటిగట్టు' అనే టైటిల్ నిర్ణయించారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్నేజ్ లాంచ్ ఈవెంట్‌లో వీడియో ద్వారా టైటిల్‌ను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న రామ్‌చరణ్ మాట్లాడుతూ 'ఓ ఫైటర్‌లా పదేళ్ల కెరీర్‌ను పూర్తి చేసిన తేజ్‌కి అభినందనలు. అతను మంచి నటుడే కాదు మంచి వ్యక్తి కూడా. తేజ్ ఊచకోత ఎలా ఉంటుందో ఈ సినిమాతో చూడబోతున్నారు. ఇంత బడ్జెట్ పెట్టి సినిమా తీస్తున్న నిర్మాతలు నిరంజన్, చైతన్యలకు ఆల్ ద బెస్ట్' అన్నారు. తను ఈ స్థాయికి రావడానికి కారణమైన ముగ్గురు మావయ్యలకు సాయిదుర్గా తేజ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లు అరవింద్, టీజీ విశ్వప్రసాద్, అనిల్ రావిపూడి, మారుతి, ప్రశాంత్ వర్మ, వైవీఎస్ చౌదరి, దేవ్ కట్టా హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రోహిత్ కేపీని దర్శకుడిగా పరిచయం చేస్తూ కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం వచ్చే ఏడాది సెప్టెంబర్ 25న విడుదలవుతుంది.

అలుసుగా తీసుకుంటే సహించేది లేదు

సాయిపల్లవి



తనపై నిరాధార వార్తలు ప్రచురిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని కథానాయిక సాయిపల్లవి హెచ్చరించారు. తన మౌనాన్ని అలుసుగా తీసుకొని ఇష్టం వచ్చినట్లు అసత్యాలను ప్రచారం చేస్తున్నారంటూ మీడియా వైఖరిని తప్పుపట్టారు. 'ఇక సహించేది లేదు. నా సినిమాలు, వ్యక్తిగత జీవితానికి సంబంధించి నిరాధార వార్తలు ప్రచురిస్తే, అది ఎంత పెద్ద మీడియా సంస్థ అయినా చర్య తీసుకోవడానికి వెనుకాడేది లేదు' అని ఆమె ఘాటుగా స్పందించారు. ఓ కోలీవుడ్ మీడియా సంస్థ రాసిన వార్త సాయిపల్లవిలో ఈ ఆగ్రహానికి కారణమైంది. బాలీవుడ్ చిత్రం 'రామాయణ'లో సాయిపల్లవి సీత పాత్ర పోషిస్తున్నారు. ఈ పాత్ర కోసం సాయిపల్లవి తన అలవాట్లను పక్కనపెట్టారనీ, పద్ధతులు మార్చుకున్నారని ఓ కోలీవుడ్ వెబ్‌సైట్ వార్తను ప్రచురించింది. మాంసాహారం త్యజించి, పూర్తి శాఖాహారిగా మారారని, బయట భోజనం చేయడం లేదని, విదేశాలకు వెళ్లినా వంటవాళ్లను వెంటపెట్టుకు వెళుతున్నారనేది ఆ వార్తల సారాంశం. అయితే శాఖాహారిగా మారడం, ఇంటిభోజనం తినడం అసత్యమే అయినా ఈ మాత్రానికే సాయిపల్లవి మనసు ఇంతలా నొచ్చుకోవడం ఏవిటో అర్థం కావడం లేదంటున్నారు నెటిజన్లు. భారత సైన్యాన్ని అవమానించారనీ, కశ్మీర్ వేర్పాటువాదులను, గోసంరక్షణ ఉద్యమకారులను ఒకే గాటన కట్టారని గతంలో తనపై సోషల్ మీడియాలో తీవ్రంగా ట్రోలింగ్ జరిగినప్పుడు ఏమీ మాట్లాడని సాయిపల్లవి ఇప్పుడు మాత్రం ఇంత తీవ్రంగా స్పందించడం ఆశ్చర్యం కలిగిస్తుందని అంటున్నారు. అయితే పురాణేతిహాసాల ఆధారంగా తెరకెక్కే చిత్రాల్లో దేవీ దేవతల పాత్రలను పోషించే నటీనటులు భక్తిభావంతో తమ ఆహార విహారాల్లో మార్పులు చేసుకోవడం, సాత్వికంగా మారడం చాలాకాలంగా ఉన్నదే.

ఏడడుగుల బంధంలోకి







ప్రముఖ నటి కీర్తి సురేష్ గురువారం ఏడడుగుల బంధంలోకి అడుగుపెట్టారు. తన స్నేహితుడు ఆంటోనీ తట్టిల్‌ను ఆమె పెళ్లి చేసుకున్నారు. గురువారం గోవాలోని ప్రముఖ రిసార్టులో వీరి వివాహం ఘనంగా జరిగింది. కొద్దిమంది కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే ఈ పెళ్లి వేడుకలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ పెళ్లికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ వివాహానికి కోలీవుడ్ నుంచి అగ్రహీరో విజయ్ తమిళ సంప్రదాయ పంచెకట్టులో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కాగా, కీర్తి సురేష్ - ఆంటోనీలు గత 15 యేళ్ళుగా మంచి స్నేహితులుగా ఉన్నారు. కొచ్చిన్‌లో కాలేజీ చదువుకునే రోజుల నుంచే వీరిద్దరికి మంచి పరిచయముంది. వ్యాపార కుటుంబ నేపథ్యం కలిగిన ఆంటోనీకి చెన్నై, కొచ్చిన్‌లలో వ్యాపారాలు ఉన్నాయి.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

భారీ బడ్జెట్ సినిమాలన్నీ ఆడాలి

మోహన్‌లాల్



మలయాళ చిత్రరంగ సూపర్ స్టార్ మోహన్‌లాల్ తొలిసారిగా దర్శకత్వం వహిస్తున్న సోషియో ఫాంటసీ 3డి చిత్రం 'బర్రోజ్' ఈ నెల 25న విడుదలవుతోంది. ఇటీవలే ముంబైలో జరిగిన వేడుకలో చిత్రం ట్రైలర్‌ను అక్షయ్‌కుమార్ విడుదల చేశారు, 44 ఏళ్ల క్రితం మోహన్‌లాల్ తొలి చిత్రం 'మంజిల్ విరింజ పూక్కళ్' విడుదలైన రోజునే ఆయన దర్శకత్వం వహించిన మొదటి సినిమా విడుదలవుతుండడం విశేషం. మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మోహన్‌లాల్ మాట్లాడుతూ ' భారీ చిత్రాలు ఇప్పుడు వరుసగా వస్తున్నాయి. 'పుష్ప 2' మాత్రమే కాదు అన్నీ హిట్ కావాలి. ప్రేక్షకులు వాటినీ ఆదరించాలి. నేను 1996లో 'కాలాపానీ' అనే సినిమా చేశాను. అది పాన్ ఇండియా హిట్ అయింది. అలాగే ఇప్పుడు 'బర్రోజ్' కూడా పెద్ద హిట్ కావాలి' అన్నారు.

తప్పు చేయలేదు భయపడను

నయనతార



నా తప్పు లేనప్పుడు అవతలి వ్యక్తి ఎంత బలవంతుడైనా భయపడాల్సిన అవసరమేముంది అంటూ స్పందించారు నయనతార. తమిళ అగ్రహీరో ధనుష్‌ను ఉద్దేశించి ఆమె ఆ వ్యాఖ్యలు చేశారు. 'నయనతార: బియాండ్ ద ఫెయిరీటేల్' డాక్యుమెంటరీకు సంబంధించిన కాపీరైట్ వివాదంతో నయనతార, ధనుష్ తరచూ వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. ధనుష్ వ్యక్తిత్వాన్ని తప్పుపడుతూ తీవ్ర పదజాలంతో బహిరంగ లేఖను రాసిన నయనతార ఆ తర్వాత పలు వేదికలపై నుంచి ధనుష్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ వివాదంపై ఓ ఇంటర్వ్యూలో నయనతార మరోసారి మాట్లాడారు. తమిళ సినీ రంగంలో ప్రముఖుడు, అగ్రహీరో అయిన ధనుష్‌ను సవాల్ చేసేంత ధైర్యం మీకెలా వచ్చింది అని ప్రశ్నించగా, న్యాయం తనవైపు ఉందని బదులిచ్చారు. 'ధనుష్‌కు బహిరంగ లేఖ రాయడం నేను నా డాక్యుమెంటరీ ఫిల్మ్ ప్రచారం కోసం చేసిన ఎత్తుగడ అని కొందరు అనుకుంటున్నారు. నాకు ఆ అవసరం లేదు. నమ్మినదానికోసమే నేను గట్టిగా నిలబడ్డాను. ధనుష్ నుంచి వీడియో క్లిప్స్‌కు సంబంధించిన అనుమతిని పొందేందుకు నేనూ, విఘ్నేశ్ చాలా రకాలుగా ప్రయత్నించాం. మాకు తెలియకుండా ఎప్పుడైనా ఆయన మనసు నొప్పించి ఉంటే మాట్లాడి పరిష్కరించుకుందాం అనుకున్నాం. ఆయన్ను కలిసేందుకు చాలా ప్రయత్నించాం. పలుమార్లు ధనుష్‌కు ఫోన్ చేశాం. అయినా ఆయన స్పందించలేదు. మా మధ్య ఎలాంటి శత్రుత్వం లేదు. ఆయన నాకు మిత్రుడే. ఆయన కోపానికి కారణం నాకు తెలియదు' అని నయనతార తెలిపారు.

కొత్త తరహా స్క్రిప్ట్‌తో..



డా.హరిత గోగినేని దర్శకత్వంలో వేదిక లీడ్‌రోల్‌లో నటించిన చిత్రం 'ఫియర్'. డా.వంకి పెంచలయ్య, ఏఆర్ అభి నిర్మాతలు. సుజాత రెడ్డి కో ప్రొడ్యూసర్. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకురాలు హరిత గోగినేని మాట్లాడుతూ 'ఇది స్క్రీన్‌ప్లే ఓరియెంటెడ్ మూవీ. వేదిక డ్యూయెల్ రోల్‌లో నటించారు. పిల్లలు, పెద్దలు, ఫ్యామిలీ అంతా కలసి చూడొచ్చు. ఫియర్ సినిమాలో ఎన్నో సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్ ఉన్నాయి' అని తెలిపారు. ప్రొడ్యూసర్ ఏఆర్ అభి మాట్లాడుతూ 'టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. మేము అనుకున్న దానికంటే చాలా ఎక్కువగా 70 పర్సెంట్ బుకింగ్స్ ఉన్నాయి. చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు. కో ప్రొడ్యూసర్ సుజాత రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాను చాలా కొత్త తరహా స్క్రిప్ట్‌తో హరిత రూపొందించారు' అని తెలిపారు. హీరో సొహైల్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో లవ్ స్టోరీతో పాటు థ్రిల్లర్ హారర్ ఎలిమెంట్స్ కలసిన ఒక కొత్త తరహా స్క్రీన్‌ప్లే ఉంటుంది. ఇలాంటి స్క్రిప్ట్, స్క్రీన్‌ప్లేతో తెలుగులో మూవీ రాలేదని చెప్పగలను' అని అన్నారు. కార్యక్రమంలో నటి సాహితి దాసరి, నటుడు షానీ, నిర్మాత బెక్కెం వేణుగోపాల్ తదితరులు మాట్లాడారు.

అసామాన్యుడి కథ



హీరో విజయ్ సేతుపతి, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'విడుదల-2'. వీరి కాంబినేషన్‌లోనే వచ్చిన 'విడుదల-1'కు సీక్వెల్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. డిసెంబరు 20న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. నిర్మాత చింతపల్లి రామారావు ఈ సినిమా తెలుగు హక్కులను దక్కించుకున్నారు. తెలుగు ట్రైలర్‌ను కథానాయకుడు విజయ్‌సేతుపతి ఇటీవల చెన్నయ్‌లో విడుదల చేశారు. పాటలకు, ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. పరిపాలకుల అహంకారానికి అణచివేతకు గురైన సామాన్యుల నుంచి ఉద్భవించిన ఒక అసామాన్యుడి వీర విప్లవ గాథనే 'విడుదల-2' అని చిత్రబృందం పేర్కొంది. పెరుమాళ్(నక్సలైట్) పాత్రలో విజయ్ సేతుపతి నటించారు. సినిమాకు ఇళయరాజా సంగీతం అందించారు. మంజు వారియర్, సూరి, భవాని శ్రీ, గౌతమ్ వాసుదేవ్ మీనన్, సూర్య సేతుపతి, అనురాగ్ కశ్యప్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

ప్రేమకు వారధి



అనిల్ అర్కా, విహారికా చౌదరి హీరో హీరోయిన్లుగా శ్రీ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన మూవీ 'వారధి'. పెయ్యాల భారతి, ఎం.డి. యూనస్ నిర్మాతలు. తాజాగా ఈ యూత్‌ఫుల్ లవ్ స్టోరీ సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీ కృష్ణ మాట్లాడుతూ 'ఈ కథ లవ్, రొమాన్స్ థ్రిల్లర్‌తో అందరినీ ఆకట్టుకుంటుంది. ప్రేక్షకులందరికీ నచ్చే కథను అందించామనే నమ్మకం ఉంది. త్వరలోనే మూవీని విడుదల చేస్తాం' అని అన్నారు. కాగా, ఈ సినిమా సాంకేతిక నిపుణుల కృషి, కథా కథనాల ప్రత్యేకత, నటీనటుల అభినయం చిత్రానికి ప్రధాన బలంగా నిలుస్తాయని చిత్ర యూనిట్ పేర్కొంది.

64 గళ్ల రాజ్యాన్ని జయించాడు!



కల నెరవేరింది: గుకేష్

'గత పదేళ్లుగా ఈ రోజుకోసమే కలలు కంటున్నా. నా స్వప్నం నిజమైనందుకు ఎంతో సంతోషంగా ఉంది. విజేతగా నిలుస్తానని ఊహించలేదు. అందుకే భావోద్వేగానికి గురయ్యా. అవకాశం చిక్కడంతో.. ప్రత్యర్థిపై విరుచుకుపడ్డా. తొలి గేమ్‌లో ఓడినప్పుడు విషీ సర్ ధైర్యం చెప్పాడు. పిన్నవయసు చాంపియన్‌గా నిలవాలని 2017లో అనుకొన్నా.'

నా అంచనాలను మించాడు



తొలి ప్రపంచ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లోనే గుకేష్ ఆటతీరు అద్భుతంగా ఉందని ఐదుసార్లు చాంపియన్ ఆనంద్ కొనియాడాడు. 'గుకేష్ నా అంచనాలను మించి రాణించాడు. గుకేష్ విశ్వ విజయం భారత్ చెస్‌పై ఎంతో ప్రభావం చూపుతుంది. ఎందరో యువకులు చెస్ క్రీడలోకి అడుగుపెట్టేందుకు గుకేష్ టైటిల్ గెలుపు దోహదం చేస్తుంది' అని ఆనంద్ స్పష్టంజేశాడు.


డింగ్ లిరెన్

చెస్‌కు అంతం: క్రామ్నిక్

వరల్డ్ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంప్ లిరెన్ చిన్నపిల్లాడిలా ఆడి తప్పిదం చేయడంపై మాజీ విజేత వ్లాదిమిర్ క్రామ్నిక్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. చెస్‌కు ఇది అంతమన్నాడు. 'ఏటువంటి వ్యాఖ్యలు చేయదల్చుకోలేదు. బాధగా ఉంది. మాకు తెలిసిన చెస్ అంతమైంది' అని ఎక్స్‌లో పోస్టు చేశాడు. పిల్లలు కూడా చేయని తప్పిదం.. వరల్డ్ చెస్ టైటిల్ ఫలితాన్ని నిర్ధారించిందని మరో పోస్టులో అసహనం వ్యక్తం చేశాడు.

పిన్నవయసు వరల్డ్ చాంపియన్లు

గుకేష్	18 ఏళ్ల 8 నెలల 14 రోజులు
గ్యారీ కాస్పరోవ్	22 ఏళ్ల 6 నెలల 27 రోజులు
మాగ్నస్ కార్ల్‌సన్	22 ఏళ్ల 11 నెలల 24 రోజులు
మిఖైల్ తాల్	23 ఏళ్ల 5 నెలల 28 రోజులు
అనతొలి కార్పోవ్	23 ఏళ్ల 10 నెలల 11 రోజులు
వ్లాదిమిర్ క్రామ్నిక్	25 ఏళ్ల 4 నెలల 10 రోజులు
ఎమ్మాన్యుయెల్ లాస్కర్	25 ఏళ్ల 5 నెలల 2 రోజులు

యువతకు ప్రేరణ

'చారిత్రకం.. ఆదర్శవంతం..! అద్భుత విజయం సాధించిన గుకేష్‌కు అభినందనలు. ఇది ప్రతిభ, కఠిన శ్రమ, పట్టుదలకు దక్కిన ప్రతిఫలం. అతడి విజయం చెస్‌లో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించడమే కాదు.. ఎంతోమంది యువతకు ప్రేరణ. భవిష్యత్‌లో అతడు మరిన్ని విజయాలు అందుకోవాలని కోరుకొంటున్నా'

- ప్రధాని నరేంద్ర మోదీ

'ఎంతో గర్విస్తున్నాం. గొప్ప విజయం సాధించిన నీకు అభినందనలు. చెస్‌కు భారత్ పవర్ హౌస్ అని నిరూపించావు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిష్ఠించాలి'

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ప్రపంచ చెస్ చాంపియన్ గుకేష్ | పిన్నవయస్కుడిగా సరికొత్త చరిత్ర | ఆఖరి రౌండ్‌లో డింగ్‌కు చెక్

అరవైనాలుగు గళ్ల సమరంలో గుకేష్ చరిత్ర సృష్టించాడు. 18 ఏళ్ల ప్రాయంలోనే చెస్ ప్రపంచానికి రారాజుగా అవతరించాడు. 'క్యాండిడేట్స్' విజేతగా వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించిన భారత జీఎం.. గత విజేత డింగ్ లిరెన్‌ను ఓడించి అగ్రపీఠాన్ని అధిష్ఠించాడు. హోరాహోరీగా సాగిన 14 రౌండ్ల పోరులో.. ఆఖరి గేమ్‌లో ప్రత్యర్థి ఎత్తును చిత్తు చేసిన గుకేష్.. చదరంగ చరిత్రలో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకొన్నాడు.

సింగపూర్: భారత టీనేజ్ గ్రాండ్ మాస్టర్ గుకేష్ దొమ్మరాజు ప్రపంచ చెస్ చాంపియన్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు. 18 ఏళ్ల పిన్నవయసులోనే చెస్ రారాజుగా అత్యంత అరుదైన ఘనతను అందుకొన్నాడు. 18వ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా.. 14 రౌండ్లపాటు హోరాహోరీగా సాగిన పోరులో డిఫెండింగ్ చాంపియన్, చైనాకు చెందిన డింగ్ లిరెన్ (32)ను గుకేష్ 7.5-6.5 పాయింట్ల తేడాతో ఓడించాడు. టోర్నీ నిబంధనల ప్రకారం తొలుత 7.5 పాయింట్లు సాధించిన ఆటగాడిని విజేతగా ప్రకటిస్తారు. గురువారం నాలుగు గంటలపాటు జరిగిన 14వ, ఆఖరి క్లాసిక్ రౌండ్‌లో 58 ఎత్తుల్లో లిరెన్ ఆటకట్టించిన దొమ్మరాజు విశ్వకిరీటాన్ని అందుకొన్నాడు. టోర్నీ ఆరంభానికి ముందు భారత జీఎంను ఫేవరెట్‌గా పరిగణించినా.. తొలి రౌండ్‌లోనే షాకిచ్చిన లిరెన్ తనను ఏమాత్రం తక్కువగా అంచనా వేయొద్దన్న హెచ్చరికలు పంపాడు. కానీ, కీలక గేమ్ డ్రా దిశగా సాగుతున్న క్రమంలో.. లిరెన్ చేసిన ఒక్క తప్పిదాన్ని గుకేష్ తన విజయానికి మెట్టుగా మార్చుకొన్నాడు. 1985లో రష్యన్ చెస్ లెజెండ్ గ్యారీ కాస్పరోవ్ (22 ఏళ్ల 6 నెలల 27 రోజులు) పిన్నవయసులో చాంపియన్‌గా నిలవగా.. ఆ రికార్డును గుకేష్ (18 ఏళ్ల 8 నెలల 14 రోజులు) బద్దలుకొట్టాడు. ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనతను సాధించిన రెండో భారతీయుడిగా దేశ ప్రజలను ముగ్ధులను చేశాడు. 2013లో విషీ విజేతగా నిలవగా.. దశాబ్దం తర్వాత గుకేష్ అద్భుతం చేశాడు.

విజేతకు రూ.11.45 కోట్లు

వరల్డ్ చెస్ చాంపియన్‌గా నిలిచిన గుకేశ్ ఖాతాలో ప్రైజ్‌మనీ కూడా భారీగా చేరనుంది. 14 రౌండ్లపాటు సాగిన ఈ చాంపియన్‌షిప్ మొత్తం ప్రైజ్‌మనీ 2.5 మిలియన్ డాలర్లు (రూ.21.22 కోట్లు). అలాగే ఫిడే నిబంధనల ప్రకారం ఇందులో ఒక్కో రౌండ్ గెలిచిన విజేతకు రూ.1.69 కోట్లు లభిస్తాయి. కాబట్టి ఈ చాంపియన్‌షిప్‌లో మూడు గేమ్‌లు గెలిచిన గుకేశ్ రూ.5.07 కోట్లు సాధించాడు. లిరెన్ రెండు గేమ్‌లు గెలవడంతో అతడికి రూ.3.38 కోట్లు దక్కాయి. ఇక మిగిలిన 1.5 మిలియన్ డాలర్ల ప్రైజ్‌మనీని ఇరువురికి సమానంగా పంచారు. దీంతో గుకేశ్‌కు మొత్తంగా రూ.11.45 కోట్లు లభించగా.. రన్నరప్‌గా నిలిచిన లిరెన్‌కు రూ.9.75 కోట్లు అందాయి.

ఒక్క ఎత్తుతో చిత్తు..

13వ రౌండ్ ముగిసేసరికి చెరో 6.5 పాయింట్లతో నిలిచిన గుకేష్-లిరెన్‌కు 14వ రౌండ్ అత్యంత కీలకం. క్లాసిక్ గేమ్‌లో ఎంతో పట్టున్న దొమ్మరాజుకు టోర్నీ టైబ్రేక్ దారితీస్తే మాత్రం ఎంతో సంక్లిష్టమయ్యేది. ఈ నేపథ్యంలో తీవ్ర ఒత్తిడి మధ్య నల్లపావులతో ఆడిన గుకేష్ ఆది నుంచే దీటుగా ఎత్తులు వేస్తూ ప్రత్యర్థిని ఇరుకునబెట్టే ప్రయత్నం చేశాడు. తెల్లపావులతో ఆడిన డింగ్.. జుకర్‌టార్ట్ ఓపెనింగ్‌తో ఆరంభించాడు. దీనికి గుకేష్ కింగ్స్ రివర్స్‌డ్ గ్రెన్‌ఫెల్డ్ ఓపెనింగ్ ప్యాటర్న్‌తో దీటుగా బదులిచ్చాడు. గత రౌండ్లలో ఆరంభంలో ఎత్తులు వేయడానికి ఎంతో సమయం తీసుకొన్న లిరెన్ ఈ రౌండ్‌లో చకచకా పావులు కదిపాడు. బదులుగా గుకేష్ కూడా కౌంటర్ మూవ్స్‌తో టైమ్ కంట్రోల్ గేమ్ ఆడాడు. ఇద్దరూ మధ్య బోర్డులో ఆధిక్యం కోసం తీవ్రంగా ప్రయత్నించారు. 32 ఎత్తులు ముగిసేసరికి ఇద్దరి వద్ద చెరో బిషప్, రుక్ మాత్రమే మిగిలున్నాయి. అయితే, గుకేష్ వద్ద ఒక్క పాన్ అదనంగా ఉంది. ఈ క్రమంలో 40 ఎత్తులు పూర్తయ్యే సరికి.. చాలా మంది విశ్లేషకులు ఫలితం టైబ్రేక్‌కు మళ్లుతుందన్న ఊహాగానాలు చేశారు. మరోవైపు డింగ్ కూడా తదనుగుణంగా ఎత్తులు వేశాడు. కచ్చితంగా డ్రా అనుకొంటున్న సమయంలో 55వ ఎత్తులో లిరెన్ ఘోర తప్పిదం చేశాడు. తన రుక్‌ను గుకేష్ రుక్‌కు ఎదురుగా నిలిపాడు. దీన్ని గమనించిన గుకేష్ ఒక్కసారిగా విరుచుకుపడ్డాడు. అనంతరం మరో మూడు ఎత్తుల్లోనే చైనా గ్రాండ్ మాస్టర్ ఓటమిని అంగీకరించాడు. దీంతో గుకేష్ ఒక్కసారిగా ఉద్వేగానికి లోనయ్యాడు. అతడి కంటి నుంచి ఆనందభాష్పాలు జలజలా రాలాయి. చేతులతో ముఖాన్ని దాచుకొన్న భారత జీఎం.. ఆ తర్వాత తేరుకొని సంబరాలు చేసుకొన్నాడు.

ఇదీ టీమ్..

- గ్రజ్‌గోర్జ్ గజూస్కి
- రడోస్లావ్ వోజ్‌టస్జక్
- పెంట్యాల హరికృష్ణ
- విన్సెంట్ కీమర్
- జాన్ క్లిమ్‌కోస్కి
- జాన్ క్రజిస్టోఫ్ డుడా
- విశ్వనాథన్ ఆనంద్
- ప్యాడీ అప్టన్

నిశితంగా పరిశీలించే వాడు: అప్టన్

టోర్నీ ఆసాంతం ఒడిదొడుకులు ఎదురైనా.. గుకేష్ ఎంతో కూల్‌గా వ్యవహరించాడు. తొలి గేమ్‌లోనే కంగుతున్నా అద్భుతంగా పుంజుకొన్నాడు. మానసికంగా గుకేష్ ఎంతో బలంగా ఉండడం వెనుక ప్రముఖ మెంటల్ కండీషనింగ్ కోచ్ ప్యాడీ అప్టన్ పాత్ర చాలా ఉంది. గత ఆరునెలలుగా గుకేష్‌కు అప్టన్ వర్చువల్‌గా శిక్షణనిచ్చాడు. గంటలకొద్దీ సెషన్‌లు కొనసాగేవని చెప్పాడు. చిన్నవయసులోనే అతడి ఆలోచనల్లో ఎంతో పరిపక్వత కనిపించిందని ప్యాడీ చెప్పాడు. ప్రతి చిన్న విషయాన్ని నిశితంగా గమనించి.. శోధించి తెలుసుకోవడం వల్లే అతడు ఎంతో ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగాడని చెప్పాడు. 2011లో టీమిండియా వరల్డ్‌కప్ నెగ్గినప్పుడు కూడా అప్టన్ సేవలు అందించాడు.



సంబరాలు.. వినూత్నంగా..

గుకేష్ తన గెలుపు సంబరాలను వినూత్నంగా చేసుకొన్నాడు. గేమ్ ముగిసిన తర్వాత చెస్ బోర్డుపై పావులను ఆయా స్థానాల్లో ఉంచి తన గౌరవాన్ని చాటాడు. బోర్డుపై పావులను సర్దుతున్న వీడియో ఇప్పుడు నెట్‌లో వైరల్‌గా మారింది. బలగాలను వాటివాటి స్థానాల్లో పెట్టిన తర్వాతనే అతడు పైకిలేచి విజయదరహాసం చేశాడు.

అందనంత 'ఎత్తు'లో..

నిన్న క్యాండిడేట్స్, నేడు వరల్డ్ చెస్ టైటిళ్లు

నా లక్ష్యం ఇంకా పెద్దది..

జనవరి 15, 2019న 12 ఏళ్ల ఏడు నెలల 17 రోజుల వయస్సులో గ్రాండ్‌మాస్టర్ అయిన సందర్భంగా గుకేష్ చేసిన ఆ వ్యాఖ్య అతడిలోని ఆత్మవిశ్వాసానికి అద్దం పడుతుంది. అందుకు తగ్గట్టుగానే గత ఏప్రిల్‌లో క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన గుకేష్ తొలి సంచలనం సృష్టించాడు. 17 సంవత్సరాలకే క్యాండిడేట్స్ టైటిల్ అందుకున్న పిన్నవయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. ఇప్పుడేమో ఏకంగా ప్రపంచ చాంపియన్‌గా ఆవిర్భవించిన గుకేష్ తన అతిపెద్ద లక్ష్యాన్ని చేరుకున్నాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ స్ఫూర్తిగా భారత్ నుంచి ఎందరో చెస్ ఆటగాళ్లు ఉద్భవించారు. పెద్ద సంఖ్యలో ఆటగాళ్లు దూసుకురావడమేకాదు విశ్వ చెస్ వేదికపై ప్రకంపనలు సృష్టిస్తున్నారు. పెంటేల హరికృష్ణ మొదలుకొని కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలీ రమేష్‌బాబు, ప్రజ్ఞానంద, అర్జున్ ఇరిగేసితో ఈ జాబితా ఎంతో సుదీర్ఘంగా ఉంటుంది. ప్రస్తుతం గుకేష్ 'విశ్వ' కిరీటంతో ప్రపంచ చెస్‌లో తిరుగులేని శక్తిగా భారత్ స్థానం మరింత సుస్థిరమైంది. దొమ్మరాజు గుకేష్ కూడా తెలుగువాడే. అతడి తండ్రి రజనీకాంత్ కంటి వైద్యుడు. తల్లి డా.పద్మ మైక్రోబయాలజిస్ట్. వృత్తి, ఉద్యోగ రీత్యా గుకేష్ తల్లిదండ్రులు చెన్నైలో స్థిరపడ్డారు.

లేలేత ప్రాయంలోనే..: ఏడు సంవత్సరాల వయస్సులోనే గుకేష్ చెస్‌లోకి అడుగుపెట్టాడు. చదువుతోపాటు చెస్ ఆటగాళ్లను తీర్చిదిద్దే చెన్నైలోని ప్రసిద్ధ వేలమ్మాల్ విద్యాలయంలో చేరడంతో గుకేష్ చదరంగ ప్రస్థానం ప్రారంభమైంది. 2015లో అండర్-9 ఆసియా స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్ విజయంతో గుకేష్ ఘనమైన పయనం మొదలైంది. 2018లో వరల్డ్ యూత్ చెస్ అండర్-12 టైటిల్ గెలవడంతో అందరి చూపు ఈ చిన్నోడిపై పడింది. అదే ఏడాది ఏషియన్ యూత్ చెస్ చాంపియన్‌షిప్ అండర్-12 కేటగిరిలో ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో కలిపి ఏకంగా ఐదు స్వర్ణ పతకాలు కొల్లగొట్టడంతో దేశ చెస్‌లో గుకేష్ పేరు మార్మోగిపోయింది. 2017లో ఇంటర్నేషనల్ మాస్టర్ నార్మ్ దక్కించుకున్న గుకేష్ మరో రెండు సంవత్సరాలకు గ్రాండ్‌మాస్టర్ అయ్యా డు. ప్రపంచ చెస్‌లో రెండో పిన్నవయసు జీఎంగా గుకేష్ రికార్డు నెలకొల్పాడు. 2022 చెస్ ఒలింపియాడ్‌లో వ్యక్తిగత పసిడి పతకం నెగ్గిన గుకేష్.. మరుసటి సంవత్సరం 2750 ఎలో రేటింగ్‌తో ఇంకో రికార్డు సాధించాడు. 2023 సెప్టెంబరులో ఆనంద్‌ను వెనక్కునెట్టి భారత టాప్ ర్యాంక్ ఆటగాడిగా ఖ్యాతిగాంచాడు. ఇక..ఈ సంవత్సరం ఏప్రిల్‌లో క్యాండిడేట్స్ టోర్నీ టైటిల్ అందుకోవడం ద్వారా ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్ పోరుకు అర్హత సాధించాడు.



ఆకాశ్‌దీప్ ఆడేనా?

విరాట్.. పద్ధతి మార్చుకో : గవాస్కర్
మిడిలార్డర్‌లోనే రోహిత్ ▸▸ జోరుగా ప్రాక్టీస్

రేపటి నుంచే మూడో టెస్టు
ఉ. 5.50 నుంచి



బ్రిస్బేన్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా శనివారం నుం చి ఆస్ట్రేలియాతో జరిగే మూడో టెస్టు కోసం రోహిత్ సేన ముమ్మరంగా ప్రాక్టీస్ సాగిస్తోంది. అలాగే 1-1తో సిరీస్ సమమైన వేళ ఇరు జట్లకు ఈ మ్యాచ్ అత్యంత కీలకమే. అందుకే అత్యంత పకడ్బందీగా బరిలోకి దిగాలని టీమిండియా భావిస్తోంది. దీంట్లో భాగంగా తుది జట్టులోనూ మార్పులు ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా బౌలింగ్ విభాగంలో పేసర్ హర్షిత్ రాణాపై వేటు పడే చాన్సుంది. అతడి స్థానంలో మరో పేసర్ ఆకాశ్ దీప్‌ను ఆడించేందుకు కోచ్ గౌతం గంభీర్ మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. పెర్త్ టెస్టులో మెరుగ్గా రాణించిన రాణా.. గులాబీ బంతితో తేలిపోయాడు. దీంతో బుమ్రా, సిరాజ్‌లపైనే అధిక ఒత్తిడి పడింది. తొలి ఇన్నింగ్స్‌లో 16 ఓవర్లు వేసిన తను 86 పరుగులిచ్చుకోవడం గమనార్హం. దీంతో గాబా టెస్టులో అతడిని తప్పించి ఆకాశ్‌ను తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తోంది. దీనికి తగ్గట్టుగానే గురువారం నాటి నెట్స్‌లో ఆకాశ్ తీవ్రంగా సాధన చేశాడు. బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్ చేయడం కూడా కనిపించింది. కొత్త బంతితో చక్కటి స్వింగ్‌ను రాబట్టే ఆకాశ్‌ను ఆరంభంలో వినియోగించుకుంటే.. సిరాజ్ మధ్య ఓవర్లలో బ్యాటర్లను ఇబ్బందిపెట్టగలడు. గత టెస్టులో బుమ్రా, సిరాజ్ ఓవర్లను ఓపిగ్గా ఆడి మూడో పేసర్ రాణాను టార్గెట్ చేశారు. అందుకే ఈసారి ఆసీస్ బ్యాటర్లను వణికించే పేస్ త్రయంతో బరిలోకి దిగాలనుకుంటోంది. మరోవైపు కెప్టెన్ రోహిత్ ఓపెనర్‌గా వస్తాడా? లేక మిడిలార్డర్‌లోనే కొనసాగుతాడా? అనేది సస్పెన్స్‌గానే ఉంది. ప్రాక్టీస్‌లో కొత్త బంతిని ముందుగా ఓపెనర్లు రాహుల్, జైస్వాల్ ఎదుర్కొన్నారు. బంతి కాస్త పాతది అయ్యాక రోహిత్ బ్యాటింగ్ చేశాడు. కాసేపయ్యాక రాహుల్‌తో కలిసి మరో నెట్స్‌లో కొత్త బంతితోనూ సాధన చేయడం విశేషం. అలాగే నెట్స్ ఆరంభానికి ముందు ఆటగాళ్లంతా సర్కిల్‌లో నిల్చోగా విరాట్ కోహ్లీ ఉత్తేజపూరితంగా సంభాషించాడు.

సచిన్‌ను అనుసరించు: సన్నీ

ఆఫ్‌స్టంప్‌నకు ఆవల బంతులను వేటాడి వికెట్‌ను సమర్పించుకోవడం విరాట్ కోహ్లీకి అలవాటు. అడిలైడ్ టెస్టులోనూ అదే రీతిన వెనుదిరిగాడు. అందుకే అతడిని సచిన్ ఆటతీరును అనుసరించాలని మాజీ కెప్టెన్ గవాస్కర్ సూచించాడు. 'సచిన్‌కు కూడా ఇలాంటి బలహీనతే ఉండేది. కానీ 2004 సిడ్నీ టెస్టులో దాన్ని అధిగమిస్తూ ఆఫ్‌స్టంప్ ఆవల వేసిన బంతులను పూర్తిగా వదిలేశాడు. ఒక్క కవర్‌డ్రైవ్ కూడా ఆడకుండా అక్కడ డబుల్ సెంచరీ సాధించాడు. అందుకే విరాట్ కూడా అదే రీతిన ఆడేందుకు ప్రయత్నించాలి. స్ట్రయిట్‌గా ఆడి మిడాన్, మిడ్ వికెట్ మీదుగా పరుగులు సాధించవచ్చు' అని సన్నీ సూచించాడు.

షమి.. ఇక కష్టమే

వెటరన్ పేసర్ మహ్మద్ షమి ఆస్ట్రేలియా పర్యటన దాదాపుగా లేనట్టే. ఎందుకంటే.. ఈనెల 21నుంచి జనవరి 18 వరకు జరిగే విజయ్ హజారే వన్డే ట్రోఫీలోనూ బెంగాల్ జట్టు షమిని ఆడించాలనుకుంటోంది. ఇప్పటికే తను సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పూర్తి మ్యాచ్‌లు ఆడి 11 వికెట్లు తీసిన సంగతి తెలిసిందే.

సెమీస్ ఆశలు సజీవం

రెండో మ్యాచ్‌లో గాయత్రి జోడీ విజయం

హాంగ్జౌ (చైనా) : వరల్డ్ టూర్ ఫైనల్స్ గ్రూపు దశ తొలి మ్యాచ్ ఓటమి నుంచి భారత జోడీ గాయత్రి/ట్రీసా జాలీ త్వరగానే కోలుకుంది. రెండో మ్యాచ్ విజయంతో ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ సెమీఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. గ్రూప్ 'ఏ'లో గురువారం జరిగిన ఉత్కంఠ భరిత రెండో మ్యాచ్‌లో గాయత్రి గోపీచంద్/ట్రీసా జాలీ జంట 21-19, 21-19తో మలేసియా ద్వయం పియర్లీ టాన్/తినా మురళీధరన్‌ను చిత్తు చేసింది. నాలుగు జట్లు తలపడుతున్న ఈ గ్రూప్‌లో గాయత్రి జోడీ ప్రస్తుతం చైనా తర్వాత రెండో స్థానంలో కొనసాగుతోంది. మలేసియా జంటతో పోరులో ఆది నుంచే దూకుడు ప్రదర్శించిన గాయత్రి/ట్రీసా తొలి గేమ్‌లో 6-2 ఆధిక్యానికి దూసుకు పోయింది. ఈ దశలో మలేసియా జంట పుంజుకోవడంతో గేమ్ రసవత్తరంగా మారింది. అయితే ఒత్తిడిని అదిమిపట్టిన భారత జోడీ మొదటి గేమ్‌ను సొంతం చేసుకుంది. ఇక రెండో గేమ్‌కూడా నువ్వా..నేనా అనేలా సాగింది. ఈక్రమంలో మలేసియా ద్వయం స్వల్ప ఆధిక్యం దక్కించుకున్నా..గాయత్రి జంట గేరు మార్చడంతో గేమ్ హోరాహోరీగా సాగింది. కానీ ఒత్తిడిని దరిచేరనీయని గాయత్రి/ట్రీసా గేమ్‌ను నెగ్గి జయకేతనం ఎగుర వేసింది.



అండర్-19 మహిళల ఆసియా కప్

భారత జట్టులో త్రిష, షబ్నమ్


నికీ ప్రసాద్

న్యూఢిల్లీ : మొట్టమొదటి జూనియర్ మహిళల ఆసియా కప్ క్రికెట్‌లో పాల్గొనే భారత జట్టును గురువారం ప్రకటించారు. ఈనెల 15 నుంచి 22 వరకు కౌలాలంపూర్‌లో జరిగే ఈ టోర్నీలో తలపడే జట్టుకు నికీ ప్రసాద్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. జట్టులో తెలుగు క్రికెటర్లు జి.త్రిష, ఎండీ షబ్నమ్‌తోపాటు స్టాండ్ బైగా కావ్యశ్రీకి చోటు లభించింది. పాకిస్థాన్, నేపాల్ జట్లతో కలిసి గ్రూప్ 'ఎ'లో భారత్ తలపడనుంది. గ్రూప్ 'బి'లో బంగ్లాదేశ్, శ్రీలంకతోపాటు ఆతిథ్య మలేసియా అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. 15న జరిగే ఆరంభ మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను భారత్ ఢీకొననుంది. 17న నేపాల్‌తో ఆడనుంది. రెండు గ్రూపుల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచే జట్లు సూపర్-4కి అర్హత సాధిస్తాయి.

రోహిత్ స్థూలకాయుడు : కలినన్



జొహాన్నెస్‌బర్గ్: అధిక బరువును కలిగి ఉండే భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఇంకెంతో కాలం క్రికెట్ ఆడలేడని దక్షిణాఫ్రికా మాజీ బ్యాటర్ డారిల్ కలినన్ అభిప్రాయపడ్డాడు. ఫ్లాట్ ట్రాక్‌పై మాత్రమే అతడు బ్యాటింగ్ చేయగలడని ఎద్దేవా చేశాడు. 'విరాట్, రోహిత్ శరీరాలను ఓసారి గమనించండి. రోహిత్ చాలా బరువుతో ఉంటాడు. అందుకే తను ఎక్కువకాలం క్రికెట్‌లో ఉండలేడు. సుదీర్ఘ టెస్టు సిరీస్‌ల్లో ఆడే ఫిట్‌నెస్ కూడా అతనికి లేదు. పైగా తను స్వదేశంలోనే మెరుగ్గా ఆడుతూ, విదేశీ పిచ్‌లపై తేలిపోతుంటాడు. దక్షిణాఫ్రికాలో షార్ట్‌పిచ్ బంతులను బాల్స్‌ను ఆడడంలో ఎప్పుడూ విఫలమవుతుంటాడు' అని కలినన్ విమర్శించాడు.



తెలుగు టైటాన్స్‌కు మరో ఓటమి

పుణె: ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్‌కు మరో ఓటమి ఎదురైంది. గురువారం దబాంగ్ ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌లో 27-33 తేడాతో ఓడింది. ఈ విజయంతో ఢిల్లీ 61 పాయింట్లతో పట్టికలో రెండో స్థానానికి చేరింది. ఈ పోరు హోరాహోరీగా సాగినప్పటికీ చివర్లో నవీన్ కుమార్ సూపర్ 10 సాధించడంతో ఢిల్లీ నాలుగు పాయింట్లతో ఆధిక్యంలోకి వెళ్లింది. మొత్తంగా నవీన్ 11 పాయింట్లు సాధించాడు. ఆ తర్వాత యూపీ యోధ-బెంగాల్ వారియర్స్ మధ్య జరిగిన మ్యాచ్ 31-31 స్కోరుతో టైగా ముగిసింది.

మన అమ్మాయిలకు జరిమానా

బ్రిస్బేన్: ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌ను భారత మహిళల జట్టు 0-3తో కోల్పోయింది. అయితే, రెండో వన్డేలో స్లో ఓవర్ రేట్ కారణంగా భారత జట్టు మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించారు. నిర్ణీత సమయంలో వేయాల్సిన దానికంటే 2 ఓవర్లు వెనుకబడినట్టు మ్యాచ్ రెఫరీ తేల్చాడు.

ధరణి పోర్టల్ తాత్కాలిక బంద్

హైదరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్ సేవలు సాంకేతిక కారణాల రీత్యా నాలుగు రోజుల పాటు అందుబాటులో ఉండవని ప్రధాన భూ పరిపాలనా కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. 12వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటల నుంచి 16వ తేదీ సోమవారం ఉదయం వరకు సేవలు అందుబాటులో ఉండవని తెలిపింది. ధరణి పోర్టల్ డేటాబేస్ వెర్షన్ అప్‌గ్రేడ్ చేస్తున్నందున ఈ అంతరాయం ఏర్పడిందని పేర్కొంది. సాంకేతిక సమస్యల వల్ల తలెత్తిన అసౌకర్యానికి చింతిస్తున్నామని, సోమవారం ఉదయం నుంచి సేవల పునరుద్ధరణ ఉంటుందని వివరించింది. ధరణి పోర్టల్ డిసెంబరు 1 నుంచి జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) నిర్వహణలోకి వచ్చిన విషయం విదితమే.

ఆర్థిక సంఘం నివేదికలు అసెంబ్లీలో ప్రవేశపెట్టేలా ఆదేశించండి

- గవర్నర్‌కు ఎఫ్‌జీజీ లేఖ

హైదరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక సంఘం నివేదికలను అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆ సంఘం సిఫారసుల మేరకు స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీలకు నిధులు విడుదల చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి గురువారం రాష్ట్ర గవర్నర్‌కు లేఖ రాశారు. గత తొమ్మిదేళ్లుగా ఆర్థిక సంఘం నివేదికలను అసెంబ్లీలో ప్రవేశపెట్టడంలేదని, ఇప్పటికైనా ప్రవేశపెట్టి వాటిపై చర్చ జర్గేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని గవర్నర్‌ను కోరారు. గవర్నర్ రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయాలంటూ రాజ్యాంగంలోని 243అధికరణ నిర్దేశిస్తోందని, ఈ మేరకు ఏర్పాటవుతున్న ఆర్థిక సంఘాలు... రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు నిధులివ్వాలంటూ ప్రభుత్వానికి నివేదిస్తున్నాయని తెలిపారు. ఈ నివేదికలను అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చించాల్సి ఉంటుందని, సభ ఆమోదం పొందాక స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంటుందన్నారు.

తెలంగాణ సంస్కృతిపై దాడి : బండి సంజయ్

హైదరాబాద్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతిపై దాడి జరుగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ మాయమైందని, బతుకమ్మ మన పండుగే కాదన్న ప్రచారం మొదలైందని ఆయన అన్నారు. "తెలంగాణ వేడుకల్లో జానపదం కనుమరుగవుతోంది. బాసరలో లడ్డూలు అందకుండా పోతున్నాయి. కొమురవెల్లి ప్రసాదంలో నాణ్యత లేకుండా పోతున్నది. వేములవాడలో మొక్కులుగా చెల్లించే కోడెలు మాయమైపోతున్నాయి. పండుగల మీద ఆంక్షలు పెరుగుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ ఆలయాలపై దాడులు జరుగుతున్నాయి" అని ఎక్స్ వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చూసీ చూడనట్లు వదిలేస్తోందా? లేక ప్రభుత్వమే ఈ సాంస్కృతిక దాడిని చేయిస్తోందా? అని బండి సంజయ్ ప్రశ్నించారు.

'బయ్యారం' కోసం బీజేపీ ఎంపీలు పోరాడాలి

- ఉక్కు పరిశ్రమపై కిషన్‌రెడ్డి ప్రకటన బాధాకరం: కవిత

హైదరాబాద్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కాదంటూ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చేసిన ప్రకటనపై బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కల్వకుంట కవిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డి ప్రకటన బాధాకరమని అన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు బీజేపీ ఎంపీలు పోరాడాలని డిమాండ్ చేస్తూ గురువారం ఓ ప్రకటన చేశారు. నాణ్యమైన ముడి ఇనుము లభించదనే సాకుతో బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కాదని చెప్పి కేంద్ర ప్రభుత్వం తప్పించుకోవడాన్ని కవిత విమర్శించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ హామీ కాదని విభజన చట్టంలోని అంశమని గుర్తు చేశారు. కాగా, మహిళలకు కాంగ్రెస్ నాయకులు క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ డిమాండ్‌చేశారు. బతుకమ్మ చీరలు అడిగితే అసలు బతుకమ్మే లేదన్నట్లుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పిల్లలు చనిపోతుంటే పట్టించుకోరా?

- రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోంది?: సబిత, సత్యవతి రాథోడ్

వికారాబాద్, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో పిల్లలు చనిపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తోంది. ప్రధాన ప్రతిపక్షంగా మేం ప్రశ్నిస్తాం' అని మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం తాండూరు హాస్టల్‌లో అస్వస్థకు గురైన విద్యార్థులను పరామర్శించడానికి వెళ్తున్న వారిని వికారాబాద్ చెన్నారెడ్డి విగ్రహం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు అక్కడికి చేరుకుని రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వారిని చన్‌గోముల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

జనగణనలో కులగణన చేయాలి

- బీసీ మేధావుల సంఘం చైర్మన్ టి.చిరంజీవులు

న్యూఢిల్లీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జనగణనలో కులగణనను చేపట్టకపోతే ఓబీసీ నేతలతో కలిసి జాతీయ స్థాయిలో ఉద్యమం చేస్తామని బీసీ మేధావుల సంఘం హెచ్చరించింది. గురువారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో పలువురు బీసీ నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం చైర్మన్ టి. చిరంజీవులు మాట్లాడుతూ... గతంలో హామీ ఇచ్చిన మేరకు బీజేపీ ప్రభుత్వం కులగణన చేయకపోవడం ఆ పార్టీ ద్వంద నీతికి నిదర్శనమని విమర్శించారు. అన్ని పార్టీలు డిమాండ్ చేస్తున్నప్పటికీ కులగణన చేపట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. బీసీల్లో రాజకీయ చైతన్యం వచ్చేంత వరకు నిరంతరం పోరాటాలు చేయాలని తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూధనాచారి పేర్కొన్నారు. కేంద్ర విద్యాసంస్థలలో అధ్యాపక ఖాళీల భర్తీలో ఓబీసీ రిజర్వేషన్లను అమలుచేయాలని అఖిల భారత విద్యార్థి సంఘం అధ్యక్షుడు గౌడ కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు.

మా కులాల పేర్లు మార్చండి

- బీసీ కమిషన్‌కు విజ్ఞప్తులు

హైదరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమ కులాల పేర్లను మార్చాలని దొమ్మర, వంశరాజ్, తమ్మలి కుల సంఘాల ప్రతినిధులు బీసీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. కమిషన్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో పలు సంఘాల నాయకులు వినతి పత్రాలు అందించారు. దొమ్మర కుల ప్రతినిధులు మాట్లాడుతూ.. తమ కులం పేరును గడవంశీగా మార్చాలని కోరారు. తమ కులంలో ఉన్న పిచ్చగుంట్ల అనే పదాన్ని పూర్తిగా తొలగించాలని వంశరాజ్ కులంవారు విజ్ఞప్తి చేశారు. నాన్ బ్రాహ్మిణ్, శూద్ర అనే పదాలను తమ కులం పేరు నుంచి తొలగించాలని తమ్మలి కులం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ పదాలతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.

సాహితీ ఇన్‌ఫ్రాపై మనీ లాండరింగ్ కేసు

- ఈడీ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న కోర్టు
- లక్ష్మీనారాయణ, పూర్ణచంద్రరావుకు సమన్లు

హైదరాబాద్, డిసెంబర్ 12(ఆంధ్రజ్యోతి): మోసానికి పాల్పడిందంటూ సాహితీ ఇన్‌ఫ్రా కంపెనీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అధికారులు గురువారం మెదటి ఎంఎస్‌జే కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లైంట్(పీసీ) దాఖలు చేశారు. ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బి.లక్ష్మీనారాయణ, సేల్స్ హెడ్ పూర్ణచంద్రరావుతోపాటు ఆ కంపెనీపైనా మనీలాండరింగ్ నిరోధక (పీఎంఎల్ఏ) చట్టం కింద నేరారోపణలు చేశారు. ఈడీ దాఖలు చేసిన పీసీని కోర్టు పరిగణనలోకి తీసుకుని తదుపరి విచారణకు నిందితులకు సమన్లు జారీ చేసింది. దాదాపు రూ.1500కోట్ల మోసానికి పాల్పడ్డారంటూ సీసీఎస్‌లో నమోదైన కేసు ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టిన విషయం తెలిసిందే. ప్రీలాంచ్ ఆఫర్ల పేరిట వేలమంది నుంచి లక్ష్మీనారాయణ అతని బృందం డబ్బు వసూలు చేసి వారికి ఇళ్లు కట్టి ఇవ్వకుండా, ఆ డబ్బును సొంత అవసరాలకు మళ్లించినట్లు ఈడీ అధికారుల విచారణలో వెల్లడైంది.

కేసీఆర్ వ్యక్తిగత కార్యదర్శిగా నాగేందర్‌రెడ్డి!

మర్కుక్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యక్తిగత కార్యదర్శిగా మర్కుక్ మండల వ్యవసాయాధికారి నాగేందర్‌రెడ్డిని నియమించినట్లు తెలిసింది. కొంతకాలంగా ఈ స్థానం ఖాళీగా ఉండటంతో నాగేందర్‌రెడ్డిని నియమించినట్లు సమాచారం.

రైతుకు ఛాతీనొప్పి వస్తే..

సంకెళ్లు వేసి ఆస్పత్రికి

లగచర్ల రిమాండ్ ఖైదీ, రైతు హీర్యా నాయక్‌కు అస్వస్థత.. జైలు నుంచి బేడీలు తగిలించి ఆస్పత్రికి తరలింపు

- రైతుకు బేడీలు వేయాల్సినఅవసరమేంటి?
- పోలీసుల తీరుపై సీఎం రేవంత్ ఆగ్రహం
- రేవంత్ క్రూరత్వానికి నిదర్శనం: కేటీఆర్
- ఇదేనా ప్రజాపాలన: హరీశ్



సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రైతు హీర్యా నాయక్‌ను బేడీలతో తీసుకొచ్చిన పోలీసులు

సంగారెడ్డి అర్బన్, బొంరాస్‌పేట్, హైదరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి సెంట్రల్ జైల్లో 'లగచర్ల' రిమాండ్ ఖైదీ, గిరిజన రైతు గురువారం ఛాతీనొప్పి రావడంతో అస్వస్థతకు గురయ్యాడు. ఆ రైతు చేతికి అధికారులు సంకెళ్లు తగిలించి జైల్లోంచి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. నెల క్రితం వికారాబాద్ జిల్లా లగచర్ల గ్రామంలో ఫార్మాసిటీ ఏర్పాటుకు వ్యతిరేకంగా అన్నదాతలు జరిపిన ఆందోళనలో కలెక్టర్, ఇతర అధికారులపై దాడి చేశారన్న ఆరోపణలతో కొందరు రైతులను పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు రిమాండ్ విధించడంతో వారిని సంగారెడ్డి సమీపంలోని కంది జైలుకు తరలించారు. రిమాండ్ ఖైదీల్లో హీర్యా నాయక్ (45) అనే రైతుకు బుధవారం ఛాతీనొప్పి రావడంతో జైలు అధికారులు సంగారెడ్డిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేయించి, జైలుకు తీసుకెళ్లారు. మళ్లీ గురువారం ఛాతీనొప్పి రావడంతో ఆయన్ను మరోసారి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు 2డీ-ఈకో, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. రిపోర్టులన్నీ నార్మల్‌గా వచ్చాయి. అయితే యాంజియోగ్రామ్ తీసేందుకు, మెరుగైన చికిత్స నిమిత్తం నిమ్స్‌కు తరలించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్ వెల్లడించారు. సంగారెడ్డి ఆస్పత్రిలో హీర్యానాయక్‌ను ఆస్పత్రిలో తండ్రి రూప్లానాయక్, తల్లి లక్ష్మీబాయి, భార్య దేవీబాయి.. న్యాయవాదితో కలిసి వచ్చి పరామర్శించారు. తన కుమారుడికి ఏమైనా జరిగితే సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు తిరుపతిరెడ్డిదే బాధ్యత అని హీర్యానాయక్ తండ్రి రూప్లానాయక్ పేర్కొన్నారు. కుమారుడికి జరగకూడదనిది జరిగితే రేవంత్ సోదరుల ఇంటికి ముందుకే తీసుకొస్తామని హెచ్చరించారు. హీర్యానాయక్‌ను చూసేందుకు ఇతర కుటుంబసభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు రాగా పోలీసులు లోపలికి అనుమతించలేదు. దీనిపై గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్, పట్టణ సీఐ రమేశ్‌తో వాగ్వాదానికి దిగారు. సంగారెడ్డి ఆస్పత్రి వద్ద హీర్యానాయక్‌ను స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరామర్శించారు. కాగా లగచర్ల రైతుల బెయిల్ కోసం కృషిచేస్తున్నామని వారి తరఫున్యాయవాది వికారాబాద్‌కు చెందిన రాంచర్‌రావు పేర్కొన్నారు.

రేవంత్ క్రూర మనస్తత్వానికి నిదర్శనం: కేటీఆర్

గిరిజన రైతు హీర్యానాయక్ గుండెనొప్పితో బాధపడుతున్న సమయంలో ఆయన చేతికి బేడీలు వేయడంపై బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రేవంత్ రెడ్డి క్రూర మనస్తత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. రేవంత్ జైపూర్‌లో విందులు, వినోదాలతో జల్సాలు చేసుకుంటూ చిందులు వేస్తున్నారని, తెలంగాణ గిరిజన రైతులు మాత్రం ప్రాణాపాయస్థితిలో జైళ్లలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీకి మనసుంటే, గిరిజనుల పట్ల నిజమైన ప్రేమ ఉంటే.. ప్రభుత్వం పెట్టిన కేసులు రద్దు చేయించేలా ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాము చెప్పిందే వినాలన్న అహంకారంతోనే, రేవంత్ రెడ్డి ఆయన సోదరులు గిరిజన రైతన్నల ప్రాణాలు తీస్తున్నారని ఆరోపించారు. గుండెపోటు వచ్చిన వారిని స్ట్రెచర్ మీదనో, అంబులెన్స్‌లోనో కాకుండా బేడీలు వేసి తీసుకుని వచ్చి బెడ్‌పై పడుకోబెట్టడం క్షమార్హమైన విషయం కాదన్నారు. రాజ్యాంగంలోని 14, 19, 21 ఆర్టికల్స్ ప్రకారం వారి హక్కులను హరించడమేనని, జైలు నిబంధనలు, బీఎన్ఎస్ ప్రకారం కూడా విచారణ ఖైదీల హక్కులను హరించడమేనన్నారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ ఘటనను సుమోటోగా స్వీకరించాలని కోరారు. గవర్నర్ జోక్యం చేసుకుని తగిన విచారణకు ఆదేశించాలని విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. హైదరాబాద్ నందినగర్‌లోని తన ఇంట్లో గురువారం విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. జైల్లో ఉన్న హీర్యానాయక్‌కు బుధవారం గుండెనొప్పి వస్తే వైద్య సాయం అందించడంలో ప్రభుత్వం అలసత్వం చూపిందని ఆరోపించారు. హీర్యానాయక్ గుండెనొప్పితో బాధపడుతున్న విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు తెలియనివ్వకుండా, బయటకు చెప్పకుండా దాచిపెట్టే ప్రయత్నం చేయడం ద్వారా ప్రభుత్వం అమానవీయంగా వ్యవహరించిందని ఆరోపించారు. తాము ఒత్తిడి చేయడంతోనే మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారని చెప్పారు. లగచర్ల కేసుల్లో అరెస్టు అయిన రాఘవేంద్ర, బసప్ప కూడా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, తమ నాయకుడు పట్నం నరేందర్ రెడ్డికి అనేక ఆరోగ్య సమస్యలున్నాయని పేర్కొన్నారు దేశానికి అన్నం పెట్టే రైతన్న చేతికి బేడీలు వేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న లగచర్ల రైతులకు బేడీలు వేసి తీసుకెళ్లడం హేయమైన చర్య అంటూ ఆయన ట్వీట్ చేశారు. రైతు హీర్యానాయక్ ఉగ్రవాదా? దోపిడీ దొంగనా? ఇదేనా మీ ఇందిరమ్మ రాజ్యం? ఇదేనా మీ ప్రజాపాలన? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

బీఆర్ఎస్‌కు ఎలా తెలిసింది?

హీర్యానాయక్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లేక్రమంలో చేతికి బేడీలు వేసిన ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఈ ఘటనపై ఉన్నతాధికారులు దర్యాప్తు ప్రారంభించారు. మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ సంగారెడ్డి జైలుకు వెళ్లి జరిగిన సంఘటనపై విచారణ చేపట్టారు. పోలీసు విచారణలో కొన్ని షాకింగ్ విషయాలు బయటపడినట్లు సమాచారం. ఫలితంగా మొత్తం వ్యవహారంలో ప్రభుత్వాన్ని అప్రతిష్టపాల్జేసే కుట్ర కోణం ఉందా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే రైతుకు బేడీలు వేసిన ఘటనపై సంగారెడ్డి జైలర్ సంజీవరెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. కాగా లగచర్ల ఈ కేసులో ఏ2గా ఉన్న బీఆర్ఎస్ నాయకుడు సురేశ్ గురువారం ఉదయం ఏడుగంటలకు జైలు నుంచి తన ఇంటికి రెండు సార్లు ఫోన్ చేశారు. భార్య, బావమరిదితో మాట్లాడారు.. దీంతో సురేశ్ ద్వారానే హీర్యానాయక్ ఆస్పత్రికి తరలింపు విషయం బయటకు పొక్కి ఉండవచ్చుననే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హీర్యానాయక్ ను ఆసుపత్రికి తీసుకుని వెళ్తున్న విషయం బయటున్న బీఆర్ఎస్ లేదా మీడియాకు ఎలా తెలుస్తుంది అనే కోణంలో విచారణ చేపట్టినపుడు సురేశ్ చేసిన ఫోన్లు అనుమానాలకు తావిస్తున్నాయి.

పోలీసుల తీరుపై సీఎం ఆగ్రహం

లగచర్ల రైతుకు బేడీలు వేసి, తీసుకెళ్లాల్సినంత అవసరం ఏమొచ్చిందంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపి, పూర్తి నివేదికను సమర్పించాలంటూ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రజాప్రభుత్వం ఇలాంటి చర్యలను ఏమాత్రం సహించబోదని హెచ్చరించారు.

రైతుకు బేడీలు దుర్మార్గం : బీజేపీ

లగచర్ల రైతుకు బేడీలు వేయడం కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గపు చర్య అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కాసం వెంకటేశ్వర్లు, జి. ప్రేమేందర్‌రెడ్డిలు విమర్శించారు. రైతు రాజ్యం తెస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, ఈ ఘటనతో రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నిరసనలపై రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరికాదని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



సూర్యాపేట జిల్లా రావిపహాడ్ సమీపంలోని ఎన్ఎంకే ఇథనాల్ కంపెనీ వద్ద ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు, ప్రజలు

సూర్యాపేట జిల్లాలో ఇథనాల్ మంటలు!

- రావిపహాడ్‌లో ఫ్యాక్టరీ వద్ద స్థానికుల ఆందోళన.. పోలీసులతో ఘర్షణ
- మహిళల పట్ల ఏఎస్సై దురుసు ప్రవర్తన

మోతె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మోతె మండలం రావిపహాడ్‌లో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ ఎదుట గురువారం అఖిలపక్షం చేపట్టిన మహాధర్నా ఉద్రిక్తతకు దారితీసింది. ఆందోళనకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఫ్యాక్టరీ తాళం పగులగొట్టే ప్రయత్నం చేయడంతో వారికి పోలీసులకు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. ఈ క్రమంలో ఏఎస్సై సత్యనారాయణ ఓ మహిళ చేయిపట్టుకుని, అభ్యంతరకరంగా మాట్లాడడంతో ఇతర మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రావిపహాడ్‌లో ఎన్ఎంకే బయో ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ చేపడుతున్న ఇథనాల్ ఫ్యాక్టరీపై స్థానికులు కొద్దిరోజులుగా ఆందోళన నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ యజమానులు ఫ్యాక్టరీ నిర్మాణం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆత్మకూరు(ఎస్), రావిపహాడ్, అప్పన్నగూడెం, సర్వారం, శెట్టిగూడెం, ఆవాసతండా, కొత్తగూడెం గ్రామాల నుంచి రైతులు, ప్రజలు పార్టీలకు అతీతంగా తరలివచ్చి మహాధర్నాలో పాల్గొన్నారు. ప్రజాభిప్రాయం సేకరించకుండా అక్రమ మార్గంలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మిస్తున్నారని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆరోపించారు. ఇథనాల్ ఫ్యాక్టరీతో చుట్టుపక్కల 10 గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూములు దెబ్బతింటాయన్నారు. ఫ్యాక్టరీకి రోజూ 7.50 లక్షల లీటర్ల నీరు అవసరం ఉంటుందని, దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఉదయం 10గంటలకు ఆందోళన ప్రారంభించగా.. మధ్యాహ్నం 12 గంటలైనా నిర్వాహకులు, అధికారులు ఎవరూ రాకపోవడంతో మహిళలు, రైతులు ఫ్యాక్టరీ గేట్ల తాళాలు పగులగొట్టేందుకు ప్రయత్నించారు. దీంతో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, మోతె ఎస్సై యాదవేందర్ రెడ్డి సిబ్బందితో వచ్చారు. ఫ్యాక్టరీలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించిన ప్రజలను చెదరగొట్టారు. సుమారు రెండు గంటల పాటు ఉద్రిక్తత కొనసాగింది. పోలీసుల తీరుపై గుమ్మడి నర్సయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నిర్వాహకులు పోలీసుల సమక్షంలో ప్రజలతో చర్చించారు. రెండు, మూడు రోజుల్లో ఫ్యాక్టరీ నిర్వహణ తీరు, ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తామని నిర్వాహకులు చెప్పడంతో ప్రజలు ధర్నాను విరమించారు.

ఆర్‌బీఐ నివేదిక కాంగ్రెస్‌కు చెంపపెట్టు

- పదేళ్లలో మేం చేసిన అప్పు రూ.3.22లక్షల కోట్లు మాత్రమే
- రేవంత్ మాటల వల్ల రాష్ట్రానికి పెట్టుబడులు తగ్గాయి: హరీశ్‌రావు



సిద్దిపేట/సిద్దిపేట అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల తెలంగాణ అభివృద్ధిపై రిజర్వు బ్యాంకు విడుదల చేసిన నివేదికతోనైనా రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు కళ్లు తెరవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు సూచించారు. అబద్ధాలను ప్రచారం చేసే కాంగ్రెస్‌కు ఆ నివేదిక చెంపపెట్టు అని వ్యాఖ్యానించారు. తెలంగాణ దివాళా తీసిన రాష్ట్రం కాదని, దివ్యంగా వెలిగిన రాష్ట్రమని ఆర్‌బీఐ తేల్చిచెప్పిందన్నారు. గురువారం ఆయన సిద్దిపేటలో విలేకరులతో మాట్లాడారు. అబద్ధాల పునాదులపై ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అవే అబద్ధాలను ప్రచారం చేస్తూ కాలం గడుపుతున్నదని విమర్శించారు. గడిచిన పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.3 లక్షల 22 వేల 499 కోట్లు మాత్రమే అప్పు చేసిందని పేర్కొన్నారు. కానీ రూ.7లక్షల కోట్లకు పైగా అప్పులు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పదే పదే ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వీరి ఆరోపణల వల్లనే తెలంగాణకు పెట్టుబడులు తగ్గాయని, అప్పుల రాష్ట్రంగా చూస్తున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ సంపద పెంచడమేగాకుండా రెట్టింపు చేశారనే విషయాన్ని ఆర్‌బీఐ రిపోర్టులో ఉందన్నారు. తెలంగాణలో లక్షల కోట్ల ఆస్తులను సమకూర్చడంతోపాటు లక్షల కోట్ల రూపాయలను సంక్షేమం, అభివృద్ధి పేరిట పేదలకు పంచారని హరీశ్‌రావు అన్నారు. ఇప్పటికైనా విషప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. 2014వరకు తెలంగాణ జీఎస్‌డీపీ రూ.4.3 లక్షల కోట్లు ఉంటే 2023-24వరకు రూ.15.01లక్షల కోట్లకు చేరిందని, 249% వృద్ధిరేటు పెరిగిందని హరీశ్‌రావు వెల్లడించారు. ప్రజల తలసరి ఆదాయం కూడా రూ.1,03,889 నుంచి రూ.3,56,564కు పెరిగి 243% వృద్ధిరేటు నమోదు చేసుకుందని తెలిపారు. 91లక్షల టన్నులు మాత్రమే పండిన ధాన్యం ఉత్పత్తిని పదేళ్లలో 2కోట్ల టన్నులకు చేర్చిన విషయాన్ని ఆర్‌బీఐ పొందుపర్చడం తమకు గర్వకారణమని చెప్పారు. తెలంగాణలో బీఆర్ఎస్ సృష్టించిన ఆస్తులను కాంగ్రెస్ ప్రభుత్వం వెలుగు చూడనివ్వడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల క్రమబద్ధీకరణకు పోరాటం

సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, వారి పోరాటానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని హరీశ్ తెలిపారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేటలో నాలుగు రోజులుగా సమగ్ర శిక్షా ఉద్యోగులు దీక్ష కొనసాగిస్తున్నారు. వారి దీక్షకు హరీశ్‌రావు సంఘీభావం తెలిపి, మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.

అధికారమా నీకింతటి కాఠిన్యమా?

(మొదటిపేజీ తరువాయి)

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బాలల సంరక్షణ విభాగం (డీసీపీవో) అధికారులు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. వారిలో తొమ్మిదిమంది తల్లిదండ్రులు పిల్లలను తమకు చట్టబద్ధంగా దత్తత ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై నిర్ణయం తీసుకోవాల్సిందిగా మేడ్చల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ)ని న్యాయస్థానం ఆదేశించింది. ఆ క్రమంలో ఇంతకాలం పెంచిన వారిని కాదంటూ, చట్టబద్ధంగా మరొకరికి పిల్లలను దత్తత ఇవ్వాలని సీడబ్ల్యూసీ నిర్ణయాన్ని వెల్లడించింది. ఆ మేరకు డీసీపీవో గురువారం పిల్లల ఫొటోలు, పేర్లతో సహా పత్రికా ముఖంగా ప్రకటించింది. పిల్లలను కన్నవారు తగిన సాక్ష్యాధారాలతో జిల్లా సంక్షేమ అధికారిని నెలరోజుల్లోగా సంప్రదించకుంటే, వాళ్లను తల్లిదండ్రులు వదిలిపెట్టిన పిల్లలుగా ప్రకటిస్తాం.. తదనంతరం చట్టప్రకారం దత్తత ఇస్తామన్నది ఆ ప్రకటన సారాంశం. దాంతో.. ఆరునెలలుగా ఇన్నాళ్లు తాము పెంచుకున్న పిల్లలను తిరిగి తమకే అప్పగించాలంటూ న్యాయపోరాటం సాగిస్తున్న ఆ తొమ్మిదిమంది పెంపుడు తల్లిదండ్రులకు శోకమే మిగిలింది. వాళ్ల కన్నీటి విజ్ఞాపనలకు అధికారుల గుండెలు కరగకపోగా, ఈ విషయంపై మరింత కాఠిన్యం ప్రదర్శించడం బాధాకరం. "కన్నవారెవరో తెలియని పసికందులను ప్రాణంకన్నామిన్నగా ప్రేమించిన మా నుంచి దూరంచేయడం న్యాయమేనా.? ఇంత కాలం మా ఒడిలో పెరిగిన పిల్లలు ఇప్పుడు మరొకరిని అమ్మా నాన్న అని అనగలరా? చట్టాలు మనుషుల కోసమే కదా" అంటూ తొమ్మిదిమంది తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మానవత్వంతోనైనా కనికరించి, మా బిడ్డలను మాకు ఇవ్వండి అంటూ వేడుకుంటున్నారు.

పిల్లలను అడగాలి కదా?

తొమ్మిదిమంది పిల్లల్లో నలుగురు మూడు నుంచి నాలుగేళ్ల మధ్య వయస్కులు. మిగతా పిల్లలు కూడా ఇన్నాళ్లు తమను పెంచిన వారినే తల్లిదండ్రులుగా గుర్తించేంత ఊహకలిగినవారే! సీడబ్ల్యూసీ నిర్ణయం తీసుకోవడానికి ముందు పిల్లల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నది జువైనల్ జస్టిస్ చట్టంలోనూ ఉంది. సామాజిక విచారణను సైతం చేపట్టాలి. ఇన్నాళ్లు పిల్లలను పెంచిన అమ్మానాన్నలతోనూ సంభాషించాలి. అవేవీ లేకుండా, సీడబ్ల్యూసీ నిర్ణయాన్ని ప్రకటించడం చట్టవిరుద్ధం. కనుక దీనిపై తామంతా తిరిగి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించనున్నట్లు తొమ్మిది మంది తల్లిదండ్రులు తెలిపారు. "వారం కిందట సీడబ్ల్యూసీ ముందు హాజరుకావాలని రకరకాల ఊర్లలో ఉన్న మమ్మల్ని అందరినీ హైదరాబాద్‌కు డీసీపీవో అధికారులు పిలిపించారు. తీరా, మేము వచ్చి గంటల కొద్దీ పడిగాపులు కాసినా, సీడబ్ల్యూసీ సభ్యులెవరూ రాలేదు"అని ఒక బిడ్డ పెంపుడు అమ్మానాన్న చెప్పారు. పిల్లల సంరక్షణ కోసం పనిచేసే వీరంతా కనీసం ఆ తొమ్మిదిమంది పసి మనసులు తెలుసుకోలేరా అంటూ తల్లిదండ్రులు బాధను వ్యక్తం చేస్తున్నారు.



అమ్మానాన్న కావాలి...

అభం శుభం తెలియని ఆ పసి హృదయాలకేమి తెలుసు చట్టాలు, తీర్పులు. వారికి తెలిసిందల్లా, ఇన్నాళ్లు లాలపోసి, పాలు తాపి, జోలపాడిన అమ్మ స్పర్శ.. భుజాలమీద ఎక్కించుకొని ఆడించిన నాన్న ప్రేమ. తాము అమ్మానాన్న అని పిలిచే వారు ఇప్పుడు ఎందుకు కనిపించడంలేదో! ఆయాల సంరక్షణలో శిశువిహార్‌లో ఆరునెలలుగా ఎందుకు ఉంటున్నారో ఆ చిన్నారులకు తెలియదు కదా! 'అమ్మకావాలి, నాన్నను చూడాలి... ఇంటికెళతాం' అని పిల్లలు ఎక్కిఎక్కి ఏడ్చినా అక్కడ ఆలకించేదెవ్వరు. నవమాసాలు మోసి కనకున్నా, బిడ్డపై అంతకుమించిన ప్రేమను పెంచుకున్న ఓ తల్లి న్యాయస్థానం అనుమతితో శిశువిహార్‌లోని తన కూతురిని వారం కిందట చూడడానికి వెళ్లారు. ఇంట్లో కుటుంబ రక్షణలో ఆనందంగా గడపాల్సిన తన కూతురు దయనీయ స్థితిని చూసి తల్లడిల్లారు. "నా కూతురికి కుడి చెయ్యి పనిచేయదు. మా దగ్గర ఉన్నప్పుడు రోజూ ఫిజియోథెరపీ చేయించేవాళ్లం. శిశువిహార్‌లో పట్టించుకున్నవాళ్లు లేరు. ఆరునెలల కిందట ఆరోగ్యంగా ఉన్నపాప ఇప్పుడు బక్కచిక్కిపోయింది. నన్ను తిరిగి వస్తుంటే, 'నన్నూ తీసుకెళ్లు అమ్మా' అని నేలమీద పడి ఏడ్చింది. నావెంట రావాలని నా చీరకొంగుపట్టుకొని, వెంటపడింది. తిండికూడా సరిగ్గా తినడంలేదంట. అన్నంలో పురుగులు వస్తున్నాయని చెప్పింది. నా బిడ్డకోరికమేరకైనా మా పాపను మాకు అప్పగించండి" అని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. మరొక బాబు కిటికీలో నుంచి పెంపుడు తండ్రిని చూసి, రోదించడాన్ని వీడియోగానూ రికార్డు చేశారు. ఆ దృశ్యం మనసున్న ప్రతి ఒక్కరినీ కదిలిస్తుంది. ఇలా ఒక్కరా, ఇద్దరా... పెంపుడు తల్లిదండ్రుల మమతానురాగాలు రుచిచూసిన వారందరిదీ ఇదే మనోవేదన. ఇలాంటి పిల్లలను మరొకరి ఇంటికి దత్తత పంపితే, వారు అక్కడ సవ్యంగా ఉండకపోవచ్చని మానసిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఆరునెలలుగా పెంచినవారికి, ఇంటికి దూరంగా శిశువిహార్‌లోని నాలుగు గోడలకే పరిమితమైన పిల్లలంతా ట్రోమాలో ఉండే అవకాశం లేకపోలేదంటున్నారు.

వారుపెట్టిన పేర్లతో ప్రకటన

పెంపుడు తల్లిదండ్రుల చేతుల్లోకి పసికూనలు చేరేనాటికి వారంతా రోజుల వయస్సున్న పిల్లలే. సంతానంలేని దంపతులు పిల్లలకు హిందూ సంప్రదాయం ప్రకారం నామకరణాలు చేశారు. పుట్టినరోజు వేడుకలు జరిపారు. జనన ధ్రువీకరణ, ఆధార్‌లాంటి గుర్తింపు కార్డులనూ తీసుకున్నారు. తర్వాత తల్లిదండ్రుల నుంచి పిల్లలు కాదని స్వాధీనం చేసుకున్న డీసీపీవో పెంపుడు అమ్మానాన్న పెట్టిన పేర్లతోనే పత్రికా ప్రకటన జారీచేయడం గమనార్హం. అందులోనూ ఒకపాపకు ఇంటిపేరుకూడా ప్రస్తావించారు.

వహ్వా.. హైదరాబాద్ బిర్యానీ!

- అత్యుత్తమ వంటకాల్లో 31వ ర్యాంకు
- అవార్డులను ప్రకటించిన 'టేస్ట్ అట్లాస్'



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బిర్యానీ... హైదరాబాద్ సంస్కృతిలో ఒక భాగం. దాని రుచికి ప్రపంచమే ఫిదా అయిపోయిందని వెల్లడించింది సుప్రసిద్ధ ఫుడ్, ట్రావెల్ గైడ్ టేస్ట్ అట్లాస్. 2024-25 సంవత్సరానికి అందించిన వరల్డ్ ఫుడ్ అవార్డుల్లో ఇండియన్ క్విజిన్ అంతర్జాతీయంగా 12వ స్థానంలో నిలిస్తే, వంటకాల్లో హైదరాబాద్ బిర్యానీ 31వ స్థానంలో నిలిచింది. ప్రపంచ వ్యాప్తంగా పోటీ పడ్డ 15,478 వంటకాల్లో హైదరాబాద్ బిర్యానీ స్థానమిది. ప్రపంచ వ్యాప్తంగా 4,77,287కు పైగా ఫుడ్ బ్లాగర్స్‌తో పాటు ఆహారాభిమానులు ఓటు వేసి ఈ వంటకాలను ఎంపిక చేశారని ఆ సంస్థ పేర్కొంది. వరల్డ్ ఫుడ్ అవార్డుల్లో భాగంగా అత్యుత్తమైన 100 ఆహారాలు, క్విజిన్స్, వంటకాలు, ప్రాంతాలు, నగరాలు, రెస్టారెంట్లను ఎంపిక చేసింది. అత్యుత్తమ నగరాల జాబితాలో ముంబై 5వ స్థానంలో నిలవగా, హైదరాబాద్‌కు 50వ స్థానం దక్కింది. అమృత్‌సర్ (43), న్యూఢిల్లీ (45), కోల్‌కతా (71), చెన్నై (75) కూడా జాబితాలో చోటు దక్కించుకున్నాయి. భారత్ కు వెళ్లిన వారు తప్పనిసరిగా రుచి చూడాల్సిన వంటకాల్లో పంజాబీ వంటకం అమృత్‌సరి కుల్చా తొలి స్థానంలో నిలిస్తే, ఆ తరువాతి స్థానాల్లో బటర్ గార్లిక్ నాన్, ముర్గ్ మఖానీ, హైదరాబాదీ బిర్యానీ నిలిచాయి. హైదరాబాద్ బిర్యానీ తినాలంటే మాత్రం షాదాబ్ రెస్టారెంట్‌కు వెళ్తామని ఎక్కువ మంది ఓట్లేశారు. ప్రాంతాల వారీ కేటగిరీలో దక్షిణ భారత వంటకాలు 59వ స్థానంలో నిలిచాయి. దక్షిణ భారత వంటకాల్లో రేటింగ్స్ పరంగా హైదరాబాద్ బిర్యానీ అగ్రస్థానం దక్కింది. ఆ తరువాతి స్థానాల్లో చికెన్ 65, మసాలా దోశ నిలిచాయి. దక్షిణ భారత సంప్రదాయ వంటకాలను రుచి చూపించే రెస్టారెంట్లలో ఐటీసీ కోహినూర్ మూడో స్థానంలో నిలిచింది. అయితే ప్రపంచ వ్యాప్తంగా అత్యుత్తమ 100 రెస్టారెంట్ల జాబితాలో బెంగళూరు, కోజికోడ్, కోల్‌కతా వంటి నగరాలకు చెందిన రెస్టారెంట్లకు స్థానం లభిస్తే, హైదరాబాదీ రెస్టారెంట్ ఒక్కటి కూడా లేకపోవడం గమనార్హం.

విగ్రహాన్ని చెక్కినందుకు.. ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు

» ఆత్మగౌరవంతో బతికే కళాకారుడిని నేను
» నందిని సిధారెడ్డి ఆరోపణలు అర్థరహితం
» తెలంగాణ తల్లి విగ్రహ శిల్పి ఎంబీ రమణారెడ్డి



సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సచివాలయం వద్ద ప్రతిష్ఠించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని చెక్కినందుకు ఇప్పటి దాకా తాను ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని.. తెలంగాణ తల్లి విగ్రహ శిల్పి ఎంబీ రమణా రెడ్డి స్పష్టం చేశారు. రూ.కోట్లు తీసుకుని రమణారెడ్డి తెలంగాణ తల్లి రూపరేఖలు మార్చారని ప్రముఖ కవి నందిని సిధారెడ్డి చేసిన ఆరోపణలకు ఆయన స్పందించారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ మెప్పు కోసం మేధావితనాన్ని పణంగా పెట్టిన నందిని సిధారెడ్డి తనపై తప్పుడు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆత్మగౌరవంతో జీవించే కళాకారుడినైన తాను తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటేందుకు రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తున్నానని తెలిపారు. తెలంగాణ మాతృమూర్తి, చాకలి ఐలమ్మ, ఉద్యమ స్ఫూర్తి ఉట్టిపడేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించానని వివరించారు. తాను కోట్ల రూపాయలు తీసుకున్నానని అనడం సిధారెడ్డి విజ్ఞతకు నిదర్శనమన్నారు. తెలంగాణ తల్లి శిల్పులపై అభాండాలు వేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని చెక్కినందుకు ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని అన్నారు. 2008కి ముందు జర్మనీలో ఉన్నప్పటికీ ఉద్యమంలో భాగమై తెలంగాణ సాధన కోసం ఇక్కడే ఉండిపోయానని, పార్టీలకు అతీతంగా కళ ద్వారా సేవ చేస్తున్నానని రమణారెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ సంస్థల కోసం తాను చేసిన కొన్ని పనులకు ఈ రోజుకి బిల్లులు చెల్లించలేదని తెలిపారు.

తెలంగాణ తల్లి విగ్రహంలో.. మా అమ్మ కనిపించింది

» గతంలో అసలు విగ్రహాన్నే ప్రకటించలేదు
» రాష్ట్ర గీతాన్నీ అసెంబ్లీలో తీర్మానించలేదు
» ఆ రెండూ రేవంత్ రెడ్డి సారథ్యంలో జరిగాయి
» బీఆర్ఎస్ పుట్టక ముందే 20 పాటలతో క్యాసెట్ తీశాను: సుద్దాల అశోక్‌తేజ



"కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని చూడగానే నన్ను కన్న మాయమ్మలా కనిపించింది. తోడబుట్టిన అక్కలా కనిపించింది. ఒక నగటు రైతు వనితలా.. తెలంగాణ నేలమ్మలా అనిపించింది" అని సినీ గీత రచయిత సుద్దాల అశోక్‌తేజ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన విగ్రహం బాగోలేదని తాను అనడం లేదని, ఈ విగ్రహం బాగుందని మాత్రమే చెబుతున్నానని స్పష్టం చేశారు. ఈ తెలంగాణ తల్లిలో వజ్ర కిరీట ధగధగలు లేవని, మట్టిగాజుల గలగలలున్నాయన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చారంటూ వస్తున్న విమర్శలపై ఆయన మాట్లాడుతూ.. "గత పాలనలో ఎన్నడూ తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ప్రకటించలేదు. ఇదే రాష్ట్ర గీతం అని చెప్పలేదు. అసెంబ్లీలో తీర్మానించలేదు. విజయశాంతి తల్లితెలంగాణ పార్టీ పెట్టినప్పుడు ఓ విగ్రహాన్ని చూపించారు. ఆ విగ్రహం కూడా పల్లెటూరి యువతిలా ఉంటుంది. దానికి సారూప్యంగా ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం ఉంది. అందెశ్రీ రాసిన గీతం గురించి గానీ, తెలంగాణ తల్లి విగ్రహం గురించి గానీ, అధికారికంగా ప్రకటించిన తొలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే" అని చెప్పారు. తెలంగాణ ఉద్యమం పుట్టినప్పుడు, బీఆర్ఎస్ పుట్టి, జెండా ఎగరేయకముందే వచ్చిన తెలంగాణ రాష్ట్రోద్యమ గీతాలలో.. గద్దర్ తదితరుల తర్వాత దాదాపు 20 పాటలతో ఓ ఆడియో క్యాసెట్‌ను తీసుకువచ్చింది తనేనని గుర్తుచేశారు. "పదేళ్ల కాలంలో ఏ ప్రభుత్వాధినేత కూడా ఆ పాటలు రాసింది ఈయన అనీ, సినీ గీత రచయితంగా కెరీర్‌ను పణంగా పెట్టి ఉద్యమ గీతాలు రాసింది ఈయనే అని ఏనాడు చెప్పలేదు. మనసులో నాకు ఉన్న ఆ దిగులును ఇప్పుడు తీసేసినట్లైంది" అని సుద్దాల అశోక్ తేజ చెప్పారు.

ఆస్పత్రుల్లో అత్యవసర పరికరాల జాబితాను రూపొందించండి: దామోదర

» ఔషధాలు, పరికరాల పర్యవేక్షణకు సెంట్రల్ పోర్టల్



హైదరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అత్యవసర ఔషధాల జాబితా మాదిరిగానే ఆస్పత్రుల్లో వినియోగించే అత్యవసర పరికరాల జాబితాను రూపొందించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. డయాగ్నొస్టిక్ ఎక్విప్‌మెంట్, ఫైర్ సేఫ్టీ, ఔషధాలు తదితర అంశాలపై ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయంలో గురువారం మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వ దవాఖానాల్లో ఫైర్ సేఫ్టీ, పరికరాలు, ఔషధాల లభ్యతపై ఏర్పాటు చేసిన పది టాస్క్‌ఫోర్స్ బృందాలు నివేదికలను రూపొందించాయి. ఈ బృందాలు గుర్తించిన అంశాలను మంత్రికి వివరించారు. పరికరాల మరమ్మతులు, ఔషధాల సరఫరా తదితర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా సెంట్రలైజ్డ్ ఇంటిగ్రేటెడ్ మానిటరింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి హైదరాబాద్‌లోని బోధనాస్పత్రుల వరకు ఈ సమీకృత పర్యవేక్షణ వ్యవస్థ పని చేయాలని మంత్రి ఆదేశించారు. ఔషధాలు, పరికరాల పర్యవేక్షణ కోసం త్వరలో సెంట్రల్ పోర్టల్ అందుబాటులోకి రానుందని తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో బయోమెడికల్ ఇంజనీర్ పోస్టులు ఏపీకి వెళ్లాయని, ఈ పదేళ్లలో బయోమెడికల్ ఇంజనీర్లను నియమించకపోవడంతో చిన్న చిన్న మరమ్మతుల కోసం పరికరాలను బయటకు పంపాల్సి వస్తోందని అధికారులు తెలిపారు. దీంతో రాష్ట్ర స్థాయిలో చీఫ్ బయోమెడికల్ ఇంజనీర్ పోస్టును సృష్టించాలని మంత్రి చెప్పారు. ప్రతి జిల్లాకు కనీసం ఒక బయోమెడికల్ ఇంజనీర్‌ను తాత్కాలిక పద్ధతిలో తక్షణమే నియమించాలని ఆదేశించారు.

నేటి నుంచి యాసంగికి నీటి విడుదల

హైదరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల ప్రాజెక్టుల కింద యాసంగి (రబీ)లో 42.48 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా శుక్రవారం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి రబీ పంటలకు నీటిని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విడుదల చేయనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నిజాంసాగర్ చేరుకోనున్న ఆయన... నీటిని విడుదల చేసిన అనంతరం.. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వద్దకు చేరుకోనున్నారు. అక్కడ జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి, సమీక్ష చేపట్టనున్నారు. ఈ ఏడాది రబీలో ప్రాజెక్టుల కింద 17.94 లక్షల ఎకరాల్లో ఆరుతడి పంటలకు, 24.54 లక్షల ఎకరాల్లో వరి పంటకు కలిపి.. 42.48 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలని ప్రభుత్వం ఇదివరకే నిర్ణయించింది. దీని కోసం 354.88 టీఎంసీలను విడుదల చేయనున్నారు.

చర్యలు తీసుకున్నా మీరు మారరా ?

» ఫుడ్ కార్పొరేషన్ అధికారులపై మంత్రి సీతక్క ఆగ్రహం

హైదరాబాద్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): టీజీ ఫుడ్ కార్పొరేషన్ అధికారుల తీరుపై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకున్నా.. అయినా మీలో మార్పు రాదా ? అంటూ మండిపడ్డారు. టీజీ ఫుడ్ కార్పొరేషన్ టెండర్లు పిలవకుండా పలు పనులను ఇటీవల నామినేషన్ పద్ధతిలో కేటాయించింది. ఈ విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క సిబ్బంది తీరుపై గురువారం అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులను సచివాలయంలోని తన చాంబర్‌కి పిలిపించి.. ప్రభుత్వంతో సంబంధం లేకుండా సొంత నిర్ణయాలు తీసుకోవడం ఏంటనీ ప్రశ్నించారు. అలాగే, పదోన్నతులు, కారుణ్య నియామకాల్లో నిబంధనల ఉల్లంఘనపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మల్లన్న భక్తులకు ఏ ఇబ్బందులు కలగొద్దు..

» కొమురవెల్లి జాతరపై మంత్రి కొండా సురేఖ సమీక్ష

హైదరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ఈనెల 29న ఉదయం 10.45 నిమిషాలకు మల్లికార్జున స్వామి కల్యాణం, జనవరి 19 నుంచి 10 ఆదివారాల పాటు అంటే మార్చి 23 వరకు జాతర నిర్వహించేందుకు నిర్ణయించిన నేపథ్యంలో మంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

కనీసవేతనాల సలహామండలి సభ్యుల నియామకం

హైదరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కనీస వేతనాల సలహా మండలిలో సభ్యులను ప్రభుత్వం నియమించింది. ఉద్యోగులు/కార్మికుల తరఫున ఎర్రం పిచ్చిరెడ్డి, ఎస్.నర్సింహారెడ్డి(ఐఎన్‌టీయూసీ), మహ్మద్ యూసుఫ్(ఏఐటీయూసీ), ఎస్.రాజు ముదిరాజ్(తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం), కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి(హైదరాబాద్ హోటల్ వర్కర్ల సంఘం), యాజమాన్య వర్గాల నుంచి మీలా జయదేవ్(ఎఫ్‌టీసీసీఏ), కశ్యప్‌రెడ్డి, మహిమా దాట్ల(ఫిక్కి), నర్రా రవికుమార్(డిక్కి), బి.చంద్రప్రకాష్ (బీడీ కంపెనీల యాజమాన్యం)తో పాటు స్వతంత్ర సభ్యులుగా ప్రొఫెసర్ సి.రవి(సెస్), ప్రొఫెసర్ వాసంతి(నల్సార్ యూనివర్సిటీ)లను ఎంపికచేస్తూ కార్మికశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మండలి రెండేళ్లపాటు ఉంటుంది. ఈమేరకు గురువారం జీవో జారీ చేశారు.

సిరిసిల్లలో బీసీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణానికి రూ.5 కోట్లు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5 కోట్లు విడుదల చేసింది. జీప్లస్ 1 పద్ధతిలో భవనం నిర్మించనున్నారు. ఈ మేరకు బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్ గురువారం జీవో జారీ చేశారు. నిర్ణీత వ్యవధిలోగా నిర్మాణం పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

మట్టికట్ట వద్దు.. రబ్బర్ డ్యామ్ మేలు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ ఇదివరకే తేల్చింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెలాఖరుకల్లా ఆ కమిటీ నివేదిక ఇవ్వాల్సి ఉంది. నివేదిక అనుకూలంగా వస్తే మేడిగడ్డ ఎగువన మట్టికట్టను కట్టి... జియోట్యూబ్ టెక్నాలజీలో ఇసుక నింపిన ట్యూబ్ చుట్టూ రక్షణగా గ్యాబియన్ బాక్సులు (రాళ్లతో నింపిన కంచె) పెట్టాలని అధికారులు భావించారు. దీని కోసం డిజైన్లు/డ్రాయింగ్‌లు ఇవ్వాలని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో)ను కోరారు. పలువురు నిపుణులు దీన్ని పరిశీలించిన పిదప మట్టకట్ట వద్దని తేల్చిచెప్పారు. రబ్బర్ డ్యామ్ కట్టుకుంటే భారీగా వరదలు వస్తే గాలిని తీసేసి, వరద తగ్గుముఖం పట్టగానే మళ్లీ నింపుకొని నీటిని కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి పంపింగ్ చేయవచ్చని సూచించారు. దీని కన్నా ముందు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడం సురక్షితమా, కాదా అనే అంశంపై ఎన్‌డీఎస్‌ఏ అభిప్రాయం తీసుకోవాలని పేర్కొన్నారు.

అనుమతులు, నిధులు ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

ఆ మేరకు రహదారి అభివృద్ధికి ఆటంకంగా ఉందని, కేవలం పగటి పూట మాత్రమే రాకపోకలు సాగించాల్సి వస్తోందని తెలిపారు. అమ్రాబాద్ అటవీ ప్రాంతంలో నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని, ఇందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్-విజయవాడ (ఎన్‌హెచ్-65) రహదారిని 6 వరుసలుగా విస్తరించే పనుల డీపీఆర్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. తెలంగాణలోని రెండో పెద్ద నగరమైన వరంగల్ దక్షిణ భాగం బైపాస్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలన్నారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్‌ను అనుసంధానించే ఎన్‌హెచ్-63 (16) రహదారి వరంగల్, హన్మకొండ నగరాల మధ్యగా వెళుతోందని, దాన్ని నగరం వెలుపలి నుంచి మంజూరు చేయాలని కోరారు. పర్వత్‌మాల ప్రాజెక్ట్‌లో యాదాద్రి ఆలయం, నల్లగొండలోని హనుమాన్ కొండ, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ వద్ద రోప్ వేలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. నల్లగొండ జిల్లాలో ఎన్‌హెచ్-65 పక్కన 67 ఎకరాల్లో ట్రాన్స్‌పోర్ట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయాలని కోరారు.

అభివృద్ధి పనులకు సహకరించండి..

తెలంగాణలో వివిధ రకాల అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఆర్ఆర్ఆర్, హైదరాబాద్ మెట్రో ఫేజ్-2తో పాటు హైదరాబాద్, వరంగల్‌లో సీవరేజీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్లాన్, సింగరేణి సంస్థకు బొగ్గు గనుల కేటాయింపు సహా పలు అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించారు. మొత్తం రూ.1.63 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టుల విషయంలో కేంద్రం నుంచి కావాల్సిన చేయూతపై చర్చించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని, త్రైపాక్షిక ఒప్పందం పూర్తయినా ఇప్పటికీ ఎన్‌హెచ్ఏఐ అనుమతి ఇవ్వలేదని చెప్పారు. ఆర్ఆర్ఆర్‌తో పాటు రేడియల్ రోడ్లు పూర్తయితే ఫార్మా పరిశ్రమలు, పారిశ్రామిక హబ్‌లు, లాజిస్టిక్, రిక్రియేషన్ పార్కులు వంటివి అభివృద్ధి చెందుతాయని వివరించారు. మెట్రో రెండో దశలో రూ.24,269 కోట్ల వ్యయంతో కొత్తగా 76.4 కి.మీ. రైలు మార్గం నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 వాటాతో మెట్రో రెండో దశను చేపట్టేందుకు సహకరించాలని కోరారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ పరిధిలోని 222.27 ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఇప్పటికే కోరిన విషయాన్ని గుర్తు చేశారు. హైదరాబాద్ నగరంతోపాటు సమీప 27 మునిసిపాలిటీల్లో 7,444 కి.మీ. మేర సీవరేజీ నెట్‌వర్క్ పనులకు రూ.17,212.69 కోట్లతో సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్ రూపొందించామని, అమృత్ 2 లేదా ప్రత్యేక ప్రాజెక్టు కింద దానిని చేపట్టేందుకు సహకరించాలని కోరారు. సింగరేణి సంస్థ మనుగడ కొనసాగించేందుకు గోదావరి లోయ పరిధిలోని బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. సెమీకండక్టర్ల ప్రాజెక్టులకు హైదరాబాద్ అనువుగా ఉందని, తెలంగాణను సెమీకండక్టర్ మిషన్‌లో చేర్చాలని కోరారు. ప్రాజెక్టులకు అనుమతులు, నిధుల విడుదలలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని విన్నవించారు. తెలంగాణకు కేంద్రీయ విద్యాలయాలు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరారు. డీమ్డ్ యూనివర్సిటీ గుర్తింపునకు రాష్ట్ర ప్రభుత్వంనుంచి ఎన్‌వోసీ తీసుకునేలా చూడాలన్నారు.


ఢిల్లీలో గురువారం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి

నేడు కాంగ్రెస్ అగ్రనేతలతో రేవంత్ భేటీ!

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం భేటీ కానున్నట్లు సమాచారం. రాహుల్ తోపాటు ఇతర నేతలను కూడా కలిసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న మంత్రివర్గ విస్తరణతోపాటు కుల గణన, రాష్ట్రంలో ఏడాది పాలన తదితర అంశాలపై రాహుల్‌తో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. చర్చలు ఫలప్రదమైతే త్వరలోనే మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశంఉంది.

మంత్రివర్గంపై అధిష్ఠానానిదే తుది నిర్ణయం: భట్టి

మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానానిదే తుది నిర్ణయమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఢిల్లీలో ఉన్న భట్టి మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తెలంగాణలో ప్రజా పాలన పట్ల 50 శాతానికి పైగా ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. వందశాతం మంది ప్రభుత్వ పాలన పట్ల సంతోషంగా ఉంటారనుకోవడం లేదని చెప్పారు. హైడ్రాకు ధనిక, పేద అనే వ్యత్యాసాలేమీ లేవని చెప్పారు. రైతు భరోసాను ఎట్టి పరిస్థితుల్లో సంక్రాంతి నుంచి అమలు చేస్తామన్నారు. తెలంగాణ తల్లి గతంలో అధికారికంగా లేదని, టీఆర్ఎస్ పార్టీ తరఫున మాత్రమే ఉండేదని చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలో అధికారికంగా తెలంగాణ తల్లి ఉందన్నారు. కాగా, మంత్రివర్గ విస్తరణలో ప్రేమ్‌సాగర్ రావు పేరును కూడా పరిశీలించాలని భట్టి పార్టీ అధిష్ఠానాన్ని కోరుతున్నట్లు తెలిసింది.

ఏజెన్సీలు గజగజ

పడిపోయిన ఉష్ణోగ్రతలు, కమ్మేస్తున్న పొగమంచు

» ఆదిలాబాద్ జిల్లా బేలలో 7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
» వచ్చే 3 రోజుల్లో రాష్ట్రంలో మరింత చలి
» 2-4 డిగ్రీల మధ్యకు పడిపోయే చాన్స్
» వాతావరణ కేంద్రం ప్రకటన

ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మెదక్ అర్బన్, హైదరాబాద్, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతుంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలు చలితో గజగజలాడుతున్నాయి. ఓ వైపు పొగమంచు కమ్మేస్తుండగా.. ఉష్ణోగ్రతలు కూడా పడిపోతుండడంతో పగలు, రాత్రీ అనే తేడా లేకుండా ఏజెన్సీ ప్రాంత గ్రామాల ప్రజలు చలికి వణికిపోతున్నారు. ఆదిలాబాద్ జిల్లా బేలలో రాష్ట్రంలో అత్యల్పంగా గురువారం 7.0డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే భీంపూర్ మండలం అర్లి(టి)లో 7.2, మావలలో 7.4, నేరడిగొండలో 7.5, బోథ్‌లో 7.6, ఆదిలాబాద్ రూరల్‌లో 8.2, బజార్‌హత్నూర్‌లో 8.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్(యు) మండలంలో గురువారం 7.3 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట, రుద్రంగి మండలాల్లో 10.4, మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో 10.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే, మెదక్ జిల్లా శివ్వంపేటలో 9.4, సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 9.5, సిద్దిపేట జిల్లా పోతారెడ్డిపేటలో 10.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరగనుందని హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం ప్రకటించింది. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీల వరకు పడిపోతాయని హెచ్చరించింది. ఉత్తర తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో చలి గాలి ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో మరో 10 అంశాలు

» 2.32 లక్షల దరఖాస్తుల అప్‌లోడ్
» 'ప్రజాపాలన'లో దరఖాస్తు చేసుకోని వారికీ చాన్స్
» సంక్రాంతిలోగా వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరిస్తాం
» 31వ తేదీలోగా మంత్రి వర్గ విస్తరణ
» మీడియాతో చిట్‌చాట్‌లో పొంగులేటి



హైదరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కోసం తీసుకొచ్చిన యాప్‌లో మరో 10 కొత్త అంశాలను చేర్చామని, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారు ఇప్పుడు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కొత్త ఆర్వోఆర్ చట్టం అమల్లోకి వచ్చాక భూ ఆక్రమణలకు పాల్పడిన వారి వివరాలన్నీ బయటపెడతామని పునరుద్ఘాటించారు. గురువారం ఆయన మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పలు అంశాలపై ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో సర్వే అధికారుల సిఫార్సు కాలమ్‌ను తొలగించామన్నారు. ఇప్పటి వరకు యాప్ ద్వారా 2.32 లక్షల దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. కొంత జాప్యం జరిగినా నిజమైన లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. గిరిజన ప్రాంతాల నుంచి ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. సంక్రాంతి లోపల వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరిస్తామని మంత్రి తెలిపారు.తప్పు చేసిన అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఆర్వోఆర్ -2024 బిల్లును ఆమోదిస్తామని, చట్టం అమల్లోకి వచ్చాక మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో భూ ఆక్రమణలకు పాల్పడిన వారి చిట్టాను అన్ని ఆధారాలతో బయట పెడతామన్నారు. కొత్త ఆర్వోఆర్ బిల్లులో 1971లో వచ్చిన ఆర్వోఆర్ చట్టంలోని మంచి విషయాలనూ తీసుకున్నామన్నారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ఆర్వోఆర్‌పై సలహాలు ఇవ్వాలని సూచించారు. తాను, సీఎం రేవంత్‌రెడ్డి 80 వేల పుస్తకాలు చదవలేదని, అన్ని పుస్తకాలు చదివిన కేసీఆర్ అసెంబ్లీకి రావాలని కోరుకుంటున్నామని వ్యాఖ్యానించారు. కేటీఆర్, హరీశ్‌రావు కనీసం 5వేల పుస్తకాలు చదివినా.. వాళ్ల సూచనలు తీసుకునే వాళ్లమని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో బీఆర్ఎస్ నాయకులు సూచనలు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇప్పుడు విగ్రహంపై గోల చేస్తున్న వారు.. గతంలో అధికారిక ప్రకటన చేశారా? అని ప్రశ్నించారు. రైతులకు బేడీలు వేయడం సరైన పద్ధతి కాదని, ఈ ఘటనపై సీఎం రేవంత్ తీవ్రంగా స్పందించారని తెలిపారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్లనే వసతి గృహాల్లో ఆహార కల్తీ వంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. 14వ తేదీన మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులందరూ హాస్టళ్లలోనే భోజనం చేయనున్నామని తెలిపారు.

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆటల పోటీలు.. స్టడీ టూర్లు

» శిక్షణ తరగతులు అభినందనీయం
» కొత్త సంప్రదాయానికి సర్కారు నాంది
» స్పీకర్ ప్రసాద్, మండలి చైర్మన్ గుత్తా

హైదరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేసే ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్సీలకు ప్రభుత్వం కొంత ఆటవిడుపు కల్పించనుంది. వీరికి ఆటల పోటీలు నిర్వహించడంతో పాటు స్టడీ టూర్లకు తీసుకెళ్లనుంది. ఈ విషయాన్ని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. శీతాకాల అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అసెంబ్లీ నియమావళి, బడ్జెట్, పలు బిల్లులు సహా వివిధ అంశాలపై ప్రభుత్వం అవగాహన తరగతులను నిర్వహించింది. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో బుధ, గురువారాల్లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ తరగతులకు 61మంది ఎమ్మెల్యేలు, 17మంది ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ నిర్వహించని విధంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు శిక్షణ ఇవ్వడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కొత్త సంప్రదాయానికి నాంది పలికిందన్నారు. తరగతులను విజయవంతంగా నిర్వహించిన అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులును స్పీకర్, మండలి చైర్మన్ అభినందించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, బడ్జెట్ ప్రవేశపెట్టే విధానంపై రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు ప్రత్యేకంగా వివరించారు. 16వ ఆర్థిక సంఘం నుంచి.. దేశంలో ఏయే రాష్ట్రాలు ఆర్థికంగా ఎలా ఉన్నాయి? మెరుగుపడాలంటే తీసుకోవాల్సిన చర్యలేంటి?.. ఇలా పలు అంశాలను ప్రస్తావించారు. ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్, అప్పులను కూలంకశంగా వెల్లడించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన తరగతులు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.


కార్యక్రమంలో గుత్తా సుఖేందర్, గడ్డం ప్రసాద్, భట్టి, శ్రీధర్‌బాబు, పొన్నం తదితరులు

నెలలో 2 రోజులు పర్యాటక ప్రచారానికి కేటాయించండి..

ప్రజా ప్రతినిధులు, ప్రజలకు జూపల్లి విజ్ఞప్తి

పర్యాటక రంగం అభివృద్ధి చెందితే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, తద్వారా రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పర్యాటక శాఖ ప్రచారంలో ప్రజా ప్రతినిధులు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. నెలలో రెండు రోజులు తప్పనిసరిగా పర్యాటక ప్రాంతాలను సందర్శించి, వాటిని ప్రాచుర్యంలోకి తీసుకురావాలన్నారు. శాసనసభ వ్యవహారాలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పునశ్చరణ తరగతులు ముగిసిన సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని తారామతి బారాదరిలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం భట్టి , మంత్రులు దుద్దిళ్ల , పొన్నం, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

ఈ-బైక్, ఈ-స్కూటర్, ఈ-రిక్షా.. హైటెక్స్ 'ఈవీ ఎక్స్‌పో' అదుర్స్!

» రూ.26 వేల నుంచి 1.20 లక్షల్లో ధరలు
» 11 వేలతో ఈవీ చార్జింగ్ స్టేషన్ పెట్టొచ్చు
» గ్రామగ్రామంలో ఈవీ చార్జింగ్ స్టేషన్!
» వర్కాస్ ఆటో సీఈవో రాం వేమిరెడ్డి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెట్రో ధరలు మండుతున్న నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ పెరుగుతోంది. బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్(బీఎంఎస్), నాణ్యతాప్రమాణాల విషయంలో కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను తీసుకొచ్చిన నేపథ్యంలో.. విభిన్న రకాల ఈ-వాహనాలు మార్కెట్లకు పోటెత్తుతున్నాయి. గురువారం మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన గ్రీన్ వెహికిల్ ఎక్స్‌పో-2024ను రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో ద్విచక్ర వాహనాలతోపాటు.. పాల వాహనాలు, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీం వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటిల్లో.. వింగ్స్ పవర్ నిర్వాహకులు 'సిగ్నల్ లైట్' పేరుతో ఈ-స్కూటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీని ధర రూ.26,500 అని చెప్పారు. 1-2 యూనిట్ల కరెంటు ఖర్చుతో ఈ-స్కూటర్‌పై 45 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు. అదేవిధంగా స్పోర్ట్స్ బైక్ మాదిరిగా ఆకట్టుకుంటున్న ఎన్కే ఈ-బైక్ ధర రూ.1.20 లక్షలుగా ఉంది. దీన్ని 4 గంటల పాటు 6 యూనిట్ల కరెంటుతో చార్జ్ చేస్తే.. 120 కిలోమీటర్ల వరకు వెళ్తుంది. ఇక ఇదే కంపెనీకి చెందిన ఈ-రిక్షాను ఒకసారి చార్జ్ చేస్తే.. గంటకు 25-40 కిలోమీటర్ల వేగంతో.. 110 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది. 5 క్వింటాళ్ల సరుకును తరలించే సామర్థ్యం ఈ వాహనానికి ఉంది. రూ. 11 వేల పెట్టుబడితో పాన్‌షాపులు, కిరాణా దుకాణాల వద్ద ఈవీ చార్జర్లను ఏర్పాటు చేసుకునేలా 'చార్జింగ్ స్టేషన్' పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వర్కాస్ ఆటోమొబైల్ ఫౌండర్, సీఈవో రాం వేమిరెడ్డి వెల్లడించారు. తెలంగాణలో 25 వేల చార్జింగ్ స్టేషన్లను అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు ఆయన వివరించారు. భవిష్యత్‌లో ప్రతి గ్రామంతో పాటు.. కిలోమీటరు దూరానికి ఒక ఈవీ స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలనుకునేవారు 9154758247, 9024482830 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు. కాగా.. తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు బి.అశోక్‌కుమార్ గౌడ్ ఈ ఎక్స్‌పోలో మాట్లాడుతూ.. కేంద్ర పథకాల తరహాలో రాష్ట్ర ప్రభుత్వం సోలార్ రంగానికి ప్రత్యేక ప్రోత్సాహకాలివ్వాలని కోరారు.


ప్రదర్శనను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం తదితరులు


4 గంటలు చార్జ్ చేస్తే.. 120 కి.మీ వెళ్లే 1.2 లక్షల ఈ-బైక్


ఐదు క్వింటాళ్ల సరుకును మోసుకెళ్లే ఈ-రిక్షా

ఈవీ పాలసీతో విద్యుత్ వాహనాలకు ప్రోత్సాహం

రాష్ట్రంలో కాలుష్య నివారణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి పొన్నం

హైదరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాలుష్య నివారణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్యుత్ వాహన (ఈవీ) పాలసీతో ఈవీలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఢిల్లీ తదితర నగరాల్లో కాలుష్య తీవ్రత అధికంగా ఉందని, అలాంటి పరిస్థితి హైదరాబాద్‌కు రాకుండా జాగ్రత్తపడాలని చెప్పారు. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన విద్యుత్ వాహనాలను ఆయన పరిశీలించారు.



రూ.10కే పురుగుమందుల
అవశేషాల గుర్తింపు పరీక్ష

» పళ్లు, కూరగాయలు, నీళ్లలో అవశేషాలను గుర్తించే సాధనం

» బిట్స్ హైదరాబాద్ పరిశోధకుల ఆవిష్కరణ

బిట్స్‌పిలానీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పళ్లు, కూరగాయలు, నీళ్లలో.. పురుగుమందుల అవశేషాలను త్వరగా, అత్యంత చవకగా రూ.10కే గుర్తించే పరికరాన్ని హైదరాబాద్‌లోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) పరిశోధకులు రూపొందించారు. సాధారణంగా పురుగుమందుల అవశేషాలను గుర్తించాలంటే.. పళ్లు, కూరగాయలను జూస్‌లాగా మార్చి ఆ ద్రావకాన్ని పరీక్షిస్తారు. కానీ, బిట్స్ శాస్త్రవేత్తలు తయారుచేసిన సాధనంతో జూస్‌లాగా మార్చాల్సిన అవసరం లేకుండానే పరీక్ష జరపవచ్చు. సదరు పళ్లు, కూరగాయలను కడిగిన నీటిని పరీక్షించటం ద్వారా పురుగు మందుల అవశేషాలను ఈ సాధనం గుర్తిస్తుంది. మనదేశంలో వినియోగించే 8 రకాల సేంద్రియ ఫాస్ఫరస్ పురుగుమందుల అవశేషాలను ఈ సాధనంతో కనుగొనవచ్చు. పళ్లను, కూరగాయలను కడిగిన నీళ్లలో కేవలం ఐదు మిల్లీలీటర్ల నీటితో పరీక్ష జరపవచ్చని ప్రధాన పరిశోధకుడు కేఎస్ దీపక్ తెలిపారు. పురుగుమందుల అవశేషాలుంటే.. సాధనంలో ఉండే ఒక ద్రావకం రంగు మారుతుందని, దాని ద్వారా ఏ అవశేషాలు, ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చన్నారు. సాధారణంగా ఈ తరహా పరీక్షకు ప్రస్తుతం రూ.1500 వరకు వ్యయం అవుతుండగా, తాము రూపొందించిన 'పోర్టబుల్ మైక్రోఫ్లూయిడిక్ డివైజ్'తో రూ.10కే సాధ్యమని తెలిపారు.

తాండూరు ఆశ్రమ పాఠశాల వార్డెన్‌పై వేటు

» ఫుడ్ పాయిజన్ కాదు గ్యాస్ట్రిక్ సమస్య : కలెక్టర్ ప్రతీక్ జైన్

తాండూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తాండూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో తిన్న ఆహారం వికటించి అస్వస్థతకు గురైన బాలికలకు చికిత్స కొనసాగుతోంది. బాధిత బాలికలను ఆస్పత్రి నుంచి వసతి గృహానికి తీసుకొచ్చి చికిత్స అందిస్తున్నారు. వైద్య సిబ్బంది, పరికరాలు, మందులను వసతి గృహానికే రప్పించి వైద్యం చేయిస్తున్నారు. ఆహారం వికటించడంతో అందుకు బాధ్యులైన వసతి గృహ వార్డెన్ విశ్వ కుమారి, మరో ఇద్దరు వంట సిబ్బందిని అధికారులు సస్పెండ్ చేశారు. బాలికలకు చికిత్స కొనసాగుతున్న నేపథ్యంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గురువారం పాఠశాలను సందర్శించారు. బాధిత బాలికలను పరామర్శించి.. వారి పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ విలేకరులతో మాట్లాడుతూ.. ఫుడ్ పాయిజన్ అవ్వలేదని విద్యార్థినులు గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. శివలీల అనే బాలిక కడుపులో నొప్పి, విరేచనాలతో బాధపడుతుందని అవసరమైతే ఆమెను ఆస్పత్రికి తరలిస్తామన్నారు. ఇక, ఈ ఘటనకు బాధ్యులైన వార్డెన్, ఇద్దరు వంట సిబ్బందిని సస్పెండ్ చేసి ఆ స్థానాలను వేరే వారితో భర్తీ చేస్తామని ప్రకటించారు.



ఇందిరా పార్కు వద్ద మహాధర్నాకు వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

కదంతొక్కిన అంగన్‌వాడీలు

కవాడిగూడ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల ప్రకారం తమ వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. చలో హైదరాబాద్‌లో భాగంగా వివిధ జిల్లాల నుంచి అంగన్‌వాడీలు తరలివచ్చారు. కనీస వేతనం రూ.18 వేలకు, పీఎఫ్, ఈఎస్ఐ, పదవీ విరమణ ప్రయోజనాలు పెంచాలని, బకాయి ఉన్న 7 నెలల వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కతో చర్చించేందుకు యూనియన్ ప్రతినిధి బృందాన్ని పోలీసులు సచివాలయానికి తీసుకెళ్లారు. చర్చల అనంతరం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ జయలక్ష్మి మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందు చర్యలు తీసుకుంటామని చర్చల్లో హామీ లభించడంతో తమ పోరాటలను వాయిదా వేసుకున్నామని తెలిపారు.

22న వరంగల్‌లో కాకతీ కదన భేరి

» ఉద్యోగులు, ఉపాధ్యాయులు హాజరు కావాలి: స్థితప్రజ్ఞ

హైదరాబాద్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్న ఏకీకృత పింఛను పథకం(యూపీఎస్)ను వ్యతిరేకిస్తూ ఈనెల 22న ఉద్యోగులు, ఉపాధ్యాయులతో వరంగల్ కేంద్రంగా కాకతీ కదన భేరీ నిర్వహిస్తున్నామని సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. ఉద్యోగులను మోసగించి, కార్పొరేట్ల కడుపు నింపేందుకే యూపీఎ‌స్‌ను తీసుకొచ్చారని సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ పేర్కొన్నారు. ఉద్యోగి కుటుంబానికి సామాజిక భద్రత ఇవ్వని ఈ పథకాన్ని తీవ్రంగా ప్రతిఘటించాల్సిన సమయం వచ్చిందని, వరంగల్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

పోషకాహారం అందుతోందా?

» హాస్టళ్లు, గురుకులాల్లో సౌకర్యాలపై నివేదిక కోరిన హైకోర్టు

హైదరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టళ్ల, గురుకుల పాఠశాలల్లో నిబంధనల ప్రకారం సౌకర్యాలు అందిస్తున్నారా? లేదా? అనే అంశంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్సీపీసీఆర్)- 2018 మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులకు పోషకాహారం అందడం లేదని, పిల్లల నిష్పత్తికి తగిన విధంగా మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు లేవని పేర్కొంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీనిపై గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం పరుపు, కాటన్ బెడ్‌షీట్, కవర్‌తో కూడిన దిండు, కాటన్ దుప్పట్లు, దోమతెర, శుద్ధమైన తాగునీరు (ఆర్వో వాటర్) వంటి సదుపాయాలు ఉన్నాయా? మార్గదర్శకాల ప్రకారం మెనూ అందజేస్తున్నారా? అని అడిగింది. అన్ని అంశాలపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను జనవరి 22కు వాయిదా వేసింది.

మంత్రి సురేఖపై నాగార్జున కేసు 19కి వాయిదా

హైదరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు అక్కినేని నాగార్జున వేసిన పరువు నష్టం దావా కేసు విచారణ మరోసారి వాయిదా పడింది. గురువారం నాంపల్లిలోని ప్రత్యేక జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఎక్సైజ్ కోర్టులో ఈ కేసుపై జరిగిన విచారణకు కొండా సురేఖ తరఫున ఆమె న్యాయవాది గుర్మీత్ సింగ్ హాజరయ్యారు. విచారణకు సురేఖ వ్యక్తిగతంగా హాజరవడానికి మరికొంత సమయం కావాలని ఆయన కోరారు. దీంతో ఈ కేసు తదుపరి విచారణను ఈనెల 19వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది.

'బీసీ' నివేదికపై
ప్రత్యేక కమిషన్ కసరత్తు!

(మొదటిపేజీ తరువాయి)

వివిధ వర్గాల తో సమావేశమైంది. ఆయా సమావేశాల్లో వచ్చిన వివరాల ఆధారంగా ఇప్పుడు ప్రభుత్వానికి అందించే నివేదిక రూపకల్పనలో నిమగ్నమైంది.

గ్రామాలు, మండలాల వారీగా రిజర్వేషన్లు

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కల్పించాల్సిన రిజర్వేషన్లపై ప్రత్యేక కమిషన్ క్షుణ్ణంగా పరిశీలన చేస్తోంది. ఆ మేరకే వివరాలనూ సేకరించింది. అయితే బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కేటాయించాలంటూ అటు ప్రభుత్వానికి, ఇటు కమిషన్‌కు వినతులు వచ్చాయి. అయితే, వివిధ కేసుల్లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50శాతం కంటే పెరగకూడదు. ఈ నేపథ్యంలో బీసీలకు రిజర్వేషన్లను ఏ విధంగా కేటాయించాలన్న అంశంపై కమిషన్ లోతుగా అధ్యయనం చేసింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహా రిజర్వేషన్ కాకుండా.. ఆ గ్రామం లేదా జిల్లాలో జనాభాను బట్టి ఆయా పదవులకు రిజర్వేషన్ కేటాయించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఇందులో భాగంగా గ్రామాల్లో వార్డు సభ్యులు, సర్పంచ్‌లకు ఎంత మేర రిజర్వేషన్ కేటాయించాలి? సంబంధిత వార్డులో ఎంత మంది బీసీలు ఉన్నారు? ఒక వేళ బీసీలకు సర్పంచ్ పదవి ఇవ్వాలంటే గ్రామంలో ఎంతమంది బీసీలు ఉన్నారు? అనే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించింది. మండల స్థాయిలో ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు, జడ్పీ చైర్మన్ పదవులకు కూడా బీసీ జనాభా వాటా ప్రకారం పోటీ చేసేందుకు అవకాశం కల్పించేలా నివేదికను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

రిపోర్టు రెండు దఫాల్లో..

రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించిన అంశాలపై దృష్టి పెట్టిన ప్రత్యేక కమిషన్, రెండు దఫాల్లో ప్రభుత్వానికి నివేదికలు సమర్పించనున్నట్లు తెలిసింది. మొదటి దఫాలో గ్రామీణ ప్రాంతాలు, రెండో దఫాలో పట్టణ, మునిసిపాలిటీల వారీగా రిపోర్టులను ప్రభుత్వానికి ఇవ్వనుంది. ఇప్పటికే గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తయి ఏడాది అయింది. పైగా సర్పంచ్‌లు లేకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన వివిధ గ్రాంట్లు, నిధులు కూడా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో మొదట గ్రామీణ ప్రాంతాల్లో వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జడ్పీటీసీ, జడ్పీ చైర్మన్ పదవులకు సంబంధించిన రిజర్వేషన్లపై కమిషన్ దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లోని బీసీ రిజర్వేషన్లను సూచిస్తూ ప్రభుత్వానికి నివేదికను సమర్పించనుంది. ఏయే ప్రాంతాల్లో బహిరంగ విచారణ చేపట్టాలి.. అనంతరం రిజర్వేషన్ల ఖరారుకు ఎంత సమయం పడుతుంది.. వంటి అన్ని అంశాలపైనా చర్చలు జరుపుతోంది.

రాష్ట్ర అప్పు 4.57,783 కోట్లు

ఆర్‌బీఐ 'హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్-2024'లో వెల్లడి

హైదరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న మొత్తం అప్పు రూ.4,57,783 కోట్లుగా ఉన్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ప్రకటించింది. ఈ మొత్తంలో బడ్జెట్ పరంగా తీసుకున్న అప్పులు, వివిధ కార్పొరేషన్ల పేరుతో సేకరించిన గ్యారెంటీ రుణాలున్నట్లు వివరించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి సేకరించిన అప్పు, ప్రావిడెంట్ ఫండ్, ఇతర డిపాజిట్లు, అడ్వాన్సులన్నింటినీ కలిపితే.. అప్పు మొత్తం రూ.5,24,955 కోట్లకు చేరుతుందని తెలిపింది. ఈ మేరకు రాష్ట్రాల అప్పులు, జీఎస్‌డీపీ తదితర వివరాలతో తాజాగా 'హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్-2024'ను విడుదల చేసింది. దీని ప్రకారం 2024 మార్చి నాటికి తెలంగాణ అప్పు రూ.3,22,501 కోట్లుగా ఉంది. వివిధ కార్పొరేషన్ల పేర అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న గ్యారెంటీ అప్పులు 2022 మార్చి నాటికి రూ.1,35,282 కోట్లుగా నమోదయ్యాయి. ఈ రెండూ కలిపి.. రూ.4,57,783 కోట్లుగా తేలిందని ఆర్‌బీఐ పేర్కొంది. కాగా.. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం నుంచి మరో రూ.14,775 కోట్ల రుణం తీసుకుంది. ప్రావిడెంట్ ఫండ్‌కు సంబంధించి రూ.14,688 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్సులకు సంబంధించి రూ.35,571 కోట్లు, రిజర్వ్ ఫండ్ రూ.2,088 కోట్లను కూడా ప్రభుత్వం భరించాల్సి ఉంది. ఇవన్నీ కలిపితే రాష్ట్ర మొత్తం అప్పు 5,24,955 కోట్లుగా తేలుతుందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. 2023-24 సంవత్సరంలో జీఎస్‌డీపీ ప్రస్తుత ధరల వద్ద రూ.15,01,98,141 కోట్లుగా ఉందని తెలిపింది. అంతకు ముందు సంవత్సరం జీఎస్‌డీపీ రూ.13,11,82,302 కోట్లుగా నమోదైనట్లు గుర్తుచేసింది.

యూనివర్సిటీల్లో
పోస్టుల భర్తీకి ప్రత్యేక కమిషన్!

» ఏర్పాటు అంశంపై సర్కారు కసరత్తు

హైదరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న వివిధ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీ కోసం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసే అంశంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. చాలా ఏళ్లుగా విశ్వవిద్యాలయాల్లో నియామకాలు లేకపోవడంతో ఖాళీల సంఖ్య బాగా పెరిగిపోయాయి. ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం గత ప్రభుత్వం ప్రత్యేక నియామక బోర్డును ఏర్పాటు చేసింది. అసెంబ్లీలో ఆమోదించిన ఈ బోర్డు బిల్లు ఆమోదం కోసం ప్రభుత్వం గవర్నర్‌కు పంపగా.. గవర్నర్ ఈ బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు పంపారు. దాంతో అప్పటి నుంచి ఈ బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఈ ఖాళీ పోస్టుల భర్తీపై దృష్టి కేంద్రీకరించింది. అయితే నియామక బోర్డు బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండగా... మరో ఏజెన్సీ ద్వారా ఈ పోస్టులు భర్తీ చేయడం సాధ్యంకాదని భావిస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో ఆమోదించిన నియామక బోర్డు బిల్లును వెనక్కి తీసుకోవాలని యోచిస్తున్నారు. ఆ తర్వాత ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసి నియామకాలు చేపట్టాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. దీనిపై ఇప్పటికే అధికారులు ప్రాథమిక కసరత్తు పూర్తి చేశారు. కమిషన్ ఎలా ఉండాలి? ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలా? లేక ఉత్తర్వులతో దీన్ని ఏర్పాటు చేయవచ్చా? వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఉపకులపతుల (వీసీ)తో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. శుక్రవారం మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ఆధ్వర్యంలో ఈ వీసీల సమావేశం జరగనుంది. ఇందులో ప్రధానంగా వచ్చే ఏడాదిలో అమలుపరిచే కొత్త సిలబస్ రూపకల్పనపై చర్చించే అవకాశం ఉంది. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ వంటి కోర్సుల్లో వచ్చే ఏడాది నుంచి సిలబస్‌లో మార్పులు చేయాలని ఇప్పటికే నిర్ణయించారు. ఆయా రంగాల్లో విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగాలు లభించేలా ఈ సిలబస్‌ను రూపొందించాలనుకుంటున్నారు. ఆయా యూనివర్సిటీల్లో నాణ్యతను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ఇతర అంశాలపైనా చర్చించనున్నారు.

వైసీపీకి ఝలక్!

మాజీ మంత్రి అవంతి, మాజీ ఎమ్మెల్యే గ్రంధి రాజీనామా

విశాఖపట్నం/భీమవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి గురువారం గట్టి షాక్ తగిలింది. మాజీ మంత్రి, భీమిలి మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి (అవంతి) శ్రీనివాసరావు, భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తమ రాజీనామా లేఖలను జగన్‌కు పంపించారు. సీతమ్మధారలోని తన స్వగృహంలో అవంతి విలేకరులతో మాట్లాడారు. 'భీమిలి ఇన్‌చార్జి పదవికి, వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేశా. కూటమి ప్రభుత్వం పరిపాలన చేపట్టి కొద్దికాలమే అయింది. ఐదేళ్లు పాలించేందుకు వారికి ప్రజలు పట్టం కట్టారు. కానీ ఐదు నెలలకే విమర్శిస్తూ వైసీపీ ధర్నాలు, ఆందోళనలకు దిగడం సరికాదు. ఎన్నికల్లో ఓటమి తర్వాత జగన్మోహన్‌రెడ్డి అన్నీ సమీక్షించుకుని, తప్పులు సరిచేసుకుని పార్టీని ముందుకు తీసుకెళ్తారని భావించా. అయితే అటువంటి మార్పేదీ కనిపించలేదు' అని చెప్పారు.

నేతలు బుజ్జగించినా..

గ్రంధి శ్రీనివాస్ రాజీనామాతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వైసీపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. 'జగన్ ప్రవేశపెట్టిన వలంటరీ వ్యవస్థతో కార్యకర్తలకు, నాయకులకు గుర్తింపు లేకుండా పోయింది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వైసీపీలో కొనసాగితే జనాభిమానం పొందలేం. అందుకు రాజీనామా చేశా' అని ప్రకటించారు.

సినిమాల్లోనే నటన.. జీవితంలో కాదు

మీడియా ప్రతినిధిపై దాడి చేయాలనుకోలేదు

» ఇంట్లోకి దూసుకొచ్చి ఇబ్బంది పెట్టారు

» మైక్ నా కంటికి తగిలింది.. కన్ను పోయే ముప్పున్నందునే మైక్ లాక్కుని ప్రతిదాడి

» మా కుటుంబ సమస్య మేమే పరిష్కరించుకుంటాం

» నేనూ టీవీ చానల్ పెట్టొచ్చు: మోహన్‌బాబు

» ఆయనపై హత్యాయత్నం కేసు నమోదు



హైదరాబాద్ సిటీ/పహాడిషరీఫ్ డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మీడియా ప్రతినిధులపై దాడి చేసే ఉద్దేశం తనకు లేదని.. మీడియా ముసుగులో ప్రత్యర్థులు తనపై దాడి చేసే అవకాశముంది కాబట్టే ఆ విధంగా ప్రవర్తించానని నటుడు మోహన్‌బాబు అన్నారు. మీడియా ప్రతినిధిపై దాడి ఘటన గురించి గురువారం ఆయన ఒక ఆడియో ప్రకటన విడుదల చేశారు. 'నాసినిమాల్లో నటిస్తాను తప్ప నిజజీవితంలో నటించాల్సిన అవసరం నాకు లేదు. గేటు బయట అసభ్యకరంగా ప్రవర్తించి, కొట్టి ఉంటే నాపై 100 కేసులు పెట్టుకోవచ్చు. నన్ను అరెస్టు చేసుకోవచ్చు. నేనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అరెస్ట్ అయ్యేవాడిని. కానీ, నా ఇంట్లోకి వచ్చి నా ఏకాగ్రతను, ప్రశాంతతను భగ్నం చేశారు' అని ఆయన ఆ సందేశంలో పేర్కొన్నారు. తన కుటుంబ సమస్యను పెద్దదిగా చేసి చూపుతున్నారని.. రాత్రివేళ తన ఇంట్లోకి వచ్చి తనకు మనశ్శాంతి లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఆరాత్రి సమయంలో నా ఇంట్లోకి దూసుకొచ్చి మైకులు పెట్టారు. మైక్ నా కంటికి తగిలింది. నా కన్ను పోయే అవకాశం కూడా ఉంది. కాబట్టి చీకట్లో మైక్ లాక్కుని ప్రతిదాడి చేశా' అని మోహన్‌బాబు వివరణ ఇచ్చారు. నాలుగు రోజుల నుంచి మీడియా తన ఇంటి ముందు ఉందని.. అలా ఉండడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. 'నా పిల్లలతో ఉన్న సమస్యను నేనే పరిష్కరించుకుంటానని మీడియాకు చెప్పా. నేను ఇంటి నుంచి బయటకు వెళుతున్న సమయంలో దండం పెట్టి మరీ ఈ విషయం చెప్పాను. నా గురించి కల్పిత కథలు ప్రచారం చేసినందుకు నేనేం బాధపడట్లేదు. నా ఇంట్లోకి దూసుకొచ్చే వాళ్లు మీడియా వాళ్లా? ఇంకా ఎవరైనా ఉన్నారో నాకు తెలియదు. మీడియాను అడ్డుపెట్టుకొని నాపై దాడి చేసే అవకాశం ఉందని ఆలోచించా. మీడియాను కొట్టాలని దైవసాక్షిగా నేను అనుకోలేదు. చీకట్లో ఘర్షణ జరిగింది. నేను కొట్టిన దెబ్బ అతనికి తగిలింది. అందుకు నేను బాధపడుతున్నా. ఆ మీడియా ప్రతినిధి నాకు తమ్ముడిలాంటివాడు. అతడి భార్యాబిడ్డల గురించి ఆలోచించాను. నా బాధ గురించి ఎవరూ ఆలోచించలేదు' అని మోహన్‌బాబు అన్నారు. తాను ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానని.. అవన్నీ మరచిపోయి తాను మీడియా ప్రతినిధిని కొట్టిన విషయాన్నే ప్రస్తావిస్తున్నారని వాపోయారు. 'నేను కొట్టడం తప్పే. కానీ, ఏ సందర్భంలో కొట్టానో ఆలోచించాలి. మీకు టీవీలు ఉండొచ్చు. నేను కూడా రేపు టీవీ పెట్టొచ్చు. నేను మీడియా ప్రతినిధిని కొట్టినందుకు చింతిస్తున్నాను. నేను కొట్టింది వాస్తవమే. అసత్యం కాదు. నా విషయంలో మీడియా చూపిస్తోంది తప్పని ఎవరూ అనట్లేదు. పైన భగవంతుడు చూస్తున్నాడు' అని మోహన్‌బాబు అన్నారు. 'నేను చేసింది న్యాయమా? అన్యాయమా? ప్రజలు ఆలోచించాలి. నా ఇంటి తలుపులు బద్దలుకొట్టుకుని రావడం న్యాయమా?' అని ప్రశ్నించారు. తన బిడ్డే తన ప్రశాంతతను చెడగొడుతున్నాడంటూ ఆవేదన వెలిబుచ్చిన మోహన్‌బాబు.. తాము కూర్చుని మాట్లాడుకుంటామని, కుటుంబసభ్యుల గొడవకు మధ్యవర్తులు అవసరం లేదని స్పష్టం చేశారు. కాగా.. జర్నలిస్టు మీద దాడి చేసిన మోహన్‌బాబుపై పహాడిషరీఫ్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తొలుత బీఎన్ఎస్ సెక్షన్ 118 కింద దాడి కేసు నమోదు చేశారు. న్యాయసలహా తీసుకున్న అనంతరం దాన్ని హత్యాయత్నం కేసుగా మార్చారు. ఇక.. జర్నలిస్ట్‌పై దాడి ఘటన అనంతరం అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరిన మోహన్‌బాబును వైద్యులు గురువారం డిశ్చార్జ్ చేశారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.